సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 190

మంగళవారం 30-9-2025



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



అపజయం వెనుకే విజయం

'ప్రతి స్త్రీ అమ్మవారిలా ఓ శక్తి స్వరూపిణి'... 'సాక్షి'తో శ్రీనిధి శెట్టి. -IIలో



రొయ్యలకు డిమాండ్ పెంచాలి

అవకాశాలు వినియోగించుకోవాలంటున్న ఆక్వా శాస్త్రవేత్త డా.విజయ్ గుప్తా. -IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
నవశక్తి
హైదరాబాద్
మంగళవారం ॥ 30-9-2025



ప్లాస్టిక్ ప్రభావం ముఖ్యంగా హార్మోన్లపై... అందునా మరీ ముఖ్యంగా మహిళల్లోని ఈస్ట్రోజెన్ స్రావంపై ఉంటుందనీ, దీనివల్ల ప్రత్యుత్పత్తికి తోడ్పడే హార్మోన్ల సమతౌల్యంతో తేడాలు వచ్చి గర్భధారణ సమస్యలు రావచ్చని అధ్యయనాల్లో తేలింది. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, కదలికలు తగ్గడం, పురుష సంబంధ హార్మోన్ల స్రావం తగ్గడం జరుగుతాయి. అందువల్ల వీలైనంత మేరకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవడం మంచిది.

ప్లాస్టిక్స్‌పై ప్రత్యేక కథనం సాక్షి ప్లస్ హెల్త్ ఈపేపర్‌లో..

● సంప్రదాయం

తన ప్రసాదాన్ని తానే...

సాధారణంగా అమ్మవారికి భక్తులు రకరకాల నైవేద్యాలను వండి ప్రసాదాలను సిద్ధం చేయడం సంప్రదాయం. అయితే ఇక్కడ మాత్రం అమ్మవారు తన నైవేద్యాన్ని తనకు నచ్చిన విధంగా తానే వండుకుంటుంది. అందుకోసం నాణ్యమైన సరుకులు, మసాలా దినుసులు, వంట చెరకు, వంటపాత్రలు సమకూరిస్తే సరిపోతుంది. వినడానికి విచిత్రంగా ఉన్నా, పశ్చిమ బెంగాల్ ఝార్‌గ్రామ్‌లోని చిల్కిగఢ్ రాజభవనంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న సంప్రదాయం ఇది.

స్థానికంగా 'విరామ భోగ్' అని పిలుచుకునే అష్టమి రోజున అమ్మవారు తనకు సమర్పించిన నైవేద్యాన్ని తానే స్వయంగా వండుతుందని నమ్ముతారు. చిల్కిగఢ్ రాజభవనంలో, అష్టమి పూజ పూర్తయిన తర్వాత, ఆలయ ప్రధాన పూజారి ఒక కొత్త మట్టి కుండలో నీరు, బలి మాంసం, ఇతర పదార్థాలను నింపుతాడు. పూజారి మేక బలి మాంసంతో ఏకాంతంగా వంటగదిలోకి ప్రవేశిస్తాడు. సంప్రదాయం ప్రకారం, మాంసాన్ని కొత్త మట్టి కుండలో ఉంచుతారు. దానిలో వివిధ మసాలా దినుసులు కలుపుతారు. తరువాత, మూడు కట్టెలను పొయ్యిలో ఉంచుతారు. ఆ మట్టి కుండను సాల్ చెట్టు ఆకులతో కప్పి, గదిలో పొయ్యిపై పెట్టి, కుండ పక్కన ఒక కొయ్య గరిటె ఉంచుతారు. పొయ్యిలో మూడు కట్టెలు వెలిగించిన తర్వాత, గది బయటి నుండి తాళం వేస్తారు. నవమి రోజు ఉదయం, పూజారి రాజభవనం నుండి తాళం తీసుకుని వచ్చి, ఆ వంట గది తలుపు తెరిచి చూసి, అమ్మవారికి 'భోగ్'గా సమర్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెబుతాడు. అమ్మవారే స్వయంగా వచ్చి ఈ భోగ్‌ను వండుకుంటుందని విశ్వాసం. ఈ విషయాన్ని చిల్కిగఢ్ రాజ్‌బరి ప్రస్తుత వారసుడు తేజసచంద్ర దేవ్ ధబల్‌దేవ్ స్వయంగా తెలియజేశారు. అమ్మవారు తమ పూర్వీకులకిచ్చిన సూచనల మేరకు ఈ విధంగా చేస్తున్నట్లు తెలియజేశారు.

● సాంస్కృతికం

96 ఏళ్లుగా కళాప్రదర్శన

ముంబైలో జరిగే దుర్గా పూజ సాంస్కృతిక వైభవానికి, భక్తికి చిహ్నంగా నిలుస్తోంది.

బొంబాయి దుర్గా బారి సమితి ప్రారంభం 1930ల నాటిది. అప్పట్లో బెంగాలీల చిన్న సమావేశంగా ప్రారంభమైన ఈ ఉత్సవం ఇప్పుడు గొప్ప కళా ప్రదర్శనగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా వారు మట్టి, ఎండుగడ్డితో చేసిన పర్యావరణ అనుకూలమైన విగ్రహాన్ని తయారు చేశారు. అక్టోబర్ 1న మహానవమి నాడు కుమారీపూజ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం ధునుచి నాచ్, 2న మహాదశమి నాడు సింధూర్ ఉత్సవ్ జరుగుతుంది, తరువాత గిర్గామ్ చౌపట్టిలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు.

'ఇది మతపరమైన వేడుక మాత్రమే కాదు, సాంస్కృతిక కళా ప్రదర్శన కూడా' అని చైర్‌పర్సన్ మితాలి పోద్దార్ అన్నారు. 'కోల్‌కతాకు చెందిన ప్రఖ్యాత కళాకారులు స్థానిక యువతతో కలిసి ప్రదర్శనలు ఇస్తారు. ఇది భవిష్యత్ తరాలకు కళాత్మక, సాంస్కృతిక వారసత్వాన్ని అందించడం కోసం కూడా. అందుకే మేం ప్రతి సంవత్సరం, పర్యావరణ అనుకూల విధానంతో సంప్రదాయాన్ని పాటిస్తాం–' అని చెబుతున్నారామె. వేడుకలతోపాటు పేదపిల్లలకు స్కాలర్‌షిప్‌లు, ఆసుపత్రులకు వైద్యపరికరాల విరాళాలు – వంటివి కూడా ఉంటాయి' అని మితాలి పేర్కొన్నారు.



● సామరస్యం

పీర్లకు ప్రసాదంగా..!

దుర్గా పూజ హిందూ పండుగ అని తెలిసిందే. అయితే, ఇక్కడ మాత్రం హిందూ–ముస్లిం మత సామరస్యంతో జరుపుకోవడంలో ప్రసిద్ధి చెందింది. పశ్చిమ బెంగాల్ తూర్పు మిడ్నాపూర్ జిల్లా కొంటైలోని కిషోర్‌నగర్ గర్ రాజ్‌బరి వద్ద జరుపుకుంటున్న స్వర్ణదుర్గాదేవి పూజలో అమ్మవారికి సమర్పించిన నైవేద్యాన్ని మొదటగా అక్కడి పీర్లకు ఇస్తారు. ఆ తర్వాతే రాజకుటుంబీకులు స్వీకరిస్తారు. భక్తులకు పంచిపెడతారు. ఇలా దాదాపు 300 సంవత్సరాలుగా జరుగుతోంది.

ఈ పూజకు దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.

హిందూ–ముస్లిం సామరస్యం ఒక ప్రధాన లక్షణం, ఇక్కడ విగ్రహ నిమజ్జనానికి ముందు ముస్లిం పీర్లకు దేవత ప్రసాదాన్ని అందిస్తారు. ముందుగా పూజ సమయం లో ఒక ఉత్సవం జరుగుతుంది, ఈ ఉత్సవంలో కూడా స్థానిక హిందువులతోపాటు ముస్లింలు కూడా పాల్గొంటారు. వీరితోపాటు ఇతర మతాల వారు కూడా పూజలో పాలు పంచుకుంటారు,

స్వర్ణదుర్గమ్మకు జీడిపప్పు భోగం

పూజ సమయంలో అమ్మవారికి పండ్లు, తీపి పదార్థాలను నివేదిస్తారు. వీటితోపాటు వేయించిన జీడిపప్పు, ఇంట్లో తయారు చేసిన జున్ను, చక్కెరతో వండిన ప్రత్యేక భోగాన్ని నివేదిస్తారు.

''అపజయం ఎదురైనప్పుడు జీవితం ఆగిపోయింది అనుకుంటే మనం ఆగిపోతాం... ఆ అపజయాన్ని విజయానికి మెట్టుగా మార్చుకుంటే ముందుకు సాగిపోతాం'' అంటున్నారు శ్రీనిధి శెట్టి. అందాల పోటీల్లో 'మిస్ సుప్ర నేషనల్ ఇండియా' కిరీటం దక్కించుకోవడం నుంచి, 'మిస్ స్మైల్'... వరకు పలు టైటిల్స్ శ్రీనిధి సొంతం. తొలి చిత్రం 'కేజీఎఫ్'తో హీరోయిన్‌గా విజయవంతంగా కెరీర్ మొదలుపెట్టిన శ్రీనిధి శెట్టి ఇప్పుడు ఫుల్ బిజీ. ''ప్రతి స్త్రీ అమ్మవారిలా ఓ శక్తి స్వరూపిణి'' అంటూ 'దసరా' సందర్భంగా 'సాక్షి'తో శ్రీనిధి శెట్టి ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలు.

అపజయం వెనుకే విజయం


శ్రీనిధి శెట్టి

నార్త్‌లో దాండియా కల్చర్ బాగుంటుంది. చిన్నప్పుడు మేం ముంబైలో ఉండేవాళ్లం. దసరా టైమ్‌లో మా కమ్యూనిటీలో దాండియా ఆడేవాళ్లు. అలా మా అపార్ట్‌మెంట్‌వాళ్లతో కలిసి లైట్‌గా దాండియా చేసిన గుర్తు ఉంది. కానీ పెద్దయ్యాక దాండియా ఆడలేదు. అయితే చేయాలని ఉంది.

● మా మంగళూరులో చాలా టెంపుల్స్ ఉన్నాయి. నవరాత్రి సమయంలో గుడిలో జరిగే పూజలు చాలా వైభవంగా ఉంటాయి. ఈ దసరా టైమ్‌లో వీలైనప్పుడల్లా గుడికి వెళుతుంటాను. మైసూర్‌లో నవరాత్రి పూజలను ఘనంగా చేస్తారు. మైసూర్ ప్యాలెస్‌ని బాగా డెకరేట్ చేస్తారు. జాతర జరుగుతుంది. స్టాల్స్ పెడతారు. 'మైసూర్ దసరా' చాలా పాపులర్. ఈ పండగ సమయంలో సిటీ మొత్తం జనాలతో కిటకిటలాడిపోతుంది.

● 'ఫాస్టింగ్' అనేది సైంటిఫికల్లీ, ట్రెడిషనల్లీ మంచిది అని నా అభిప్రాయం. అయితే నవరాత్రి టైమ్‌లో ఉపవాసం ఉండను. కానీ నాన్ వెజ్‌కి దూరంగా ఉంటాను. నెలలో రెండుసార్లు ఏకాదశి వస్తుంది కదా... అప్పుడు ఉపవాసం ఉంటాను. ఏకాదశి వస్తోందంటే చాలు... 'నువ్వు ఫాస్టింగ్ ఉండాలి' అని నా బాడీ నాకు గుర్తు చేస్తుంది. నా మైండ్ అలా ట్యూన్ అయిపోయింది.

● చెడుపై మంచి గెలవడం అనేది దసరా థీమ్. ఒక చెడు ఉంటేనే మంచి జరుగుతుంది. అపజయాలను నేను ఇలానే భావిస్తాను. ఫెయిల్యూర్ ఎదురైతేనే కదా సక్సెస్ కోసం ప్రయత్నం చేస్తాం. సో... ఫెయిల్యూర్స్‌ని చెడుగా భావించను. చెడుని అంతం చేయడానికి అమ్మవారు ఏం చేసిందో మనందరికీ తెలుసు. అలాగే మనకు ఎదురయ్యే ఫెయిల్యూర్స్‌ని ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలి. కొందరు మహిళలు సపోర్ట్‌ని ఆశిస్తారు. కానీ మనకు మనమే సపోర్ట్ సిస్టమ్ అవ్వాలి. మన శక్తిని మనం గుర్తించగలగాలి. నాకు ఏదైనా చెడు ఎదురైందనుకోండి అది నా 'స్టెప్పింగ్ స్టోన్' అని నమ్ముతాను. జీవితం లో ఎదురయ్యే సవాల్‌ని అలా అనుకుంటే సక్సెస్ అయిపోతాం.

● స్త్రీలు ఇంటిల్లిపాదినీ చూసుకోవాలి. అది చాలా పెద్ద బాధ్యత. అయితే అందరి బాగోగులు చూస్తూ చాలామంది మహిళలు తమ గురించి పట్టించుకోరు. కానీ మన గురించి కూడా మనం పట్టించుకోవాలి. ఇన్నర్‌గా మనం హ్యాపీగా ఉంటే చుట్టూ ఉన్నవాళ్లను మనం ఇంకా హ్యాపీగా ఉంచగలుగుతాం. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే... అందర్నీ హ్యాపీగా ఉంచడమే మన పని అని ఫిక్స్ అయిపోకండి. మనం హ్యాపీగా, హెల్తీగా ఉండటం కూడా ముఖ్యం.

పండగ అంటే ఫ్యామిలీ రీ యూనియన్ అని నా ఫీలింగ్. నా చిన్నప్పుడు మా బంధువులందరం కలిసి పండగ జరుపుకునేవాళ్లం. అందరూ కలిసి పండగ వంటలు చేయడం చాలా బాగుండేది. అయితే పై చదువులు, కెరీర్... వీటివల్ల రాను రాను ఆ సందడి తగ్గిపోయింది. ఇప్పుడైతే వర్క్‌లో బిజీ అయ్యాను కదా... మూటింగ్స్, ప్రమోషన్స్ ఉంటాయి కాబట్టి పండగ సమయంలో ఇంటి దగ్గర ఉండటం తగ్గిపోయింది. ఆ పాతరోజులను తలచుకుంటూ ఉంటాను.

● జీవితంలో 'పాజిటివిటీ' చాలా ముఖ్యం. ఒక పని చేసే ముందు 'ఇది మనవల్ల అవుతుంది. చేసి తీరతాం' అని పాజిటివ్‌గా ఆలోచించాలి. ఆ పాజిటివిటీ మనల్ని చాలా దూరం తీసుకెళుతుంది. చదువుకునే అమ్మాయిలకు, ఉద్యోగం చేసుకునే వారికి నేను చెప్పేదేంటంటే... ఏ విషయంలోనూ 'నా వల్ల కాదు' అనుకోకండి. స్త్రీలు తలచుకుంటే చేయలేనిదేం ఉండదు. పాజిటివ్ గా ఆలోచించండి. అంతా మంచే జరుగుతుంది. చెడు ఆలోచనలను దూరం పెట్టండి. ఆటోమేటిక్‌గా మంచి దగ్గరవుతుంది. ఈ పద్ధతి ఫాలో అయితే జీవితం కష్టంగా ఉండదు... తేలికగా సాగిపోతుంది'' అని చెప్పారు.

– డి.జి. భవాని

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 29న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,20,910	బంగారం (24 క్యారెట్లు)	1,18,300	బంగారం (24 క్యారెట్లు)	1,16,400	బంగారం (24 క్యారెట్లు)	1,18,300	బంగారం (24 క్యారెట్లు)	1,20,030	బంగారం (24 క్యారెట్లు)	1,16,720
బంగారం (22 క్యారెట్లు)	1,13,118	బంగారం (22 క్యారెట్లు)	1,06,700	బంగారం (22 క్యారెట్లు)	1,06,700	బంగారం (22 క్యారెట్లు)	1,09,090	బంగారం (22 క్యారెట్లు)	1,10,680	బంగారం (22 క్యారెట్లు)	1,07,700
వెండి	1,51,500	వెండి	1,48,200	వెండి	1,60,000	వెండి	1,48,200	వెండి	1,49,000	వెండి	1,60,000


గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



రొయ్యలకు దేశంలోనే డిమాండ్ పెంచాలి!

సాగుబడి

హస్త కార్తె: సెప్టెంబర్ 27 నుంచి



ఆక్వాకల్చర్ ప్రపంచంలో రాణించిన అరుదైన భారతీయ శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ గుప్తా. 86 ఏళ్ల క్రితం బాపట్ల జిల్లాలో పుట్టారు. ఆక్వా కల్చర్ నిపుణుడిగా లావోస్ నుంచి బంగ్లాదేశ్ వరకు 22 ఆసియా, ఆఫ్రికా దేశాల్లో విశేష సేవలందించారు. సామాన్య ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తెచ్చారు. నిస్వార్థ సేవలకు గుర్తింపుగా అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ప్రపంచ ఆహార పురస్కారం' (2005), నోబెల్‌తో సరితూగే 'సన్‌హాక్ శాంతి పురస్కారం '(2015) అందుకున్నారు. పదవీ విరమణ అనంతరం హైదరాబాద్‌లో నివసిస్తున్న డా. విజయ్ గుప్తాను 'సాక్షి సాగుబడి' పలుకరించింది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో అమెరికాయేతర మార్కెట్లను వెతకటంతో పాటు.. దేశీయ మార్కెట్లలో మౌలిక సదుపాయాలు కల్పించి చేపలు, రొయ్యలకు డిమాండ్ పెంచుకోవటానికి పుష్కలంగా ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యాంశాలు..

వరల్డ్ ఫుడ్ ప్రైజ్ విజేత, సన్‌హాక్ పీస్ ప్రైజ్ గ్రహీత, ప్రముఖ ఆక్వా శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ గుప్తాతో 'సాక్షి సాగుబడి' ముఖాముఖి

86 ఏళ్ల వయసులో 66లా ఉన్నారు.. మీ ఆరోగ్య రహస్యం ఏమిటి?

డా. విజయ్ గుప్తా: ఏమీ లేదు. కష్టపడి పనిచెయ్యటమే. పనితో వయసును జోడించి చూడకూడదండి.. మీరు చెయ్యగలిగినంత కాలం పని చేస్తూనే ఉండాలి. జీవితంలో మీరు ఏమి చెయ్యదలచుకున్నారో ఆ పనిలో సంతృప్తి కోసం పాటుపడాలి. చాలా మంది ధనంలోనే సంతృప్తిని వెదుక్కుంటూ ఉంటారు. కానీ, అది వాస్తవం కాదు. ధనార్జన ఇచ్చే సంతృప్తి పరిమితమైనది. మీరు ఎవరికైనా సహాయంతో అభివృద్ధి చెందిన వాళ్లు చూపే ఆదరణతో లభించే ఆత్మసంతృప్తి అనంతమైనది.

2015లో దక్షిణ కొరియా ప్రభుత్వం సన్‌హాక్ శాంతి బహుమతి నాకు ఇచ్చింది. దానికి ముందు నేను గతంలో పనిచేసిన దేశాల్లో ప్రజల స్పందనను తెలుసుకునేందుకు నాతో పాటు పాత్రికేయులను పర్యటనకు పంపింది. బంగ్లాదేశ్‌లో ఆరేళ్లు పనిచేసిన నేను పదిహేనేళ్ల తర్వాత మళ్లీ అక్కడి గ్రామాల్లోకి వెళ్తే.. మహిళా రైతులు నన్ను గుర్తుపట్టి చాలా సంబరపడ్డారు. మీరు నేర్పిన ఆక్వా సాగు వల్ల మా పూరి గుడిసెలు ఇప్పుడు పక్కా భవనాలయ్యాయని చూపించి కృతజ్ఞతలు తెలిపారు. ఆ క్షణాల్లో వారి మొహాల్లో నవ్వును చూసినప్పుడు నాకు ఎంతో ఆత్మసంతృప్తి కలిగింది. అది ఏ బహుమతులతోనూ దొరకదు..!

బంగ్లాదేశ్ ఆక్వా రైతు మిమ్మల్ని అంతగా గుర్తుపెట్టుకోవటానికి కారణం ఏమిటి?



అక్కడ ఆరేళ్లు పనిచేశా. బంగ్లాదేశ్ అంతా లోతట్టు ప్రాంతం. స్థానికంగా ప్రజలు గుంతలు తవ్విన మట్టిని ఎత్తుగా పోసి, వాటిపైన గుడిసెలు వేసుకొని జీవిస్తుంటారు. ఆ గుంతల్లో గుర్రపుడెక్క, దోమలు పెరిగి సమస్యగా ఉండేది. తినటానికి జనానికి తిండి లేదు. అటువంటి స్థితిలో ఆ చిన్న గుంతల్లోనే పెంచుకొని తినే చిన్న సైజు చేపల సాగు సాంకేతికతలను అభివృద్ధి చేశాం. స్థానిక స్వచ్ఛంద సంస్థల ద్వారా రైతుల బృందాలను కూడగట్టాం. ఉమ్మడి బాధ్యతతో కూడిన బృంద రుణాలు ఇప్పించాం. తద్వారా పేద రైతులను అధిక వడ్డీల విష చక్రం నుంచి, ఆహార అభద్రత నుంచి బయటపడేశాం. యూఎస్‌ఎయిడ్ చరిత్రలోనే బెస్ట్ ప్రాజెక్ట్‌గా మాకు గుర్తింపు రావటం ఓ మధుర స్మృతి.

ప్రభుత్వం అందుకు ఏం చెయ్యొచ్చు..?

ఒక్క రొయ్యలకే కాదు, చేపలకు కూడా మన నగరాలు, పట్టణాల్లో అపారమైన మార్కెటింగ్ అవకాశాలున్నాయి. ప్రొటీన్ ఆహారానికి డిమాండ్ ఉన్నా చేపలు, రొయ్యలను చాలా మంది తినకపోవటానికి కారణం.. వాటిని విక్రయించే పద్ధతులు సరిగ్గా లేకపోవటమే. జూబ్లీహిల్స్‌లో ఇప్పటికీ చేపలను రోడ్డుపక్కన పెట్టి అపరిశుభ్ర పరిస్థితుల్లో అమ్ముతున్నారు. అసలు మెరుగైన మార్కెటింగ్ కల్పించాలన్న చైతన్యం లేదు. నగరాలు, పట్టణాల్లో ఆధునిక వసతులతో ప్రత్యేక దుకాణాలు తెరవాలి. విలువ జోడించి మార్కెటింగ్ గొలుసును నిర్మిస్తే.. చేపలు, రొయ్యలను ప్రజలు బాగా తింటారు. సబ్సిడీలివ్వటం కాదు, మౌలిక సదుపాయాలు కల్పించాలి.

రొయ్యలపై అమెరికా సుంకాలను ఎదుర్కొనేదెలా?

మనం సాగు చేసే రొయ్యలను 90% విదేశాలకే ఎగుమతి చేస్తున్నాం. ట్రంప్ సుంకాల వల్ల లక్షలాది మంది జీవనోపాధులకు సమస్య వచ్చి పడింది. గతంలోనూ ఇతర దేశాల్లో మార్కెట్ ధరలు తగ్గటం, ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు కూడా మన రొయ్యల ఎగుమతికి ఇబ్బందులొచ్చిన సందర్భాలున్నాయి. ఎగుమతులపై అంత ఆధారపడటం ఎందుకు? అసలు, దేశీయంగా రొయ్యల వినియోగాన్ని విస్తృతంగా పెంచుకునేలా మార్కెట్‌లో డిమాండ్‌ను ఎందుకు సృష్టించుకోకూడదు?

పోషకాల పరంగా అడ్వాంటేజ్ ఉందా?

పోర్క్, బీఫ్, పౌల్ట్రీతో పోల్చితే చేపలు, రొయ్యల్లో పోషకాలు చాలా ఎక్కువ. కంపేరిటివ్ స్టడీస్ కూడా వచ్చాయి. పర్యావరణ పరంగా చూసినా ఆక్వా ఉత్పత్తులే మెరుగైనవి. ఒకటిన్నర కేజీల మేత వేస్తే కిలో చేపల్ని పెంచే సాంకేతికత అందుబాటులో ఉంది. ఇతర జంతువులకు 12 కిలోల మేత పెడితే గాని ఒక కిలో ఉత్పత్తి రాదు. పశువుల పెంపకం కోసం విస్తారంగా గడ్డి భూములు కావాలి. చేపలు, రొయ్యలు నీటిలో పెరుగుతాయే కానీ అవి నీరు తాగవు. మార్కెటింగ్, కోల్డ్ చెయిన్ సదుపాయాల కొరత, ఆరోగ్య ప్రయోజనాలపై ప్రచార లోపమే సమస్య.

యూరోపియన్ యూనియన్ కఠిన నియమాలను అధిగమించేదెలా?

ట్రేసబిలిటీ వంటి సదుపాయాలు అన్ని దేశాల్లోనూ అందుబాటులో ఉన్నాయి. అందువల్ల కెమికల్ రెసిడ్యూ లేని విధంగా సస్టయినబుల్ ఫిష్ ప్రొడక్షన్ పద్ధతులను ఆక్వా రైతులకు, పరిశ్రమదారులకు ప్రభుత్వం నేర్పించాలి. తెలిసో తెలియకో మందులు వాడుతున్న మన చిన్న, సన్నకారు రైతులకు లోతైన అవగాహన కల్పించాలి. టెక్నాలజీ ఇవ్వాలి. ఇలా చేస్తే అధిక ధర వచ్చే విదేశీ మార్కెట్లు ఉన్నాయి. ఆఫ్రికాలో ఇలా చేశారు. మన ప్రభుత్వాలు కూడా చెయ్యాలి. అమెరికాయేతర దేశాలతో కూడా ట్రేడ్ అగ్రిమెంట్లకు ప్రయత్నం చెయ్యాలి.

ప్రపంచ ఆహార భద్రత భవిష్యత్తు ఎలా ఉంటుంది?

రాబోయే 20–30 సంవత్సరాల్లో జంతువులను మాంసం కోసం పెంచటం చాలా ఇబ్బందుల్లో చిక్కుకుంటుంది. జనాభాతో పాటు వారి కొనుగోలు శక్తి పెరుగుతోంది. ఇది ఆసియా దేశాల్లో ఆక్వా అభివృద్ధికి చాలా మంచి అవకాశం. జలవనరులు ఎక్కువగా ఉన్న మన దేశానికి ఇది గొప్ప అవకాశం. అయితే, మన ఆక్వా రంగం ఉత్పాదకతను పెంచుకోవాలి.

మన ఉత్పాదకత ఎందువల్ల తక్కువ?

ఉప్పునీటి, మంచినీటి చేపలు, రొయ్యల సాగు రంగంలో మనకున్న వనరుల్లో 30–40% మాత్రమే ఇప్పటికి వాడుకుంటున్నాం. ఇంకా పెంచుకోవటానికి చాలా అవకాశం ఉంది. ఉత్పాదకత పెరగాలంటే దేశీయంగా వినియోగం పెరగాలి. మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు పెంపొందిస్తే డిమాండ్ పెరుగుతుంది. డిమాండ్ డ్రైవెన్ ఎకానమీగా గుర్తించి ప్రభుత్వాలు ఆక్వా రంగంపై దృష్టి కేంద్రీకరిస్తే రైతులు అందుకుంటారు.

– ఇంటర్వ్యూ: పంతంగి రాంబాబు
ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్


ఆక్వా ఉత్పత్తుల మార్కెటింగ్ పెరిగే అవకాశాలు ఎంత మేరకు ఉన్నాయి?

కోళ్ల పరిశ్రమతో సరిపోల్చి చూడండి.. 15–20 ఏళ్ల క్రితం కోడి మాంసం తినాలంటే కోడిని కొనుక్కొచ్చి ఇంటి దగ్గర కోసుకునే వాళ్లు. ఇప్పుడు ఎక్కడ చూసినా కోళ్లను కోసి మాంసం అమ్మే దుకాణాలొచ్చేశాయి. కాబట్టే వినియోగదారులు కోడి మాంసాన్ని ఇంత ఉత్సాహంగా వాడుతున్నారు. చేపలు, రొయ్యల అమ్మకానికి, పౌల్ట్రీ మాదిరిగా, మార్కెటింగ్ సదుపాయాలు, విలువ జోడింపు మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున కల్పించాలి. మార్కెట్ సృష్టిస్తే చేపలు, రొయ్యల ఉత్పత్తిని ఇంకా పెంచుకోవటానికి రైతులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. చేపలు, రొయ్యల పౌష్టికాహార విలువలు, ఆరోగ్య ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచార మాధ్యమాల్లో ఎగ్ క్యాంపెయిన్ మాదిరిగా ప్రచారోద్యమం చేపట్టాలి.



దేశీయంగా రొయ్యలు ఎక్కువగా తినకపోవటానికి కారణం?

ప్రపంచవ్యాప్తంగా ఆక్వా ఉత్పత్తులను ఏడాదికి తలసరి వినియోగం 22 కిలోలు. బంగ్లాదేశ్‌లో 30–40 కిలోల వరకు ఉంటుంది. మన దేశంలో 6 కిలోలంటారు. కచ్చితమైన గణాంకాలు లేవు. మన వాళ్లు రొయ్యలు ఎక్కువగా తినకపోవటానికి ధర ఎక్కువ కావటం ఒకటి. మరొక అపోహ ఏమిటంటే.. రొయ్యలు తింటే కొలెస్ట్రాల్ ఉంటుందని. అది అపోహే. చేపలతో కూడా ప్రాబ్లమ్ ఏమీ లేదు. నీట్‌గా ఉండే కోయిస్కలను ఏర్పాటు చేస్తే వినియోగం పెంచవచ్చు. ప్రభుత్వం నగదు ఇన్సెంటివ్‌లు ఇవ్వటం కాదు. కోల్డ్‌చెయిన్, మౌలిక సదుపాయాలు కల్పించాలి.


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 190

మంగళవారం 30-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మిల్లెట్స్ స్నాక్స్

ఆరోగ్యకరమైన చిరుతిళ్లకు డిమాండ్.. ఆసక్తి చూపుతున్న యువతరం -7లో



గాజా ఆక్రమణ ఉండదు

శాంతిని నెలకొల్పుతామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ -6లో

న్యూస్‌రీల్

'నూతన సుపరిపాలన' తెచ్చాం



జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రధాని మోదీ కొట్టిపారేశారు. రోజూ అబద్ధాలు చెబుతూ, తమపై రాళ్లు విసురుతూ కాలం గడపడం తప్ప విపక్షాలకు ఇంకేమీ తెలియదన్నారు.

- వివరాలు 6లో ▶

ఇప్పుడంతా గంటలు, సెకన్ల యుద్ధాలే



ఆధునిక సాంకేతిక యుగంలో యుద్ధరీతి పూర్తిగా మారిపోయిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. శత్రుదేశాలతో సాయుధ పోరుకు గంటలు, సెకండ్లలోనే తెర పడే పరిస్థితి వచ్చిందని స్పష్టంచేశారు.

- వివరాలు 6లో ▶

'బాకీకార్డు'తో కాంగ్రెస్‌ను ఓడిస్తాం



'బాకీ కార్డు' ఉద్యమంతో కాంగ్రెస్ సర్కార్ భరతం పడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీఆర్ఎస్‌దే హవా అని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

- వివరాలు 2లో ▶

స్థానిక పోరుకు సైరన్

షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్



- తక్షణమే అమల్లోకి ఎన్నికల కోడ్
- తొలుత మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు
- రెండు దశల్లో అక్టోబర్ 23, 27 తేదీల్లో నిర్వహణ
- నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల కౌంటింగ్
- మూడు దశల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికలు
- అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో 'పల్లె పోరు'
- ఏ రోజుకు ఆ రోజే వెలువడనున్న పంచాయతీ ఎన్నికల ఫలితాలు
- అక్టోబర్ 9న మొదలై నవంబర్ 11న ముగియనున్న స్థానిక ఎన్నికల ప్రక్రియ



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీ కుముదిని

అదనంగా 24 వేల పదవులు!

బీసీలకు 42 శాతం కోటా బొనాంజా

- అన్ని స్థాయిల్లో కలిపి మొత్తం 55 వేలకు పైగా స్థానిక పదవులు
- గతంలో కంటే 2,422 సర్పంచ్ పదవులు పెరిగే అవకాశం
- వార్డు సభ్యులుగా అదనంగా 20 వేల మంది బీసీలు

3లో

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నగారా మోగింది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని సోమవారం విడుదల చేశారు. తొలుత మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సమరం మొత్తం ఐదు దశల్లో జరగనుంది. మండల, జిల్లా పరిషత్‌ల తొలి విడత ఎన్నికలు అక్టోబర్ 23న, రెండో విడత అదే నెల 27న జరగనున్నాయి. గ్రామ పంచాయతీల మొదటి దశ ఎన్నికలు అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో దశ ఎన్నికలు అదే నెల 8న జరగనున్నాయి. మొత్తం మీద అక్టోబర్ 9న మొదటి దశ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీతో మొదలయ్యే స్థానిక ఎన్నికల ప్రక్రియ, నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫలితాల వెల్లడితో ముగియనుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఓట్ల కౌంటింగ్ (రెండు దఫాలకు) నవంబర్ 11న నిర్వహిస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు ఏ రోజుకు ఆ రోజు సాయంత్రమే చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లాలు మినహా) ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించారు.

మొత్తం ఐదు దశలు..

స్థానిక ఎన్నికల ఒక్కో దశను 15 రోజుల్లోగా ముగించేలా చర్యలు చేపడుతున్నామని ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని చెప్పారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాలయంలో డీజీపీ జితేందర్, లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్,

మిగతా 3వ పేజీలో ▶

'గిన్నిస్' బతుకమ్మ



1,500 మంది మహిళలు ఏకకాలంలో గొంతు కలిపి బతుకమ్మ ఆడారు. 300 మంది మహిళలు మూడు రోజులు శ్రమించి 36 అడుగుల వెడల్పు, 63.11 అడుగుల ఎత్తు, 10.7 టన్నుల బరువుతో 11 వరుసల్లో తొమ్మిది రకాల పూలతో రూపొందించిన భారీ బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా నర్తించారు. అత్యధిక మంది ఆడిపాడటం... ఎత్తయిన బతుకమ్మ... సరూర్‌నగర్ స్టేడియం వేదికగా సోమవారం ఆవిష్కృతమైన ఈ అద్భుత దృశ్యాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకెక్కాయి.

- వివరాలు 2లో

విదేశీ చిత్రాలకు ట్రంప్ షాక్

- తమ దేశ సినిమా వ్యాపారాన్ని ఇతర దేశాలు దోచుకుంటున్నాయని వ్యాఖ్య
- అమెరికా వెలుపల నిర్మితమయ్యే సినిమాలపై వంద శాతం టారిఫ్
- ఈ నిర్ణయంతో భారతీయ సినిమాకు నష్టం

14లో



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్. చిత్రంలో చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్



1,050 సినిమాల పైరసీ

ఐదుగురిని అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు

- రెండు రకాలుగా ముఠాల దందా
- డిజిటల్ మీడియా కంపెనీల సర్వర్ల హ్యాకింగ్
- థియేటర్లలో చిన్న కెమెరాల ద్వారా రికార్డింగ్
- వ్యవస్థీకృతంగా సాగుతున్న దందా
- పైరసీతో రూ.22,400 కోట్ల నష్టం: నగర పోలీస్ కమిషనర్ ఆనంద్
- సినీ ప్రముఖులతో ప్రత్యేక భేటీ

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: దేశంలోనే అతిపెద్ద సినీ పైరసీ గుట్టురట్టు చేశారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. పైరసీకి సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. ఈ వ్యవహారం జరుగుతున్న విధానం, మార్కెటింగ్, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఐదేళ్లలో 1,050 సినిమాలను పైరసీ చేసిన ఐదుగురు

మిగతా 15వ పేజీలో ▶

పార్టీ మారారని ఎలా చెప్తారు?

- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై క్రాస్ ఎగ్జామినేషన్
- తొలి రోజు స్పీకర్ ట్రిబ్యునల్ ఎదుట వాదనలు

16లో

మిథున్‌రెడ్డికి బెయిల్

మద్యం కేసులో ఆయన పాత్రను నిరూపించే ఆధారాల్లేవ్: ఏసీబీ కోర్టు

- ఆరోపణల ఆధారంగా అమూల్యమైన బెయిల్ హక్కును తిరస్కరించలేం
- మాస్టర్ మైండ్ అనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు... సహ నిందితుల వాంగ్మూలాల ఆధారంగానే ఆరోపణలు
- ఆ వాంగ్మూలాలకు ఎలాంటి ఆమోద యోగ్యత లేదు... మా ముందుంచిన ఆధారాలు స్వతంత్రమైనవి కావు
- ముడుపులు వసూలు చేశారన్న ఆరోపణలు నిరాధారమన్న న్యాయస్థానం
- రాజమహేంద్రవరం జైలు నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల



మిథున్‌రెడ్డితో ఆయన తండ్రి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

16లో

ఇదండీ సంగతి



ఇంత కన్‌ఫ్యూజన్ ఎందుకు సార్! ఎవరైనా పొలిటికల్ ఎనలిస్టుతో సర్వే చేయిస్తే పోలా?!



అమెరికా వెళ్లాలంటే.. అప్పు పుట్టట్లేదు!

ట్రంప్ దెబ్బకు అమెరికా కల విలవిల

- వెళ్లే వారికి పెట్టుబడులు ఇవ్వడానికి వెనుకంజ
- ఇచ్చిన వాళ్ల నుంచి వసూలుకు పెరిగిన ఒత్తిడి
- తీవ్ర ఆందోళనలో తల్లిదండ్రులు

సాక్షి, హైదరాబాద్: విదేశీ విద్య కోసం అమెరికా వెళ్లాలన్న ఆసక్తి విద్యార్థుల్లో క్రమంగా తగ్గుతోంది. తమ పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులూ వెనుకాడుతున్నారు. అధ్యక్షుడు ట్రంప్ దెబ్బకు అమెరికా అంటేనే నమ్మకం పోతోందని కన్సల్టెన్సీ సంస్థలూ అంటున్నాయి. ఇదిలాఉంటే, ఇప్పటికే అమెరికా వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఆందోళనతో ఉన్నారు. ప్రైవేటు అప్పులు వారిని వెంటాడుతున్నాయి. ఇంకోవైపు అమెరికా నుంచి విద్యార్థులు డబ్బులు పంపాలని కోరడం మరింత ఆందోళన రేపుతోంది. పిల్లలు అమెరికా వెళ్లే వరకూ ఆనందంగా ఉన్న

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...


బతుకమ్మ సంబరాల్లో గవర్నర్ దంపతులు

గవర్నర్, సీఎం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుధాదేవ్ వర్మ దంపతులు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌భవన్‌లో సోమవారం గవర్నర్ సతీమణి సుధాదేవ్ వర్మ రాజ్‌భవన్ మహిళా సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం రాజ్‌భవన్‌లోని కొలనులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌తో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి..
ప్రకృతిని.. పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని అక్కాచెల్లెళ్లందరికీ ఆయన సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తీరొక్క పూలతో తయారు చేసిన ఘనమైన బతుకమ్మలతో ఆడబిడ్డలందరూ ఆట పాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు రాష్ట్రమంతటా అత్యంత వైభవంగా నిర్వహించామన్నారు. బతుకమ్మ విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పడానికి, సరూర్ నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో ప్రభుత్వం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తోందని చెప్పారు.

బతుకమ్మ సాంస్కృతిక సంప్రదాయం: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పూల పండుగను మహిళలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకుని, చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగిసే బతుకమ్మ సాంస్కృతిక సంప్రదాయం తెలంగాణకు ప్రత్యేకం అని పేర్కొన్నారు. కష్టాలన్నీ తొలగి, ప్రతి ఇల్లూ సుఖసంతోషాలతో నిండేలా ప్రకృతిమాత బతుకమ్మ దీవెనలు అందించాలని కేసీఆర్ ప్రార్థించారు.

తెలంగాణ తల్లి చేతిలోకి మళ్లీ బతుకమ్మ రావాలి

- అప్పటి వరకు పోరాడుతాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తల్లి చేతిలోకి మళ్లీ బతుకమ్మ వచ్చే వరకు పోరాడుతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. లండన్‌లో జరుగుతున్న బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో విదేశాల్లో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న కవిత మంగళవారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యువతకు 2 నెలల కాలవ్యవధి గల డీటీపీ, బేసిక్ కంప్యూటర్స్ (డేటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ చైర్మన్ ఎన్.కిశోర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీటీపీ కోర్సుకు ఇంటర్‌తోపాటు బేసిక్ కంప్యూటర్ విద్యార్హత కలిగి ఉండాలని, బేసిక్ కంప్యూటర్స్ కోర్సుకు ఇంటర్ పాసై ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగం కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి కలిగినవారు తమ విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో అక్టోబర్ 6న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9133908111, 9133908222 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



‘సద్దుల’ సంబురం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

హనుమకొండ కల్చరల్: వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తొమ్మిది రోజుల పాటు మహిళలు భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్న బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగిశాయి. హనుమకొండ పద్మాక్షి గుండం, వేయిస్తంభాల దేవాలయం, వరంగల్ భద్రకాళి ఆలయం, కాశిబుగ్గ శివాలయ ప్రాంగణం, శివనగర్ మెట్ల బావి, కరీమాబాద్ ఉర్సు గుట్ట, రామస్వామిగుడి, శంభునిపేట, రంగశాయిపేట, త్రికోటతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పూజల అనంతరం నైవేద్యాలు ఇచ్చి పుచ్చుకున్నారు. గౌరమ్మను గంగమ్మ ఒడికి చేర్చారు.

ప్రధాని మోదీ నోట.. బతుకమ్మ మాట

ఢిల్లీలో జరిగిన వేడుకల గురించి ప్రస్తావించిన ప్రధాని



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ.. సాంస్కృతిక వైవిధ్యానికి చిరునామా అని, ఇది ఒక మినీ ఇండియా అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఢిల్లీలో తెలుగు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలను ఈ సందర్భంగా ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఉత్సవాల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా పాల్గొన్నారని గుర్తు చేశారు. సోమవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల పండుగలను అందరూ కలసి జరుపుకోవడం ‘ఏక్ భారత్ –శ్రేష్ఠ భారత్’ స్ఫూర్తిని పెంపొందిస్తుందని బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. రాజకీయ రాజధానిగానే కాకుండా, దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు నివసించే సాంస్కృతిక రాజధానిగా ఢిల్లీని ప్రధాని మోదీ అభివర్ణించారు. బతుకమ్మ, సిక్కు గురువుల ప్రకాశ్ పర్వ్, అస్సాం వీరయోధుడు లాచిత్ బోర్ఫుకన్ జయంతి వేడుకలు, ఛత్ మహా పర్వ్, దుర్గా పూజ, పొంగల్ వంటి అనేక కార్యక్రమాలు ఢిల్లీలో ఉత్సాహంగా జరుగుతున్నాయని మోదీ పేర్కొన్నారు.

‘గిన్నిస్’లోకి తెలంగాణ బతుకమ్మ

- మహా బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా మహిళల ఆట
- ఏక కాలంలో రెండు రికార్డులు నమోదు
- సరూర్‌నగర్ వేదికగా అద్భుత దృశ్యకావ్యం
- వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా మిస్ వరల్డ్ ఓపల్ సుచాత


బతుకమ్మ ఆడుతున్న మిస్‌వరల్డ్ ఓపల్ సుచాత, మంత్రి సీతక్క తదితరులు


గిన్నిస్ రికార్డులు అందుకుంటున్న మంత్రులు జూపల్లి, సీతక్క. చిత్రంలో మేయర్ విజయలక్ష్మి, విమలక్క తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘ఒక్కేసి..పువ్వేసి చందమామా.. ఒక్క జామాయే చందమామా..., బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు తెలంగాణ ఉయ్యాలో..’ అంటూ మంత్రి సీతక్క, అరుణోదయ విమలక్క, గాయని గీతామాధురి సహా 1500 మంది మహిళలు ఏకకాలంలో గొంతు కలిపి బతుకమ్మ ఆడారు. 300 మంది మహిళలు మూడు రోజులు శ్రమించి 36 అడుగుల వెడల్పు, 63.11 అడుగుల ఎత్తు, 10.7 టన్నుల బరువుతో 11 వరుసల్లో తొమ్మిది రకాల పూలతో రూపొందించిన భారీ బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా నర్తించారు. ఈ అద్భుత దృశ్యకావ్యం సోమవారం సాయంత్రం సరూర్‌నగర్ స్టేడియం వేదికగా ఆవిష్కృతమైంది. దసరా నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని సాంస్కృతిక, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ పేరుతో ‘మహా బతుకమ్మ’ వేడుకలను నిర్వహించారు. గ్రేటర్ జిల్లాల నుంచే కాకుండా శివారు జిల్లాలకు చెందిన మహిళలు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. మహాబతుకమ్మ చుట్టూ ఓ క్రమపద్ధతిలో తిరుగుతూ లయబద్ధంగా నర్తించారు.

ప్రపంచంలోని తెలుగు వారందరికీ తెలిసేలా...
బతుకమ్మ సాధారణంగా 11 మీటర్ల ఎత్తు ఉండాలి. కానీ ఇక్కడ 19 మీటర్ల ఎత్తు బతుకమ్మను తయారు చేశారు. అలాగే, ఏదైనా జానపద పాటకు 474 మంది ఉండాలి. కానీ ఇక్కడ 1500 మందితో తెలంగాణ బతుకమ్మ ఫోక్ డ్యాన్స్ చేసి అబ్బుర పరిచారు. ఏకకాలంలో ఆవిష్కృతమైన ఈ రెండు ప్రదర్శనలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకున్నాయి. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి శైలేష్ ప్రకటించారు. ఈ రెండు అవార్డులను మంత్రుల చేతికి అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మిస్ వరల్డ్ ఓపల్ సుచాత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. మన బతుకమ్మ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని చెప్పారు. బతుకమ్మ అంటేనే ఆడబిడ్డల ఐక్యత అని, జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. ప్రపంచంలోని తెలుగు వారందరికీ తెలిసేలా ప్రపంచ రికార్డు సాధించామని చెప్పారు. గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆకాశంలో సగమైన ఆడబిడ్డలు నేడు అన్ని రంగాల్లో ముందుంటున్నారని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డలు ఏదైనా సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద పాల్గొన్నారు.

విజయ ‘తిలక్’కు.. విక్టరీ వెల్‌కమ్


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తిలక్‌వర్మ అభివాదం

శంషాబాద్: ఆసియా కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్‌కు అద్భుత విజయాన్ని అందించిన హైదరాబాద్ ఆటగాడు తిలక్‌వర్మకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం లభించింది. భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన తిలక్ వర్మ దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాత్రి 8.30 గంటలకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోని బాలాదేవితోపాటు క్రీడాభిమానులు పెద్దఎత్తున తిలక్‌వర్మకు స్వాగతం పలికారు. అనంతరం అందరికీ అభివాదం చేస్తూ తిలక్‌వర్మ ఇంటికి బయలుదేరారు.

విజయ్ ఆలస్యంగా రావడం వల్లే..

- కరూర్ తొక్కిసలాటపై ఎఫ్ఐఆర్‌లో పోలీసులు
- 41కి చేరిన మరణాలు



సాక్షి, చెన్నై: తమిళనాడులోని కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య 41కి చేరింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో సుగుణ అనే మహిళ సోమవారం మృతి చెందింది. చికిత్స పొందుతున్న వారిలో మరొకరి పరిస్థితి విషమంగా ఉండగా, మిగిలిన వారు కోలుకుంటున్నారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత, నటుడు విజయ్ సభకు ఆలస్యంగా రావడం, నిబంధనల్ని తుంగలో తొక్కడం వల్లే ఇంత పెద్ద ఘోరం జరిగినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం గమనార్హం, సభకు వచ్చిన జనం నీళ్లు, ఆహారం లేక నీరసించిపోతున్నారని, రద్దీ మరింత పెరిగితే ఊపిరి ఆడకపోవచ్చని తాము పదేపదే హెచ్చరించినా నిర్వాహకులు ఖాతరు చేయలేదన్నారు. ఇదిలావుండగా.. కరూర్ ఘటన గురించి సీఎం స్టాలిన్ వీడియో విడుదల చేస్తూ, జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ముమ్మందు ఇలాంటి ఘటనలు జరగకుండా రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాల సమావేశాలకు కొత్త మార్గదర్శకాలను రూపొందించి ప్రజల ప్రాణ రక్షణ దిశగా నిబంధనలు కఠినతరం చేస్తామన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన విజయ్
తొక్కిసలాట ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ విజయ్ మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనాన్ని ఆశ్రయించారు. విద్యుత్ సరఫరా నిలిపివేశారని, రాళ్లు రువ్వారని, పోలీసులు లాఠీచార్జి చేశారని పేర్కొంటూ స్థానిక డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీపై సైతం అనుమానాలు వ్యక్తం చేస్తూ పలు అంశాలను పిటిషన్‌లో ప్రస్తావించారు. కేసును సీబీఐ విచారణకు అప్పగించాలని కోరారు. ఈ కేసును అక్టోబరు 3న విచారించేందుకు ధర్మాసనం నిర్ణయించింది. ఇదిలావుండగా.. చెన్నై శివారులోని పనయూరు నివాసంలో ఉండే విజయ్.. సోమవారం అనూహ్యంగా నగరం నడ్డిబొడ్డున ఉన్న పట్టినంబాక్కం నివాసానికి మకాం మార్చారు. కరూర్ ఘటనపై విజయ్‌తో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఫోన్‌లో మాట్లాడారు. ఎంపీ హేమమాలిని నేతృత్వంలో ఈ ఘటనపై విచారణకు బీజేపీ అధిష్టానం కమిటీ నియమించినట్టు తెలిసింది.

అమెరికా వెళ్లాలంటే.. అప్పు పుట్టట్లేదు!

▶ మొదటి పేజీ తరువాయి

మధ్యతరగతి కుటుంబాలు ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నాయి. హెచ్1–బీ వీసాకు లక్ష డాలర్లు చెల్లించాలన్న ట్రంప్ నిర్ణయం అనేక కుటుంబాల్లో కునుకులేకుండా చేస్తోంది.

పెరుగుతున్న అప్పు ఒత్తిడి
భారత్ నుంచి ఈ ఏడాది దాదాపు 3 లక్షల మంది అమెరికా వెళ్లారు. తెలుగు రాష్ట్రాల నుంచి 50 వేల మంది వెళ్లినట్టు అంచనా. ఇందులో ఎక్కువ మంది చిన్నస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలే ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో బ్యాంకు లోన్లలతోపాటు, తేలికగా ప్రైవేటు అప్పులు పుట్టాయి. అమెరికా వెళ్లే విద్యార్థి పార్ట్ టైం ఉద్యోగం చేసి సంపాదిస్తాడనే నమ్మకం ఉండేది. దీంతో ప్రైవేటు వ్యక్తులూ అప్పులివ్వడానికి వెనుకాడలేదు. కొంతమంది తల్లిదండ్రులు రూ.2 నుంచి 5 వడ్డీకి కూడా అప్పులు తెచ్చారు. వడ్డీ రెండేళ్లలో అసలును మించి పోయిందని ఇప్పుడు వాపోతున్నారు. వచ్చే జీతంలో ఎక్కువ భాగం నెలనెలా వడ్డీ కట్టేవాళ్లు ఉన్నారు. అమెరికాలో పార్ట్‌టైం ఉద్యోగాలు చేయొద్దంటూ ఆంక్షలు పెట్టడంతో, జీవనం కోసం విద్యార్థులు తల్లిదండ్రులను ఆశ్రయించారు. డబ్బులు పంపకపోతే అమెరికాలో ఉండటం కష్టమని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఏడాదిగా కొత్త అప్పులు తీసుకురాక తప్పని పరిస్థితి. దీనికితోడు రూపాయి మారక విలువ తగ్గడంతో అమెరికాలో యూనివర్సిటీ ఫీజుల భారం ఎక్కువైంది. ఇవన్నీ తల్లిదండ్రులను మరింత అప్పుల్లోకి నెట్టాయి. హెచ్1–బీ వీసాకు ఆంక్షలు పెట్టడంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన 19 వేల మంది విద్యార్థులు ఎంఎస్ పూర్తి చేసుకుని, ఉద్యోగం లేని కారణంగా వెనక్కు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది గమనించిన అప్పుల వాళ్లు తామిచ్చిన మొత్తాన్ని ఇవ్వమని తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారు. వడ్డీ ఇవ్వకున్నా అసలైనా ఇవ్వాలని కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఏమీ చేయలేని అయోమయంలోకి వెళ్తున్నారు.

అమ్మో... అప్పా?
కొత్తగా అమెరికా వెళ్లే విద్యార్థులకు అప్పులు ఇచ్చేందుకు ప్రైవేటు వ్యక్తులు ముందుకు రావడం లేదు. స్థిరాస్తి కుదవపెడితే ఆలోచిస్తామని చెబుతున్నారు. బ్యాంకులు కూడా షూరిటీని అడుగుతున్నాయని తల్లిదండ్రులు అంటున్నారు. అమెరికా వెళ్లాలంటే ముందుగా జీవన వ్యయాన్ని బ్యాంకు నిల్వగా చూపించాలి. ఈ మొత్తాన్ని ఆరు నెలల ముందే బ్యాంకులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. వచ్చే జనవరి సెమిస్టర్ కోసం యూఎస్ వెళ్లే విద్యార్థులు ఇప్పట్నుంచే ఏర్పాట్లు చేసుకోవాలి. ఒక్కో విద్యార్థి కనీసం రూ. 40 లక్షలు సమకూర్చుకుంటే తప్ప అమెరికా వెళ్లలేరు. కొంత మంది ఉద్యోగులు తమ పీఎఫ్ డ్రా చేస్తున్నారు.

ఒత్తిడి పెరిగింది

సాధారణ ఉద్యోగం చేసే నేను రూ.20 లక్షల ప్రైవేటు అప్పు చేసి ఎంఎస్ కోసం కొడుకును అమెరికా పంపాను. రెండేళ్లలో అప్పు రెట్టింపు అయింది. నెలనెలా అమెరికాలో అబ్బాయికి డబ్బులు పంపుతున్నాను. అప్పు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నా ఏమీ చేయలేని పరిస్థితి. స్థిరాస్తులు కూడా ఏమీ లేవు. భయమేస్తోంది.
– మల్లెల హర్షవర్ధన్ (సిద్దిపేట)

అప్పంటే భయమేస్తోంది

అమెరికా వెళ్లే వారికి కొన్నేళ్లుగా అప్పులు ఇస్తున్నాను. పెద్దగా ష్యూరిటీ ఆశించలేదు. కానీ రెండేళ్లుగా ఇస్తున్న అప్పులు తిరిగి రావడం కష్టంగా ఉంది. కొంతమంది వద్ద స్థిరాస్తులు కూడా లేవు. గట్టిగా అడిగే పరిస్థితి లేదు. అందుకే అమెరికా వెళ్లే వారికి అప్పులు ఇవ్వడం మానేశాను.
– మారపంపు నవీన్, వడ్డీ వ్యాపారి, వరంగల్

‘బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్’

పోటీల దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పండుగలు, చరిత్ర, సంస్కృతి నేపథ్యంలో ‘బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్’ పోటీల కోసం దరఖాస్తు తేదీని వచ్చే నెల 5 వరకు పొడిగించారు. ప్రజాపాలన, తెలంగాణ పండుగలు, చరిత్ర, సంస్కృతి నేపథ్యంగా ‘బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ చాలెంజ్’ పోటీలు నిర్వ హించనున్నట్టు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు తెలిపిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్‌ఫిల్మ్స్, పాటల పోటీలు ఉంటాయని, షార్ట్ ఫిల్మ్స్ నిడివి 3 నిమిషాలకు, పాటల వ్యవధి 5 నిమిషాలకు మించరాదని, రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున ప్రథ మ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించనున్నారని తెలిపారు. కన్సొలేషన్ బహుమతి రూ.20 వేలు (ఐదుగురికి) ఇవ్వడంతో పాటు విజేతలందరికీ ప్రశంసాపత్రం, జ్ఞాపిక ప్రదా నం చేస్తారని తెలిపారు. ఎంట్రీలను youngfilmmakerschallenge@gmail.comకి, లేదా 8125834009 వాట్సాప్ ఫోన్ నంబర్‌కు పంపాలని వెల్లడించారు.

పీహెచ్‌డీ ప్రవేశాల జాబితా విడుదల

లాలాపేట (హైదరాబాద్): ఉస్మానియా యూనివర్సిటీ 2025 పీహెచ్‌డీ ప్రవేశాలకు కేటగిరీ 2 తుది జాబితాను సోమవారం ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ. కుమార్ ఆయా విభాగాల డీన్లతో కలిసి విడుదల చేశారు. మొత్తం 12 ఫ్యాకల్టీలకు సంబంధించి 667 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్స్‌కు అవకాశం లభించింది. వివిధ విభాగాల నుంచి 2,906 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

వచ్చే అసెంబ్లీ పోటీలో బీఆర్ఎస్ ఉండదు

స్టాంప్ పేపర్‌పై రాసిస్తా: ఎంపీ అర్వింద్



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ పోటీలో ఉండదని, ఈ విషయాన్ని స్టాంప్ పేపర్ మీద రాసిస్తానని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యలోనే పోటీ ఉంటుందని, ఈ రెండుపార్టీల్లో ఏదో ఒకటి అధికారంలోకి వస్తుందన్నారు. ‘నా జిల్లా వరకు ఎన్నికలకు మేము ఎప్పటినుంచో సిద్ధంగా ఉన్నాం. నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ స్థానం మేమే గెలుస్తున్నాం’ అని ధీమా వ్యక్తంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులే కీలకమని, ఈ విషయంలో పార్టీలకు పెద్దగా సంబంధం ఉండదన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ‘వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను చూసి ఓట్లు వేస్తారా? కేటీఆర్‌నా.? కేసీఆర్ ది ముగిసిన చరిత్ర’ అని వ్యాఖ్యానించారు. ‘అర్ధరాత్రి తనను కొడంగల్ నుంచి ఎత్తుకుపోయింది రేవంత్‌రెడ్డి మర్చిపోయాడా? కేసీఆర్‌ను ఇంకా జైలుకు పంపడం లేదంటే రేవంత్‌లో పౌరుషం లేదా’ అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పార్లమెంట్ పరిధి నియోజకవర్గం కాబట్టి జూబ్లీహిల్స్ ఎన్నిక బాధ్యత ఆయనదేనని అర్వింద్ వ్యాఖ్యానించారు.

‘బాకీ కార్డు’తో కాంగ్రెస్‌ను ఓడిస్తాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ అభయహస్తం. ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తం
- కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ నేత ప్రదీప్ చౌదరి


మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ‘బాకీ కార్డు’ఉద్యమంతో కాంగ్రెస్ సర్కార్ భరతం పడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీఆర్ఎస్‌దే హవా అని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జూబ్లీహిల్స్‌కు చెందిన టీడీపీ సీనియర్ నేత ప్రదీప్ చౌదరి తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అబద్ధపు హామీలను ఎండగట్టేందుకే ‘బాకీ కార్డు’ఉద్యమం ప్రారంభించామని తెలిపారు. కాంగ్రెస్ అభయహస్తం ఆ పార్టీకి భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉన్న సమస్యలతోనే ఆగమవుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త నగరం కడతామని ఊదరగొడుతున్నారని ఎద్దేవా చేశారు. చెత్త, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలతో నగరం అల్లాడుతోందని, రోడ్ల నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 42 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మితమైతే, కాంగ్రెస్ ఒక్క ఇటుకా పేర్చలేదన్నారు.

కాంగ్రెస్ అసమర్థ పాలనపై ప్రజల ఆగ్రహం..
రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు కాంగ్రెస్ అసమర్థ పాలనపై ఆగ్రహంతో ఉన్నారని, రైతులు ఎరువుల కోసం వచ్చి నానా ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాగంటి సునీత బంపర్ మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రదీప్ చౌదరి చేరికతో బీఆర్ఎస్ మరింత బలోపేతమవుతుందని అన్నారు. కేసీఆర్ 14 ఏళ్ల పోరాటంతో తెలంగాణ సాధించి, 10 ఏళ్ల పాలనలో దేశంలో అగ్రస్థానంలో నిలిపారని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటే పండుగ బతుకమ్మ: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించి, గౌరమ్మను భక్తితో కొలిచే సబ్బండ వర్ణాల సంబురం బతుకమ్మ పండుగ.. అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని తెలిపారు.

సీఐ, పైస్థాయి అధికారికి మాత్రమే అధికారం

‘స్పా’పై ఎస్ఐ పెట్టిన కేసును కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మనుషుల అక్రమ రవాణా నివారణ చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం కేసు నమోదు చేసే అధికారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లేదా ఆపై స్థాయి అధికారికి మాత్రమే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ నమోదు చేసిన కేసు చట్టప్రకారం చెల్లదంటూ కొట్టివేసింది. స్పా ముసుగులో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారని, మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ దాడులు నిర్వహించారు. మేనేజర్‌గా పేరున్న మహిళ కేసు కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ఏపీపీ వాదనలు వినిపిస్తూ.. ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నందున కేసు కొట్టివేయొద్దని, దర్యాప్తు కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నా చట్టప్రకారమే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ లేదా అంతకంటే ఎక్కువ హోదా ఉండే ప్రత్యేక అధికారికి మాత్రమే ఈ చట్టం కింద చర్య తీసుకునే అధికారం ఉందన్నారు. సోదాలు, స్వాధీనం, కేసు నమోదు సహా అన్ని చర్యలు చట్టపరంగా జరగలేదంటూ కేసు కొట్టివేశారు. అక్రమ రవాణా నిరోధం కేసుల దర్యాప్తునకు ప్రత్యేక అధికారులను నియమించాలని డీజీపీని ఆదేశించారు

స్థానిక అభ్యర్థుల ఎంపికకు ప్రత్యేక కమిటీలు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఖమ్మం జిల్లా కూసు మంచిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన పాలేరు నియోజకవర్గ పరిధిలోని నాయకులతో మండలాల వారీగా సమావేశమయ్యారు. గ్రామాల్లో పరిస్థితులు, గెలుపు అవకాశాలను ఆరా తీశాక.. మంత్రి మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా ఉండేలా ప్రతీ మండలానికి 9మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గెలుపు అవకాశాలు, పార్టీపై విధేయత ఉన్న వారికి అవకాశాలు వస్తాయని.. రిజర్వేషన్ల కారణంగా ఎవరికైనా పోటీచేసే అవకాశం రాకపోతే ఇతర అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సమయాన ఎవరూ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేయొద్దని, అలా చేస్తే క్రమ శిక్షణ చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. టికెట్ కావాలని అందరూ ఆశించినా గెలుపే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. కూసుమంచి మండలంలో ధర్మాతండా బీసీ, మంగళితండా బీసీ మహిళకు రిజర్వ్ కాగా ధర్మాతండాలో కుమ్మరికుంట్ల నాగరాజు, మంగళితండా నుంచి జిల్లా అనిత మాత్రమే ఆ కేటగిరీలో ఉన్నారని, వారు ఏక గ్రీవం అయ్యే అవకాశముందంటూ స్థానిక నాయకులు వారిని మంత్రికి పరిచయం చేయగా, వారికి పొంగులేటి అభినందనలు తెలిపారు.

‘బీసీ రిజర్వేషన్ల’పై గవర్నర్‌ను ఒప్పించండి


రాంచందర్‌రావును కోరిన జాజుల బృందం

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లను 42% పెంచుతూ ప్రభుత్వం చేసిన చట్టాన్ని గవర్నర్‌కు పంపి నెల రోజులు గడుస్తున్నప్పటికీ నేటివరకు ఆమోదం దక్కలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన బీసీలకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర గవర్నర్ బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడానికి బీజేపీ పార్టీ తర పున జోక్యం చేసుకొని తక్షణమే గవర్నర్‌తో పార్టీ తరఫున భేటీ కావాలని జాజుల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిసి విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే ఆమోదించేలా రాష్ట్ర గవర్నర్‌తో కలిసి ఒత్తిడి తీసుకు రావాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

స్థానిక ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ?

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి తరఫున బరిలో దిగితే ఎలా ఉంటుందనే కోణంలో కవిత ఆలోచిస్తున్నట్టు తెలిసింది. బీసీలకు 42% రిజర్వేషన్ల సాధనలో తెలంగాణ జాగృతి పోరాటం కూడా ఇమిడి ఉన్నందున పోటీ చేయాలని అనుచరుల నుంచి సూచనలు అందుతున్నట్టు తెలిసింది. తన వెనుక ఏ జాతీయ పార్టీ లేదని ప్రకటించిన కవిత.. భవిష్యత్‌లో సొంత పార్టీ పెట్టడంపై కసరత్తు జరుపుతున్నట్టు తెలిసింది. 2001లో టీఆర్ఎస్ ఆవిర్భావ సమయంలోనూ కేసీఆర్ స్థానిక ఎన్నికల్లో పార్టీ ఆరంగేట్రం ద్వారా విస్తరణ వ్యూహాన్ని అమలు చేసిన విషయాన్ని తెలంగాణ జాగృతి వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అదే తరహాలో తెలంగాణ జాగృతి కూడా స్థానిక ఎన్నికల్లో పోటీ ద్వారా రాజకీయ పార్టీగా ఆరంగేట్రం చేయాలనే వ్యూహంతో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం తెలంగాణ జాగృతి నాయకులతో జరిగే భేటీ అనంతరం కవిత కీలక ప్రకటన చేసే అవకాశమున్నట్టు సమాచారం.

అదనంగా 23,973 పదవులు!



బీసీలకు 42% కోటా బొనాంజా
అన్ని స్థాయిల్లో కలిపి మొత్తం 55 వేలకు పైగా స్థానిక పదవులు
గతంలో కంటే 2,422 సర్పంచ్ పదవులు పెరిగే అవకాశం
వార్డు సభ్యులుగా అదనంగా 20 వేల మంది బీసీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుతో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఆయా వర్గాలకు అధికారికంగా 24 వేల అదనపు స్థానిక పదవులు లభిస్తాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇంకా స్పష్టంగా తేలకపోయినప్పటికీ 23,973 పదవులు అదనంగా బీసీలకు దక్కుతాయని చెపుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో క్షేత్రస్థాయి రాజకీయ ముఖచిత్రం మారిపోతుందని పేర్కొంటున్నాయి. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లు కలిపి సుమారు 55,624 మంది బీసీ నాయకులు ఆయా పదవుల్లో కూర్చుంటారని, ఈ సంఖ్య ఇంకా ఎక్కువ కూడా ఉండే అవకాశముందని అంటున్నాయి.

5,350కి పైగా సర్పంచులు

గ్రామ పాలనకు అధ్యక్షులుగా ఉండే సర్పంచులుగా ఈసారి 5,350 మంది బీసీ నేతలు ఎన్నిక కానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,733 సర్పంచ్ పదవుల్లో బీసీలకు పెంచిన 42 శాతం రిజర్వేషన్లు అమలైతే ఈ మేరకు పదవులు దక్కనున్నాయి. గతంతో పోల్చుకుంటే 2,422 సర్పంచ్ పదవులు అధికంగా దక్కనున్నాయి. ఇక 1.12 లక్షలకు పైగా ఉన్న వార్డు సభ్యులకు గాను 47 వేలు, 5,749 ఎంపీటీసీ స్థానాల్లో 2,420 మంది బీసీలు ఎన్నిక కానున్నారు. అదే విధంగా చెరో 565 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో బీసీలకు గతం కంటే 101 స్థానాలు అధికంగా చెరో 238 స్థానాలు దక్కుతాయని అంచనా. ఇప్పటివరకు రాష్ట్రంలోని 8 జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలు బీసీలకు రిజర్వు కాగా, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రకారం ఆ సంఖ్య 13కు పెరిగిన విషయం తెలిసిందే. ఇలా 31 జెడ్పీ చైర్మన్ పదవుల్లో బీసీలకు ఇప్పటికే 13 దక్కడం తెలిసిందే. కాగా గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఎన్నికల్లో రిజర్వేషన్ల శాతాన్ని 34 నుంచి 23కు తగ్గించడంతో పెద్ద ఎత్తున బీసీ నేతలు అధికారికంగా ప్రజాప్రతినిధులయ్యే అవకాశం కోల్పోయారు. ఇలా కోల్పోయిన వారు కనీసం 13,346 మంది ఉంటారని అంచనా. అయితే, ఇప్పుడు జరిగే ఎన్నికల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు అమలైతేనే బీసీలు కనీసం 50 వేల మంది స్థానిక ప్రజాప్రతినిధులు కానున్నారు. ఒకవేళ జనరల్ స్థానాల్లోనూ బీసీలను నిలబెడితే ఆ సంఖ్య మరింత పెరుగుతుంది. ఒకవేళ బీసీ రిజర్వేషన్లు అధికారికంగా అమలు కాకపోతే ఎలాగూ స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికలు జరుగుతాయని, అప్పుడు అన్ని పార్టీలు ఇప్పుడు ప్రభుత్వం ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారమే అభ్యర్థులను నిలబెడతాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. అయితే ఇది తప్పనిసరి కాకపోవడంతో..ఆయా పార్టీలు బీసీలకు ఇచ్చే అవకాశాన్ని బట్టి వారికి లభించే పదవుల సంఖ్య ఆధారపడి ఉండనుంది.

స్థానిక పోరుకు సైరన్

▶ మొదటి పేజీ తరువాయి

పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, పీఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్ఈసీ కార్యదర్శి మంద మకరందలతో కలిసి ఆమె స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 31 జిల్లాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీల ఖాళీల వివరాలతో కూడిన గెజిట్‌ను అధికారులు విడుదల చేశారని తెలిపారు. ఒక్కో దశకు ఆయా తేదీలను బట్టి ఎక్కడికక్కడ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల చేస్తారని చెప్పారు. ఇవి జారీ అయిన రోజు కలిపి మొత్తం మూడురోజుల పాటు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. హైకోర్టుస్టే ఉత్తర్వుల కారణంగా.. 14 ఎంపీటీసీ, 27 గ్రామపంచాయతీలు, 246 వార్డులకు ఎన్నికలు జరపడం లేదన్నారు. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలు, 25 గ్రామపంచాయతీలు, 230 వార్డులకు, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని కుర్మపల్లి, రామచంద్రాపూర్ పంచాయతీలు, వీటిలోని 16 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం లేదని కమిషనర్ తెలియజేశారు.

ఎన్నికలు జరిగే స్థానాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలు

జిల్లా పరిషత్‌లు	31
మండల పరిషత్‌లు	565
జెడ్పీటీసీ స్థానాలు	565
ఎంపీటీసీ స్థానాలు	5,749
ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్లు	31,300
ఎంపీటీసీ/జెడ్పీటీసీ పోలింగ్ ప్రాంతాలు	15,302
మొత్తం గ్రామ పంచాయతీలు	12,733
మొత్తం వార్డులు	1,12,288
పోలింగ్ స్టేషన్లు	1,12,474
గ్రామ పంచాయతీ పోలింగ్ ప్రాంతాలు	15,522
రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ఓటర్లు	
పురుషులు	81,65,894
మహిళలు	85,36,770
ఇతరులు	504
మొత్తం	16,70,3168

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ ఇలా..

	మొదటి దశ	రెండో దశ
ఎంపీపీ, జెడ్పీపీల వారీగా ఓటర్ల జాబితా ప్రచురణ	అక్టోబర్ 9న	అక్టోబర్ 13న
ఎన్నికల నోటిఫికేషన్ జారీ	అక్టోబర్ 9న- నామినేషన్ల స్వీకారం మొదలు (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు)	అక్టోబర్ 13న - నామినేషన్ల స్వీకారం మొదలు (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు)
నామినేషన్ల దాఖలుకు చివరిరోజు	అక్టోబర్ 11 సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 15న సాయంత్రం 5 దాకా
నామినేషన్ల పరిశీలన	అక్టోబర్ 12న సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 16న సాయంత్రం 5 దాకా
చెల్లుబాటయ్యే అభ్యర్థుల జాబితా	అక్టోబర్ 12న సాయంత్రం 5 తర్వాత	అక్టోబర్ 16న సాయంత్రం 5 తర్వాత
అప్పీల్‌కు చివరి తేదీ	అక్టోబర్ 13న సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 17న సాయంత్రం 5 దాకా
అప్పీళ్ల పరిష్కారం	అక్టోబర్ 14న సాయంత్రం 5 లోపు	అక్టోబర్ 18న సాయంత్రం 5 లోపు
ఉపసంహరణలకు చివరితేదీ	అక్టోబర్ 15న మధ్యాహ్నం 3 గంటల లోపు	అక్టోబర్ 19న మధ్యాహ్నం 3 గంటల లోపు
పోటీచేస్తున్న అభ్యర్థుల జాబితా ప్రకటన	అక్టోబర్ 15న మధ్యాహ్నం 3 గంటల తర్వాత	అక్టోబర్ 19న మధ్యాహ్నం 3 గంటల తర్వాత
ఎన్నికల తేదీ	అక్టోబర్ 23న ఉ: 7 నుంచి సా: 5 దాకా	అక్టోబర్ 27న ఉ: 7 నుంచి సా: 5 దాకా
రీ పోలింగ్ ఏమైనా ఉంటే	ఎస్ఈసీ నిర్ణయించిన మేరకు..	ఎస్ఈసీ నిర్ణయించిన మేరకు...
ఓట్ల లెక్కింపు	నవంబర్ 11న ఉదయం 8 గంటల తర్వాత	నవంబర్ 11న ఉదయం 8 గంటల తర్వాత
ఫలితాల ప్రకటన	ఓట్ల లెక్కింపు ముగియగానే...	ఓట్ల లెక్కింపు ముగియగానే...

	మొదటి దశ	రెండో దశ	మూడో దశ
వార్డుల వారీగా ఓటర్ల జాబితాల ప్రదర్శన	అక్టోబర్ 17న (శుక్రవారం)	అక్టోబర్ 21న (మంగళవారం)	అక్టోబర్ 25న (శనివారం)
నోటిఫికేషన్ జారీ	అక్టోబర్ 17న-నామినేషన్ల స్వీకారం మొదలు (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 దాకా)	అక్టోబర్ 21న-నామినేషన్ల స్వీకారం మొదలు (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 దాకా)	అక్టోబర్ 25న-నామినేషన్ల స్వీకారం మొదలు (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 దాకా)
నామినేషన్ల దాఖలుకు చివరిరోజు	అక్టోబర్ 19 సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 23 సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 27 సాయంత్రం 5 దాకా
నామినేషన్ల పరిశీలన	అక్టోబర్ 20న సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 24న సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 28న సాయంత్రం 5 దాకా
చెల్లుబాటయ్యే అభ్యర్థుల జాబితా	అక్టోబర్ 20న సాయంత్రం 5 తర్వాత	అక్టోబర్ 24న సాయంత్రం 5 తర్వాత	అక్టోబర్ 28న సాయంత్రం 5 తర్వాత
అప్పీల్‌కు చివరితేదీ	అక్టోబర్ 21న సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 25న సాయంత్రం 5 దాకా	అక్టోబర్ 29న సాయంత్రం 5 దాకా
అప్పీళ్ల పరిష్కారం చివరి తేదీ	అక్టోబర్ 22న సాయంత్రం 5 లోపు	అక్టోబర్ 26న సాయంత్రం 5 లోపు	అక్టోబర్ 30నసాయంత్రం 5 లోపు
ఉపసంహరణకు చివరితేదీ	అక్టోబర్ 23న మధ్యాహ్నం 3 గంటల లోపు	అక్టోబర్ 27న మధ్యాహ్నం 3 గంటల లోపు	అక్టోబర్ 31న మధ్యాహ్నం 3 గంటల లోపు
అభ్యర్థుల జాబితా ప్రకటన	అక్టోబర్ 23న మధ్యాహ్నం 3 గంటల తర్వాత	అక్టోబర్ 27న మధ్యాహ్నం 3 గంటల తర్వాత	అక్టోబర్ 31న మధ్యాహ్నం 3 గంటల తర్వాత
ఎన్నికల తేదీ	అక్టోబర్ 31న ఉ: 7 నుంచి మ: 1 గంట దాకా	నవంబర్ 4న ఉ: 7 నుంచి మ: 1 గంట దాకా	నవంబర్ 8న ఉ: 7 నుంచి మ: 1 గంట దాకా
ఓట్ల లెక్కింపు	అక్టోబర్ 31న మధ్యాహ్నం 2 గంటల నుంచి	నవంబర్ 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి	నవంబర్ 8న మధ్యాహ్నం 2 గంటల నుంచి
ఫలితాల ప్రకటన	ఓట్ల లెక్కింపు ముగియగానే...	ఓట్ల లెక్కింపు ముగియగానే...	ఓట్ల లెక్కింపు ముగియగానే...

(ఏదైనా కారణం వలన ఉప-సర్పంచ్ ఎన్నిక జరగకపోతే మరుసటిరోజు గ్రామపంచాయతీ నిర్ణయించిన మేరకు సెలవు దినం అయినా కూడా నిర్వహించాలి)

స్థానిక ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదం మాకే..

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



మధిర: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు ఆదరించి, ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా మధిరలోని క్యాంపు కార్యాలయంలో సోమ వారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ ఎస్ పెద్దలు పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక, పాలనా వ్యవస్థలను విధ్వంసం చేస్తే.. వాటిని ప్రణాళిక ప్రకారం సరి చేసుకుంటూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలేంటో వారి హృదయాలకు బాగా తెలుసు అన్నారు. తమ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, తద్వారా బీసీల దశాబ్దాల కోరిక నెరవేర్చామని చెప్పారు. ప్రజల కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రపూరితంగా కొందరిని కోర్టులకు పంపిస్తున్నారని ఆరోపించారు. లెక్కకు మిక్కిలిగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయని భట్టి తెలిపారు.

మా నోటి దగ్గరి ముద్ద లాక్కోవద్దు

మద్దతిచ్చే అన్ని పార్టీలు హైకోర్టుకు అఫిడవిట్లు ఇవ్వాలి: మంత్రి పొన్నం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి

సాక్షి, హైదరాబాద్: తాము ఎవరి నోటి దగ్గర ముద్దనూ లాక్కోవడం లేదని, తమ నోటి దగ్గర ముద్దను కూడా ఎవరూ లాక్కునే ప్రయత్నం చేయొద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశమున్న పార్టీలు, ఇందుకు మద్దతిచ్చే పార్టీలు ఈ మేరకు హైకోర్టులో అఫిడవిట్లు దాఖలు చేయాలని కోరారు. సోమవారం మరో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సామాజిక న్యాయానికి ప్రతినిధులైన తొలితరం ప్రజాప్రతినిధులు త్వరలోనే రాబోతున్నారని వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జీఓపై ఈ నెల 8వ తేదీ నుంచి వాద ప్రతివాదనలు ప్రారంభమవుతాయని, ఆ సమయంలో సామాజిక న్యాయాన్ని కాంక్షించే ప్రతి వ్యక్తి ప్రభుత్వానికి మద్దతుగా నిలబడాలని కోరారు. రాజకీయ పార్టీలు కూడా తమ మద్దతు తెలియజేస్తూ హైకోర్టులో అఫిడవిట్లు దాఖలు చేయాలని కోరారు. తమకు న్యాయస్థానాలపై గౌరవం ఉందని, బీసీల రిజర్వేషన్లను కొనసాగించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే 50 శాతం పరిమితి దాటిపోయిందని, ఇప్పుడు దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు.

పండుగ ముందే పండుగ: మంత్రి వాకిటి శ్రీహరి

దసరా పండుగ కంటే ముందే తెలంగాణలోని బీసీ వర్గాల్లో పండుగ వాతావరణం కనిపిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు బీసీ బిడ్డలకు ప్రజాప్రభుత్వం ఇచ్చిన వరమని చెప్పారు. వాస్తవానికి బీసీలకు అంతకంటే ఎక్కువ వాటానే రావాలని, కానీ కుదించుకొని తామే 42 శాతానికి సర్దుకుంటున్నామని, న్యాయపరమైన ఈ కోరిక అమలు కాకపోతే బీసీ బిడ్డలు మరింత వెనుకబడతారని చెప్పారు. అన్ని పార్టీలు, ఆయా పార్టీల్లోని బీసీ నాయకులు ఈ రిజర్వేషన్లకు మద్దతివ్వాలని, పార్టీ మెప్పు కోసం, అధినాయకుల మెప్పు కోసం తలవంపులు తెచ్చుకోవద్దన్నారు. బీజేపీ నేతలు కాళ్లలో కట్టెలు పెట్టే ప్రయత్నాన్ని మానుకోవాలని, 42 శాతం రిజర్వేషన్లకు అంగీకరించకపోతే బీసీ బిడ్డల ఆగ్రహానికి గురికాక తప్పదని శ్రీహరి హెచ్చరించారు.

స్థానిక ఎన్నికలపై ప్రజలకు నమ్మకం లేదు

జగదీశ్ రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రజలకు నమ్మకం లేదని, ఎన్నికలు ప్రహసనంగా మారాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చితే తప్ప సాధ్యం కాదన్నారు. ప్రభుత్వం జీఓలతో బీసీలను మోసం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని చెప్పారు. మెట్రో రైలు విషయంలో ప్రభుత్వ వైఖరిపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఎల్అండ్‌టీకి లాభం చేకూర్చేందుకే సీఎం రేవంత్ రెడ్డి మెట్రోను ప్రభుత్వం చేతిలోకి తీసుకున్నారన్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం పడుతుందన్నారు. మెట్రో వాటా కొనుగోళ్లలో రూ.వెయ్యి కోట్లు చేతులు మారాయని, ఎల్అండ్‌టీ షేర్లు ఒక్క రోజులోనే భారీగా పెరిగాయని చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దందాలు నడుస్తున్నాయని, ప్రజా ప్రయోజనాలు లేవని, ఓటుతో బుద్ధి చెప్పాలని జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు.

సెక్రటరీల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.104కోట్లు విడుదల చేసింది. ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా ఒకేసారి ఇంత పెద్ద మొత్తాన్ని విడుదల చేయడం పంచాయతీ వ్యవస్థ పటిష్టతకు దోహదం చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు.

ఏపీపీ దరఖాస్తులకు గడువు అక్టోబర్ 5

సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువు అక్టోబర్ 5 సాయంత్రం 5 గంటలతో ముగియనున్నట్టు టీఎస్ఎల్పీఆర్బీ (తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు) చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 118 ఏపీపీ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు కోసం ఇప్పటివరకు బోర్డు వెబ్‌సైట్‌లో ఐదువేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

బదిలీలు, ప్రమోషన్లపై నిషేధం

బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు.. రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో.. ఈ ఎన్నికల నిర్వహణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ముడిపడి ఉన్న అధికారులందరి బదిలీలు, పోస్టింగ్‌లపై పూర్తి నిషేధం విధించినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తెలిపింది. ఈ ఎన్నికలను బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహిస్తున్నట్టు ఎస్ఈసీ తెలిపింది. గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి బ్యాలెట్ బాక్స్‌లను రప్పించినట్లు వెల్లడించింది. ఎన్నికల సమయంలో లౌడ్‌స్పీకర్ల వినియోగం, ఊరేగింపులు, బహిరంగ సభల నిర్వహణ, ఓటర్లను ప్రలోభపరిచే అవినీతి చర్యలు, తదితరాలపై పోలీస్‌శాఖ కచ్చితమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. సోమవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసినందున, అప్పటి నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ కార్యదర్శి మంద మకరంద్ తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ స్థానిక సంస్థల పరిధిలోని సంబంధిత ప్రాంతాల్లో కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతోనే..

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ముందస్తు కార్యకలాపాలను ముగించి, ముసాయిదా షెడ్యూల్‌ను పంపించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం (కాంకరెన్స్)తో ఎన్నికల తేదీలను ఖరారు చేసినట్టు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల స్థానాలకు సంబంధించి మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్లు తెలియజేసిందని తెలిపింది. ఆ తర్వాత సీఎస్, డీజీపీ, పీఆర్ఆర్‌డీ, ఆర్థిక, ఎక్సైజ్ శాఖల ముఖ్య కార్యదర్శులు, పీఆర్ఆర్‌డీ డైరెక్టర్, ఎస్ఈసీ కార్యదర్శిలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ శాఖలకు చెందిన అధికారులంతా సూచించిన షెడ్యూల్ తేదీలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణకు సంసిద్ధతను వ్యక్తం చేసినట్టు వివరించింది. స్థానిక ఎన్నికల నిర్వహణ గడువును సెప్టెంబర్ 30 నుంచి మరో 45 రోజుల పాటు పొడిగింపు కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్‌ను దాఖలు చేసినట్టు వెల్లడించింది.

జిల్లాల్లో ఏర్పాట్లపై ఎస్ఈసీ సమీక్ష

స్థానిక ఎన్నికలు జరగనున్న 31 గ్రామీణ జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలు, శాంతి భద్రతల పరిస్థితి, ఎన్నికలకు సంబంధించిన సన్నాహాలను రాష్ట్ర ఎన్నికల సంఘం సమీక్షించింది. సోమవారం జిల్లా కలెక్టర్లు (జిల్లా ఎన్నికల అధికారులు), కమిషనర్లు/ ఎస్పీలు, ఇతర జిల్లాస్థాయి ఎన్నికల అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ, పీఆర్‌శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర అధికారులు పాల్గొన్నారు. పోలింగ్ శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇద్దరు పిల్లలకు మించొద్దు

మండల, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో.. ఇద్దరికి మించి పిల్లలు ఉన్నట్టయితే పోటీ చేయడానికి అనర్హులు. గతంలో ఉమ్మడి ఏపీలో చంద్రబాబు సర్కార్ ఈ నిబంధన తీసుకువచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఈ నిబంధన ఎత్తివేశారు. తెలంగాణ గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం కొనసాగుతోంది. రాష్ట్ర కేబినెట్‌లో ఈ అంశం చర్చకు రాగా, ఈ నిబంధనను కొనసాగించాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే పట్టణ స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ హయాంలో ఈ నిబంధనను తొలగించారు.



నువ్వు సముద్రంలో ఒక నీటి బిందువువి కాదు.
ఒక నీటి బిందువులోని మొత్తం సముద్రమే నువ్వు!
– జలాలుద్దీన్ రూమీ

సాక్షి
మంగళవారం, 30 సెప్టెంబర్ 2025

కన్నీటి మడుగైన కరూర్

ఇరుకిరుకు రోడ్లు... లక్షలాదిమంది యువత ఆరాధించే తెరవేల్పు ఆగమనం... అంచనాలకు మించి వేలాదిగా తరలివచ్చిన జనం–ఒక హృదయవిదారక ఘటన చోటు చేసుకోవటానికి ఇంతకన్నా ఏం కావాలి? చరిత్ర ప్రసిద్ధిచెందిన నగరం మాత్రమే కాదు... వర్తమానంలో వేలాది కుటుంబాలకు జీవికనిస్తున్న పరిశ్రమలకు నిలయంగా కూడా ఉన్న తమిళనాడులోని కరూర్ నగరం శనివారం జరిగిన తొక్కిసలాట ఉదంతం తర్వాత పూర్తిగా విషాదంలో కూరుకుపోయింది. ఇంతవరకూ 41 మంది చనిపోగా, దాదాపు 80 మంది వరకూ గాయాలపాలయ్యారు. మృతుల్లో 10 మంది చిన్నారులు, 17 మంది మహిళలు ఉన్నారు. తల్లులు, బిడ్డలు, త్వరలో వివాహం కావలసిన రెండు జంటలు కూడా ఈ మృతుల్లో ఉండటం కలచివేసే విషయం. కొత్తగా ఏర్పాటైన తమిళగ వెట్రి కజగం(టీవీకే) అధినేత, సినీనటుడు విజయ్ నిర్వహించిన ర్యాలీలో ఈ ఘోరం చోటు చేసుకుంది. పదివేలమంది వస్తారంటే అనుమతినిచ్చామని, కానీ అది మూడురెట్లకు పెరిగిందని పోలీసులు చెబుతున్నారు. జనాకర్షణ గల విజయ్ వంటి నటుడి ర్యాలీకి వచ్చే జనంపై తగిన అంచనాలు లేకపోవటం సరికాదు. మతపరమైన ఉత్సవాలు, క్రీడా సంరంభాలు, రాజకీయ పక్షాల ర్యాలీలు వగైరాల్లో అసంఖ్యాకంగా జనం పాల్గొనటం ఇటీవలికాలంలో తరచు కనబడుతోంది. ఈ ఏడాదిలో ప్రయాగ్‌రాజ్ కుంభమేళాతో మొదలై దేశవ్యాప్తంగా ఇంతవరకూ కనీసం అయిదారు విషాద ఉదంతాలు చోటు చేసుకున్నాయి. కానీ నిర్వాహకులు, ప్రభుత్వాలు, పోలీసులు వీటి నుంచి గుణపాఠం తీసుకుంటున్న దాఖలాలు లేవు.

ఉత్పాదక నగరమైన కరూర్‌లో ప్రతి శనివారం వందల సంఖ్యలో వచ్చే ట్రక్కుల ద్వారా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు సరుకు బట్వాడా అవుతుంటుంది. ఇవన్నీ ఆ ఇరుకు సందుల్లో ఆగకతప్పదు. వారాంతం గనుక కార్మికులకు వేతనాలిచ్చే రోజు కూడా అదే. అందుకోసం చేనేత, దోమతెరల పరిశ్రమల్లో, బస్సు నిర్మాణాల సంస్థల్లో పని చేసేవారు దాదాపు 50,000 మంది వస్తారు. ఇంతకుమించి జనం ఏమాత్రం పెరిగినా ఆ నగరం కిక్కిరిసిపోతుంది. టీవీకే పార్టీ స్థానిక నేతలకు దీనిపై అవగాహన ఉండకపోదు. అధికార యంత్రాంగం, ముఖ్యంగా పోలీసులు సరేసరి. వారికి ఇది పూర్తిగా తెలిసి ఉండాలి. విజయ్ ప్రతి శని, ఆదివారాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నారు గనుక కరూర్‌కు ఆదివారం వస్తే మంచిదని సలహా ఇచ్చి ఉండాల్సింది. పైగా తమ అభిమాన నటుణ్ణి దగ్గర నుంచి చూడటం కోసం చుట్టుపక్కల నుంచి కూడా భారీయెత్తున ప్రజలు తరలి వచ్చారని చెబుతున్నారు.

తొక్కిసలాటల ఉదంతాలు మన దేశానికి మాత్రమే పరిమితం కాదు. 2022లో దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో హ్యాలోవీన్ ఫెస్టివల్‌లో జరిగిన తొక్కిసలాటలో 159 మంది కన్నుమూశారు. జర్మనీలోని డోజ్‌బర్గ్‌లో 2010నాటి లవ్ పెరేడ్ ఉత్సవంలో తొక్కిసలాట కారణంగా 21మంది చనిపోయారు. అయితే ఆ ఉదంతాలను లోతుగా అధ్యయనం చేసి, ఏ లోటుపాట్ల వల్ల ఆ ఘటనలు జరిగాయో నిర్ధారించుకుని వాటిని నివారించే, నియంత్రించే వ్యవస్థల్ని రూపొందించుకుంటారు. అందువల్లే అవి పునరావృతం అయ్యే అవకాశాలు తగ్గుతాయి. కానీ మన దేశంలో ఇందుకు విరుద్ధం. జనసమ్మర్దం ఎక్కువగా ఉన్నప్పుడు తొక్కిసలాట ఉదంతాలు ఎందుకు చోటుచేసుకుంటాయన్న అంశంపై జర్మనీకి చెందిన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అనా సీబెన్ చేసిన పరిశోధన అనేక ఆసక్తికర అంశాలు వెల్లడించింది. ఒక స్థాయి వరకూ గుంపులోని వారు వ్యక్తులుగా సంభాషణల అవసరం లేకుండానే ఇతరుల్ని అనుసరిస్తూ పోతారు. జనసమ్మర్దం పెరిగితే, అనుకోని ఘటన సంభవించేసరికల్లా భావోద్వేగాలపాలు అధికమై విచక్షణాజ్ఞానం నశిస్తుందని, తొక్కి సలాటల్లో జరిగేది ఇదేనని ప్రొఫెసర్ అనా సీబెన్ అంటారు.

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు నటుడు విజయ్ కూడా మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించారు. ఆప్తుల్ని కోల్పోయి విషాదంలో మునిగిన కుటుంబాలను ఇవేవీ ఊరడించలేకపోవచ్చు. ప్రభుత్వం పూనుకొని మృతుల కుటుంబాల్లో ఇంటికొకరికైనా శాశ్వత ఉపాధి కల్పించాలి. చిన్న చిన్న ముందస్తు జాగ్రత్తలతో ఈ మాదిరి విషాద ఘటనలను నివారించవచ్చు. ప్రభుత్వాలు ఆలోచించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.అష్టమి ప.1.27 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** పూర్వాషాఢ తె.5.02 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.1.38 నుండి 3.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.46 నుండి 11.33 వరకు, **అమృత ఘడియలు:** రా.11.44 నుండి 1.26 వరకు, **దుర్గాష్టమి.**

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.49
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

గుర్తెరగాలి!



చింపాంజీలు మనల్ని రక్కేస్తాయా లేదా ముద్దు పెట్టుకుంటాయా అనేది మనకు తెలియదు. అవి ఒక దశ వరకు మనతో కలిసిపోతాయి. ఆ దశ దాటినప్పుడు మనల్ని ఏం చేస్తాయో చెప్పలేం. మనుషులు కూడా అంతే! అందుకే మనం దశల్ని గుర్తెరిగి ఉండాలి.

– టిమ్ బర్టన్, ఫిల్మ్‌మేకర్

కరెక్ట్ కాదు!



ప్లాస్టిక్ ప్యాకేజింగ్ చిన్న సమస్యలా అనిపించవచ్చు. రీసైక్లింగ్ దీనికి పెద్ద పరిష్కారంలా కనిపించవచ్చు. రెండూ కరెక్ట్ కాదు. తారుమారైన మన ఆలోచనా విధానాన్ని సరి చేసుకుని ప్లాస్టిక్ వాడకాన్ని తక్షణం ఆపేయాలి. ప్యాకేజింగ్‌కు నాన్-ప్లాస్టిక్ ను వాడాలి.

– సాబిరా చౌదరి, యాంటీ ప్లాస్టిక్ యాక్టివిస్ట్

ఇద్దరుంటారు



మనం ఏదైనా సాధించాం అంటే – మనం ఏం సాధించాలో చెప్పిన వాళ్లొకరు, ఎలా సాధించాలో చెప్పిన వాళ్లొకరు ఉండి ఉంటారు. నాకు మా అమ్మమ్మ, అక్క ఉన్నారు. అమ్మమ్మ నన్ను ట్రైనింగ్ క్యాంప్‌లో చేర్పించింది. అక్క నాకంటే ముందే రన్నర్.

– బియాట్రిస్ చెబెట్, కెన్యా లాంగ్ డిస్టెన్స్ రన్నర్

రహస్యాల్లేవు



నేను ప్రతి రెండు గంటలకూ తింటాను. ఎనిమిది గంటలు నిద్రపోతాను. సమృద్ధిగా నీళ్లు తాగుతాను. వాదనలు పెట్టుకోను. ప్రశాంతత కోసం ప్రార్థిస్తాను. ముఖ్యంగా, నా ముఖంలో చిరునవ్వు ఉంటుంది. ఇవి తప్ప నా దగ్గర ఆరోగ్య రహస్యాలేమీ లేవు!

– విద్యా బాలన్, నటి


అంటే అన్నారు!



నేను నేర్చుకున్న అతి ముఖ్యమైన పాఠం ఏమిటంటే, ఆడుతున్నప్పుడు ప్రశాంతంగా ఉండటం. ఇతరుల తప్పులను లేదా నా తప్పులను తేలికగా తీసుకోవటం. ప్రేక్షకుల ఆగ్రహాన్ని చల్లబరిచే ప్రయత్నం చెయ్యకపోవడం. ఓర్పు వహించటం!

– జెరోమ్ బోటెంగ్, జర్మనీ మాజీ సాకర్ ప్లేయర్

దూరం-దగ్గర




దూరం ప్రేమను నాశనం చేస్తుంది. మరీ దగ్గరవటం వల్ల కూడా ప్రేమ నాశనం అవుతుంది. చెప్పడు మాటలు ప్రేమను నాశనం చేస్తాయి. కొన్నిసార్లు ప్రేమ నాశనం కావటానికి అసలేమీ అవసరం లేదు. ప్రేమ ఎంత బలమైనదో అంత దుర్బలమైనది.

– అరవింద్ కృష్ణ మెహ్రోత్రా, కవి

పోరాటస్ఫూర్తిని కోల్పోవద్దు!

విశ్వ గురు



యూనివర్శిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా స్నాతకోత్సవంలో నటుడు, క్యాలిఫోర్నియా (మాజీ) గవర్నర్ ఆర్నాల్డ్ష్వార్జ్‌నెగర్ గతంలో చేసిన ప్రసంగానికి సంక్షిప్త పాఠం:

యూనివర్సిటీ నుంచి మీరు బయటకు అడుగుపెట్టబోతున్నారు. జీవితంలో కొన్ని అవరోధాలు, వైఫల్యాలు, అసంతృప్తులు ఎదురవడం సహజం. వాటిని తట్టుకుంటూ ముందుకు సాగడంలో, విజయాన్ని అందుకోవడంలో మీకు సహాయపడగలిగినవి, నాకు తోచిన జీవిత పాఠాలు కొన్ని చెబుతాను.

మీపై మీరు నమ్మకం ఉంచండి

టెలివిజన్, టెలిఫోన్లు, కంప్యూటర్లు, ఐపాడ్లు లేని రోజుల్లో పెరిగి పెద్దవాడినవటం వల్ల నేనొక రకంగా అదృష్టవంతుడినే. నాతో నేను ఎక్కువ సమయం గడపగలిగే వాడిని. దేన్ని నేను నిజంగా ఇష్టపడుతున్నానో నిర్ణయించుకోగలిగే వాడిని. అలా ఆస్ట్రియాలోని మా కుగ్రామం నుంచి – బాడీబిల్డింగ్ ఛాంపియన్ అవడం ద్వారా అమెరికాలో కాలుమోపాలని అనుకున్నా. నేను ఆరాధించే 'మిస్టర్ యూనివర్స్'... రెగ్ పార్క్'. ఆయనలా బాడీబిల్డింగ్ చాంపియన్ అనిపించుకోవడం, సినిమాల్లో ప్రవేశించడం, కోట్లాది డాలర్లు సంపాదించడం నా లక్ష్యం. మిగిలినవారు ఏమనుకుంటున్నా పట్టించుకోకుండా, నా మీద నమ్మకంతో నేను ఏర్పరచుకున్న లక్ష్యం అది.

సూత్రాలను పక్కన పెట్టండి!

మా ఆవిడ వేసుకొనే ఒక టీషర్ట్‌పై 'నియమానుసారంగా నడచుకొనే మహిళలు చరిత్రను సృష్టించటం అరుదు' అని అర్థం వచ్చే ఇంగ్లీషు వాక్యం ఉంటుంది. స్త్రీ పురుషులందరికీ అది వర్తిస్తుంది. మరీ సూత్రానుసారంగా ఉంటే, మీ లక్ష్య సాధనకు 'పిచ్చి పట్టినట్లుగా' ప్రయత్నించలేరు. నాకు ఎక్కడైనా ఏదైనా లభించిందీ అంటే, అది ఈ సూత్రాలలో కొన్నింటిని పక్కన పెట్టినందువల్లనే సాధ్యమైంది. బాడీబిల్డింగ్‌కు శ్రమించినట్లుగానే, సినిమాల్లో అవకాశాల కోసం కష్టపడ్డాను. అందుకోసం ఇంగ్లీషు క్లాసులకు వెళ్లాను. ఫలితం దక్కింది. మొదట టెలివిజన్‌లో, తర్వాత సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. విజయవంతమైన నటుడిని అయ్యాను. తర్వాత గవర్నర్‌ని కూడా అయ్యాను.

> రోజుకు 6 గంటలు నిద్రిస్తే చాలు. మిగిలిన 18 గంటలూ పనిచేస్తూ ఉండాలి. సమయాన్ని సమర్థంగా నిర్వహించుకుంటూ సద్వినియోగం చేసుకోవాలి. ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు తగినంత సమయాన్ని కేటాయించుకోవాలి.

వైఫల్యానికి భయపడకండి!

నేను ఏది ప్రయత్నించినపుడైనా, విఫలమవడానికి కూడా సుముఖంగా ఉండేవాడిని. 'రెడ్ సోంజా', 'హెర్క్యులిస్ ఇన్ న్యూయార్క్', 'లాస్ట్ యాక్షన్ హీరో' వంటి నా సినిమాలు కొన్ని బాక్సాఫీసు వద్ద చతికిలపడ్డాయి. 'టెర్మినేటర్', 'క్యానన్', 'ట్రూ లైస్', 'ప్రిడేటర్', 'ట్విన్స్' వంటి చిత్రాలు ఊహించనంత విజయం సాధించాయి. కనుక, మనం అన్నిసార్లూ సఫలం కాలేకపోవచ్చు. కానీ, నిర్ణయాలు తీసుకునేందుకు భయపడకూడదు. విఫలమవుతామనే భయంతో నిర్వీర్యం కాకూడదు. మీపై మీకు నమ్మకం ఉంది కనుక, ఏది చేస్తున్నారో అదే సరైన పని అనిపించుకుంటుందని భావిస్తున్నారు కనుక ధైర్యంగా ముందుకు సాగండి.

మాటలకు ప్రభావితం కాకండి!

మా అత్తగారు యూనస్ కెనడీ ష్రైవర్ 1968లో స్పెషల్ ఒలింపిక్స్‌కు శ్రీకారం చుట్టినపుడు చాలామంది ఆమెను నివారించే ప్రయత్నం చేశారు. అదెలా సాధ్యపడుతుంది అన్నారు. ''కుదరని పని. సంస్థల నుంచి పోటీదారులను బయటకు తీసుకురావడం కష్టం. వారు జంపింగ్, స్విమ్మింగ్, రన్నింగ్ క్రీడల్లో పాల్గొనేటట్లు మీరు చేయలేరు. ఒకవేళ పాల్గొన్నా, వారు గాయపడవచ్చు. ఒకరినొకరు గాయపరచుకోవచ్చు. ఈతకొలనులో మునిగిపోతారు'' అని నిరుత్సాహపరచారు. 40 ఏళ్ల తర్వాత, గొప్ప సంస్థలలో స్పెషల్ ఒలింపిక్స్ ఒకటిగా ఉంది. ఈరోజు మానసిక వైకల్యంతో బాధపడుతున్నవారికి 164 దేశాలలో అంకిత భావంతో పని చేస్తోంది. జనం మాటలకు ఆమె నీరుగారిపోయి తన ప్రయత్నం ఆపేసి ఉంటే, ఇది సాధ్యమయ్యేదా? అంతరాత్మ ''నీకు సాధ్యమే'' అని చెబుతుంటే ఇక ఎవరి మాటా వినకండి!

శ్రమిస్తేనే విజేతలు కాగలరు!

తగినంత కృషి చేయకుండానే విఫలం అవకూడదు. అంటే, ప్రయత్న లోపం ఉండకూడదన్నది నా ఉద్దేశం. గట్టిగా ప్రయత్నించిన తర్వాత విఫలమైనా ఫరవాలేదు. అంతేకానీ, కష్టపడి సాధన చేయకుండా, పోటీలో లేదా ఎన్నికల్లో ఓటమి చెందడాన్ని నేను ఇష్టపడను. లక్ష్య సాధనకు సర్వశక్తులూ ఒడ్డాలన్నదే నా అభిమతం. మధ్య మధ్యలో విరామం తీసుకోవడం కూడా ముఖ్యమే. కాదనను. కానీ, మనం సేదదీరుతున్న సమయంలో మరెవరో శ్రమించి పని చేస్తూ ఉంటారని గుర్తుంచుకోవాలి. వారూ విజేతలుగా నిలవొచ్చు. అంతమాత్రాన, ఏదో చేజారిపోయింది అని మనం అనుకోకూడదు. రోజుకు 6 గంటలు నిద్రిస్తే చాలు. మిగిలిన 18 గంటలూ పనిచేస్తూ ఉండాలి. సమయాన్ని సమర్థంగా నిర్వహించుకుంటూ సద్వినియోగం చేసుకోవాలి. ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు తగినంత సమయాన్ని కేటాయించుకోవాలి.

చురుగ్గా చేజిక్కించుకోవాలి

రెండు జేబుల్లోనూ చేతులు పెట్టుకుని నిచ్చెన ఎక్కగలం అని మాత్రం అనుకోకండి. కార్యాచరణకు దిగకుండా 'విజయానికి సూత్రాల'ను నెమరువేయడం వల్ల ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు. క్రియాశీలంగా వ్యవహరిస్తూ, అవకాశాలను చేజిక్కించుకోవాలి. కలలను సాకారం చేసుకునేందుకు సోమరితనం వదిలించుకుని, చురుకుగా పనిచేయాలి. ఇవన్నీ మీకు తెలియనివి ఏమీ కావు. శ్రద్ధాసక్తులతో చదువుకోకపోతే మీరీ రోజు ఇక్కడ కూర్చోగలిగేవారే కాదు. ఇక మీరు ఏ రంగంలో ఉన్నా సరే, సమాజానికి తిరిగి ఎంతో కొంత ఇవ్వడానికి సిద్ధపడాలి. అందుకు తగిన వ్యవధిని చిక్కించుకోవాలి. సమాజానికి, మీ రాష్ట్రానికి, లేదా మీ దేశానికి తిరిగి ఇవ్వడాన్ని ఒక నియమంగా పెట్టుకోవాలి. మా మామగారు సార్జంట్ ష్రైవర్ గొప్ప అమెరికన్. ఆయన పేదలకు న్యాయ సహాయం లాంటి పనులు నిర్వహించారు. ''అదే పనిగా అద్దంలో మీ ముఖం మీరే చూసుకోకండి. కాసేపు అద్దాన్ని పక్కన పెట్టండి. అప్పుడే చేయూత అవసరమైన లక్షలాది మందిని మీరు మీ చుట్టుపక్కల చూడ గలుగుతారు'' అని ఆయన ఒకసారి యేల్ పట్టభద్రుల స్నాతకోత్సవంలో చెప్పారు. ఇతరులకు సహాయపడడంలో ఉండే ఆనందం అంతా ఇంతా కాదని మాత్రం నేను మీకు చెప్పగలను.

> రెండు జేబుల్లోనూ చేతులు పెట్టుకుని నిచ్చెన ఎక్కగలం అని అనుకోకండి. కార్యాచరణకు దిగకుండా 'విజయానికి సూత్రాల'ను నెమరువేయడం వల్ల ప్రయోజనం ఉండదు. క్రియాశీలంగా వ్యవహరిస్తూ, అవకాశాలందుకోవాలి.

ఎన్నింటిని దాటుకుని వచ్చాం!

చివరగా ఇంకొక్క సంగతి చెబుతా! ఈ విశ్వవిద్యాలయాన్ని 1880లో నెలకొల్పారు. అప్పట్లో లాస్ ఏంజెలెస్ చిన్న పొలిమేర పట్టణం. మీకన్నా ముందు 125 పట్టభద్రుల బృందాలు తయారై ఉంటాయి. వారు మంచి రోజులను, గడ్డు రోజులను, యుద్ధాలను, శాంతియుత పరిస్థితులను, ఆశలు రేకెత్తించిన కాలాన్ని, మహా అస్థిరమైన కాలాన్ని కూడా చూసి ఉంటారు. వాటన్నింటినీ దాటుకుని ఈ దేశం, ఈ రాష్ట్రం, ఈ యూనివర్సిటీ దృఢంగా నిలిచాయి. ఇపుడు మనం తిరిగి గడ్డు రోజులను, ప్రపంచంలో చాలా అస్థిరతను చూస్తున్నాం. ఒకటి మాత్రం ఖాయం. మనం వాటిని తట్టుకుని నిలబడగలం. మునుపటికన్నా పటిష్ఠంగా, సంపన్నమైనదిగా దేశం పునరుత్తేజం పొందుతుంది. ఆశావాదాన్నీ, పోరాట స్ఫూర్తినీ కోల్పోవద్దు. మీ అందరికీ అభినందనలు. ఆ కరుణామయుడి చల్లని చూపులు మీపై ప్రసరించాలి.

ప్రజాస్వామ్యంలో కలవడమే ఏకైక మార్గం!

'నక్సలిజం వల్ల దశాబ్దాల తరబడి గిరిజన కుటుంబాలు తీవ్రమైన బాధలు అనుభవించాయి. గిరిజన తల్లిదండ్రులు ప్రతిభావంతులైన, ఎంతో భవిష్యత్ ఉన్న తమ పిల్లలను నక్సలిజం హింస వల్ల కోల్పోయారు. యువకులు తప్పుదారి పట్టారు, మోసపోయారు, వారి జీవితాలు నాశనమయ్యాయి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగంలో ఆవేదన వ్యక్తం చేశారు. దేశం బిడ్డలు... ప్రాణాలు కోల్పోవడం, దేశానికి వ్యతిరేకంగా పని చేసే శక్తులకు ఆయుధాలుగా మారడాన్ని ప్రధాని సహించలేకపోతున్నారు. అందుకే గిరిజనులను అభివృద్ధి చేయడానికీ ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వాటన్నింటికీ అడ్డపడుతోంది నక్సల్సే. ప్రజాస్వామ్య మార్గంలో కార్యకలాపాలు నిర్వహించాలని ప్రభుత్వం ఎన్నోసార్లు చెప్పింది. కానీ వారు అంగీకరించలేదు. అందుకే కేంద్రం వారి ఏరివేతకు పూనుకొంది.

ప్రభుత్వ బలగాల చేతిలో అనేకమంది నక్సల్స్ మరణిస్తుండడంతో తాము చర్చలకు సిద్ధమనీ, ఆయుధాలు వదిలేస్తామనీ చెబుతూ వారు అనేక ప్రకటనలు జారీ చేశారు. కానీ ఆయుధాలు వదలడంపై ఖండనల పర్వమూ నడిచింది. దీన్ని బట్టి మావోయిస్టులలో ఏకాభిప్రాయం స్థానంలో గందరగోళం నెలకొని ఉందని అర్థమవుతోంది. ఇప్పుడు వారి ముందున్న దారి జనజీవన స్రవంతిలో భాగం కావడమే. నిజం చెప్పాలంటే మావోయిస్టులకు 3 దశాబ్దాల కిందట మంచి ఆదరణ ఉండేది. ఇప్పుడు దాన్ని వారు కోల్పోయారు. ఉగ్రవాదులతో జట్టు కట్టిన చరిత్ర కూడా మావోయిస్టులకు ఉంది. గతంలో 'యునైటెడ్ ఫ్రంట్' వ్యూహంలో ఇతర ఉగ్రవాద సంస్థలతో ఐడియలాజికల్ సాలిడారిటీ, ట్రైనింగ్ సహకారం ఉందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గుర్తించింది. 2005లో మావోయిస్టులు ఉపయోగించిన 300 బుల్లెట్లలో కొన్ని పాకిస్తాన్ తయారీవి గుర్తించారు. 2008లో కేరళలో ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ 'సిమి' మెంబర్లతో 500 మావోయిస్టులు ట్రైనింగ్ పొందినట్లు తేలింది. చైనా నుంచి నేపాల్ మధ్యవర్తుల ద్వారా ఆయుధాలు కూడా తెప్పించుకున్నట్లుగా గుర్తించారు. ఇలాంటివి జరిగిన తర్వాత కేంద్ర బలగాలు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్నాయి.

> ◆ ఇప్పుడు ప్రపంచం మారిపోయింది. టెక్నాలజీ మారిపోయింది. దాక్కుని చేసే ఉద్యమాలకు అవకాశం లేదు. ఎక్కడ దాక్కున్నా కనిపెట్టగల సామర్థ్యం బలగాలకు ఉంది. ఇలాంటి సమయంలో అడవుల్లో ఉండి ఉద్యమం చేయడం తెలివి తక్కువ పని.

ఈ పరిస్థితుల్లో మావోయిస్టు అగ్రనేతలు కొందరు లొంగుబాటు బాట పట్టారు. సుజాతక్క అలియాస్ పోతుల కల్పన పోలీసుల ఎదుట లొంగిపోవడం ఇందుకు ఉదాహరణ. ఇప్పుడు ప్రపంచం మారిపోయింది. టెక్నాలజీ మారిపోయింది. దాక్కుని చేసే ఉద్యమాలకు అవకాశం లేదు. ఎక్కడ దాక్కున్నా కనిపెట్టగల సామర్థ్యం బలగాలకు ఉంది. ఇలాంటి సమయంలో అడవుల్లో ఉండి ఉద్యమం చేయడం తెలివి తక్కువ పని. వారు తుపాకులను వదిలి ప్రజల్లోకి వచ్చి ప్రజాస్వామ్యయుతంగా ప్రజల కోసం పోరాడాలి.

– ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి I బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు

అక్షరాన్ని అందిస్తూ...

దేశంలో సంపన్నులకే పరిమితమైన విద్యను సామాన్యుల దరికి చేర్చిన ఘనత అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలకే దక్కింది. దేశంలో తొలి సార్వత్రిక విశ్వవిద్యాలయంగా 1982లో ఏర్పాటైనప్పటి నుంచి విద్యకు దూర మైన వారిని అక్కున చేర్చుకుంది. మొత్తం విద్యార్థుల్లో సగటున 85 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు ఉన్నారు. స్త్రీలు విద్యావంతులు కావడంలోనూ ఎంతో కృషి చేస్తోంది. మొత్తం మీద యూనివర్సిటీ విద్యార్థుల్లో సగటున ఏటా 48 శాతం మంది మహిళలు ఉంటున్నారు.


యూనివర్సిటీ ఈ ఏడాది (2025–26) నుంచి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 'చదువుతూ సంపాదించు' విధానంపై దృష్టి సారించారు. విద్యార్థులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేలా 'శ్రీ రామానందతీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్'తో ఒప్పందం కుదుర్చుకుంది. యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు ఉచిత భోజన, వసతితో వివిధ అంశాల్లో రెండు నుంచి మూడు నెలలు ఈ సంస్థలో శిక్షణ ఇస్తారు. కంప్యూటర్, ఆటోమొబైల్, సోలార్ విద్యుత్తు నుంచి అనేక రంగాలకు సంబంధించి వివిధ పరిశ్రమల్లో పనిచేయడానికి లేదా స్వయం ఉపాధి పొందడానికి అవసరమైన మెలకువలు, నైపుణ్యం సాధించేలా శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. అదే తరహాలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్)తోనూ యూనివర్సిటీ సంప్రతింపులు జరిపింది. నిర్మాణ రంగానికి సంబంధించిన వివిధ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది.

యూనివర్సిటీ మహిళా విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడానికి వీలుగా 'వీ హబ్'తో ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలోని అంగన్వాడీల్లో పనిచేసే సిబ్బంది నైపుణ్యాల్ని పెంపొందించేందుకు సర్టిఫికెట్, డిప్లమో ప్రోగ్రామ్స్ రూపొందించింది. మహిళా, శిశు సంక్షేమశాఖతో ఒప్పందం కుదుర్చుకుని ఆ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు. ఈ విద్యా సంవత్సరం (2025– 26) నుంచి గిరిజన విద్యార్థులకు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కు ఉచిత విద్య అందించనున్నది. సైనికులకూ, ఖైదీలకూ ఇప్పటికే విద్యను అందుబాటులోకి తెచ్చింది.

యూనివర్సిటీ మంగళవారం తన 26వ స్నాతకోత్సవం జరుపుకొంటోంది. రెండు విద్యాసంవత్సరాలకు (2023–24, 2024–25) సంబంధించిన 60,288 మందికి డిగ్రీలు అందిస్తోంది. 55 మందికి డాక్టరేట్ పట్టాలు అందించనున్నారు. ఇద్దరు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేయనున్నారు. అందులో ఒకరు వాగ్గేయకారుడు గోరటి వెంకన్న కాగా మరొకరు ప్రఖ్యాత శాంతి విద్యా ప్రచారకులు ప్రేమ్ రావత్!

– డా॥ ఎల్వీకే I అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, హైదరాబాద్
(నేడు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవం)

డేటా పాయింట్



పుడమితల్లికి నీరాజనం



మానవుడు పుడమి తల్లి ముద్దుబిడ్డ. ఆమె అతగాడికి కన్నతల్లి కంటె మిన్న. తల్లి తన బిడ్డలనందరినీ సమానంగానే ప్రేమిస్తుంది. కానీ ప్రతి బిడ్డతోనూ ఆమె అనుబంధం ప్రత్యేకం. తన బిడ్డలలో అందరికంటె ఎక్కువ చురుకుతనమూ, బుద్ధిబలమూ, కార్యకుశలతా, ప్రయోజకత్వమూ ఉన్న మానవుడిని చూస్తే, పుడమితల్లి గుండె ఒకింత గర్వంతో పొంగితే... అది సహజమే. తన మేధతో, కృషితో, సృజన శక్తితో తల్లి అందించిన వనరుల విలువను మరింత చేయగల మహత్తరమైన శక్తి మనిషికి ఉంది. ఆమె నీటినిస్తే, అతగాడు దానిని ఇంకని, తరగని, శోభాయమానమైన జలాశయాలుగా మారుస్తాడు. ఆమె పచ్చి దినుసులు ప్రసాదిస్తే, అతడు వాటిని పంచభక్ష్య పరమాన్నాలుగా మార్చగలడు. ఆమె పిట్టపాట వినిపిస్తే, అతడు ఆ జాడలో మరింత శోధించి... భావ, రాగ, లయలతో సమగ్రమైన సంగీత ప్రపంచం సమకూర్చుకోగలడు. ఆమె పువ్వులు ప్రసాదిస్తే, అతడు వాటితో అద్భుతమైన 'బతుకమ్మ' సంబరాలు సృష్టించగలడు! ఆమె ప్రసాదించిన పూలకు తన బహుముఖమైన కళాత్మకత జోడించి, పువ్వుల పండగ జరిపి, ఆమెకే తిరిగి కన్నుల పండుగనూ, వీనుల విందునూ అందిస్తాడు. పుడమి తల్లి మనసు పులకరింపజేసి రుణం తీర్చుకొంటాడు.

బతుకమ్మ సంబరం అంటే సాధారణంగా లభించే వనరులతో అసాధారణమైన అందాల పుష్పాకృతులను అమర్చి చేసే నేత్రోత్సవం. నిసర్గ సౌందర్యం తొణికిసలాడే అమ్మలక్కల ఆటల నృత్యోత్సవం. కృత్రిమత లేని పల్లె పడతుల పాటల తీపిని శ్రవణపేయంగా చెవులకు చేర్చే కర్ణోత్సవం. ఆత్మీయతలతో అలరారే, ఆదర్శమైన, సౌహార్ద విలసితమైన, సామాజిక జీవన మాధుర్యానికి అద్దం పట్టే సందర్భం. వికసితమైన బుద్ధిగల మానవుడు, తన వికాసానికి అన్నివిధాలా ఆధారభూతమైన ప్రకృతి మాత పట్ల ప్రగాఢమైన కృతజ్ఞతను ప్రదర్శించే వార్షికోత్సవం. సౌందర్యోపాసనలోనూ, పర్యావరణం పట్ల బాధ్యతలోనూ, సామాజిక సామరస్యం పట్ల నిబద్ధతలోనూ, తన ప్రత్యేకత ప్రదర్శిస్తూ, మనిషి వినయంగా మట్టితల్లికి సమర్పించే సాష్టాంగ ప్రణామం.

– ఎం. మారుతి శాస్త్రి


విశాల్ దసరా కలక్షన్ లో
ప్రధాన ఆకర్షణగా నిలిచిన
నటి & మిస్ వరల్డ్
మనూషి ఛిల్లర్.
కుర్తా
3 పీస్ సెట్
₹1399
VISHAL MEGA MART
5% ఎక్కువగా అదనపు క్యాష్‌బాక్#
SBI card
+
లేడీస్ కుర్తా ₹599+
3 కొనండి
₹300 తగ్గింపు పొందండి
మహిళల టీ-షర్ట్ ₹199
3 కొనండి
₹100 తగ్గింపు పొందండి
మహిళల జీన్స్ ₹699
2 కొనండి
₹200 తగ్గింపు పొందండి
పురుషుల టీ-షర్ట్ ₹199
3 కొనండి
1 ఉచితంగా పొందండి
పురుషుల జీన్స్ ₹799
2 కొనండి
₹200 తగ్గింపు పొందండి
*కనీస లావాదేవీ: ₹3,000; గరిష్ఠ క్యాష్ బ్యాక్: ప్రతి కార్డ్ అకౌంట్ పై ₹500; చెల్లుబాటు: 20 సెప్టెంబర్ - 30 సెప్టెంబర్ 2025. నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి.
*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి.


పీఓకేలో నిరసన తెలుపుతున్న పౌరులు

పీఓకేలో తిరుగుబాటు

- ప్రాథమిక హక్కుల కోసం పోరుబాట
- ముజఫరాబాద్‌లో జనంపై కాల్పులు
- ఇద్దరి మృతి.. 22 మందికి గాయాలు

ముజఫరాబాద్: పాకిస్తాన్ ప్రభుత్వంపై పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) ప్రజలు తిరుగుబాటు ప్రారంభించారు. నిరంకుశ పాలనపై నిప్పులు చెరుగుతున్నారు. తమకు ప్రాథమిక హక్కులు కల్పించాలని, అణచివేత చర్యలు ఆపాలని డిమాండ్ చేస్తూ జనం ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పీఓకే రాజధాని ముజఫరాబాద్‌లో ఆందోళనకారులకు, భద్రతా దళాలకు మధ్య ఘ ర్షణ జరిగింది. హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. జెండాలు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న సాధారణ ప్రజలపై పాక్ సైన్యంతోపాటు ఐఎస్ఐ అండదండలున్న ముస్లిం కాన్ఫరెన్స్ సాయుధ ముష్కరులు కిరాతకంగా కాల్పులు జరిపారు. హక్కుల కోసం ఉద్యమిస్తున్నవారిని పొట్టనపెట్టుకున్నారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించగా, 22 మందికిపైగా గాయపడ్డారు. ముజఫరాబాద్ వీధులు రణరంగాన్ని తలపించాయి. హింసాకాండ దృశ్యాలు పాకిస్తాన్ వార్తా చానళ్లలో ప్రసారమయ్యాయి.

తెరపైకి 38 డిమాండ్లు

ప్రాథమిక హక్కుల సాధన కోసం పీఓకేలో అవామీ యాక్షన్ కమిటీ ఉద్యమిస్తోంది. ఆదివారం నుంచి ఆందోళనలు ఉధృతంగా మారాయి. ఎక్కడికక్కడ నిరసన ర్యాలీలు జరుగుతున్నాయి. బంద్ పాటించారు. సోమవారం మార్కెట్లు, దుకాణాలు, కార్యాలయాలు మూతపడ్డాయి. రవాణా సేవలు నిలిచిపోయాయి. ఆందోళనకారులు మొత్తం 38 డిమాండ్లను తెరపైకి తెచ్చారు. ప్రభుత్వం వాటిని నెరవేర్చేదాకా తమ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. పాకిస్తాన్‌లో నివసిస్తున్న కశ్మీరీ శరణార్థుల కోసం పీఓకే అసెంబ్లీలో 12 సీట్లను పాక్ ప్రభుత్వం రిజర్వ్ చేసింది. ఈ సీట్లను రద్దు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. తమ అసెంబ్లీలో కేవలం స్థానికులకే ప్రాతినిధ్యం ఉండాలని అంటున్నారు. పీఓకేలోని మాంగ్లా డ్యామ్, నీలం–జీలం ప్రాజెక్టుల్లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 60 శాతానికి పాకిస్తాన్‌కే సరఫరా అవుతోంది. స్థానికులకు దక్కుతున్న ప్రయోజనం స్వల్పమే. ఇదే అంశం వారిలో అసంతృప్తి కలిగిస్తోంది. పీఓకేలోని వనరులు తమకే దక్కాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ధరలు విపరీతంగా పెరగడం జనంలో అసహనం కలిగిస్తోంది. ఇవన్నీ ప్రజా ఉద్యమాన్ని ప్రేరేపించాయి. గత 70 ఏళ్లుగా పాక్ ప్రభుత్వం తమను క్రూరంగా అణచివేస్తోందని, కనీస హక్కులు కూడా కల్పించడం లేదని అవామీ యాక్షన్ కమిటీ నాయకుడు షౌకత్ నవాజ్ మీర్ ఆరోపించారు. ప్రజల ఓపిక నశించిందని, అందుకే పోరాటం సాగిస్తున్నారని చెప్పారు. తమ డిమాండ్లను ఇప్పటికైనా నెరవేర్చకపోతే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని, పరిస్థితి చెయ్యి దాటిపోయే ప్రమాదం ఉందని పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు తేల్చిచెప్పారు.


అణచివేత చర్యలు ప్రారంభం

పీఓకేలో ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి పాక్ సర్కార్ చర్యలు చేపట్టింది. భారీ సంఖ్యలో సాయుధ బలగాలను రంగంలోకి దించింది. సమీపంలోని పంజాబ్ ప్రావిన్స్ నుంచి వేలాది మంది సైనికులు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు చేరుకున్నారు. పలు పట్టణాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. వీధుల్లోకి రావొద్దని ప్రజలను హెచ్చరించారు. రాజధాని ఇస్లామాబాద్ నుంచి అదనపు బలగాలను తరలిస్తున్నట్లు సమాచారం. పీఓకేలో ఆందోళన కార్యక్రమాలను ఉక్కుపాదంతో అణచివేయాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పీఓకేలో ఇంటర్నెట్ సేవలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. పాక్ వైమానిక దళం గతవారం ఖైబర్ పఖ్తూంక్వా ప్రావిన్స్‌లోని ఓ మారుమూల గ్రామంపై భారీస్థాయిలో విరుచుకుపడింది. చైనా ఇచ్చిన జే–17 ఫైటర్ జెట్లతో ప్రజలపై నిప్పుల వర్షం కురిపించింది. చైనాలో తయారైన ఎల్ఎస్–6 లేజర్ గైడెడ్ బాంబులు ప్రయోగించింది. ఈ దాడిలో 30 మంది సాధారణ ప్రజలు మరణించారు. అది జరిగిన వారం రోజులకే పీఓకేలో ఆందోళనలు ప్రారంభం కావడం గమనార్హం.

ఇప్పుడంతా గంటలు, సెకన్ల యుద్ధాలే

- టెక్నాలజీ యుగంలో యుద్ధరీతి మారిపోయింది
- కొత్త సవాళ్లు ఎదుర్కొనేందుకు ఐసీజీ సన్నద్ధం కావాలి
- ఐసీజీ కమాండర్ల సదస్సులో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ: ఆధునిక సాంకేతిక యుగంలో యుద్ధరీతి పూర్తిగా మారిపోయిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. సంఘర్షణలు జరిగే విధానాన్ని శాటిలైట్లు, డ్రోన్లు, సెన్సార్లు సమూలంగా మార్చేశాయని అన్నారు. నెలల తరబడి యుద్ధాలు కొనసాగే రోజులు ఎప్పుడో పోయాయని తెలిపారు. శత్రుదేశాలతో సాయుధ పోరాటానికి గంటలు, సెకన్లలోనే తెరపడే పరిస్థితి వచ్చిందని స్పష్టంచేశారు. సోమవారం ఢిల్లీలో ఇండియన్ కోస్ట్‌గార్డ్(ఐసీజీ) కమాండర్ల 42వ సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. మారుతున్న కాలంలో కొత్తగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించడానికి, విధి నిర్వహణలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేర్చడానికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఐసీజీ అధికారులకు సూచించారు. సైబర్, ఎల్రక్టానిక్ యుద్ధరీతి అనేది ఇక ఎంతమాత్రం ఊహాత్మకం కాదని, అది వాస్తవ రూపం దాల్చిందని గుర్తుచేశారు. మన దేశానికి పెనుముప్పుగా మారిన సైబర్, ఎల్రక్టానిక్ యుద్ధాలను ఎదుర్కోవడానికి ఎల్లవేళలా సర్వసన్నద్ధంగా ఉండాలని స్పష్టంచేశారు. ఒక దేశం మరో దేశంలోని వ్యవస్థలను నాశనం చేయాలని భావిస్తే శక్తివంతమైన క్షిపణులు ప్రయోగించాల్సిన అవసరం లేదని.. కంప్యూటర్లను హ్యాకింగ్ చేస్తే చాలని అన్నారు. సైబర్ దాడులు, ఎల్రక్టానిక్ జామింగ్‌తో అల్లకల్లోలం సృష్టించవచ్చని తేల్చిచెప్పారు. ఇలాంటి అంతర్జాల దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, శిక్షణను, రక్షణ పరికరాలను ఆధునీకరించాలని ఐసీజీకి సూచించారు. నిఘా వ్యవస్థలను పటిష్టం చేసుకోవాలన్నారు. సైబర్ దాడులను క్షణాల వ్యవధిలోనే తిప్పికొట్టాలంటే కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు.



సంప్రదాయ విధానాలు సరిపోవు

అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌ను కూడా కలుపుకొంటే భారత్‌కు 7,500 కిలోమీటర్ల సముద్ర తీరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. తీరప్రాంత భద్రత విషయంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. వీటిని అరికట్టాలంటే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, సుశిక్షితులైన సిబ్బంది, పటిష్టమైన నిఘా వ్యవస్థ అత్యవసరమని ఉద్ఘాటించారు. సముద్ర తీర ముప్పు కూడా ఆధునికతను సంతరించుకుందని వివరించారు. ఓడల్లో అక్రమ రవాణా, సముద్ర దొంగల గురించి గతంలో మాట్లాడుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడంతా జీపీఎస్ స్పూఫింగ్, రిమోట్‌తో నియంత్రించే పడవలు, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థ, డ్రోన్లు, శాటిలైట్ ఫోన్లు, డార్క్‌వెబ్ వంటి వాటితో నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థలు సైతం ఆధునిక టెక్నాలజీని వాడుకుంటున్నాయని రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పుడు సముద్ర తీర ముప్పును ఎదిరించాలంటే సంప్రదాయ విధానాలు ఎంతమాత్రం సరిపోవన్నారు.

నేడు బిహార్ ఓటరు తుది జాబితా

వచ్చే వారం ఎన్నికల షెడ్యూల్

న్యూఢిల్లీ: బిహార్ తుది ఓటరు జాబితా మంగళవారం విడుదల చేయనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో, వచ్చే వారంలో ఈసీ బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముందని భావిస్తున్నారు. దాదాపు 22 ఏళ్ల తర్వాత ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ముగియడంతో ఓటరు జాబితా ఫైనల్ లిస్టును ఈసీ ఆన్‌లైన్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేసింది. ఆగస్టు ఒకటో తేదీన విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో 7.24 కోట్ల ఓటర్లున్నారు. ఇలా ఉండగా, ఈసీ బృందం అక్టోబర్ 4, 5వ తేదీల్లో పట్నాకు వెళ్లి ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష జరపనుంది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశముందని సమాచారం. మొదటి దశ పోలింగ్ ఛట్ పండుగ తర్వాత అక్టోబర్ ఆఖర్లో ఉండొచ్చని భావిస్తున్నారు. ఎన్నికల పరిశీలకుల నియామకం కసరత్తు అక్టోబర్ 3వ తేదీకల్లా ముగియనుందని చెబుతున్నారు. బిహార్ అసెంబ్లీ ప్రస్తుత గడువు నవంబర్ 22వ తేదీతో ముగియనుంది. గత అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతల్లో జరిగాయి.

నూతన సుపరిపాలన

- జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి
- విదేశీ ఉత్పత్తులపై ఆధారపడకండి
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- ఢిల్లీ బీజేపీ శాఖ నూతన కార్యాలయం ప్రారంభం

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొట్టిపారేశారు. ప్రతిరోజూ అబద్ధాలు చెబుతూ, తమపై రాళ్లు విసురుతూ కాలం గడపడం తప్ప విపక్షాలకు ఇంకేమీ తెలియదని ఎద్దేవా చేశారు. ఈ సంస్కరణలతో ప్రతి కుటుంబానికి ఎంతో లబ్ధి చేకూరుతుందని వివరించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ పాలనలో రూ.లక్ష ఖర్చు చేస్తే అందులో పన్నుల కింద రూ.25000 చెల్లించాల్సి వచ్చేదని, ఇప్పుడు రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. అంటే ప్రతి రూ.లక్ష ఖర్చుపై రూ.20,000 చొప్పున ఆదా అయినట్లేనని స్పష్టంచేశారు. సుపరిపాలనలో నూతన మోడల్‌కు శ్రీకారం చుట్టామని స్పష్టంచేశారు. ప్రధాని మోదీ సోమవారం ఢిల్లీ బీజేపీ శాఖ నూతన ప్రధాన కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రజలకు చేరేలా చూడాలని బీజేపీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలోని హిమాచల్ ప్రదేశ్‌లో ధరలు తగ్గించడం లేదని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రూ.2 లక్షల దాకా ఆదాయంపై పన్ను ఉండేదని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.12 లక్షల దాకా ఆదాయంపై పన్ను తొలగించామని, జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చామని, దీనివల్ల దేశ ప్రజలకు ప్రతిఏటా రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతాయని పునరుద్ఘాటించారు.

దక్షిణ భారత శైలిలో బీజేపీ ఆఫీసు

ఢిల్లీలోని డీడీయూ మార్గ్‌లో ఐదు అంతస్తుల భవనంలో బీజేపీ నగర నూతన కార్యాలయం ఏర్పాటైంది. దక్షిణ భారత శైలిలో ఆధునిక వసతులతో నిర్మించారు. ప్రస్తుతం ఢిల్లీ బీజేపీ ఆఫీసు పండిట్ పంత్ మార్గ్‌లో ఉంది. దీపావళి నాటికి కొత్త భవనంలోకి మారనుంది. 825 చదరపు మీటర్ల స్థలంలో పర్యావరణ హితంగా ఈ బిల్డింగ్ నిర్మించారు. ఇందులో 200 మంది కూర్చోవడానికి వీలైన ఆడిటోరియంతోపాటు గ్రంథాలయం కూడా ఉంది. శాశ్వత భవనం లేకపోవడంతో ఢిల్లీ బీజేపీ విభాగం చాలా భవనాల్లోకి మారాల్సి వచ్చింది. అనే ప్రయత్నాల తర్వాత శాశ్వత భవనం సమకూరడం పట్ల ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంతోషం వ్యక్తంచేశారు.



కుంభకోణాల రహిత భారత్

ఎన్డీయే ప్రభుత్వం దేశానికి నూతన 'సుశాసన్ మోడల్'ను ఇచ్చిందని ప్రధాని మోదీ వివరించారు. అభివృద్ధితోపాటు దేశ రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కుంభకోణాల నుంచి దేశానికి విముక్తి కల్పించామని, అవినీతిపై నిర్ణయాత్మక యుద్ధం చేసేలా ఆత్మవిశ్వాసం పెంచామని వెల్లడించారు. స్వదేశీ ఉత్పత్తుల ప్రాధాన్యతను మరోసారి ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్వదేశీ ఉత్పత్తులను విక్రయించేలా, కొనుగోలు చేసి ఉపయోగించుకొనేలా వ్యాపారులను, ప్రజలను ప్రోత్సహించాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

బీజేపీ కార్యాలయాలు మాకు దేవాలయాలు

బీజేపీకి అధికారం ముఖ్యం కాదని, ప్రజాసేవే పరమావధి అని ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్యానించారు. బీజేపీ కార్యాలయాలు తమకు దేవాలయాలతో సమానమని చెప్పారు. ఇక్కడికి వచ్చే ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు. ప్రజలను, వారి ఆకాంక్షలను అనుసంధానించే వేదికలుగా బీజేపీ ఆఫీసులు పనిచేస్తాయని పేర్కొన్నారు.

ఎస్ఐఆర్ వద్దంటూ కేరళ అసెంబ్లీ తీర్మానం

తిరువనంతపురం: కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) చేపట్టనున్న ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా కేరళ అసెంబ్లీ సోమవారం ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి పారదర్శకతతో జరపాలని ఎన్నికల కమిషన్‌ను కోరింది. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగనీయరాదని పేర్కొంది. ఈ సందర్భంగా అసెంబ్లీలో సీఎం పినరయి విజయన్ మాట్లాడుతూ.. హడావుడిగా ఎస్ఐఆర్ చేపట్టడానికి వెనుక కుట్ర కోణం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ముసుగులో జాతీయ పౌర రిజిస్టర్(ఎన్నార్సీ)ని అమలు చేయవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లోనే ఈ ప్రక్రియ అమలు చేయడమేంటని ప్రశ్నించారు. ఎస్ఐఆర్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసిన కాంగ్రెస్ సారథ్యంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటేసింది. కొందరు సభ్యులు సూచించిన మేరకు ప్రతిపాదనలకు సవరణ చేశారు. అనంతరం తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు స్పీకర్ ఏఎన్ షంశీర్ ప్రకటించారు.

బిష్ణోయ్ గ్యాంగ్‌పై కెనడా ఉగ్ర ముద్ర

మాంట్రియల్: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చినట్లు కెనడా అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దేశంలో భయానక వాతావరణం సృష్టించినందుకు ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించారు. కెనడాలో హింస, ఉగ్రవాదానికి ఎంతమాత్రం స్థానం లేదని తేల్చిచెప్పారు. ముఖ్యంగా ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు ప్రయత్నిస్తే సహించబోమని, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ గతవారం కెనడా జాతీయ భద్రతా సలహాదారు నథాలీ డ్రౌయిన్‌తో ఢిల్లీలో సమావేశమయ్యారు. భారత్–కెనడా మధ్య సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన అధ్యాయం ప్రారంభించాలని, ఉగ్రవాదం, సీమాంతర నేరాలపై ఉమ్మడి పోరాటం సాగించాలని వారిద్దరూ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో లారెన్స్ బిష్ణోయ్ ముఠాపై కెనడా ప్రభుత్వం ఉగ్రవాద ముద్ర వేయడం గమనార్హం. దీనివల్ల ఆ ముఠా ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి, ప్రభావవంతమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని కెనడా మంత్రి గారీ ఆనంద సంగారీ చెప్పారు. కెనడాలో అధికారిక గణాంకాల ప్రకారం 88 ఉగ్రవాద సంస్థలు ఉన్నాయి. ఇందులో బిష్ణోయ్ గ్యాంగ్‌ను కూడా చేర్చారు. ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చితే వాటి ఆస్తులను, డబ్బును, వాహనాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వానికి అధికారం లభిస్తుంది. ఇండియన్ గ్యాంగ్‌స్టర్ బాలకరణ్ బ్రార్ అలియాస్ లారెన్స్ బిష్ణోయ్ తన పేరిటే గ్యాంగ్ ఏర్పాటు చేశారు. ఇండియాతోపాటు కెనడాలో పలు నేరాల్లో అతడి హస్తం ఉందని గుర్తించారు. హత్య, కాల్పులు, బలవంతపు వసూళ్ల వంటి ఆరోపణలు వచ్చాయి.


ధ్వంసమైన భవనాలు

వియత్నాంను వణికించిన బ్వాలోయి

9 మంది మృత్యువాత, 17 మంది గల్లంతు

హనోయి: భారీ వర్షం, భీకరగాలులతో కూడిన బ్వాలోయి తుఫాను వియత్నాంలో విలయం సృష్టించింది. తుఫాన్ తీవ్రతకు పలు ప్రావిన్సుల్లో రోడ్లు జలమయం కాగా, ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. గంటకు 133 కిలోమీటర్ల వేగంగా గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివిధ ఘటనల్లో కనీసం 9 మంది ప్రాణాలు కోల్పోయారు. జాడ తెలికుండా పోయిన 17 మంది జాలర్ల కోసం గాలింపు చేపట్టినట్లు యంత్రాంగం తెలిపింది. సోమవారం ఉదయం 10 గంటలకు తుఫాన్ బలహీనపడి లావోస్ దిశగా వెళ్లిందని అధికారులు తెలిపారు. గాలుల తీవ్రతకు ఇళ్లు కూలిన ఘటనల్లో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన నిన్హ్ బిన్హ్ ప్రావిన్స్‌లోనే ఆరుగురు చనిపోయారని చెప్పారు. థన్హ్ హోవా, హూయి, దనంగ్ ప్రావిన్స్‌ల్లో జరిగిన ఘటనల్లో మరో ముగ్గురు మృతి చెందారు. క్వాంగ్ ట్రి ప్రావిన్స్‌లో గాలుల తీవ్రతకు లంగరేసిన చేపల పడవ తాళ్లు తెగడంతో అది సముద్ర జలాల్లోకి కొట్టుకు పోయింది. దాని కింద ఆశ్రయం తీసుకుంటున్న 9 మంది మత్స్యకారులు గల్లంతయ్యారు. జియా లాయ్ ప్రావిన్స్‌లో చేపల వేటకు వెళ్లిన 8 మంది జాడ తెలియడం లేదని అధికారులు తెలిపారు. తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆదివారం రాత్రి 3.47 లక్షల నివాసితులు అంధకారంలో గడిపారని అధికారులు తెలిపారు. బ్వాలోయి కారణంగా ఫిలిప్పీన్స్‌లో కనీసం 20 మంది ప్రాణాలు కోల్పోయారు.

మాల్డోవాలో ఈయూ అనుకూల పార్టీ గెలుపు

- ఎన్నికల్లో రష్యా అనుకూల గ్రూపులకు పరాజయం
- రష్యా జోక్యం అనుమానాల నేపథ్యంలో ఫలితం వెల్లడి

చిసినౌ: ఒకప్పటి సోవియెట్ యూనియన్‌లో భాగంగా ఉన్న మాల్డోవాలో జరిగిన ఎన్నికల్లో యూరోపియన్ యూనియన్(ఈయూ) అనుకూల పార్టీ మరోసారి ఘన విజయం సాధించింది. రష్యా అనుకూల గ్రూపులకు ఈ ఎన్నికల్లో ఓటమి ఎదురైంది. తూర్పు, పశ్చిమ వర్గాలకు మధ్య తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో వెలువడిన ఈ ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అన్ని పోలింగ్ స్టేషన్లలో లెక్కింపు పూర్తయ్యాక వెలువడిన ఫలితాల్లో ఈయూకు అనుకూల విధానాలను అనుసరించే అధ్యక్షురాలు మైయా సండూకు చెందిన అధికార యాక్షన్ అండ్ సాలిడారిటీ(పీఏఎస్)కు 50.1 శాతం ఓట్లు వచ్చినట్లు తేలింది. రష్యా అనుకూల పేట్రియాటిక్ ఎలక్టోరల్ బ్లాక్‌కు కేవలం 24.2 శాతమే లభించాయి. రష్యాతో మైత్రిని కోరుకునే మరో గ్రూప్ ఆల్టర్నేటివా మూడవ, పాపులిస్ట్ అవర్ పార్టీ నాలుగో స్థానాల్లో నిలిచాయి. డెమోక్రసీ ఎట్ హోమ్ అనే పార్టీ కూడా పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం దక్కించుకుంది. అధికార పీఏఎస్‌కు 101 సీట్లున్న పార్లమెంట్‌లో 55 స్థానాలు దక్కాయి. తిరిగి రష్యాకు అనుకూలంగా మారడమా, లేక ఈయూ మార్గంలో నడవడమా అనే విషయం మాల్డోవా వాసులు తేల్చుకునే నిర్ణయాత్మక ఎన్నికలుగా వీటిని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ఫలితాలతో ప్రస్తుత ప్రభుత్వ విధానాలు కొనసాగుతాయని, ఈయూలో చేరాలని భావించే మాల్డోవా వాసులకు ఘన విజయంగా భావించవచ్చని అంటున్నారు. ఫలితాలపై ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ హర్షం వ్యక్తం చేశారు. 'యూరప్, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ'కోసం మాల్డోవా ప్రజల నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడిందన్నారు.


అధ్యక్షురాలు సండూ

గాజా ఆక్రమణ ఉండదు


- శాంతిని నెలకొల్పుతాం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- వైట్‌హౌస్‌లో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో భేటీ

వాషింగ్టన్: గాజా సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. గాజాను ఇజ్రాయెల్ ఆక్రమించబోదని తేల్చిచెప్పారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధానికి త్వరగా తెరపడాలన్నదే తన ఉద్దేశమని వివరించారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సోమవారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడారు. గాజాలో అస్థిరతకు చరమగీతం పాడేసి, శాంతిని నెలకొల్పే దిశగా నెతన్యాహుతో ఒప్పందానికి దరిదాపుల్లోకి వచ్చానని అన్నారు. ఈ ప్రణాళికకు అంగీకారం తెలియజేసినందుకు నెతన్యాహుకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. గాజాలో శాంతి సాధన విషయంలో ఇదొక చరిత్రాత్మక దినం అని వ్యాఖ్యానించారు. మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతికి అడుగు ముందుకు పడినట్లేనని ఉద్ఘాటించారు. తాను ప్రతిపాదించిన శాంతి ఒప్పందాన్ని హమాస్‌తో పాటు ఇతర భాగస్వామ్యపక్షాలు సైతం ఆమోదిస్తాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఒకవేళ ఆమోదం లభిస్తే గాజాలో తక్షణమే యుద్ధానికి తెరపడుతుందని తేల్చిచెప్పారు. నెతన్యాహు మాట్లాడుతూ... గాజా విషయంలో దీర్ఘకాల పరిష్కారానికి తాము కట్టుబడి ఉన్నట్లు స్పష్టంచేశారు. అదే సమయంలో ప్రాంతీయ భద్రతను కూడా దృష్టిలో పెట్టుకోవాలని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రాచ్యంలో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించే విషయంలో నెతన్యాహుతో చర్చలు ఒక భాగమేనని ట్రంప్ పేర్కొన్నారు.

ఖతార్ ప్రధానమంత్రికి నెతన్యాహు క్షమాపణ

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఖతార్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్–థానీకి ఫోన్ చేసి క్షమాపణ కోరారు. ఇటీవల ఖతార్ రాజధాని దోహాపై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. ఈ ఉదంతం ముస్లిం దేశాల్లో అలజడి సృష్టించింది. ఇజ్రాయెల్ తీరును ప్రపంచ దేశాలు ఖండించాయి. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన నెతన్యాహు అక్కడి నుంచే ఖతార్ ప్రధానికి ఫోన్‌చేశారు. దోహాపై దాడుల పట్ల విచారం వ్యక్తంచేశారు. క్షమాపణ కోరారు. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేపాల్ మాజీ ప్రధాని ఓలి సహా ఐదుగురి పాస్‌పోర్ట్‌ల సీజ్



కఠ్మాండు: పదవీచ్యుత ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలి, మాజీ హోం మంత్రి రమేశ్ లేఖక్ మరో ముగ్గురు మాజీ ఉన్నతాధికారుల పాస్‌పోర్టులను నేపాల్ ప్రభుత్వం సోమవారం సీజ్ చేసింది. ఈ నెలారంభంలో జరిగిన జెన్ జడ్ ఆందోళన సమయంలో కాల్పులు జరపాలని భద్రతా బలగాలకు ఆదేశాలిచ్చినట్లు వీరిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. రెండు రోజులపాటు సాగిన ఆందోళనల్లో మొత్తం 76 మంది చనిపోయారు. అప్పటి ఘటనలపై విచారణకు ఆపద్ధర్మ ప్రధాని సుశీలా కర్కి ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటైంది. విచారణ సజావుగా సాగాలంటే ఓలి సహా ఐదుగురి పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకోవాలని, విదేశాలకు వెళ్లాలనుకుంటే వీరు ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని కమిషన్ సిఫారసు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు వీరి పాస్‌పోర్టులను సీజ్ చేసింది. ఈ చర్య రాజకీయ కక్ష సాధింపేనని ఓలి సారథ్యంలోని సీపీఎన్–యూఎంఎల్ ఆరోపించింది.

గ్రేట్ ఎస్కేప్!

షికాగోలో నడి రోడ్డుపై చేజింగ్

ఫుడ్ డెలివరీ వర్కర్ (వృత్తంలో)ను వెంటాడుతున్న ఇమిగ్రేషన్ ఏజెంట్లు


షికాగో: ఒక ఫుడ్ డెలివరీ వర్కర్ పరుగులు తీస్తుంటే.. దాదాపు పదిమంది ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లు వెంబడించారు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరలై, అక్కడి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనితీరుపై పెద్ద రచ్చకు దారితీసింది.

అసలేం జరిగిందంటే..

షికాగో డౌన్‌టౌన్‌లో ఆదివారం ఒక ఫుడ్ డెలివరీ వర్కర్‌ను అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్లు వెంటాడారు. ఈ ఉదంతాన్ని క్రిస్టోఫర్ స్వీట్ అనే వ్యక్తి వీడియో తీసి షేర్ చేశాడు. తన పోస్ట్‌లో 'ఎక్స్‌క్లూజివ్ వార్త.. ఈరోజు ఒక వ్యక్తిని ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్లు షికాగో డౌన్‌టౌన్‌లో వెంబడించారు.. అతను ఏవో అనుచిత వ్యాఖ్యలు చేశాడు తప్ప భౌతిక దాడికి దిగలేదు.. బెదిరించలేదు కూడా.. ఏదైతేనేం మొత్తానికి తప్పించుకోగలిగాడు'.. అని వ్యాఖ్యానించారు.

నెటిజన్ల స్పందన

ఈ వీడియో ఆన్‌లైన్‌లో విపరీతంగా షేర్ అవు తోంది. చాలామంది నెటిజన్లు అతను తప్పించుకున్న తీరును చూసి 'బాగా పరుగెత్తాడు' అంటూ మెచ్చుకుంటున్నారు. కొందరు ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్ల దేహ దారుఢ్యం గురించి కూడా వ్యాఖ్యలు చేశారు. స్వీట్.. ఏకంగా అమెరికన్ ఉన్నతాధికారులను ట్యాగ్ చేస్తూ, ఈ ఘటనను చిత్రీకరించడం ద్వారా తాను ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్ల బండారం బయట పెట్టగలిగానని సరదాగా వ్యాఖ్యా నించాడు.

వెంటాడటం వెనుక కథేంటి?

ఆదివారం డౌన్‌టౌన్ షికాగోలో ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్ల ఆపరేషన్లు జరిగాయని స్వీట్ వెల్లడించారు. అరెస్టులను ఇంకా అధికారికంగా ధ్రువీకరించకపోయినా, స్థానిక మీడియా మరిన్ని విషయాలు తెలిపింది. 'ఆదివారం మధ్యాహ్నం పిల్లలతో సహా ఒక కుటుంబాన్ని అదుపులోకి తీసుకున్నారు'.. అని ఏబీసీ7షికాగో నివేదించింది. డబ్ల్యూబీఈజెడ్ సంస్థ.. ఒక సీనియర్ అమెరికా సరిహద్దు గస్తీ అధికారిని ఉటంకిస్తూ.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన అంగీకరించారని వెల్లడించింది. ఫుడ్ డెలివరీ వర్కర్‌ను వెంటాడటం, కేవలం రూపురేఖలు, ప్రవర్తన ఆధారంగా అరెస్టు చేసిన సంఘటన మొత్తం అమెరికాలో ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పద్ధతులపై తీవ్ర చర్చకు తెర లేపింది.!

మనదేశంలో పట్టణాల్లో ఉంటున్నవారు క్రమంగా ఆరోగ్యకరమైన స్నాక్స్ వైపు మళ్లుతున్నారు. మఖానా వెంటపడ్డ కస్టమర్లు ఇప్పుడు జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు, సామల వంటి చిరుధాన్యాలతో తయారైన ఉత్పత్తులను ఎంచుకుంటున్నారు. స్థానిక ఔత్సాహిక వ్యాపారులే కాదు, ప్రముఖ బ్రాండ్స్ సైతం ఈ విభాగంలోకి ఎంట్రీ ఇస్తున్నాయి.

దేశంలో ఆరోగ్య స్పృహ ఉన్న యువ జనాభా పెరుగుతోంది. 15–35 సంవత్సరాల వయసున్న వినియోగదారులు.. మామూలు భోజనమే కాదు, చిరుతిళ్ల విషయంలోనూ ఆరోగ్యకరమైనవేనా కాదా అని చూస్తున్నారు. ఆరోగ్యకరమైన చిరుతిళ్ల (స్నాక్స్) విపణి 2026 నాటికి 30 బిలియన్ డాలర్లకు పెరగవచ్చని ఆర్థిక సలహా సంస్థ అవెండస్ గత ఏడాది ఓ నివేదిక విడుదల చేసింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

మిల్లెట్స్ స్నాక్స్!



మిల్లెట్స్ ఆధారిత ఉత్పత్తులు ఎక్కువగా అల్పాహారానికి పరిమితం అయ్యాయి. టాటా సోల్ ఫుల్.. పిల్లల కోసం రాగి ఆధారిత తృణ ధాన్యాలకు ప్రసిద్ధి. కాలక్రమేణా మిల్లెట్ మ్యూస్లీ, రెడీ–

ఒకదాని వెంట ఒకటి..

టు–కుక్ ఓట్స్‌ను విడుదల చేసింది. ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చే పెద్దల కోసం రెడీ–టు–కుక్ మసాలా మిల్లెట్స్ సైతం మారికో విక్రయిస్తోంది. మనదేశం 2023ను 'అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం'గా ప్రకటించిన తర్వాత మిల్లెట్స్ ఆధారిత ఉత్పత్తులకు ప్రజాదరణ మరింత పెరిగింది. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ విభాగం లెక్కల ప్రకారం.. చిరుధాన్యాల రంగంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారు. 2023లో ప్రపంచ ఉత్పత్తిలో మనవాటా 38.4 శాతం. అలాగే రెండవ అతిపెద్ద ఎగుమతిదారుగా నిలిచిందని 2023–24 బడ్జెట్ ప్రకటన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. అంతేకాదు, దేశవ్యాప్తంగా మిల్లెట్ ఆధారిత 151 అగ్రిస్టార్టప్‌లు ఏర్పాటయ్యాయని ఇటీవల లోక్‌సభలో కేంద్రం వెల్లడించింది.

ఆరోగ్యకరమైన చిరుతిళ్లకు డిమాండ్

ప్రత్యేక ఆసక్తి చూపుతున్న యువతరం

ఈ రంగంలోకి ఎంట్రీ ఇస్తున్న బ్రాండ్స్

పెద్ద బ్రాండ్స్ వస్తే..

అయితే పెద్ద స్నాకింగ్ బ్రాండ్ల పోర్ట్‌ఫోలియోలో మిల్లెట్స్ ఇంకా విస్తరించలేదు. ప్రస్తుతానికి ఈ ఉత్పత్తులు ప్రీమియం విభాగంలో ఉన్నాయి. చిరుధాన్యాలతో తయారైన ఉత్పత్తులు గ్లూటెన్, అలర్జీ రహితం. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగినవి కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది. ఈ విభాగం ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. 10 సంవత్సరాల క్రితం సేంద్రియ ఉత్పత్తుల మాదిరిగా.. రాబోయే కాలంలో ఇవి ప్రధాన స్రవంతిలోకి వస్తాయని పరిశ్రమ అంటోంది. పెద్ద బ్రాండ్స్ ఈ రంగంలోకి ఎంట్రీ ఇస్తే వినియోగం గణనీయంగా పెరుగుతుందన్నది నిపుణుల మాట.

ముందున్న సవాల్..

ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా పశ్చిమ దేశాల్లో వినియోగదారులు చాక్లెట్లను ఇష్టపడతారు. భారత్‌లో ఎక్కువగా.. ఉప్పుతో చేసిన వేయించిన స్నాక్స్ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. మనదేశంలో ఈ విభాగంలో ఎక్కువగా అమ్ముడయ్యే ఉత్పాదన 'భుజియా'. సింగపూర్‌కు చెందిన టిమాసెక్ ఈ ఏడాది మార్చిలో హల్దిరామ్ స్నాక్స్ ఫుడ్స్‌లో 10% వాటాను దాదాపు 1 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. దీన్నిబట్టి స్నాక్స్‌కు ఉన్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ప్రధాన బ్రాండ్లు తమ ఉత్పత్తి శ్రేణిలో చిరుధాన్యాలను చేర్చడం ద్వారా ఎక్కువ మంది కస్టమర్లను చేరడానికి ప్రయత్నిస్తున్నాయి.

మఖానా.. మజాకా..

ఆరోగ్యకరమైన స్నాక్స్ మార్కెట్‌లో మార్పునకు మఖానా నాయకత్వం వహిస్తోందని ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ (ఐబీఈఎఫ్) చెబుతోంది. ప్యాకేజ్డ్ మఖానా మార్కెట్ రాబోయే 2–3 ఏళ్లలో ఒక బిలియన్ డాలర్లకు చేరుతుందని వ్యాపారుల అంచనా. ప్రస్తుతం దేశంలో 80,000 టన్నుల మఖానా పండుతోందని సమాచారం. దీని విలువ హోల్‌సేల్ మార్కెట్లో 700 మిలియన్ డాలర్లు. మఖానా పరిశ్రమను ప్రోత్సహించేందుకు 2025–26 బడ్జెట్‌లో రూ.100 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

మార్కెట్ విలువ రూ. 42 వేల కోట్లకు పైనే!

కోవిడ్-19 సమయంలో అందరికీ ఆరోగ్య స్పృహ పెరగడంతో.. సంప్రదాయ ఆరోగ్య ఉత్పత్తులవైపు మళ్లారు. ఇది చిరు ధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు దోహదపడింది.

- భారత స్నాక్స్ మార్కెట్ 2023 నాటికి రూ.42,695 కోట్లు. 2032 నాటికి ఇది రూ.95,522 కోట్లకు చేరుకుంటుందని అంచనా.
- 2024-32 మధ్యకాలంలో 9.08% వార్షిక వృద్ధి రేటుతో ఆరోగ్యకరమైన స్నాక్స్ విపణి విస్తరిస్తుందని పరిశోధనా సంస్థ ఐఎంఏఆర్‌సీ గ్రూప్ అంటోంది.
- చిరుతిళ్లు, ధాన్యాలు, పప్పుల వంటి వాటి విక్రయంలో ఉన్న 'ఫామ్‌లీ' ఈ ఏడాది చేపట్టిన సర్వేలో 6,000 మంది భారతీయ వినియోగదారులు పాలుపంచుకున్నారు. అధిక ప్రొటీన్, శక్తి వంటి ప్రయోజనాలు అందించే ఆరోగ్యకరమైన స్నాక్స్ కోసం కస్టమర్లు ఎక్కువగా చూస్తున్నారని ఈ సర్వేలో తేలింది.
- 'రూకమ్ క్యాపిటల్' సంస్థ దేశంలోని 18 రాష్ట్రాల్లో 5,000 మందిపై నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో.. చిరుధాన్యాలు, డ్రైఫ్రూట్స్ వంటి వాటితో చేసిన ఆరోగ్యకరమైన స్నాక్స్ కావాలని సగానికిపైగా చెప్పారు.

క్లుప్తంగా...

సీసీఐ ద్వారా పత్తిని కొనాలి

- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అక్టోబర్ ఒకటో తేదీ నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో 43.29 లక్షల ఎకరాల్లో పత్తి సాగయిందని, సుమారు 24.70 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని తెలిపారు. పత్తి సాగు చేసే వారిలో ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నందున, సకాలంలో మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తే వారికి ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పత్తి ధర క్వింటాల్‌కు బహిరంగ మార్కెట్‌లో రూ.6,700 మాత్రమే ఉందని, ఎంఎస్‌పీ రూ. 8,110 కంటే రూ.1,410 తక్కువగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రి ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోళ్లలో పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ


- రెండురోజుల్లో అందుబాటులోకి యూరియా



ఫెర్టిలైజర్ సిటీ (రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం ఫెర్టిలైజర్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారాన్ని సుమారు 46 రోజుల తర్వాత సోమవారం పునరుద్ధరించారు. ఆగస్టు 14న అమ్మోనియా కన్వర్టర్ లీక్ కావడంతో ప్లాంట్ షట్‌డౌన్ చేశారు. దీంతో యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. వానాకాలం సీజన్ ప్రారంభంలోనే ప్లాంట్ వార్షిక మరమ్మతులు, సాంకేతిక కారణాలు, అమ్మోనియా పైప్‌లైన్‌లీక్, అమ్మోనియా కన్వర్టర్ లీక్ కావడంతో యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీంతో తెలంగాణ రాష్ట్రంతోపాటు ఆరు రాష్ట్రాల్లో రైతులకు యూరియా కొరత తీవ్రమైంది. మరమ్మతుల అనంతరం ఆదివారం ప్లాంట్‌లో అమ్మోనియా ప్లాంట్, వాటర్ బ్లాక్ ప్లాంట్, సీపీపీ ప్లాంట్, యూరియా ప్లాంట్‌ను పునరుద్ధరించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ పునరుద్ధరించడంతో బుధవారం యూరియా ఉత్పత్తి అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

శ్రీశైలానికి భారీ ప్రవాహం

- 10 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఈ క్రమంలో సోమవారం జూరాల నుంచి 5,61,640, సుంకేసుల నుంచి 48,616, హంద్రీ నుంచి 4,800 కలిపి మొత్తం 6,15,055 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తుంది. దీంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద 10 గేట్లు ఒక్కొక్కటి 26 అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 5,77,690, విద్యుదుత్పత్తి చేస్తూ 64,149 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.2 అడుగుల వద్ద 205.6627 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇక పంట విక్రయాల్లో దళారులకు నో చాన్స్

పండించిన రైతుకే అమ్ముకునే అవకాశం

- మద్దతు ధర విక్రయాలపై కేంద్రం స్పష్టమైన మార్గదర్శకాలు
- ఈ సీజన్ నుంచి పీఎం–ఆశా కింద మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ ద్వారా కొత్త విధానంలో కొనుగోళ్లు



సాక్షి, హైదరాబాద్: రైతులు పండించిన పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసి, అక్రమ పద్ధతుల్లో కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించే దళారులకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెడుతోంది. పండించిన రైతు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను విక్రయించుకునేలా చర్యలు చేపట్టింది. రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) హామీ ఇచ్చేలా రూపొందించిన 'పీఎమ్–ఆశా'పథకం కింద ధర మద్దతు పథకం (పీఎస్‌ఎస్), మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం (ఎంఐఎస్) అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలోని పెట్టుబడి, మద్దతు ధర విభాగం నుంచి ఈనెల 18న ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఇవి అమల్లోకి వచ్చేలా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అక్రమాలకు చెక్ పెట్టేందుకే...

బహిరంగ మార్కెట్‌లో ధర లేనప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే మద్దతు ధర ఇచ్చి పంటలను కొనుగోలు చేసే విధానం కొంతకాలంగా దేశంలో అమలవుతోంది. అయితే దీనిని దళారులు దుర్వినియోగం చేస్తున్నారు.

- వరి, పత్తి కందులు, మొక్కజొన్న, పెసర, జొన్నలు, మినుములు మొదలైన పలు రకాల పంటలకు మార్కెట్ ధరతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.
- ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎఫ్‌సీఐ సేకరిస్తుండగా, పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు చేస్తుంది. ఇవి కాకుండా పెసలు, సోయా బీన్, మినుములు వంటి పంటలను కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ కొనుగోలు చేస్తాయి.
- కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ జొన్నలు, మక్కలు మొదలైన పంటలను రైతుల నుంచి సేకరిస్తుంది. అయితే ఇక్కడే అక్రమాలకు తెర లేస్తోంది. పంట నాణ్యత లేదని రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసే దళారులు, ప్రైవేటు వ్యాపారులు తిరిగి ఆ పంటనే మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, సీసీఐ వంటి సంస్థలతో కుమ్మక్కై రైతుల పేరిట మద్దతు ధరకు విక్రయిస్తున్నారు.
- గత సంవత్సరం పత్తి పంటకు సంబంధించి ఇలాంటి అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణ ద్వారా ధ్రువీకరించి, కేంద్రానికి పంపించింది.
- గతంలో మార్క్‌ఫెడ్ ద్వారా జరిగిన జొన్నల కొనుగోళ్లలో కూడా దళారులే రైతుల పేరిట విక్రయాలు జరిపినట్టు రుజువైంది.
- దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతూ రైతులే లబ్ధిదారులుగా ఉండేలా కేంద్రం మార్గదర్శకాలు రూపొందించింది.

రైతుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ...

ధర మద్దతు పథకం (పీఎస్‌ఎస్) ప్రత్యేక పోర్టల్‌లో రైతుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కూడా రైతు డేటాను కేంద్రం సేకరిస్తుంది.

- రాష్ట్ర పోర్టల్‌లో రైతులు తప్పనిసరిగా రిజిస్టర్ కావాలి. డీసీఎస్/అగ్రి–స్టాక్ ఇంటిగ్రేషన్ ద్వారా పంట వివరాలు ధ్రువీకరించాలి. లేనిచోట పాత పద్ధతిలోనే వెరిఫికేషన్ చేపడతారు.
- రైతు ఆధార్, పట్టాదార్‌పాస్ పుస్తకంతో పాటు క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగా రైతు ఏ పంట వేశారనే అంశాలను వ్యవసాయ శాఖ నుంచి సేకరించి, పంటలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ వంటి కేంద్ర నోడల్ ఏజెన్సీలతో రైతుల డేటాను అనుసంధానం చేయాల్సి ఉంటుంది.
- డిజిటల్ క్రాప్ సర్వే, అగ్రి–స్టాక్ డేటాతో ఆటో వెరిఫికేషన్ తప్పనిసరి.
- ఒకవేళ రైతులు తమ పంటలను విక్రయించడానికి నేరుగా రాని పక్షంలో తన ఆధార్ నంబర్‌తో గరిష్టంగా ముగ్గురికి ఆథరైజేషన్ ఇచ్చి పంటల విక్రయానికి పంపించే అవకాశం ఉంటుంది. రైతు హాజరు కాకపోతే, అతడి అధీకృత ప్రతినిధి ఉత్పత్తిని కొనుగోలు కేంద్రానికి తెచ్చే వీలు ఉంటుంది. చెల్లింపు మాత్రం నేరుగా రైతు (యజమాని) బ్యాంక్ ఖాతాకు మాత్రమే వెళుతుంది.
- ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ లేదా మొబైల్ యాప్ ద్వారా ముఖ గుర్తింపు తప్పనిసరి. ఓటీపీ ద్వారా ధ్రువీకరణకు అనుమతి ఉండదు. తద్వారా రైతుల పేరిట దళారులు పంటలను బల్క్‌గా విక్రయించే అవకాశం ఉండదు.
- రైతులకు చెల్లింపులు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా ఆధార్ వెరిఫైడ్ ఖాతాల్లోనే జరుగుతాయి. ఆధార్ చట్టం 2016 సెక్షన్ 7 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి, ఈనెల 30లోపు రాష్ట్రాలు దీనిని కేంద్రానికి పంపించాల్సి ఉంటుంది.
- నిజమైన రైతులకే మద్దతు ధర ప్రయోజనం చేరేలా చూడటం, మధ్యవర్తుల జోక్యం తగ్గించడంతోపాటు కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా ఉంచడం ఈ మార్గదర్శకాల ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

మూడు దశల్లో అలంపూర్ క్షేత్ర అభివృద్ధి

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల అందజేత



జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: అలంపూర్ క్షేత్రాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం జోగుళాంబ జిల్లాలోని అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అలంపూర్ క్షేత్ర ఆలయాలకు ప్రభుత్వం తరఫున మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. మొదటి దశలో రూ.48 కోట్లు, రెండో దశలో రూ.24 కోట్లు, మూడో దశలో రూ.345 కోట్లతో పూర్తిస్థాయిలో ఆలయాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జోగుళాంబ అమ్మవారి ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించారని చెప్పారు. అలంపూర్ ఆలయాలకు 50 ఎకరాల భూములు ఉన్నాయని, ఆలయ అవసరాలకు వాటిని వినియోగించుకుంటామని చెప్పారు. ఏపీలో ఉన్న పొలాలను సైతం ఏం చేయాలో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

బాసరలో మూలానక్షత్ర పూజలు

భైంసా/బాసర: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ క్షేత్రంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలో మూలానక్షత్ర పూజలు నిర్వహించారు. భక్తులు సరస్వతీ అమ్మవారి సన్నిధిలో దివ్య ముహూర్తాన తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ముధోల్, బోథ్ ఎమ్మెల్యేలు రామారావుపటేల్, అనిల్‌జాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు గోదావరి నదిలో వరద ఉప్పొంగింది. వరదలతో భక్తులకు ఇక్కట్లు తలెత్తకుండా జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పరిస్థితిని సమీక్షించారు.

ఆల్మట్టిపై సుప్రీంలో పోరాటం

- రాష్ట్ర వాటాల విషయంలో రాజీపడం: మంత్రి ఉత్తమ్
- స్థానిక ఎన్నికల తర్వాత నీటి వినియోగ సంఘాల ఏర్పాటు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎగువ కృష్ణా నదిపై కర్ణాటకలో నిర్మించిన ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో బలంగా పోరాడాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుసేన్, సలహాదారులు ఆదిత్యనాథ్ దాస్‌తో మంత్రి సోమవారం జలసౌధలో సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం కోసం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు సవరణ డీపీఆర్ రూపకల్పనను వేగిరం చేయాలన్నారు. మంత్రివర్గ సమావేశంలో తీర్మానించిన వెంటనే ఎస్‌ఎల్‌బీసీ సొరంగం నిర్మాణ పనులు పునరుద్ధరించాలని ఆదేశించారు. కల్వకుర్తి, దేవాదుల ప్యాకేజీ–6 పనుల సవరణ అంచనాలతోపాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు, ఖమ్మంలోని నీటిపారుదల శాఖ భూములకు సంబంధించిన ఫైళ్లను మంత్రివర్గ సమావేశం ముందు పెట్టేందుకు సిద్ధం చేయాలని చెప్పారు. 'కేటీఆర్ ఆల్మట్టి ప్రాజెక్టుపై పిచ్చిగా మాట్లాడుతున్నారు. రాజకీయ లబ్ధి కోసం అడ్డగోలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టు స్టే అమల్లో ఉంది' అని ఉత్తమ్ అన్నారు. సుప్రీంకోర్టులో వాదనల కోసం సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించామని చెప్పారు.

త్వరలో నీటి వినియోగ సంఘాలు

క్రమపద్ధతిలో చెరువులు, కాల్వల నిర్వహణ కోసం స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నీటి వినియోగ సంఘాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. తొలుత చెరువుల నిర్వహణకు వీటిని ఏర్పాటు చేసి క్రమంగా భారీ ప్రాజెక్టులకు విస్తరింపజేస్తామన్నారు. ప్రతి సంఘానికి సహాయకుడిగా లస్కర్‌తోపాటు కన్వీనర్‌గా నీటిపారుదల శాఖ అధికారిని నియమిస్తామన్నారు. జవాబుదారీతనంతో ముందస్తు చర్యలు తీసుకునే యంత్రాంగం ఉండి ఉంటే చాలా చెరువులకు గండ్లతో పాటు ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యాలను నిలువరించగలిగేవారమని ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో గుర్తించామన్నారు. నీటి వినియోగ సంఘాలతో ఈ కొరతను తీర్చడంతో పాటు సాగునీటి వనరుల నిర్వహణ బాధ్యతల్లో స్థానికులకు చోటు కల్పించనున్నాయన్నారు. రైతులకు తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి, సభ్యులను సంప్రదించి సంఘాలను నియమించాలనే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయన్నారు. చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వర్షాకాలంలో వాటికి గండ్లుపడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని రైతు కమిషన్ చెప్పిందన్నారు. ఇందుకోసం నీటి వినియోగ సంఘాలను ఏర్పాటు చేసి లస్కర్లతోపాటు ఇతర వనరులను కల్పించాలని విజ్ఞప్తి చేసిందన్నారు. చెరువులు, కాల్వలను పటిష్టంగా ఉంచడంలో రైతులకు నీటి వినియోగ సంఘాలు భరోసా కల్పిస్తాయని ఉత్తమ్ అన్నారు. కొత్త విధానంతో క్షేత్రస్థాయిలో బాధ్యతల పునరుద్ధరణతోపాటు గండ్లుపడకముందే నివారణ చర్యలు సాధ్యమవుతాయన్నారు. సాగునీటి వనరులకు తొలి రక్షణ కవచంగా సంఘాలు వ్యవహరిస్తూ అత్యవసర మరమ్మతుల అవసరం లేకుండా చర్యలు తీసుకుని పంటలను కాపాడతాయన్నారు.

పండుగ సామగ్రి కోసం వెళ్లి.. తిరిగిరాని లోకాలకు..

- ఆటోను ఢీకొట్టిన కారు
- ముగ్గురు మృతి, ఒకరికి గాయాలు
- హైదరాబాద్ – నాగార్జునసాగర్ హైవేపై ఘటన



భాస్కర్



వినోద్



రవి

కొండమల్లేపల్లి (చింతపల్లి)/దేవరకొండ: దసరా పండుగకు కావాల్సిన సామగ్రి తెచ్చుకునేందుకు ఆటోలో బయల్దేరిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామ సమీపంలో హైదరాబాద్ – నాగార్జునసాగర్ రహదారిపై సోమవారం జరిగింది. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం వద్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మటికతండాకు చెందిన సమీప బంధువులు రాత్లావత్ భాస్కర్ (25), రాత్లావత్ వినోద్ (27), ఇదే గ్రామ పంచాయతీ పరిధిలోని ఉచ్చరాలతండాకు చెందిన సభావత్ రవి (24)తో పాటు జర్పుల కృష్ణ కలిసి ఆటోలో సోమవారం చింతపల్లి మండల కేంద్రానికి వెళ్లారు. అక్కడ వారికి కావాల్సిన సామగ్రి కొనుగోలు చేసి స్వగ్రామాలకు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామ సమీపంలోకి రాగానే కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో భాస్కర్, వినోద్, సభావత్ రవి అక్కడికక్కడే మృతిచెందారు. జర్పుల కృష్ణకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నాంపల్లి సీఐ రాజు, చింతపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన కృష్ణను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగతా ముగ్గురి మృతదేహాలను కూడా పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దేవరకొండ ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

ఉగ్ర గోదావరి

- కాళేశ్వరం పుష్కర ఘాట్లను తాకిన నీటిమట్టం
- ములుగు జిల్లాలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ




కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద దుకాణాల్లోకి చేరిన వరద నీరు

కాళేశ్వరం/ఏటూరునాగారం: ఎగువన భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి పుష్కరఘాట్లను తాకుతూ 13.240 మీటర్ల ఎత్తులో నీటిమట్టం తరలిపోతుంది. దీంతో సీడబ్ల్యూసీ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వరద నీరు కమ్మేయడంతో చంద్రుపల్లి, మద్దులపల్లి వాగులు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. వందలాది ఎకరాల్లో పత్తి, వరి, మిర్చి పంటలు నీటమునిగాయి. కాగా, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి పెరుగుతూ ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరద 15.91 మీటర్లకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు.

భూమికి బాగా సుస్తీ చేసింది. అవనికి ఆధారంగా నిలుస్తున్న 9 పర్యావరణ వ్యవస్థల్లో ఏడింటి ఆరోగ్యం క్షీణించింది. శాస్త్రవేత్తల పరిభాషలో వీటిని 'ప్లానెటరీ బౌండరీస్' అంటారు. తాజాగా.. భూగ్రహంపై 70% భూభాగాన్ని ఆక్రమించటమే కాకుండా జీవావరణాన్ని కంటికి రెప్పలా కాపాడే సముద్రం కూడా అనారోగ్యం పాలైంది. సముద్ర జలాల ఆమ్లీకరణ హద్దుమీరి ప్రమాద ఘంటికలు మోగించటం ఇదే మొదటిసారి! అయినప్పటికీ, ఇంకా ఆశ మిగిలి ఉందని, ఇప్పటికైనా మానవాళి మేలుకోవాలని 'ప్లానెటరీ హెల్త్ చెక్ 2025' తాజా నివేదిక హెచ్చరిస్తోంది.

ఐసీయూలో భూమి!



భూమి ఒక రోగి అయితే, అది ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో పడి ఉండేదని పోట్స్‌డ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ ఇంపాక్ట్ రీసెర్చ్ (పీఐకే) వెలువరించిన 'ప్లానెట్ హెల్త్ చెక్ 2025' నివేదిక చెబుతోంది. జర్మనీ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ.. భూ ఆరోగ్య స్థితిగతులపై అధ్యయనంలో చురుగ్గా పనిచేస్తోంది. పరిశోధకులు గుర్తించిన తొమ్మిది పర్యావరణ సరిహద్దుల్లో మూడు ప్రమాదకర హద్దును దాటాయని 2009లో తొలుత గుర్తించారు. వీటి సంఖ్య 2023 నాటికి ఆరుకు, ప్రస్తుతం 9కి పెరిగింది. శాస్త్రవేత్తలు భూమి ఆరోగ్యాన్ని.. దాని ఉత్పాదకత, మానవులు వాడుకున్న తర్వాత మిగిలిన శక్తి అనే 2 సూచికలను ఉపయోగించి కొలుస్తారు.

- సాక్షి, సాగుబడి

భూగోళానికి 9 ఆరోగ్య పరీక్షల్లో ఏడింట ఫెయిల్!

ప్రమాదకర స్థాయికి చేరిన సముద్ర ఆమ్లీకరణ

తాజా 'ప్లానెటరీ హెల్త్ చెక్ 2025' రిపోర్ట్ హెచ్చరిక

1 వాతావరణ మార్పు

వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్ (సీఓ2) 350 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) స్థాయిలో ఉంటే మంచిది. కానీ ఇది 423కి పెరిగింది. 450కి చేరితే మరింత ప్రమాదకరం. ఈ కారణంగానే ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి, విపత్తులు తీవ్రమవుతున్నాయి.

2 జీవావరణ సమగ్రతలో మార్పు

మనం చేసే పనులు జీవావరణ సమగ్రతపై ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రకృతిలో ఉన్న శక్తిలో 10 శాతాన్ని మనుషులు వాడుకుంటే ప్రకృతి తిరిగి దాన్ని పూడ్చుకొని తెప్పరిల్లుతుంది. కానీ, మనం 30% వాడేసుకుంటున్నాం. వ్యవసాయం, పశువుల పెంపకం, నగరీకరణ, పరిశ్రమల కోసం భూమి సహజ స్థితిని విపరీతంగా మార్చటం వల్ల.. జీవవైవిధ్యం ప్రమాదకర స్థాయిలో అంతరిస్తోంది.

3 భూ వ్యవస్థ మార్పు

అడవులు భూగోళంపై వాతావరణాన్ని స్థిరంగా ఉంచటంలో కీలకపాత్ర పోషిస్తాయి. అసాధారణంగా అడవులు నరికివేసి భూమిని చిన్నాభిన్నం చేస్తున్నాం. వ్యవసాయం, నగరీకరణ, పశుపోషణ కోసం తీవ్రస్థాయిలో భూ వినియోగ సహజ స్థితిని మార్చటం సమస్యగా మారింది. 2000–2018 మధ్యలో 90% అడవుల నరికివేత వ్యవసాయం (52%), పశుపోషణ (38%) కోసమే జరిగింది. ప్రపంచ భూభాగంలో అడవులు 75% ఉంటే మేలు. అయితే, ఇప్పుడు 59 శాతానికి తగ్గిపోయాయి.

4 మంచినీటి మార్పు

పరిమితి దాటిని మంచి నీటి వినియోగం జల చక్రాన్ని దెబ్బతీస్తోంది. నదుల్లో పారే నీటిని 12.9% వాడుకుంటే పర్వాలేదు. కానీ, ఇప్పుడు 22.6% వాడుతున్నాం. భూగర్భ జలాలను 12.4% వాడుకుంటే పర్వాలేదు. మనం 22% వినియోగిస్తున్నాం.

5 జీవ భౌతిక రసాయన మార్పులు

రసాయనిక ఎరువులను పంటలు ఉపయోగించుకునేది తక్కువ.. నీటిని, భూమిని కలుషితం చేసేదే ఎక్కువ. ఇవి చివరికి సముద్ర జలాల్లోకీ చేరి పర్యావరణ వ్యవస్థలను కూడా అస్తవ్యస్తం చేస్తున్నాయి. భాస్వరం ఎరువులను ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 62 లక్షల టన్నులు వాడితే పర్వాలేదు. కానీ, 11 కోట్ల టన్నులు వాడుతున్నాం. నత్రజని ఎరువును ఏటా 6.2 కోట్ల టన్నులు వాడితే పర్వాలేదు. కానీ, 8.2 కోట్ల టన్నులు వాడుతున్నాం. ఇతర ఆరు రకాల సరిహద్దులను కూడా ఈ ఎరువులు ప్రభావితం చేస్తున్నాయి.

6 సముద్రాల ఆమ్లీకరణ

వాతావరణంలోకి విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్‌లో చాలా వరకు సముద్రాలే పీల్చుకుంటాయి. దీనివల్ల సముద్ర జలాల్లో ఆమ్లగుణం పెరిగిపోతుంది. ఇది ఒక స్థాయికి మించితే సముద్ర జీవ వ్యవస్థలకు ప్రమాదం. ఫలితంగా సీఓ2ను పీల్చుకునే శక్తి సముద్రాలకు తగ్గిపోతుంది. దీంతో భూగోళం మరింత వేడెక్కుతుంది.

7 వాయు కాలుష్యం

గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు చర్యలు తీసుకోవటం వల్ల ఈ కాలుష్యం తగ్గుముఖం పట్టింది. 9 సరిహద్దుల్లో సురక్షిత స్థాయిలో ఉన్న రెండింటిలో ఇదొకటి.

8 ఓజోన్ పొర

సౌర వ్యవస్థ నుంచి అతినీలలోహిత కిరణాలను భూమిపైకి రాకుండా వడకట్టేది ఆకాశంలోని ఓజోన్ పొర. గతంలో ఇది క్షీణించడంతో ప్రపంచ దేశాలు చర్యలు తీసుకున్నాయి. దీంతో ఓజోన్ పొర మందం ఇటీవల పెరుగుతోంది. తొమ్మిదింటిలో సురక్షిత స్థాయిలో ఉన్న రెండోది ఇదే.

9 నావల్ ఎంటిటీస్

మనుషులు తయారుచేసిన రసాయనాలు, ప్లాస్టిక్‌లు.. వీటి కిందికి వస్తాయి. సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థాలు సముద్ర జంతువుల్లోకి, మన దేహాల్లోకి చేరి చేటు చేస్తున్నాయి. అయితే, వీటి ముప్పు ఎంత అనేది అంచనా వేయాల్సి ఉంది.

క్లుప్తంగా...

విలువలతో కూడిన విద్య అవసరం

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



రామ్‌నాథ్ కోవింద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న గురుకుల స్వామీజీలు

మొయినాబాద్: నేటి తరానికి విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, సేవాభావంతో కూడిన విద్య అవసరమని భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని స్వామి నారాయణ్ గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా గురుకులంలో విద్యను అందించడం అభినందనీయమన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గురుకుల కేంద్రాలను ఏర్పాటు చేసి అందరూ సమానమేననే భావన చాటుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించడం శుభసూచికమన్నారు.

తెలుగు రాష్ట్రాల సీఎంలు నష్టపరిహారం చెల్లించాలి

- జెరూసలేం మత్తయ్య



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ఓటుకు కోట్లు కేసులో అన్ని రకాలుగా నష్టపోయిన తనకు ఆ కేసులో నిందితులుగా ఉన్న అప్పటి టీడీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.20 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని జెరూసలేం మత్తయ్య డిమాండ్ చేశారు. ఈ కేసులో ఏ4గా ఉన్న ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మత్తయ్య సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. టీడీపీలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సూచన మేరకు ఆయన కుమారుడు లోకేశ్ డైరెక్షన్‌లో కిలారి రాజేశ్ పర్యవేక్షణలో కొనుగోలు ఘటన జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డబ్బులు సేకరించిన రేవంత్ అనుచరుడు ఉదయ్ సింగ్, డబ్బులు తెచ్చిన వేం నరేందర్ రెడ్డి కుమారుడు వేం కీర్తన్ రెడ్డితోపాటు చంద్రబాబు ప్రభుత్వం ద్వారా తనతో లాబీయింగ్‌కు పాల్పడిన ఒక ప్రముఖ పత్రిక యజమాని కూడా ఈ కేసులో తనను తప్పించడం ద్వారా లాభపడ్డారని చెప్పారు. తనకు అన్యాయం చేసిన రేవంత్, చంద్రబాబుపై క్రిమినల్ కేసు వేస్తానని హెచ్చరించారు.

హైదరాబాద్ చాప్టర్‌కు ఉత్తమ పరిపాలన అవార్డు

సాక్షి, హైదరాబాద్: పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) తన 19వ గ్లోబల్ కాంక్లేవ్‌ను గోవా, పంజిమ్‌లోని హోటల్ ఫెర్న్ కడంబా వద్ద ఘనంగా నిర్వహించింది. ఈ కాన్క్లేవ్‌లో గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతి రాజు, గోవా ముఖ్యమంత్రి డా.ప్రమోద్ సావంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పరిపాలన అవార్డు పీఆర్‌సీఐ హైదరాబాద్ చాప్టర్‌కు దక్కింది. అలాగే జాతీయ స్థాయిలో 'మోస్ట్ వాల్యుయబుల్ లీడర్ అవార్డు'ను ప్రకాశ్ జైన్ అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం, డీఎస్‌సీఐ, నాస్కామ్ సంయుక్తంగా నడుస్తున్న సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమాలకుగాను ప్రతిష్టాత్మక 'చాణక్య అవార్డు' లభించింది. హైదరాబాద్ పీఆర్‌సీఐ చైర్మన్ షకీల్ అహ్మద్‌కు జి.పి. జైకుమార్ మెమోరియల్ అవార్డు ఫర్ ఇంటెగ్రల్ పబ్లిక్ రిలేషన్స్‌ను సీఎం ప్రదానం చేశారు.

అలైన్‌మెంట్ మార్చండి.. పరిహారం పెంచండి

- చౌటుప్పల్, సంగారెడ్డి శివారు ప్రాంతాల ఆర్ఆర్ఆర్ నిర్వాసితుల డిమాండ్
- ఉత్తర భాగం రోడ్డు నిర్మాణ టెండర్లు ఖరారయ్యే వేళ ఆందోళన బాట
- ప్రభుత్వం పరిహారం పెంచుతుందని నచ్చజెప్పుతున్న స్థానిక కాంగ్రెస్ నేతలు
- వచ్చే నెలలో పరిహారం చెల్లించి భూములు స్వాధీనం చేసుకోనున్న ఎన్‌హెచ్ఏఐ



సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణానికి టెండర్లు ఖరారు కానున్న నేపథ్యంలో అలైన్‌మెంట్ మార్చడంతోపాటు భూ పరిహారం పెంచాలంటూ నిర్వాసితులు ఆందోళన బాట పడుతున్నారు. ముఖ్యంగా చౌటుప్పల్–సంగారెడ్డి శివారు ప్రాంతాల్లో సమస్య నివురుగప్పిన నిప్పులా ఉంది. చౌటుప్పల్‌కు కనీసం 50 కి.మీ. అవల ఆర్ఆర్ఆర్ ఉంటుందని తొలుత చెప్పి చివరకు పట్టణానికి 25 కి.మీ. దూరంలోనే అలైన్‌మెంట్ ఖరారవడం వెనుక ఓ బడా పరిశ్రమను కాపాడే ఉద్దేశం దాగి ఉందని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. ముందుగా అనుకున్న అలైన్‌మెంట్ ప్రకారం ఆ పరిశ్రమ ఆర్ఆర్ఆర్ లోపలివైపు అవుతుందని.. ఔటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్) లోపలి వైపు ఉన్న పరిశ్రమలను అవతలి వైపు తరలించాలన్న అంశం తెరపైకి వచ్చినట్లుగానే భవిష్యత్తులో ఆర్ఆర్ఆర్ లోపలి వైపు ఉన్న పరిశ్రమలను సైతం దూరంగా తరలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఆ పరిశ్రమకు ఇబ్బంది వస్తుందన్న ఉద్దేశంతో అధికారులు అలైన్‌మెంట్ మార్చారని నిర్వాసితులు వాదిస్తున్నారు. దీనికితోడు గతంలో జాతీయ రహదారి కోసం భూమి కోల్పోయి, ఆ తర్వాత డిండి ప్రాజెక్టు రిజర్వాయర్ కోసం భూమి కోల్పోయి, ఇప్పుడు ఆర్ఆర్ఆర్ కోసం కూడా భూమి కోల్పోతే ఇక తమకు మిగిలేదేమి ఉంటుందని నిర్వాసితుల్లో ఎక్కువ మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోనీ ప్రభుత్వం పరిహారమన్నా ఎక్కువ ప్రకటించిందా అంటే భూముల ధరలతో పోలిస్తే ఎనిమిదో వంతు కూడా లేదని వారు వాపోతున్నారు. త్వరలో జిల్లా కలెక్టరేట్ ముట్టడితో ఆందోళనను మరోసారి ఉధృతం చేస్తామని చెబుతున్నారు.

సంగారెడ్డి వద్ద కూడా..

సంగారెడ్డి పట్టణానికి చేరువగా ఉన్న సదాశివపేట్, కొండాపూర్ మండలాల్లోని ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు చేరువగా ఉండే ప్రాంతాల్లో ఒక్కో ఎకరం మార్కెట్ రేటు ప్రకారం రూ. 2–3 కోట్ల దాకా పలుకుతుంటే ప్రభుత్వం ఇచ్చే పరిహారం మాత్రం రూ. 30 లక్షల్లోపే ఉంటుందన్న ప్రచారం జరగడంతో ఈ ధరకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని నిర్వాసితులు తెగేసి చెబుతున్నారు. పరిహారం పెంపు కోసం గతంలో ఆందోళనలు చేసిన నిర్వాసితులు తాజాగా ఆర్ఆర్ఆర్ టెండర్లు ఖరారు కానున్న నేపథ్యంలో మళ్లీ ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ అంశంపై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యేతో వారు చర్చించగా పరిహారాన్ని పెంచాలనే డిమాండ్‌తో ఆందోళన చేపట్టాలని ఆయన సూచించారు.

రంగంలోకి దిగిన కాంగ్రెస్ నేతలు

ప్రభుత్వం భూముల ధరలు పెంచేందుకు కసరత్తు చేస్తోందన్న వార్తలు వస్తుండటంతో కొందరు కాంగ్రెస్ నేతలు భూ నిర్వాసితుల ఆందోళనకు తెరదించేలా అనుకూల ప్రచారం ప్రారంభించారు. మిగతా ప్రాంతాల్లో భూముల ధరల పెంపు ఎంత ఉన్నా రింగు అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే భూముల ధరలను మాత్రం ప్రభుత్వం భారీగా పెంచనుందని.. అందువల్ల ఆందోళనకు దిగొద్దని నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

పోలీసు సహకారం తీసుకోనున్న ఎన్‌హెచ్ఏఐ..

వచ్చే నెలలో సుమారు రూ. 2 వేల కోట్ల పరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసి భూములను అధీనంలోకి తీసుకోవడానికి ఎన్‌హెచ్ఏఐ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతానికి పంటలు వేసుకున్న భూములను వదిలేసి మిగతా వాటిని స్వాధీనం చేసుకొనేందుకు సిద్ధమవుతోంది. గెజిట్ విడుదలతో సాంకేతికంగా ఆ భూములన్నీ ఎన్‌హెచ్ఏఐ అధీనంలోకి వచ్చినప్పటికీ భౌతికంగా వాటిని స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఆ సమయంలో నిర్వాసితులు ఆందోళన చేసే అవకాశం ఉన్నందున పోలీసుల సహకారం తీసుకోవాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది.

ఆ మొత్తం ధాన్యాన్ని కేంద్రం సేకరించాలి

- రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంపై కేంద్రానికి విన్నవించాలని నిర్ణయం
- పండించిన పంట మొత్తాన్ని సీఎంఆర్ కింద తీసుకోవాలి
- నేడు కేంద్రంతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమావేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ఎఫ్‌సీఐ కోతల్లేకుండా సేకరించాలని కేంద్ర ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేయాలని తెలంగాణ నిర్ణయించింది. అత్యధికంగా ధాన్యాన్ని పండిస్తూ, దేశానికి అవసరమైన బియ్యం అందిస్తున్న రాష్ట్రానికి కేంద్రం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేయనుంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశం కానున్నారు. కేంద్రం ధాన్యం సేకరణ, బాయిల్డ్ రైస్ సరఫరా, గోడౌన్ స్థలాల కొరత, గోడౌన్‌లను ఎప్పటికప్పుడు ఖాళీ చేయడం వంటి అంశాలపై కేంద్రంతో స్పష్టత తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఖరీఫ్ సీఎంఆర్‌లో ముడి బియ్యం తీసుకోవాలి

తెలంగాణ ప్రభుత్వం సేకరించిన 2024–25 ఖరీఫ్ ధాన్యం నుంచి రావలసిన సీఎంఆర్ తీసుకునేందుకు అదనంగా గడువు ఇచ్చినప్పటికీ, మొత్తం సీఎంఆర్ బాయిల్డ్ రైస్‌గా ఇవ్వాలని కేంద్రం కోరింది. అయితే రాష్ట్రంలో ఉన్న ముడి బియ్యం లభ్యతను దృష్టిలో ఉంచుకొని అందులో 7 లక్షల మెట్రిక్ టన్నులను ముడి బియ్యంగా తీసుకోవాలని రాష్ట్రం కోరుతోంది. రాష్ట్రంలో లక్ష మెట్రిక్ టన్నులు బాయిల్డ్ రైస్‌గా తీసుకోవాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించింది. అలాగే 2024–25 రబీలో మొత్తం 74 ఎల్ఎంటీ ధాన్యం రైతుల నుంచి సేకరించగా, 52 ఎల్ఎంటీలను సీఎంఆర్ కింద తీసుకునేందుకు మాత్రమే కేంద్రం ఆమోదం తెలిపింది. మిగతా 22 ఎల్ఎంటీ ధాన్యం నుంచి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సరఫరాకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతోంది. అలాగే 2024–25 రబీ సీఎంఆర్ సరఫరాకు అక్టోబర్ 31 వరకు మాత్రమే అవకాశం ఉంది. అయితే, ఇంకా 30 ఎల్ఎంటీల సీఎంఆర్ మిల్లర్ల నుంచి రావాల్సి ఉన్నందున మరో 3 నెలలపాటు అంటే జనవరి 31 వరకు పొడిగించాలని ప్రభుత్వం కోరుతోంది.

సీఎంఆర్ పెంచాలి

2025–26 ఖరీఫ్‌లో 80 ఎల్ఎంటీ ధాన్యాన్ని సేకరించాలని రాష్ట్రం అంచనా వేసింది. అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 53 ఎల్ఎంటీల సేకరణకే ఉత్తర్వులు ఇచ్చింది. మిగిలిన ధాన్యం సేకరణకు కూడా ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అలాగే ఎఫ్‌సీఐ గోడౌన్‌లలో స్థలం కొరత తీవ్రంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో ప్రతినెలా కనీసం 300 రైస్ రాక్స్ కేటాయించి, ధాన్యం వేగంగా రాష్ట్రం నుంచి తరలించేందుకు కృషి చేయాలని కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది.

ప్రభుత్వ జీవో రేవంత్ చిత్తశుద్ధికి నిదర్శనం

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీలపై వున్న చిత్తశుద్ధికి నిదర్శనమని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదంటూ బీఆర్ఎస్ చేసిన విమర్శలపై పశ్చాత్తాపం వ్యక్తం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలో మల్లు రవి విలేకరులతో మాట్లాడారు. అచ్చంపేటలో నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం చేసిందేమీ లేదని విమర్శించారు. రేవంత్ అందిస్తున్న ప్రజాపాలనను జీర్ణించుకోలేక కేసీఆర్ కుటుంబ సభ్యులు బురదజల్లుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగను వేలం వెర్రిగా మార్చారని, అందుకు ప్రధాన కారణం కేసీఆర్ కూతురు కవిత అని దుయ్యబట్టారు. పండుగలు ప్రజలు జరుపుకునేలా వ్యవహరించాలి కానీ.. వారి హక్కులను హరించవద్దని మల్లు రవి హితవు పలికారు.

మాజీ సర్పంచ్‌ల బిల్లులు చెల్లించాలి

- సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్

సాక్షి, హైదరాబాద్: మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగ లేఖను సోమవారం ఆయన సీఎం సహాయ కార్యదర్శి కె.వెంకటేశ్వర రావుకు అందజేశారు. 2019 నుంచి 24 వరకు గ్రామాలు అభివృద్ధి చేసిన సర్పంచుల బిల్లుల చెల్లింపులో కక్ష సాధింపు చర్యలు వద్దని ఆయన ఆ లేఖలో కోరారు. పంచాయతీ కార్యదర్శులకు రూ.104 కోట్లు మంజూరు చేశారని, అదే విధంగా అప్పటి సర్పంచ్‌లకు కూడా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి కేశ బోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి జర్నలిస్టులు: మంత్రి సీతక్క

- మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్ అందజేస్తున్న సీతక్క, శ్రీనివాసరెడ్డి

సాక్షి, హైదరాబాద్: మీడియా రంగంలో అమరులైన జర్నలిస్టులకు మంత్రి సీతక్క జోహార్లు అర్పించారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో జర్నలిస్టుల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జర్నలిస్టులు సమాజంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తారని, అదేవిధంగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారని అన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ.. చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థికంగా చేయూతను అందించడం వల్ల ఆయా కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో ఇండ్లు లేని జర్నలిస్టులకు ఇళ్లను కేటాయించాలని, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ కార్డులు అందజేసేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నానని సీతక్క తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీ.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ, మీడియా అకాడమీ భవనంలో జర్నలిస్టులకు ఏ.ఐ., సోషల్ మీడియా, భాషపై పట్టుకోసం నిరంతరం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, మరణించిన 18 మంది వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రమాదాలు/దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన ఆరుగురు వర్కింగ్ జర్నలిస్టులకు లక్ష రూపాయలు చొప్పున, ఒక జర్నలిస్టుకు రూ.యాభై వేల చెక్కును మంత్రి చేతులమీదుగా అందజేశామన్నారు.

'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయండి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోరాట యోధులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎం.కోదండరాం కోరారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఆయన గాంధీభవన్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు జరిగేలా చొరవ తీసుకుని ముఖ్యమంత్రితో మాట్లాడాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నంను కోరారు. ఉద్యమకారుల పట్ల ప్రజా ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఇందుకు తగిన కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

వానలు తగ్గిన తర్వాత రోడ్లకు మరమ్మతులు : మంత్రి కోమటిరెడ్డి



అధికారితో మాట్లాడుతున్న కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇటీవలి భారీ వర్షాలకు రాష్ట్రంలో 1,062 ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన అధికారులతో సమీక్షించిన అనంతరం పత్రిక ప్రకటన విడుదల చేశారు. దెబ్బతిన్న రోడ్లను తాత్కాలిక పద్ధతిలో పునరుద్ధరించేందుకు రూ. 72.49 కోట్లు అవసరమని, శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు రూ. 1,263.33 కోట్లు ఖర్చవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. టిమ్స్ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, తుది దశకు చేరుకున్న కరీంనగర్, వరంగల్, ములుగు జిల్లాల కలెక్టరేట్‌లను వీలైనంత తొందరలో సిద్ధం చేసి ప్రారంభించాలని ఆదేశించినట్టు ఆయన వెల్లడించారు.


ప్రజా సేవకు ప్రాధాన్యత ఇవ్వాలి

- డీజీపీ డాక్టర్ జితేందర్



సాక్షి, హైదరాబాద్: ప్రజా కేంద్రీకృత పోలీసింగ్ (సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్)కు పోలీసు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం డీజీపీ కార్యాలయ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ డీజీపీ కార్యాలయ సమావేశ మందిరంలో జితేందర్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర డీజీపీగా 14 నెలలపాటు పనిచేసినందుకు గర్వపడుతున్నానని విధి నిర్వహణలో తాను ప్రజా కేంద్రీకృత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చానన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖకు ప్రధాన కార్యాలయంగా ఉన్న డీజీపీ కార్యాలయ ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని చెప్పారు. శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ, ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ కోసం క్యూఆర్ కోడ్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ల మీట్, యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు, టూరిజం పోలీస్, ఇండియా జస్టిస్ రిపోర్టు ప్రకారం తెలంగాణకు ప్రథమ స్థానం వంటి ఎన్నో చర్యలు డీజీపీ జితేందర్ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐజీలు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.రమేశ్, తఫ్సీర్ ఇక్బాల్, రమేశ్ నాయుడు, ఎం.శ్రీనివాసులు, సీఐడీ ఎస్పీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన నాగిరెడ్డి



నాగిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సజ్జనార్

సాక్షి, హైదరాబాద్ /సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఆర్టీసీ ఎండీగా వై.నాగిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బస్‌భవన్‌లో ఆయన సజ్జనార్ నుంచి చార్జ్ తీసుకున్నారు. నాలుగేళ్లపాటు ఎండీగా పనిచేసిన సజ్జనార్ హైదరాబాద్ నగర్ పోలీసు కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నాగిరెడ్డి నియమితులయ్యారు. దసరా నవరాత్రి వేడుకల సమయంలో ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించటం సంతోషంగా ఉందని నాగిరెడ్డి పేర్కొన్నారు. సంస్థకు సంబంధించిన పరిస్థితులను అవగతం చేసుకున్న తర్వాత, సంస్థ పురోగతికి తీసుకోవాల్సిన చర్యపై నిర్ణయం తీసుకుంటానని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ అధికారులతో సమావేశమై సంస్థ గురించి వాకబు చేశారు.

జీవితంలో మరిచిపోలేని సమయం: సజ్జనార్

నాలుగేళ్లపాటు ఆర్టీసీకి ఎండీగా పనిచేసిన అనుభవం జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుందని సజ్జనార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆర్టీసీ నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. తాను ఎండీగా బాధ్యతలు స్వీకరించేనాటికి సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, దాన్ని సవాల్‌గా తీసుకొని అందరి సహకారంతో మెరుగుపరిచి ప్రతినెలా ఒకటో తేదీనే సొంత నిధుల నుంచి జీతాలు చెల్లించగలిగే స్థితికి చేర్చామన్నారు. ఏడాదికి రూ.9 వేల కోట్ల రాబడి, కొత్త బస్సుల కొనుగోలు, ప్రయాణికులకు వసతుల మెరుగు, కార్పొరేట్ స్థాయిలో తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిని అభివృద్ధి చేయటం, ఉద్యోగుల మెడికల్ ప్రొఫైల్‌కు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ నిర్వహణ, ఉద్యోగుల జీవిత భాగస్వామికి కూడా సంపూర్ణ వైద్య పరీక్షల నిర్వహణ.. ఇలా ఎన్నో చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి విజయవంతంగా అమలు చేయగలిగామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన విక్రమ్‌సింగ్ మాన్



విక్రమ్‌సింగ్ మాన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్‌గా ఇటీవల నియమితులైన 1998 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విక్రమ్‌సింగ్ మాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నానక్‌రామ్‌గూడలోని అగ్నిమాపకశాఖ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుత డీజీ వై.నాగిరెడ్డి నుంచి విక్రమ్‌సింగ్‌మాన్ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. కాగా, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో శాంతిభద్రతల అడిషనల్ సీపీగా మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వహించిన విక్రమ్‌సింగ్ మాన్ ఇటీవల బదిలీల్లో అగ్నిమాపకశాఖ డీజీగా బదిలీ అయ్యారు.

సాక్షి హైదరాబాద్
మంగళవారం, 30, సెప్టెంబర్, 2025



నిన్న వరద.. నేడు బురద

మూసీ నదీపరీవాహక బస్తీల్లో వరద కాటేసింది. ఆనక ఇప్పుడు బురద మేటేసింది. పేదల కళ్లల్లో కన్నీటి సుడులు తిరుగుతున్నాయి. -12లో



దుర్గమ్మ సన్నిధి.. కళల పెన్నిధి..

దసరా నవరాత్రుల్లో అమ్మవారి మండపాలు కళాత్మకంగా ఆకట్టుకుంటున్నాయి. ఎటు చూసిన ప్రత్యేక అలంకరణలతో అబ్బురపరుస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/22.0

నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

సిటీ బస్సులో పయనించిన ఆర్టీసీ ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తన విధినిర్వహణలో భాగంగా చివరి రోజు సిటీ బస్సులో ప్రయాణం చేశారు. ఒక సాధారణ ప్రయాణికుడిలా లక్డీకాపూల్ టెలిఫోన్ భవన్ వద్ద (113ఐ/ఎం) బస్సెక్కి ఆర్టీసీ బస్‌భవన్ వద్ద దిగారు. యూపీఐ పేమెంట్ ద్వారా ఆయన కండక్టర్ వద్ద టిక్కెట్ తీసుకున్నారు. నాలుగేళ్ల పాటు ఆర్టీసీ ఎండీగా సేవలందజేసిన సజ్జనార్ ప్రస్తుతం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన ఆర్టీసీ ఎండీగా సోమవారం చివరి రోజు విధులు నిర్వహించారు. మరోవైపు ఆర్టీసీతో తన నాలుగేళ్ల అనుబంధాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, అధికారులు, ఉద్యోగులు, సంస్థ అభివృద్ధి కోసం ఎంతో అంకితభావంతో పని చేస్తున్నారని, వారు అందజేసే నిరంతర సేవల వల్లనే ఆర్టీసీ ప్రగతిపథంలో పయనిస్తుందని చెప్పారు. ఆర్టీసీతో తన అనుబంధం అనిర్వచనీయమైనదన్నారు. ఆర్టీసీ ఎండీగా తాను గమ్యం చేరుకున్నట్లు చెప్పారు.

రికార్డు సంబురం



సరూర్‌నగర్ స్టేడియంలో రికార్డు బతుకమ్మ వద్ద..

కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో బతుకమ్మల నిమజ్జనం..

పూల పరిమళం..



కూకట్‌పల్లిలో మహిళల సందడి

నగరంలో సోమవారం సద్దుల బతుకమ్మ సందడి అంబరాన్నంటింది. తీరొక్క పూలతో..అందంగా అలంకరించిన బతుకమ్మలతో మహిళలు ఆడిపాడుతూ సద్దుల పండుగను వైభవంగా జరుపుకొన్నారు. కూకట్‌పల్లిలో ఏటా మాదిరిగానే పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకల్ని నిర్వహించారు. ఇక రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం 'మహా బతుకమ్మ' వేడుకలు నిర్వహించారు. 1,500 మందితో తెలంగాణ బతుకమ్మ ఫోక్ డ్యాన్స్ అబ్బుర పరిచింది. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ రెండు ప్రదర్శనలు అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించాయి.
– సాక్షి, సిటీబ్యూరో

- ఎల్అండ్‌టీ నుంచి ప్రభుత్వానికి మెట్రో బదిలీ ఈజీ కాదు
- కేంద్రం అనుమతి తప్పనిసరి
- బ్యాంకు రుణాలు బదిలీ సహా అనేక అంశాలు పరిష్కారం కావాలి
- ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఏడాదికి పైగా సమయం

'మెట్రో' బదిలీకి మరో ఏడాది!

మెట్రో మొదటిదశ ప్రాజెక్టు నుంచి ఎల్అండ్‌టీ వైదొలగనున్న నేపథ్యంలో కొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. అసలు ప్రభుత్వ అధీనంలోకి వెళ్తే నిర్వహణ ఎలా ఉంటుంది..? సౌకర్యాలు ఎలా ఉంటాయనే చర్చ మొదలైంది. అలాగే మెట్రో మొదటి దశ ప్రాజెక్టు ఎల్అండ్‌టీ నుంచి ప్రభుత్వానికి బదిలీచేసే ప్రక్రియ కూడా అంత ఈజీ కాదు. వివిధ అంశాలపైన స్పష్టమైన అవగాహన, ఒప్పందం ఏర్పడిన తరువాత మాత్రమే ఎల్అండ్‌టీ నుంచి ప్రభుత్వానికి బదిలీ కానుంది. ఇందుకోసం ఏడాదికి పైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో వివిధ అంశాలపైన సమావేశాలు నిర్వహించి ఒప్పందాలు చేసుకోవలసి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.
– సాక్షి, సిటీబ్యూరో



హైదరాబాద్ మహానగరంలో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నిర్మించి నిర్వహిస్తోన్న 69.2 కి.మీల మెట్రో మొదటిదశ ప్రాజెక్టు నుంచి ఎల్అండ్‌టీ వైదొలగనున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఎల్అండ్‌టీ సంస్థకు ఏకమొత్తంగా రూ.2000 కోట్లు చెల్లించి ప్రభుత్వం ప్రాజెక్టును స్వాధీనం చేసుకోనుంది. అలాగే రూ.13000 కోట్ల రుణాలను కూడా ప్రభుత్వమే భరించనుంది. ఈ ఆర్థిక అంశాలపైన ఒప్పందాన్ని ఏర్పాటు చేసుకోవడంతోపాటు నిర్వహణపరమైన అంశాలపైన కూడా ఎల్అండ్‌టీ నుంచి ప్రభుత్వానికి బదిలీ ఒప్పందాలు జరగాల్సివుంది. ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏడాది కంటే ఎక్కువ కాలమే పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

కేంద్రం అనుమతి తప్పనిసరి

పీపీపీ పద్ధతిలో చేపట్టిన మొదటి దశ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం కూడా ఒక భాగస్వామ్య సంస్థగానే ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి ఎల్అండ్‌టీ వైదొలగాలన్నా, ఆర్థిక లావాదేవాలపైన ఎలాంటి ఒప్పందాలు ఏర్పాటు చేసుకోవాలనుకున్నా కేంద్ర ప్రభుత్వం కూడా తప్పనిసరిగా అనుమతించవలసి ఉంటుంది. ఎల్అండ్‌టీకి, ప్రభుత్వానికి మధ్య కుదిరే ప్రతి ఒప్పందం వివరాలను కేంద్రానికి అందజేయాలి. అలాగే బ్యాంకు రుణాలను రాష్ట్రం భరించనున్న దృష్ట్యా అందుకు కూడా కేంద్రం నుంచి అనుమతి లభించవలసి ఉంటుంది. రెండోదశ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఎలా ముఖ్యమో, మొదటి దశ బదిలీకి కూడా అంతే ముఖ్యం అని అధికారులు తెలిపారు. కేంద్ర రాష్ట్రాలతో పాటు ఎల్అండ్‌టీ సంయుక్త ప్రాజెక్టుగా 2011లో మెట్రో మొదటిదశ చేపట్టిన సంగతి తెలిసిందే. 2017 నవంబర్ నుంచి మొదటి దశ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్‌ల మధ్య ప్రతి రోజు సుమారు 1000 ట్రిప్పులకు పైగా తిరుగుతున్నాయి. రోజుకు 4.8 లక్షల మందికి పైగా పయనిస్తున్నారు. ఈ ప్రాజెక్టు లో ఎల్అండ్‌టీ తన వాటాను రాష్ట్రానికి విక్రయించనున్న దృష్ట్యా నిర్వహణ పరమైన సాంకేతిక అంశాలపై న కూడా ఒప్పందాలు తప్పనిసరి.

కియోలిస్‌కు ఇంకా గడువు ఉంది

ఫ్రాన్స్‌కు చెందిన కియోలిస్ సంస్థ హైదరాబాద్‌లో మెట్రో రైళ్లను నడుపుతోంది. సీబీటీసీ (కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ సిస్టమ్) సాంకేతిక పరిజ్ఞానంతో ఈ రైళ్లు నడుస్తున్నాయి. కియోలిస్ సంస్థ హైదరాబాద్‌తో పాటు దుబాయ్, లండన్, పూణే నగరాల్లో కూడా మెట్రోలను నడుపుతోంది. నగరంలో ఈ సంస్థతో 2026 నవంబర్ వరకు ఒప్పందం ఉంది. ఈ మేరకు ఈ ఒప్పందాన్ని ఎల్అండ్‌టీ నుంచి ప్రభుత్వానికి బదిలీ చేసుకొని పునరుద్ధరించవలసి ఉంది. ఒకవేళ కియోలిస్‌ను కాకుండా మరో సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాలనుకున్నా 2026 నవంబర్ వరకు ఆగాల్సిందే. కానీ హైదరాబాద్‌తో మెట్రో రైళ్ల నిర్వహణలో కియోలిస్‌కు ఉన్న అనుభవం దృష్ట్యా ప్రభుత్వం మరో సంస్థను సంప్రదించకపోవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు కియోలిస్‌తోనే ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవలసి ఉంటుంది.

మెట్రో రైళ్లను నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వం నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 270 ఎకరాల భూములను ఎల్అండ్‌టీకి లీజుకు ఇచ్చింది. ఈ స్థలాల్లో మాల్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకొనేందుకు అనుమతినిచ్చారు. కానీ ఎల్అండ్‌టీకి ఇచ్చిన మొత్తం 18.5 లక్షల చదరపు అడుగుల్లో ఇప్పటి వరకు కేవలం 6.5 లక్షల చదరపు అడుగుల స్థలాలను మాత్రమే ఆ సంస్థ వినియోగించుకుంది. ఇందులో కొంత భూమిని

ఆస్తులు-అప్పులు తేలాల్సిందే..

సబ్‌లీజ్‌కు ఇచ్చారు. ప్రస్తుతం ఈ భూములన్నింటినీ ప్రభుత్వం తిరిగి తీసుకోవలసి ఉంది. ఇందుకోసం కొంతసమయం పట్టే అవకాశం ఉంది. అలాగే సబ్‌లీజుకు సంబంధించిన అంశాల్లో కూడా స్పష్టత రావలసి ఉంది. మరోవైపు రూ.13000 కోట్ల బ్యాంకు రుణాలు ఎల్అండ్‌టీ నుంచి ప్రభుత్వానికి బదలాయించాలి. ఎస్‌బీఐ నేతృత్వంలో 12 బ్యాంకులు ఈ రుణాలను అందజేశాయి. ప్రస్తుతం ఈ 12 బ్యాంకుల నుంచి రుణాలను ప్రభుత్వానికి బదిలీ అయ్యేందుకు కూడా కొంత గడువు అవసరం. ఇలా అనేక అంశాలతో ముడిపడి ఉన్న మెట్రో మొదటి దశ ప్రాజెక్టు యాజమాన్య బదిలీకి ఏడాది కంటే ఎక్కువ సమయమే పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

పోటెత్తిన పూలు

- మార్కెట్లకు పండుగ శోభ
- బతుకమ్మ, దసరా నేపథ్యంలో కొనుగోళ్ల జోరు
- భారీగా వివిధ రకాల పూల దిగుమతి
- రికార్డు స్థాయిలో బంతిపూల విక్రయాలు



సాక్షి సిటీబ్యూరో: పూల పండుగకు విరులు పోటెత్తాయి. సద్దుల బతుకమ్మను పేర్చడానికి తీరొక్క కుసుమాలు మార్కెట్‌కు తరలివచ్చాయి. ముఖ్యంగా తంగేడు, గునుగు, ఉప్పు పువ్వులే కాదు.. బంతి, చామంతి పూల కొనుగోళ్లతో నగర మార్కెట్లు కిటకిటలాడాయి. సోమవారం ఒక్క రోజే ఏకంగా 1.20 లక్షల కిలోల వివిధ రకాల పూలు నగరానికి దిగుమతి అయ్యాయి. శివారు జిల్లాల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర, ఏపీ నుంచి పూలు ఎక్కువగా దిగమతి చేసుకున్నారు. గులాబీ, చామంతి, బంతి పూలను ఎక్కువగా తెప్పించామని మార్కెట్ వ్యాపారులు వెల్లడించారు. ఈ ఏడాది రంగారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో వరుస వర్షాలతో కొంత మేర పూల తోటలకు నష్టం జరిగింది. దీంతో దిగుమతులు తగ్గగా ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. సాధారణంగా పండుగల సీజన్‌లో పూల ధరలకు రెక్కలు వస్తాయి. కానీ ఈ ఏడాది మార్కెట్‌లో పుష్కలంగా పూలు లభించడంతో కొంత ధరలపై ఎఫెక్ట్ పడింది. రేటు అమాంతం పెంచకుండా వ్యాపారులు మామూలు ధరలకే విక్రయించారు. రిటైల్ మార్కెట్లలో బంతి పూలు రూ.80 నుంచి రూ.100 రూపాయలకు కిలో విక్రయించగా... హోల్‌సేల్ మార్కెట్లలో కిలో 40 నుంచి 60లోపే విక్రయించారు. గులాబీ, చామంతి పూల రేట్లు కూడా తక్కువగానే ఉన్నాయని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 40 వేల కేజీల పూలు మార్కెట్లకు ఎక్కువగా దిగుమతి అయ్యాయిని తెలిపారు. ప్రత్యేకంగా బంతి, చామంతి దాదాపు 80 వేల కిలోల పూలు దిగుమతి అయినట్లు వ్యాపారులు అంటున్నారు. వినియోగదారులకు తక్కువ ధరలకే పూలు లభించేలా చర్యలు తీసుకున్నామని గుడి మల్కాపూర్ మార్కెట్ కార్యదర్శి శ్రీను నాయక్ తెలిపారు.

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో హరేకృష్ణ ఫౌండేషన్ సౌజన్యంతో భోజన పథకం

- 2014 నుంచి అమల్లో..
- నిత్యం 30 వేల మంది ఆకలి తీరుస్తూ..
- ఇప్పుడిక బ్రేక్‌ఫాస్ట్ సైతం తక్కువ ధరకే..

రూ. 5కే!

బ్రేక్‌ఫాస్ట్ మెనూ ..

1వ రోజు: మిల్లెట్ ఇడ్లీ(3), సాంబార్, చట్నీ /పొడి
2వ రోజు: మిల్లెట్ ఉప్మా, సాంబార్, మిక్చర్/చట్నీ
3వ రోజు: పొంగల్, సాంబార్, మిక్చర్
4వ రోజు: ఇడ్లీ(3), సాంబార్, చట్నీ
5వ రోజు: పొంగల్, సాంబర్, మిక్చర్
6వ రోజు: పూరి(3), ఆలూ కూర్మ
☛ తిరిగి ఇదే రొటేషన్‌లో సరఫరా చేయనున్నారు.

మధ్యాహ్నం భోజనమైనా.. ఉదయం టిఫినైనా

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఓవైపు కోటానుకోట్ల సంపదతో, ఆకాశహర్మ్యాల్లో నివసించే ఆగర్భ శ్రీమంతులతో పాటే కనీసం పూట భోజనానికి సైతం సరైన సంపాదన లేని వారూ ఉన్నారు. వారితోపాటు ఉన్నత చదువుల కోసం ఉన్న ఊళ్లను వదిలి వచ్చిన విద్యావంతులు, ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న వారూ, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి కోసం వచ్చిన సహాయకులు, ప్రతిరోజూ పనులు దొరకని వివిధ రంగాల్లోని కార్మికులూ ఎందరో ఉన్నారు. ఇలాంటి వారందరికీ కనీసం ఒక్క పూటైనా ఆకలితీర్చే అమ్మలా ఆదుకుంది జీహెచ్‌ఎంసీ రూ.5కే భోజన పథకం. 11 ఏళ్ల క్రితం 2014 మార్చి 2న నాంపల్లి సరాయి వద్ద లాంఛనంగా ప్రారంభించిన రూ.5లకే భోజన పథకం పేరు రూ.5 లకే భోజన పథకంగా ఉన్నప్పటికీ, అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని అన్నపూర్ణ పథకంగా నామకరణం చేసింది. ఇప్పటి దాకా భోజనాన్నే అందించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బ్రేక్‌ఫాస్ట్ కూడా అదే రూ.5లకు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. దాంతోపాటే సరఫరా కేంద్రాల పేరును ఇందిరా క్యాంటీన్లుగా మార్చి, సౌకర్యవంతమైన సదుపాయాలు కల్పిస్తోంది. ఆహారం తయారీలో నాణ్యతతోపాటు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వడంతో ఎలాంటి ఫిర్యాదులు లేకుండా విజయవంతంగా కొనసాగుతోందీ కార్యక్రమం.

అటు అభివృద్ధి.. ఇటు సంక్షేమం

ప్రభుత్వం ఏదైనా పథకాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నది జీహెచ్‌ఎంసీ కావడం విశేషం. మిగతా మునిసిపల్ కార్పొరేషన్లకు, జీహెచ్‌ఎంసీకి ఎంతో వ్యత్యాసం ఉంది. మిగతా కార్పొరేషన్లలో సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి ఉండగా, జీహెచ్‌ఎంసీ అందుకు భిన్నంగా కోట్ల రూపాయలతో ఫ్లై ఓవర్ల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలతోపాటు పేదల ఆకలి తీర్చే ఇలాంటి సంక్షేమ పథకాలు కూడా అమలు చేస్తోంది.

ఇందిరమ్మ క్యాంటీన్లు ఇలా..

నగర వ్యాప్తంగా 150 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యం కాగా సోమవారం రెండు ప్రారంభించారు. మరో పది ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంకో 50 రెడీగా ఉన్నప్పటికీ, తాగునీటి సరఫరా, డ్రైనేజీ ఇతరత్రా సదుపాయాలకు మరో పది రోజుల సమయం పట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మిగతావీ దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. గతంలో నిలబడే తినాల్సి వచ్చేది. కొన్నింట్లో మాత్రం కూర్చునే సదుపాయం కల్పించారు. ఇందిరమ్మ క్యాంటీన్లలో అన్నింటిలోనూ కూర్చునే సదుపాయంతోపాటు హ్యాండ్‌వాష్, తాగునీటి సదుపాయంతోపాటు విద్యుత్, డ్రైనేజీ కనెక్షన్లు కల్పిస్తున్నారు. నగరవ్యాప్తంగా 150 క్యాంటీన్ల ఏర్పాటుకుగాను జీహెచ్‌ఎంసీ రూ.11.43 కోట్లు ఖర్చు చేయనుంది. లబ్ధిదారులకు రూ.5లకే భోజనం అందిస్తున్నప్పటికీ, ఒక్కో భోజనానికి రూ. 29.83 ఖర్చవుతోంది. ఆమేరకు మిగతా వ్యయాన్ని జీహెచ్‌ఎంసీ భరిస్తోంది. అలా ఇప్పటి వరకు అందజేసిన 12.30 కోట్ల భోజనాలకు జీహెచ్‌ఎంసీ ఖజానా నుంచి రూ.253. 87 కోట్లు ఖర్చయింది. ప్రతిరోజూ సగటున 30 వేల భోజనాలు సరఫరా చేస్తూ ప్రజల ఆకలి తీరుస్తోంది.

మిల్లెట్ టిఫిన్స్..

ప్రజారోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ ఉప్మా కూడా అందజేయనున్నారు.

సీఎం ఆదేశాల మేరకు..

పేదలకు ఒక్కపూట భోజనమే కాక, ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్ కూడా అందజేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాని కనుగుణగా జీహెచ్‌ఎంసీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. బ్రేక్‌ఫాస్ట్ కోసం ఒక్కో ప్లేట్‌కు రూ.19 ఖర్చవుతుండగా, లబ్ధిదారు చెల్లించే రూ.5పోను మిగతా రూ.14 జీహెచ్‌ఎంసీ ఖర్చు చేయనుంది. ఇందుకుగాను జీహెచ్‌ఎంసీకి సంవత్సరానికి మరో రూ.12.60 కోట్లు అదనంగా ఖర్చు కానుంది. ఈమేరకు గ్రాంట్స్ ఇవ్వాల్సిందిగా జీహెచ్‌ఎంసీ ప్రభుత్వాన్ని కోరింది.



2న వధశాలలు, మాంసం దుకాణాలు మూత

జీహెచ్‌ఎంసీ ఆదేశాలు జారీ

లక్డీకాపూల్: మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని అక్టోబర్ 2న జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎద్దులు, గొర్రెలు, మేకల వధశాలలు, అలాగే రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని జీహెచ్‌ఎంసీ ఆదేశించింది. జీహెచ్‌ఎంసీ చట్టం -1955లోని విభాగం 533 (బి) ప్రకారం ఈ నెల 24న జరిగిన సమావేశంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. ఆ మేరకు సోమవారం జీహెచ్‌ఎంసీ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధిత అధికారులందరూ సహకరించాలని, మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ చేపట్టి గాంధీ జయంతి పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేసింది.



- నాలాల ఆక్రమణలు తొలగించాలంటూ విజ్ఞప్తులు
- హైడ్రాకు ప్రజావాణి ద్వారా మొత్తం 29 ఫిర్యాదులు

వరద ముప్పును తప్పించండి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వర్షాలు ఏ స్థాయిలో ఉన్నాయో..నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులు అదే స్థాయిలో ఉన్నాయి. ఆ ఆక్రమణల కారణంగా కాలనీలు, నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని పలువురు హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. సోమవారం నాటి ప్రజావాణిలో వచ్చిన 29 ఫిర్యాదుల్లో అత్యధికం నాలాల ఆక్రమణల సంబంధించినవే. హైడ్రా అదనపు కమిషనర్ ఎస్.అశోక్‌కుమార్ ఈ ఫిర్యాదులు స్వీకరించారు. బేగంపేటలోని మెథడిస్ట్‌కాలనీని వరద ముంచెత్తుతోందని ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. బేగంపేట రైల్వేస్టేషన్, కంట్రీక్లబ్, కుందన్‌బాగ్ మీదుగా వచ్చే వర్షం నీరు తమ కాలనీలో నిలిచిపోతోందని వాపోయారు. దీంతో 660 ఇళ్లతో పాటు పలు అపార్ట్‌మెంట్ల వాసులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. జోడిమెట్ల క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న నాలాను మేధా సెర్వో డ్రైవ్స్ కంపెనీకి ఆక్రమించడంతో వరద రహదారులను ముంచెత్తుతోందని హిగిరి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. ఎర్రకుంట మస్జిద్-ఏ-కుబా పరిసరాల్లోని నాలాను అక్రమంగా మూసి వేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. 20 అడుగుల వెడల్పుతో ఉండాల్సిన నాలాను ఆక్రమించిన వాళ్లు కేవలం మూడు అడుగుల పైప్ వేశారని పేర్కొన్నారు. చందానగర్ సర్వే నం.366, 367లో మొత్తం 2470 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాన్ని స్థానికులు కొందరు ఆక్రమించేశారని ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. షెడ్లు వేసి సర్వీసింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సమీపంలోని మూడు వేల కుటుంబాలకు పార్క్ సౌకర్యం అందడంలేదని వాపోయారు. వ్యాపార కార్యక్రమాలను చేపట్టిన వారి షెడ్డులను తొలగించి పార్కును కాపాడాలంటూ ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు.



బంగారు నగల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు వేర్వేరు చోరీ కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్‌కుమార్ సోమవారం వివరాలు వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన దంపతులు బాలాజీనగర్‌లోని శ్రీ బాలాజీ నిలయంలో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు ఆర్యన్ యోగేష్ తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. సోమవారం ఉషా ముళ్లపూడి రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానస్పదంగా కనిపించిన యువకుడిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా అతని జేబులో బంగారు ఆభరణాలు గుర్తించారు. దీంతో అతడిని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా తాము ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్ యజమాని ఆగస్టు 20న ఇంటి తలుపులు దగ్గరకు వేసి గుడికి వెళ్లాడు. ఇదే అదనుగా ఆర్యన్ ఇంట్లో దూరి 3 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆర్యన్‌ను విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారు. 2024 జూన్‌లోనూ అదే అపార్టుమెంట్‌లోని మరో ఫ్లాట్‌లో 29 తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు తెలిపాడు. అతడి నుంచి 29 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వాహనాల దొంగ అరెస్ట్..

జగద్గిరిగుట్టకు చెందిన మసి సురేష్ గచ్చిబౌలిలోని ఓ కంపెనీలో నెట్‌వర్క్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. చెడు అలవాట్లకు బానిసైన అతను సులవుగా డబ్బులు సంపాదించేందుకు వాహనాలను



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, కెమెరా

చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. పథకంలో భాగంగా సంగీత్‌నగర్‌లో ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఐ-20 కారును చోరీ చేశాడు. కారు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసి అతడి నుంచి కారు స్వాధీనం చేసుకున్నారు.

పని చేస్తున్న సంస్థకే కన్నం నిందితుడి అరెస్ట్

ఇందిరమ్మ కాలనీకి చెందిన అల్లూరి పవన్ ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు తాను పనిచేసే ఫొటో స్టూడియోలోనే 2.50 లక్షల విలువైన కెనాన్ 5డీ కెమెరా, ఫ్లాష్‌లైట్, చార్జర్, మెమొరీ కార్డులను చోరీ చేశాడు. స్టూడియో యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ కె. వెంకట సుబ్బారావు, డీఐ కొండల్‌రావు, ఎస్‌ఐ రవీందర్ రెడ్డి, అడ్మిన్ ఎస్‌ఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బొల్లినేని కృష్ణయ్య కేసులో
అదనపు సెక్షన్లు సబబే

దర్యాప్తు అధికారి నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టు

- నిందితులపై అభియోగపత్రాల దాఖలుకు అనుమతి
- ఆయన రెండో భార్య ఫిర్యాదు మేరకు గత ఏడాది కేసు



బొల్లినేని కృష్ణయ్య (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: తెలుగుదేశం పార్టీ కీలక నేత, నెల్లూరు జిల్లా, ఆత్మకూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యపై ఆయన రెండో భార్య ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో అదనపు సెక్షన్ల జోడింపు సబబేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దర్యాప్తు అధికారి తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ గత వారం తీర్పు చెప్పింది. ఫోర్జరీ సహా ఇతర సెక్షన్లను జోడిస్తూ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ నిందితులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కీలక ఆదేశాలు ఇచ్చిన న్యాయస్థానం ఆయనతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర కుటుంబీకుల పైనా అభియోగపత్రాలు దాఖలు చేయవచ్చని స్పష్టం చేసింది. రెండో భార్య సంతానాన్ని మొదటి భార్య, బంధువుల సంతానంగా చూపిస్తూ బర్త్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు పొందారని, దీనికోసం అనేక పత్రాలను ఫోర్జరీ చేశారన్నది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. విశాఖపట్నానికి చెందిన కృష్ణవేణి నాంపల్లిలోని ఓ ఆస్పత్రిలో పని చేస్తుండగా బొల్లినేని కృష్ణయ్యతో పరిచయమైంది. తన భార్య సుజాతతో సరైన సంబంధాలు లేవని, ఆమెకు పిల్లలు పుట్టే అవకాశం లేదని కృష్ణవేణిని నమ్మించిన కృష్ణయ్య 2004 ఫిబ్రవరిలో రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి 2004 ఆగస్టు 31న బేగంపేటలోని స్వప్న హెల్త్ కేర్ సెంటర్‌లో కుమారుడు అర్జున్ జన్మించాడు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ సర్కిల్-10 కార్యాలయంలో అదే ఏడాది సెప్టెంబర్ 11న రిజిస్ట్రేషన్ చేయించారు. రెండేళ్లకు కృష్ణయ్య తన కుమారుడు అర్జున్‌ను తనతో పాటు తీసుకెళ్లిపోయారు. కృష్ణయ్య, కృష్ణవేణిలకు 2006 జూలై 29న స్వప్న నర్సింగ్ హోమ్‌లో కృష్ణ వైష్ణవి పుట్టింది. అదే ఏడాది ఆగస్టు 9న జీహెచ్‌ఎంసీ సర్కిల్-10 కార్యాలయంలో ఈ మేరకు రిజిస్టర్ చేయించారు. కుమార్తెను కూడా కృష్ణయ్య వివిధ కారణాలు చెప్పి తనతో తీసుకెళ్లిపోయాడు. అర్జున్ పేరును బొల్లినేని అర్జున్ చౌదరిగా, సుజాత-కృష్ణయ్య తల్లిదండ్రులుగా పేర్కొంటూ, సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో అతడు పుట్టినట్లు 2007 జనవరి 29న జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 కార్యాలయంలో మళ్లీ రిజిస్టర్ చేయించారు. దీనికి సంబంధించి కృష్ణయ్య మొదటి భార్య సుజాత అదే ఏడాది జనవరి 27న హైదరాబాద్ ఆర్డీఓ వద్ద ఓ అఫిడవిట్ దాఖలు చేశారు. అందులో పొందుపరిచిన వివరాలతో పాటు ఇతర పత్రాల ఆధారంగానే అర్జున్ చౌదరికి మరో బర్త్ సర్టిఫికెట్ జారీ అయింది. అలాగే కృష్ణ వైష్ణవి పేరును వైష్ణవిగా, ఆమె బాలానగర్‌లోని రెమిడీ ఆస్పత్రిలో జన్మించినట్లు, తల్లిదండ్రులుగా డాక్టర్ వంకాయలపాటి హేమమాలినీ ప్రసాద్, డాక్టర్ వంకాయలపాటి శ్రీ వెంకటేశ్వర ప్రసాద్‌లను తల్లిదండ్రులుగా పేర్కొంటూ 2006 డిసెంబర్ 30న జీహెచ్‌ఎంసీ సర్కిల్-14 కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు. ఈ మేరకు మరో బర్త్ సర్టిఫికెట్ పొందారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులు ఇప్పటికే జీహెచ్‌ఎంసీ నుంచి కీలక పత్రాలు పొందారు. వీటి ఆధారంగా పోలీసులు కృష్ణయ్య, సుజాత, హేమామాలిని, వెంకటేశ్వర ప్రసాద్‌లపై నమోదైన కేసులో ఫోర్జరీ సహా ఇతర సెక్షన్లు చేర్చారు. ఈ సెక్షన్ల జోడింపును సమర్థించిన న్యాయస్థానం నిందితులపై అభియోగపత్రాల దాఖలుకు అవకాశం ఇచ్చింది. అయితే బొల్లినేని కృష్ణయ్య వయస్సు, ఇతర నిందితుల వృత్తులు తదితరాలను పరిగణలోకి తీసుకున్న కోర్టు అరెస్టు చేయవద్దని స్పష్టం చేసింది.

గంజాయి విక్రేతల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

మూసాపేట: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన కరుణాకర్, చరణ్ సూర్జా మల్లంపేట్‌లో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తుండగా, సుజిత్ మహంతి ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. ముగ్గురూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఒడిశాకు వెళ్లి 3.78 కేజీల గంజాయిని కొనుగోలు చేసి బస్సులో నగరానికి తీసుకువచ్చారు. దానిని విక్రయించేందుకు వారు ముగ్గురూ కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద ప్రయత్నాలు చేస్తుండటంతో దాడి చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3.78 కేజీల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- 12 మంది సెక్టార్ అధికారులకు షోకాజ్ నోటీసులు
- ఎన్నికలలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం
- జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్

సాక్షి,సిటీ బ్యూరో: ఎన్నికల ప్రక్రియలో పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పర్సన్‌లుగా సెక్టార్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, వారు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. సోమవారం జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గానికి సంబంధించి సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సెక్టార్ అధికారుల సన్నాహక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి 47 మంది సెక్టార్ అధికారులకు గానూ 35 మంది హాజరయ్యారు. 38 మంది సెక్టార్ పోలీస్ అధికారులకు గానూ 35 మంది హాజరయ్యారు. వీరికీ రిటర్నింగ్ అధికారి సాయిరాం విధులు, బాధ్యతలపై అవగాహన కలిగించారు. శిక్షణకు గైర్హాజరైన 12 మంది సెక్టార్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రిటర్నింగ్ అధికారికి సూచించారు. మళ్లీ నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి కూడా గైర్హాజరైతే విధుల నుంచి సస్పెండ్ చేయాలని సూచించారు. గైర్హాజరైన ముగ్గురు సెక్టార్ పోలీస్ అధికారులకు వివరాలను సంబంధిత సీపీకి తెలియజేయాలన్నారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మార్గదర్శకాల ప్రకారం కనీస వసతులు తాగునీరు, లైటింగ్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, సరైన విద్యుత్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల ఘటనల ఆధారంగా స్థానిక తహసీల్దార్‌లు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌ల సహకారంతో వల్నరబుల్ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 30న ప్రచురితమయ్యే ఓటర్ల తుది జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించేలా చూడాలన్నారు. కాగా సెక్టార్ అధికారులకు అక్టోబర్ 6 న రెండోసారి, అక్టోబర్ 18 న మూడోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నరసింహా రెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, ఎలక్ట్రికల్ ఈఈ మమత తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2న మంథన్ సంవాద్

సాక్షి,సిటీ బ్యూరో: హైదరాబాద్ నగరం మరోసారి మంథన్ సంవాద్ వేదిక కాబోతుంది. అక్టోబర్ 2న శిల్పారామంలో మంథన్ సంవాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే కార్యక్రమంలో వివిధ రంగాల నిపుణులు, మేధావులు, రచయితలు, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, కళాకారులు, జర్నలిస్టులు, విద్యార్థులు హాజరై వివిధ అంశాలపై చర్చిస్తారన్నారు. .2005లో ప్రారంభమైన మంథన్ సంవాద్‌లో ఇప్పటి వరకు 400కు పైగా ప్రసంగాలు నిర్వహించగా సుమారు 60,000 మందికి పైగా సభ్యులు భాగస్వాములైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా గాంధీ జయంతి రోజున ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

హైటెన్షన్ వైర్లు తగిలి ఐదుగురికి గాయాలు

బతుకమ్మ వేడుకల్లో ఘటన



హైటెన్షన్ వైర్లకు చిక్కుకున్న బతుకమ్మ , గాయపడిన కూలీలు

మూసాపేట: కూకట్‌పల్లిలోని బతుకమ్మ వేడుకల్లో సోమవారం అపశృతి చోటు చేసుకుంది. భారీ బతుకమ్మను తరలిస్తుండగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి ఐదుగురు కూలీలు గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి డివిజన్, సాయిబాబానగర్‌లోని దేవిస్థాన్ విల్లాస్‌లో సద్దుల బతుకమ్మ సందర్భంగా సుమారు 15 అడుగుల భారీ బతుకమ్మను తయారు చేశారు. కూకట్‌పల్లిలో బతుకమ్మను ఆడేందుకు ట్రాక్టర్‌తో 220 కేవీ హైటెన్షన్ లైన్ కింది నుంచి తీసుకువెళుతున్నారు. అయితే బతుకమ్మ కింద పడకుండా ఇనుప రాడ్‌లను ఏర్పాటు చేశారు. 220 కేవీ లైన్ కావటంతో విద్యుత్ షాక్‌కు గురై బతుకమ్మను పట్టుకున్న ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. దీనిని గుర్తించిన స్థానికులు వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

బతుకమ్మ పూల కోసం వెళ్లి....

ప్రమాదవశాత్తు సంపులో పడి వ్యక్తి మృతి



అశోక్‌రెడ్డి(ఫైల్)

హయత్‌నగర్: బతుకమ్మ పండుగ నేపథ్యంలతో పూలు తెచ్చేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పాడుబడిన సంపులో పడి మృతి చెందిన సంఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది... స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హయత్‌నగర్ డివిజన్, కమర్షియల్ టాక్స్ కాలనీకి చెందిన సుర్కంటి అశోక్‌రెడ్డి (55) లారీల వ్యాపారం చేసేవాడు. అనారోగ్యం కారణంగా కొంత కాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. సోమవారం ఉదయం బతుకమ్మ పూలు తెచ్చేందుకు వెళ్లిన అతను ప్రమాదవశాత్తు ఇంటి సమీపంలో పూడ్చి వేయకుండా వదిలేసిన పాడుబడిన సంపులో పడిపోయాడు. మధ్యాహ్నం వరకు అతను ఇంటికి రాకపోవడంతో గాలింపు చేపట్టిన కుటుంబ సభ్యులు సంపులో పడిపోయినట్లు గమనించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అశోక్‌రెడ్డి మృతదేహాన్ని బయటికి తీశారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కళ్లె నవజీవన్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను బెదిరించాడని..

● బాలుడిపై దాడి ● నిందితుడిపై కేసు నమోదు



గాయపడిన దాసరి సాయి

చైతన్యపురి: పెంపుడు కుక్క వెంట పడటంతో బయపడిన ఓ బాలుడు దానిని బెదిరించినందుకు సదరు కుక్క యజమాని అతడిపై దాడి చేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కోదండరాంనగర్ కాలనీకి చెందిన దాసరి సాయి 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి అతను స్నేహితుడితో కలిసి ఇంటి సమీపంలోని క్రికెట్‌పాయింట్‌కు వెళుతున్నాడు. అదే కాలనీలో ఉండే లంక లక్ష్మీనారాయణకు చెందిన పెంపుడు కుక్క రోడ్డుపైకి వచ్చి సాయి అతని స్నేహితుడి వెంట పడింది. దీంతో బయపడిని వారు ఇద్దరు రాయి తీసుకుని కుక్కను బెదిరించడంతో అది ఇంట్లోకి వెళ్లింది. దీనిని గుర్తించిన లంక లక్ష్మీనారాయణ అతని కుమారుడు శివనారాయణ మూర్తి బయటికి వచ్చి క్రికెట్ పాయింట్ నుంచి ఇంటికి తిరిగి వెళుతున్న దాసరి సాయిని అడ్డుకుని విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో వారికి తీవ్ర గాయాలు కావడమే కాకుండా సాయి ఎడమ చేయి విరిగింది. అతడికి ఆస్పత్రిలో చికిత్స చేయించిన అనంతరం బాధితుడి తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పోలీస్ అకాడమీలో ఘనంగా ఆయుధ పూజ



వాహనాలకు పూజ చేస్తున్న అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలోని ఎంటి పార్క్ ప్రాంగణంలో డైరెక్టర్ అభిలాష బిస్త్, ఉన్నతాధికారులు సోమవారం వాహన, ఆయుధ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటి పార్క్ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన దుర్గా భవానీ విగ్రహానికి పూజలతోపాటు వాహనాలకు పూజలు చేశారు. దసరా పండగను పురస్కరించుకొని జాయింట్ డైరెక్టర్ నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు ఉన్న వంద మంది అధికారులకు ట్రాక్ సూట్లు, రెయిన్ కోట్స్, లాప్‌టాప్ బ్యాగులు, షూలను అకాడమీ డైరెక్టర్ బహూకరించారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోని వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా ఉత్సాహం పెంచడమే లక్ష్యంగా ఈ బహుమతులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఇంచార్జి జాయింట్ డైరెక్టర్ డి.మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీరామ్‌మూర్తి, కె.ఆర్.కె.ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, టి.అమృతరెడ్డి, వి.భాస్కర్, దేవారెడ్డి, సందీప్ రెడ్డి, సారంగ పాణి, కృష్ణ, ఏవో కె.యాదమ్మ, ఇండోర్, అవుట్ డోర్ ఫ్యాకల్టీ సభ్యులు, మోటార్ వెహికల్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సైనిక శిక్షణ

- దేశభక్తిని పెంపొందించడమే 'ఎన్‌సీసీ' ధ్యేయం
- 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎంజేరెడ్డి



మాట్లాడుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎం.జే.రెడ్డి

రాయదుర్గం: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే 'ఎన్‌సీసీ' లక్ష్యంగా పనిచేస్తుందని తెలంగాణ 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎం.జే.రెడ్డి అన్నారు. గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ క్యాంపస్‌లో సోమవారం ఆయన ఆయన జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌తో కలిసి ఎన్‌సీసీ క్యాడెట్లకు వార్షిక శిక్షణా కార్య క్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సైనికులకు ఇచ్చే ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. సమాజసేవ, మత్తు పదార్థాల దుష్పలితాలు, ట్రాఫిక్ నిబంధనలు,, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమం అక్టోబర్ 7 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 9 కళాశాలలు, 14 పాఠశాలలకు చెందిన 629 మంది క్యాడెట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. జేఎన్‌వీ ప్రిన్సిపాల్ విజయభాస్కర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లకు ఏటా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్ల సహకారంతో పలు కార్య క్రమాలను విజయవంతం చేశామని గుర్తుచేశారు. శిక్షణా కార్యక్రమంలో ఎన్‌సీసీ సబ్ మేజర్ కిషోర్‌కుమార్ సిన్హా, ఏఎన్‌ఓ ఆఫీసర్లు, సైనిక సిబ్బంది పాల్గొన్నారు.

'సార్వత్రిక' కుటుంబం!

- కుటుంబ సభ్యులందరూ అంబేడ్కర్ వర్సిటీ పూర్వ విద్యార్థులే..
- ఒకరికి నేడు స్నాతకోత్సవంలో బంగారు పతకం అందించనున్న గవర్నర్



కుటుంబ సభ్యులతో గాయత్రి

బంజారాహిల్స్: ఉన్నతవిద్య అభ్యసించడానికి వారికి పరిస్థితులు అనుకూలించలేదు.. సంప్రదాయ విద్యను కొనసాగించే అవకాశమూ ఆ కుటుంబసభ్యులకు లేదు.. కుటుంబ స్థితిగతుల నేపథ్యంలో చిరు ఉద్యోగంలో చేరి ఆ తర్వాత వివాహం, భార్య, పిల్లలు పోషణతో చదువుకు దూరమైన ఓ వ్యక్తి పట్టుదలగా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉన్నతవిద్యను అభ్యసించారు. అంతే కాకుండా భార్య, పిల్లలను కూడా అదే వర్సిటీలో ఉన్నత చదువులు చదివించారు. ఒకే కుటుంబంలోని ఐదుగురి ఉన్నత విద్యకు అంబేడ్కర్ వర్సిటీ ఆలంబనగా నిలిచింది. ఇదీ ఓ సార్వత్రిక కుటుంబం కథ. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతికి చెందిన ఎస్.శ్రీధర్ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో చిరు ఉద్యోగి. కుటుంబ స్థితిగతులు కొంత మెరుగయ్యాక అంబేడ్కర్ సార్వత్రిక విద్యాలయంలో డిగ్రీలో చేరి ఉత్తీర్ణులయ్యారు. శ్రీధర్ బాటలో భార్య ఉమాదేవి కూడా పయనించి డిగ్రీ పట్టభద్రులయ్యారు. కుమారుడు కార్తీక్ కూడా అదే వర్సిటీ నుంచి ఎం.కామ్ పూర్తి చేసి అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. పెద్ద కుమార్తె ఎస్.విద్య కూడా సార్వత్రిక విద్యాలయం నుంచి ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తి చేశారు. చిన్న కుమార్తె గాయత్రి కూడా ఈ వర్సిటీ నుంచే ఎం.కామ్ చదివి బంగారు పతకానికి ఎంపికైంది. కుటుంబ సభ్యులందరికీ అంబేడ్కర్ సార్వత్రిక విద్యాలయం బాసటగా నిలిచి వారి పురోగతికి దోహదపడింది.

లక్ష్యసాధనలో వెనుకడుగు వేయొద్దు..

లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తర్వాత వెనుకడుగు వేయవద్దని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ బంగారు పతక గ్రహీత ఎస్.గాయత్రీ అన్నారు. వర్సిటీ తిరుపతి అధ్యయన కేంద్రంలో ఎం.కామ్‌లో అత్యధిక మార్కులు సాధించడంతో భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రయోజిత బంగారు పతకానికి ఆమె ఎంపికైంది. బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగే స్నాతకోత్సవంలో ఆమెకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బంగారు పతకాన్ని అందించనున్నారు.

సైనిక కుటుంబాల కోసం ఆర్థిక అక్షరాస్యత

సాక్షి, సిటీబ్యూరో: సీడీఎస్‌ఎల్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ (సిడిఎస్‌ఎల్ ఐపీఎఫ్) ఆధ్వర్యంలో సాయుధ దళాల అధికారులు , వారి కుటుంబాల కోసం పెట్టుబడి అవగాహన కార్యక్రమాలను నగరంలో నిర్వహించారు, ఎంపవరింగ్ అవర్ ప్రొటెక్టర్స్ కింద, సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్, బోయిన్‌పల్లి మిలిటరీ స్టేషన్, మెహిదీపట్నం మిలిటరీ ప్రాంతాల్లో వీటిని విజయవంతంగా నిర్వహించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో నిపుణులు మాట్లాడిన ముఖ్య అంశాల్లో సెక్యూరిటీల మార్కెట్ పరిచయం, పెట్టుబడి మోసం నుంచి రక్షణ ఉన్నాయన్నారు.

12న ఓబీసీల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్: దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 12న విజయవాడలో ఓబీసీల జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో దక్షిణ భారత బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సులో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళకు చెందిన వేలాది మంది ఓబీసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథులుగా నలుగురు కేంద్రమంత్రులు, వివిధ పార్టీలకు చెందిన 20 మంది పార్లమెంట్ సభ్యులు, మేధావులు, ప్రొఫెసర్లు పాల్గొంటారని తెలిపారు. అనంతరం హైదరాబాద్, బెంగుళూరు, తమిళనాడు, ఢిల్లీలో కూడా ఓబీసీల జాతీయ సదస్సులు నిర్వహించి సత్తా తెలియజేస్తామని అన్నారు. 1931లో బ్రిటీష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత మరే ప్రభుత్వం చేపట్టలేదని, కేంద్రంలోని బీజేపీ తొలిసారిగా జనగణనలో కులగుణన చేపట్టబోతున్నదని, ఇది దేశచరిత్రలో రికార్డు అని పేర్కొన్నారు. అన్ని కోణాలలో కులగణన తరువాత సమాజంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుందన్నారు. కేంద్రంలో బీసీ బడ్జెట్లో రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుజ్జ సత్యం, నాయకులు సి.రాజేందర్ ముదిరాజ్, భూపేష్ సాగర్, పగిళ్ళ సతీష్, మణికంఠ, చిక్కుడు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ విజయారెడ్డి ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా తిరుకల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఉదయం స్వామివారి తిరుకల్యాణ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన స్వామివారి గరుడ వాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అర్జున్ యాదవ్, ఈవో శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ఇప్పటికీ సమాజంలో అనేక కుల, మత, ఆర్థిపరమైన అనేక విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో కుల, మతాలకు అతీతంగా ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్ సినిమా చూడాలని తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. దివ్యవాణి సోషల్ కమ్యునికేషన్స్ ఆధ్వర్యంలో ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్ సినిమాపై విలేకరుల సమావేశం నిర్వహించి, ట్రైలర్ లాంచ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దీపక్ జాన్ మాట్లాడుతూ .. పేద, బడుగు, బలహీన వర్గాలకు నేటికీ అన్యాయం జరుగుతూనే ఉందని, వారు ఇంకా పేదరికంలోకి వెళ్తున్నారన్నారు. సంపన్నులు ఇంకా సంపాదిస్తున్నారని ఇలాంటి సమయంలో బడుగుల కోసం పనిచేసేది ఎవరు అనే విశయాన్ని ఈ చిత్రం చూపించిందన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యవాణి సోషల్ కమ్యునికేషన్స్ సీఈవో డాక్టర్ ఐ లూర్ధురాజ్ ఎస్‌జే, డిస్ట్రిబ్యూటర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు



సమావేశంలో పాల్గొన్న జయపాల్

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపాటి జైపాల్ సూచించారు.నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్ నేత ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన బూత్ కమిటీల ప్రతినిధులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీ ప్రతినిధులు అందించే సేవలు ఎంతో కీలకం బూత్‌కమిటీల ప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో నాగరాజు, సుందర్, మాలాకీ, మార్టిన్ పాల్గొన్నారు.

దహనవాటిక గద్దెలను ఆధునీకరిస్తాం

కాచిగూడ: హర్రాస్‌పెంట హిందూ శ్మశానవాటికలో దహనవాటిక గద్దెలను ఆధునీకరించనున్నట్లు శ్మశానవాటిక ట్రస్ట్ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. కాచిగూడలోని ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం ట్రస్ట్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశదిన కర్మలు చేసుకోవడానికి ప్రత్యేక హాల్స్ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం శ్మశానవాటిక అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులు స్పందించి నిధులు కేటాయించే విధంగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైభవంగా నవరాత్రి పూజలు



సరస్వతి దేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



సోమాజిగూడలోని జై మాతా అసోసియేషన్ ఆధ్వర్యంలో



పెన్నులు, పుస్తకాలు, పలకలతో అలంకరించిన దృశ్యం



దీన్‌దయాల్‌నగర్ బస్తీలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయాలతో పాటు ఆయా కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బంజారాహిల్స్‌లోని కనక దుర్గ ఆలయంతో పాటు విజయగణపతి ఆలయం, దైవసన్నిదానం, శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. పలు ఆలయాల్లో అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. - బంజారాహిల్స్



ఇందిరానగర్‌లోని రామకృష్ణ స్టేజీ వద్ద..



జై భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి వద్ద పూజలు



మాగంటి కాలనీలో

జమ్మి చెట్టును కాపాడుకోవాలి



జమ్మి మొక్క నాటుతున్న క్లబ్ సభ్యులు

పంజగుట్ట: ఊరి ఊరికో జమ్మిచెట్టు .. గుడి గుడికో జమ్మి చెట్టు కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జమ్మి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల నాయుడు మాట్లాడుతూ .. తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మిని ప్రతీ ఊరు, ప్రతీ గుడిలో నెలకొల్పేందుకు గ్రీన్ ఇండియా చాలెంజ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. వేద కాలంగా అత్యంత ప్రతిష్ఠ కలిగిన చెట్టుగా, భక్తి పూర్వకంగా అందరూ పూజించుకునే చెట్టుగా జమ్మిచెట్టును తెలంగాణ రాష్ట్ర వృక్షంగా గుర్తించారని, అనేక కారణాలతో అంతరించిపోతున్న ఈ చెట్టును కాపాడుకునేందుకు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, బాపూరావు, గర్రెపల్లి సతీష్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీ, సీపీఆర్‌పై శిక్షణ



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

బంజారాహిల్స్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అపోలో హాస్పిటల్స్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ.. యువతలో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని చిన్న వయస్సులోనే అవగాహన కల్పించడం అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ నేర్పడం సమాజానికి మేలు కలిగిస్తుందన్నారు. అపోలో హాస్పిటల్స్ తెలంగాణ రీజియన్ సీఈఓ తేజస్విరావు వీరపల్లి మాట్లాడుతూ.. చికిత్స మాత్రమే కాకుండా నివారణ, అవగాహన, ప్రాణ రక్షణ నైపుణ్యాలపై కూడా అపోలో కట్టుబడి ఉందన్నారు.

వీల్ చైర్ల వితరణ



బీరప్పకు వీల్ చైర్లను అందిస్తున్న శ్రీధర్

లక్డీకాపూల్: నిమ్స్ రేడియేషన్ అంకాలజీ విభాగానికి చెందిన ఉద్యోగి అప్పారి శ్రీధర్ తన పదవీ విరమణ సందర్భంగా ఆసుపత్రికి వీల్‌చైర్లు విరాళంగా అందజేశారు. నిమ్స్ కు వచ్చే రోగులకు ఉపయోగపడే విధంగా వీల్ చైర్లు ఇవ్వడం తనకు గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ..నిమ్స్ ఉద్యోగులకు శ్రీధర్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లక్ష్మీ భాస్కర్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్య గౌడ్, ఆర్ ఎం ఓ సయ్యద్.సల్మాన్, పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లను నిర్లక్ష్యం చేయొద్దు

వెంగళరావునగర్: కళ్లను నిర్లక్ష్యం చేయరాదని ఎలాంటి చిన్న సమస్య ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ సూచించారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధి వెంకటగిరి, శ్రీకృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేత్రదానం చేయడం వల్ల మనం చనిపోయిన తర్వాత కూడా వేరొకరి ద్వారా చూడగలుగుతామని అందుకే కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్లెం శ్రీనివాసరెడ్డి, లయన్ రాజశేఖర్, ఈఎల్ రామయ్య, కిరణ్, ఫిరోజ్‌ఖాన్, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న అంజన్‌కుమార్ యాదవ్

మాగంటి ఆశయాలను కొనసాగిస్తాం



చీరలు పంపిణీ చేస్తున్న సునీత

వెంగళరావునగర్: నిరంతరం ప్రజల కోసం పరితపించే మాగంటి గోపీనాథ్ ఆశయాలను కొనసాగించడానికి కృషి చేస్తానని దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి, సునీత పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని వెంకటగిరి, శ్రీకృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆమె బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆజా అలీ, మాగంటి అక్షర, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, సంతోష్, నర్సింగ్‌దాస్ పాల్గొన్నారు.

నియామకం



రవిశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న కాంగ్రెస్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (కేకేసీ) జాతీయ కోఆర్డినేటర్‌గా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి నియామకమయ్యారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఆదేశాల మేరకు చైర్మన్ డాక్టర్ ఉదిత్‌రాజ్ ఉత్తర్వులను అందించారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపునకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా సరస్వతీ దేవి పూజలు



సరస్వతీ దేవిలో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులు

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో ఉన్న శ్రీసాయిసరస్వతీ హైస్కూల్‌లో సోమవారం సరస్వతీ దేవి పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ శిరీష భవానీశంకర్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది తమ పాఠశాలలో సరస్వతీ దేవి పూజలు, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

పుస్తకాలు, పెన్నులు పంపిణీ

వెంగళరావునగర్: విద్యార్థులు చక్కగా చదువుకుంటే ఉన్నతస్థాయికి చేరుకుంటారని నవ్‌యువ సేవా సమితి నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్‌యాదవ్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ బస్తీలోని పోచమ్మ దేవాలయం వద్ద సోమవారం ఆయన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎవరూ చదువును మధ్యలో ఆపకూడదని సూచించారు. తొలుత సరస్వతీదేవి అవతారంలో ఉన్న దుర్గమాతకు ప్రత్యేక పూజలు చేశారు.



పుస్తకాలు అందజేస్తున్న నవీన్‌యాదవ్

డా. పత్తిపాటి ఉషారాణికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ పత్తిపాటి ఉషారాణి

శ్రీనగర్‌కాలనీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ–హైదరాబాద్ రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పత్తిపాటి ఉషారాణి అరుదైన అవార్డు అందుకున్నారు. తమిళనాడులోని కన్యాకుమారిలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగిన ఏడో అంతర్జాతీయ బయోపెస్టిసైడ్స్ సదస్సులో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే దిశగా ఆమె చేసిన అత్యుత్తమ శాస్త్రీయ కృషికి ఇండియన్ అకాడమీ ఆఫ్ బయోపెస్టిసైడ్స్ నుంచి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వార్గెసె చేతుల మీదుగా అందుకున్నారు. డాక్టర్ పత్తిపాటి ఉషారాణి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులను పొందారు. ఆమె తీసిన శాస్త్రీయ డాక్యుమెంటరీలకు నంది అవార్డును సైతం లభించింది.

బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి 'భాగ్యరెడ్డి వర్మ'

చిక్కడపల్లి: అంబేడ్కర్ కంటే ముందే దళితులపై జరుగుతున్న సామాజిక వివక్షపై భాగ్యరెడ్డి వర్మ పోరాడారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. త్యాగరాయ గానసభలో సోమవారం 'భాగ్యరెడ్డి వర్మ యాదిలో..'పేరుతో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన భాగయ్య తదుపరి కాలంలో రెడ్డిగా పేరు మార్చుకున్నారని తెలిపారు. దళితులను 'ఆది హిందూ'గా గుర్తించాలని ఉద్యమించారని అన్నారు. ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. విద్య మాత్రమే దళితులను ఉన్నతస్థాయికి తీసుకెళ్తుందని చాదర్‌ఘాట్ వద్ద 'ఆది హిందూ'భవన్‌ను స్థాపించారన్నారు. దీనిని కేంద్రంగా చేసుకుని 26 ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించి దళిత పిల్లలకు విద్యను చేరువ చేశారని పేర్కొన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం-2లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సాగర్ సొసైటీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



బతుకమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరం

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో బతుకమ్మ సంబరాలు సందడిగా నిర్వహించారు. సోమవారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, శ్రీనగర్ కాలనీ, పంజగుట్ట, గౌరీ శంకర్ కాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ, కృష్ణానగర్ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని సాగర్ సొసైటీ మైదానంలో ఖైరతాబాద్ బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

-ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ల బృందం



బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో..



గౌరీ శంకర్ కాలనీలో..



ఫిలింనగర్ బీజేఆర్ నగర్ బస్తీలో...



ఫిలింనగర్ పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో..



బతుకమ్మ వేడుకల్లో మాగంటి సునీత, దేదీప్య



బతుకమ్మలతో మహిళలు..

సాక్షి
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో దేనాదబ్రహ్మోత్సవ్–2025ను పురస్కరించుకుని సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులచే అన్నమాచార్య సంకీర్తనలతో నాదనైవేద్యం కార్యక్రమం జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా పేరిట స్వచ్ఛమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కెచ్చర్స్, స్టేకిడ్ స్టోరీస్, దీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ గఫార్‌ఖాన్ కాలనీలోని లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు ఖిజార్ స్కిల్స్ సోలో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో సర్బోజనిన్ దుర్గోత్సవ్–2025లో భాగంగా ఉదయం 11 నుంచి అష్టమి పూజ, పుష్పాంజలిలతోపాటుగా, ఫన్ అండ్ కల్చరల్ ఈవెంట్‌ను బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ నిర్వహిస్తుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

నేడు అంబేడ్కర్ వర్సిటీ స్నాతకోత్సవం

– ప్రజాకవి గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవం యూనివర్సిటీ క్యాంపస్ భవనంలోని వెంకట్రాం ఆడిటోరియంలో మంగళవారం(నేడు) ఉదయం 10 గంటలకు జరగనున్నది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొనున్నారు. పీహెచ్‌డీ పట్టాలు, బంగారు పతకాలు, బుక్ ప్రైజ్‌లు విద్యార్థులకు ప్రదానం చేస్తారు. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ (న్యూఢిల్లీ) ప్రొఫెసర్ ఉమా కాంజీలాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారు. అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి స్నాతకోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. ఈ స్నాతకోత్సవంలో ప్రఖ్యాత గేయ రచయిత, కవి గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ అందించనున్నారు. ప్రఖ్యాత శాంతి, విద్యా ప్రచారకులు, ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యకర విధానంలో పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను ప్రోత్సహించి, నేరాల శాతం తగ్గించడానికి కృషి చేస్తున్న ప్రముఖ రచయిత ప్రేమ్‌రావత్‌కు కూడా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా ఏడుగురు ట్రాన్స్‌జెండర్ విద్యార్థులు తమ డిగ్రీ పట్టాలు అందుకోనున్నారు. 55 మంది పీహెచ్‌డీ, ఇద్దరు ఎం.ఫిల్ విద్యార్థులు పట్టాలు అందుకోనున్నారు. ఈ స్నాతకోత్సవంలో మొత్తం 86 బంగారు పతకాలు (డిగ్రీ–35, పీజీ–51) అందజేస్తుండగా, ఇందులో మహిళలకు 67, పురుషులు 19 బంగారు పతకాలు అందుకున్నారు. 4 బుక్ ప్రైజ్‌లు ప్రదానం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవంలో అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 60,288 మంది అభ్యర్థులు డిగ్రీలు/ డిప్లొమాలు/ సర్టిఫికెట్లు అందుకోనున్నారు.

ఉత్సవం కాదు.. ఉద్యమం

మల్లాపూర్: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని, ఇది ఉత్సవం కాదు, అడవులను సంరక్షించే ఉద్యమమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. మల్లాపూర్ గోకుల్‌నగర్ కాలనీలో బహుజన బతుకమ్మ వేడకకు హాజరై ఆడి పాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రకృతి రక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పాడాలన్నారు. ప్రతి ఆడబిడ్డ అవసరమైనప్పుడు దేనినైనా ఎదిరిస్తాననే ధైర్యానికి గుర్తుగా బతుకమ్మతో రావాలని పిలుపునిచ్చారు. గోకుల్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో రాపోలు రాములు, మల్కయ్య, మల్లయ్య, రాజు, వీఎస్ఎస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటయ్య, లావణ్య, లక్ష్మీ, విజయ, పుష్పాలత, ఇందిర పాల్గొన్నారు.



నిన్న వరద.. నేడు బురద

ముంచెత్తిన మూసీతో చితికిన బతుకులు

ప్రభావిత కాలనీల్లో దుర్భర పరిస్థితులు	తడిసి ముద్దయిన నిత్యావసరాలు	సర్వం కోల్పోయి కన్నీటి పర్యంతం	తడిసిన సర్టిఫికెట్‌లు, గుర్తింపు కార్డులు

మూసీ వరద బాధితుల కన్నీటి వేదన



తడిసిన బట్టలు ఆరబెట్టుకుంటున్న బస్తీవాసులు

సాక్షి, సిటీబ్యూరో /చాదర్‌ఘాట్: మూసీ నదీపరీవాహక బస్తీల్లో వరద కాటేసింది. ఆనక ఇప్పుడు బురద మేటేసింది. పేదల కళ్లల్లో కన్నీటి సుడులు తిరుగుతున్నాయి. వరద ఉధృతి తగ్గడంతో నివాసాలకు చేరుకుంటున్న బాధితులు వరద బురదలో కూరుకుపోయిన సామగ్రిని చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. మూడు రోజుల క్రితం ఓ రోజు రాత్రిపూట ఒక్కసారిగా ముంచెత్తిన వరదనీటిలో ఇండ్లన్నీ మునిగిపోయాయి. భయకంపితులైన స్థానికులు, బస్తీల ప్రజలు కట్టుబట్టలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. కొందరు దూరంలో ఉన్న తమ బంధువుల ఇండ్లలో, మరి కొందరు పునరావాస కేంద్రాల్లో తల దాచుకున్నారు. ప్రవాహ ఉధృతి నుంచి తప్పించుకునిమిద్దెలెక్కి, మేడలెక్కి ప్రాణాలు కాపాడుకున్నారు.మసీదుల్లో తలదాచుకున్నారు. ఇప్పుడు మూసీ ఉగ్రరూపం తగ్గి సాధారణ పరిస్థితులు ఏర్పడటంతో బతుకుజీవుడా.. అంటూ తిరిగి బస్తీలోకి వచ్చి చూస్తే ఇండ్లలోని ఏ చిన్న వస్తువు కూడా పనికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దుస్తులు, బియ్యం, సరుకులు, నిత్యావసరాలు బురదలో కూరుకుపోయాయి. ఫ్యాన్‌లు, కూలర్లు, గ్యాస్ పొయ్యిలు, వంట సామగ్రి తడిసి ముద్ద అయ్యాయి. ఇంటి పైకప్పును తాకిన వరదనీరు సామగ్రినంతా పనికిరాకుండా చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బురదతో నిండిన ఇళ్లన్నీ ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధంతో నిండిపోయాయి. బాధితుల నిత్యజీవనం అత్యంత దయనీయంగా ఉంది. మూసీ పరీవాహక ప్రాంతాలైన మూసారాంబాగ్, మూసానగర్, శంకర్‌నగర్, అంబేడ్కర్ నగర్, వినాయకవీధి, కృష్ణానగర్ తదితర బస్తీల్లో ఎక్కడ చూసినా బురదమయమే. ముంచెత్తిన వరద భయం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతూ తమ ఇళ్లు, వాకిళ్లు కడుక్కుంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కదిలిస్తే కన్నీళ్లే..

మూసీ బాధితుల్లో ఎవరిని కదిలించినా కన్నీళ్లే. వరద కారణంగా సర్వస్వం కోల్పోయి బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తున్నారు. ఇంట్లో వస్తువులేవీ మిగలేదు. తమ బతుకెలా..? అంటూ రోదిస్తున్నారు. చిన్న, చిన్న పిల్లలతో ఎలా నెట్టుకురావాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు దిక్కెవరంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత వరద చూడలేదని స్థానికులు చెబుతున్నారు. వరద వచ్చినా రోడ్లపైకి పారేది తప్ప ఇళ్లల్లోకి వచ్చిన దాఖలాలే లేవని అంటున్నారు. వారిలో ఇంకా వరద భయం వీడలేదు. రాత్రిపూట ఒక్కసారిగా ఇళ్లల్లోకి నీళ్లు వచ్చేసరికి బయటకు రాలేని పరిస్థితి. చుట్టూ నీళ్లు.. ఎటు పోవాల్నో అర్థం కాలేదు. కట్టుబట్టలతోనే మూడురోజులుగా ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వరద ముంచెత్తి ఇండ్లన్నీ మునిగిపోవడంతో చదువుకునే చిన్నారుల పుస్తకాలన్నీ తడిసి ముద్దయ్యాయి. నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. రూ.వేలు వెచ్చించి తమ పిల్లలకు కొనిచ్చిన పుస్తకాలు నీటి పాలయ్యాయని తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటిలోంచి నీటిని, మట్టిని తోడుతున్న వరద బాధిత బస్తీవాసులు

ఒక్కసారిగా 26 గేట్లు ఎత్తడంతోనే...

జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎక్కువ సంఖ్యలో, ఎక్కువ ఎత్తు ఎత్తడటంతో ఒకేసారి మూసీలోకి వరద ప్రవాహం పెరిగింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు వరద హెచ్చరిక జారీ చేసినా.. ఒకేసారి రెండు జలాశయాల 26 గేట్లు సుమారు 9 అడుగులు ఎత్తి 36 వేల క్యూసెక్కులు నీరు వదలడంతో మూసీ ఉగ్రరూపం దాల్చింది. దీంతో క్షణాల్లోనే వరద తీవ్రత పెరిగి పరీవాహక ప్రాంతాలను ముంచెత్తింది.



తడిసిన సర్టిఫికెట్లు

కాలనీ రోడ్లను శుభ్రం చేస్తున్న జీహెచ్‌ఎంసీ

ముంపునకు గురైన కాలనీల రోడ్లపై ఉన్న బురదను తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు తమ సిబ్బందితో నడుంబిగించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది కాలనీల్లో పర్యటించి పరిస్థితిని గమనించారు. బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. లోతట్టు కాలనీల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అండగా ఉంటామని అధికారులు భరోసా ఇస్తున్నారు. లోతట్టు కాలనీల్లోని ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా కాలనీల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.



మలక్‌పేట్ లోతట్టు కాలనీలోని రోడ్డు దుస్థితి..

తక్షణ సహాయం అందించాలి



మూసీ వరదలో సర్వస్వం కోల్పోయాం. ఇళ్లు బురదమయమయ్యాయి. కోలుకునే వరకు నెల రోజులపాటు చేయూత అందించాలి.

–జితేందర్ యాదవ్, మూసానగర్

అన్నివిధాలా ఆదుకోవాలి



వరదల్లో నష్టపోయాం. ఇండ్లు కోల్పోయాం. పునరావాసం కల్పించాలి. ఇండ్లు కట్టించి ఇవ్వాలి. నిత్యవసర సరుకులు సమకూర్చాలి. పాడైన వస్తువులను వాడుకోలేం. కొత్తవి కావాలి.

–షహీద్, శంకర్‌నగర్



బ్రిడ్జికి మరమ్మతులు చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

మింట్ కాంపౌండ్‌లో ఇందిరమ్మ క్యాంటీన్ ప్రారంభం

గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 150 క్యాంటీన్లు



మింట్ కాంపౌండ్‌లో ఇందిరమ్మ క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం అల్పాహారం తీసుకుంటున్న మంత్రి పొన్నం తదితరులు

ఖైరతాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్‌ను ఖైరతాబాద్ డివిజన్‌లోని మింట్ కాంపౌండ్‌లో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గరీబీ హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు అప్పటి ప్రధాని ఇందిరమ్మ కృషి చేశారన్నారు. ప్రజల ఆశీస్సులతో ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 60 వేలకుపైగా రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించామన్నారు. ఇందిరమ్మ స్ఫూర్తితో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ క్యాంటీన్లు ప్రారంభించామని, ఇప్పటి నుంచి ఇక్కడ రూ.5కే అల్పాహారం కూడా లభిస్తుందన్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో 150 ఇందిరమ్మ క్యాంటీన్లు ప్రారంభించబోతున్నామని తెలిపారు. మహిళలను ప్రోత్సహిస్తూ స్వయం సహాయక సంఘాలకు క్యాంటీన్లు కేటాయిస్తామని తెలిపారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ మింట్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్ అందరికీ చేరువగా ఉందని, క్యాంటీన్ల నిర్వహణ బాధ్యలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, జోనల్ కమిషనర్‌లు హేమంత్ సహదేవ్ రావు, అనురాగ్ జయంతి, అదనపు కమిషనర్‌లు రఘుప్రసాద్, స్థానిక కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ రూపకల్పనలో వర్సిటీలు కీలకం

నీతి ఆయోగ్ గౌరవ వైస్ చైర్మన్ సుమన్ బేరి



హెచ్‌సీయూ ఎకనామిక్స్ కాంక్లేవ్‌లో మాట్లాడుతున్న సుమన్ బేరి. చిత్రంలో వీసీ ప్రొఫెసర్ బీజేరావు, ప్రొఫెసర్లు

రాయదుర్గం: దేశ భవిష్యత్తును రూపొందించడంలో విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో ముఖ్యమని నీతి ఆయోగ్ గౌరవ వైస్‌చైర్మన్ సుమన్ బేరి అన్నారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో 'షాక్స్, షిఫ్ట్స్ అండ్ స్ట్రాటజీస్: మ్యాపింగ్ ఇండియాస్ మైక్రో ఎకనామిక్స్ ఫ్యూచర్' అనే అంశంపై 6వ ఎకనామిక్స్ కాంక్లేవ్ రెండు రోజుల సమావేశాన్ని ఆయన ప్రారంభించి సోమవారం ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నిర్మాతలైనా విశ్వవిద్యాలయ విద్యార్థులు నూతన భారత ఆవిష్కరణలో కీలకపాత్ర పోషించాల్సి ఉందన్నారు. దేశం ఆర్థికంగా పరిపుష్టి చెందాలంటే మానవ వనరులు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. దేశంలో ఉన్న యువ జనాభా స్వయం సమృద్ధిని సాధించే దిశగా నవ కల్పనలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ప్రపంచ పెట్టుబడులు భారత్ వైపు రావాలంటే దేశంలో గుణాత్మకమైన మార్పుకు నాంది పలకాలని కోరారు. భారత ప్రభుత్వం యువత స్వయం సమృద్ధి కోసం అనేక కార్యక్రమాలకు పెద్ద పీట వేసిందన్నారు. హెచ్‌సీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన ఎకనామిక్స్ కాంక్లేవ్ లాంటివి వారి ఆలోచనలో కొత్తదనానికి, నూతన ఆవిష్కరణలకు నిదర్శనమని అన్నారు. స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ దేబాశీష్ ఆచార్య మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్సిటీలతోపాటు సమాజంలో వస్తున్న మార్పులను అవగాహన చేసుకొని నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకుడు చిట్టెడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దేశంలోని ఆర్థిక సమస్యలపై సరికొత్త ఆలోచనల కోసం ప్రయత్నిస్తుండటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డోంట్ మిస్ ఎ బీట్

– నిమ్స్‌లో 'వరల్డ్ హార్ట్ డే'ర్యాలీ



డోంట్ మిస్ ఎ బీట్ అంటూ నినాదాలు చేస్తున్న నిమ్స్ వైద్యులు

లక్డీకాపూల్: 'డోంట్ మిస్ ఎ బీట్'అన్న నినాదాలు నిమ్స్ ఆస్పత్రిలో హోరెత్తాయి. గుండెవ్యాధుల ముందస్తు గుర్తింపు, రెగ్యులర్ చెకప్‌లు, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. నిమ్స్‌లో కార్డియాలజీ నిపుణులు ప్రొఫెసర్ ఓ.సాయిసతీష్, డాక్టర్ ఎం.అమరేశ్‌రావు, ఆ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రామకుమారి నేతృత్వంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. 'డోంట్ మిస్ ఎ బీట్'అనే గ్లోబల్ థీమ్‌తో జరిగిన ఈ ర్యాలీ గుండె జబ్బులపై అవగాహన దిశగా సాగింది. డాక్టర్ రామకుమారి మాట్లాడుతూ హార్ట్ డిసీజ్ ఎప్పుడూ ముందుగానే హెచ్చరించదని, ఆ లక్షణాలను మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ఈ విషయంలో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ గుండె ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ రెగ్యులర్ చెకప్‌లు చేయించుకోవాలన్నారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. గుండెను సంరక్షించడంలో ఒక్క బీట్ కూడా మిస్ కాకూడదన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, స్క్రీన్ టైమ్ తగ్గించాలని, మైండ్‌ఫుల్‌నెస్, హాబీలు, కౌన్సెలింగ్ ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. ర్యాలీ ముగింపు సందర్భంగా హృదయ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించేందుకు సంకల్పం చేశారు. కుటుంబం, సమాజం, సోషల్ మీడియా వేదికల్లో గుండె ఆరోగ్య అవగాహనకు రాయబారులుగా నిలబడతామని పలువురు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాసులు, వైద్య, పారామెడికల్, ఫిజియోథెరపీ, విద్యార్థులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన సరస్ మేళా

స్టాల్స్ నిర్వాహకులను అభినందించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



స్టాల్స్ నిర్వాహకులకు ప్రశంసాపత్రాలు అందజేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క

మాదాపూర్: మహిళా స్వయం సహాయక బృందాల స్టాళ్లు చాలా బాగున్నాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. మాదాపూర్‌లోని ఇందిరామహిళా శక్తి బజార్‌లో నిర్వహిస్తున్న సరస్ మేళా– 2025 సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల స్ఫూర్తి , మార్కెటింగ్ ఇన్నోవేషన్‌కు సరస్ ఫెయిర్ అద్దం పడుతుందన్నారు. 20కిపైగా రాష్ట్రాల నుంచి వచ్చిన నిర్వాహకులు ఏర్పాటు చేసిన 150 స్టాల్స్ తమ ప్రత్యేకతను చాటుకున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలోని నకాషీ బొమ్మల నుంచి ఒడిశా పటచిత్రాల వరకు అన్నీ ఇక్కడ అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల స్టాల్స్ చాలా బాగున్నాయని, ఉద్యమంలా మహిళ సాధికారత ముందుకు సాగడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గతంలో పోచంపల్లిని సందర్శించానని, అక్కడ లభించేవి కేవలం చీరలు, దుస్తులు మాత్రమే కాదని, తెలంగాణ చరిత్ర, సంస్కృతి కూడా అని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన స్టాల్స్ నిర్వాహకులను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వెదురు బెడ్‌ల్యాంప్ స్టాండ్‌ను కొనుగోలు చేశారు. స్టాల్స్ నిర్వాహకులతో మాట్లాడి వ్యాపార విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల భరతనాట్య ప్రదర్శనను గవర్నర్ తిలకించారు. కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఉమెన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ పర్మిట్ ఫీజు మినహాయింపు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మకమైన సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మాణానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాచారంలోని సీఎస్ఐఆర్–ఐఐసీటీ, సీఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ (కేటగిరీ–1)కు జీహెచ్‌ఎంసీకి చెల్లించాల్సిన భవన నిర్మాణ అనుమతులు, ఇతర చార్జీల నుంచి మినహాయింపునిచ్చింది. ఈ మేరకు సంబంధిత మునిసిపల్ పరిపాలనశాఖ సెక్రటరీ కె.ఇలంబర్తి సోమవారం జీవో జారీ చేశారు. ప్రభుత్వం ప్రజలకు, విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత దృష్ట్యా ఈ సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు భవన నిర్మాణ అనుమతి, తదితర ఫీజుల నుంచి మినహాయింపు ఇవ్వాల్సిందిగా సీఎస్ఐఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అందుకనుగుణంగా ఎంట్రీ గేట్, గేట్ కాంప్లెక్స్, మెయిన్ సైన్స్ సెంటర్ నిర్మాణాలకు చెల్లించాల్సిన రూ.3,24,24,819 (లేబర్ సెస్ మినహా)లకు మినహాయింపునిచ్చింది.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ: కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఔన్నత్యానికి బతుకమ్మ పండగ ప్రతీక అని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై గౌరీపూజ నిర్వహించి మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ ప్రకృతితో ముడిపడి ఉన్న ఒక ప్రత్యేకమైన పూల పండగ అని, తెలంగా సామూహిక జీవన విధానానికి, ప్రజల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. బతుకమ్మలను అందంగా పేర్చిన మహిళా అధికారులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటాచారి, సీపీఓ డాక్టర్ సురేందర్, బీసీ సంక్షేమ అధికారి జి.ఆశన్న, వివిధ శాఖల మహిళా అధికారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బురద తొలగింపునకు కదిలిన హైడ్రా



సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాలకు మూసీ వరద నగరవాసులను ఆందోళనకు గురి చేసింది. ముఖ్యంగా మూసీ పరీవాహక నివాస ప్రాంతాలు ఖాళీ చేయాల్సి వచ్చింది. వర్షాలు తగ్గడంతో మూసీ నది ప్రవాహం తగ్గింది. కానీ, నీట మునిగిన కాలనీలో పెద్ద ఎత్తున చెత్తా చెదారంతోపాటు బురద, మట్టి, ఇసుక పేరుకుపోయాయి. వాటిని తొలగించే పనిని హైడ్రా ఆధీనంల్నో డీఆర్ఎఫ్ బృందాలు, ఇతర విభాగాలతో కలిసి ముమ్మరం చేసింది. చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ వంతెనలకు చేరువలో ఉన్న రసూల్‌పురా, మూసానగర్, శంకర్ నగర్, పద్మావతినగర్, ధోబీగల్లీతోపాటు పలు కాలనీల్లో బురదను హైడ్రా సోమవారం తొలగించింది. వరద ప్రవాహానికి కొట్టుకొచ్చిన చెత్తను అక్కడ నుంచి తరలించింది. ఈ పనిని డీఆర్ఎఫ్ బృందాలు మెట్ టీమ్స్‌తో కలిసి రెండు మూడు రోజులుగా చేస్తున్నాయి. చాలా వరకు పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. వంతెనల వద్ద పేరుకుపోయిన చెత్తను కూడా హైడ్రా తొలగించింది. బీఎస్ రెడ్డి నగర్, గాయత్రి నగర్‌లోని వరద కష్టాలను తొలగించడమే కాకుండా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టింది. హయత్‌నగర్‌లోని కమర్షియల్ టాక్స్ కాలనీలో బతుకమ్మ ఉత్సవాల కోసం పూలు తెచ్చేందుకు వెళ్లి సెప్టిక్ ట్యాంకులో పడి పోయి ప్రాణాలు కోల్పోయిన సూరకంటి అశోక్‌రెడ్డి మృతదేహాన్ని హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు బయటకు తీశాయి.

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా 92 ఫిర్యాదులు




ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కమిషనర్‌కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్ సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అర్జీదారులు ఒకే సమస్యపై పదేపదే వచ్చే పరిస్థితి కల్పించకుండా హెచ్‌ఓడీలు దానిని పరిష్కరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 37 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 21, ఇంజినీరింగ్ 7, ట్యాక్స్ సెక్షన్ 5, విజిలెన్స్, హెల్త్ అండ్ శానిటేషన్, యు.బి.డి, సీటీఓ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 55 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్‌పల్లి జోన్‌లో 28, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్‌లో 9 చొప్పున, చార్మినార్ జోన్ లో 5, ఎల్బీనగర్ జోన్ లో 4 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, సత్యనారాయణ, వేణుగోపాల్, అలివేలు మంగతాయారు, విజిలెన్స్ డీఎస్పీ నర్సింహారెడ్డి, హౌసింగ్ సీఈ నిత్యానంద, అడిషనల్ సీసీపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సులభంగా వంచగలిగే కొత్త పదార్థానికి రూపకల్పన

ఫలించిన ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, కేఏయూఎస్‌టీ పరిశోధకుల ప్రయత్నం



తక్కువ ఖర్చుతో వంచగలిగే కొత్త పదార్థం ఇదే..

రాయదుర్గం: హెల్త్‌కేర్, రోబోటిక్స్, వేరబుల్ సెన్సింగ్ అప్లికేషన్స్ కోసం తక్కువ వ్యయంతో వంచగలిగే కొత్త పదార్థానికి రూపకల్పన చేశారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, కింగ్ అబ్దుల్లా యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(కేఏయూఎస్‌టీ)ల పరిశోధక బృందం సంయుక్తంగా ఈ పదార్థానికి రూపకల్పన చేయడం విశేషం. ఈ విషయాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. తక్కువ వ్యయంతో కూడిన అధిక సున్నితత్వం కలిగిన హెల్త్‌కేర్, రోబోటిక్స్, వేరబుల్ పరికరాల అప్లికేషన్లతో ఉపయోగించిన పెద్ద ప్రాంతపు వంచగలిగే డై ఎలెక్ట్రిక్ పదార్థాలను అభివృద్ధి చేశారు. ఇవి కెపాసిటివ్ ప్రెజర్ సెన్సర్లుగా పని చేస్తాయని పరిశోధకులు వివరించారు. ఐఈఈఈ జర్నల్ ఆన్ ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్‌లో ప్రచురించబడిన ఈ అధ్యయనం బబుల్–ఇండ్యూస్డ్ పీడీఎంఎస్ ఫోమ్‌ను కండక్టివ్ టెక్స్‌టైల్ ఎలక్ట్రోడ్స్‌తో కలిసి విశ్వసనీయమైన, విస్తరించగలిగే ప్రెజర్ సెన్సర్లను ఎలా తయారు చేయవచ్చో చూపించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆఫ్తాబ్ ఎం హుస్సేన్ మాట్లాడుతూ ఇది హెల్త్‌కేర్, అసిస్టివ్ టెక్నాలజీల కోసం చవకైన అనుకూల పదార్థాలను రూపొందించే అవకాశాలను తెరుస్తుందన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్‌, మంగళవారం,
30, సెప్టెంబర్‌, 2025



దుర్గమ్మ సన్నిధి.. కళల పెన్నిధి..

అబ్బురపరుస్తున్న మండపాల అలంకరణలు

- నగరంలో నవరాత్రి ఉత్సవాల వేదికల వైభవం
- ఆకట్టుకుంటున్న పలు మండపాల థీమ్స్‌
- రూపకల్పనలో ఆర్టిస్టుల క్రియేటివిటీకి పదును
- వేర్వేరు ప్రాంతాల నుంచి చేతివృత్తుల కళాకారుల రాక
- సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్న మోడళ్లు



దసరా అంటేనే సరదాగా సాగే పండుగ. ప్రకృతితో మమేకమయ్యే పలు అలంకరణలు, అమ్మవారి దశావతారాలు, బతుకమ్మ ఏర్పాట్లు ఇలా చెప్పుకుంటూ పోతే భక్తిని పెంచేది మాత్రమే కాదు చక్కని సందేశాన్ని పంచేది అంటున్నారు నగరానికి చెందిన పలువురు పండితులు. దీంతో పాటు అమ్మవారి మండపాల నిర్వాహకులు వైవిధ్యభరితంగా ఏర్పాటు చేసిన అలంకరణలతో అమ్మవారి రూపం మొదలు మండప నిర్మాణం వరకూ కాదేదీ కళాకృతులకు, సృజనకు అనర్హం అన్నట్టుగా తీర్చిదిద్దుతున్నారు. నెలల తరబడి వ్యయ ప్రయాసలకోర్చి రూపుదిద్దుకున్న ఈ అలంకరణలు సందర్శకులను, భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

నార్సింగిలోని కేవీఎంఆర్‌ ప్రైడ్‌ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మండపం వేర్వేరు ప్రాంతాల కళల సమ్మేళనంగా రూపుదిద్దుకుంది. బిహార్‌కు చెందిన సంప్రదాయ కళారూపం మధుబని, గుజరాత్, రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతాల నుంచి వచ్చిన సంప్రదాయ మిడ్‌–మిర్రర్‌ ఆర్ట్‌ లిప్పన్‌ శైలిని కలగలిపి విశిష్ట కళా స్వరూపంగా దుర్గా పూజ మండపాన్ని తీర్చిదిద్దారు. దీని కోసం మణికొండలోని ఒక ఇంటిని నెలన్నర రోజుల పాటు ఆర్ట్‌ స్టూడియోగా మార్చారు. అక్కడ బెంగాలీ సామాజిక–సాంస్కృతిక సంస్థ అయిన ఉత్తరాయణ బంగియా సమితికి చెందిన నిపుణులు విద్యార్థులతో కూడిన తొమ్మిది మంది బృందం నిర్విరామంగా పనిచేసింది. ‘మా పంజికా (బెంగాలీ జ్యోతిష్య శాస్త్ర క్యాలెండర్‌) ప్రకారం, ఈ సంవత్సరం దుర్గామాత వాహనం ఏనుగు కాబట్టి థర్మాకోల్‌ ఉపయోగించి ఏనుగుల తోరణన్ని (ద్వారం) రూపొందించాం’ అని బృందానికి సారథ్యం వహించిన ఉపాధ్యాయుడు కుంతల్‌ చెప్పారు. హఫీజ్‌పేట నుంచి సేకరించిన రీసైకిల్‌ కలపతో తయారు చేసిన ఈ నిర్మాణంలో మధుబని శైలిలో రంగురంగుల యాక్రిలిక్‌ గోడ చిత్రాలు ఉంటాయి. ఈ మండపం పర్యావరణ అనుకూల సందేశాన్ని కూడా కలిగి ఉంది. ‘మేం వ్యర్థాలుగా మారని పదార్థాలను మాత్రమే ఉపయోగిస్తాము. ఈ ఉత్సవాల తర్వాత ఇంటి అలంకరణకు కూడా వీటిని ఉపయోగించుకోవచ్చు’ అని కుంతల్‌ వివరించాడు.




పటచిత్రానికి పూర్వవైభవం..

మియాపూర్‌లోని సైబరాబాద్‌ బెంగాలి అసోసియేషన్‌ 18వ సంవత్సరం దుర్గామాత వేడుకలను సృజనాత్మకంగా నిర్వహిస్తోంది. వెదురు, జనపనార, వస్త్రం ఉపయోగించి నిర్మించిన మండపం శతాబ్దాల నాటి బెంగాల్‌ కళా శైలి ‘పట్టచిత్రం’ థీమ్‌తో రూపొందింది. (చేతితో చిత్రించిన స్క్రోల్‌ల ద్వారా సంక్లిష్టమైన కథ చెప్పడానికి ఇదో శక్తివంతమైన సాధనం ప్రసిద్ధి చెందిన జానపద కళారూప పటచిత్రం).

సామాజిక బాధ్యతగా..

సంప్రదాయం, కళలను సామాజిక బాధ్యతగా మిళితం చేసే థీమ్‌తో, ఈ సంవత్సరం దుర్గామాత విగ్రహం వెదురు, జనపనార, బంకమట్టితో తయారు చేశామని అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి సుబ్రో ముఖర్జీ చెప్పారు. ‘చీర, ఇతర దేవతల దుస్తులు, ఇతర ఆభరణాలన్నీ మట్టితో తయారు చేశారు. బయో డీగ్రేడబుల్, స్థానికంగా లభించే పదార్థాలను ఉపయోగించారు. ‘బెంగాల్‌ పటచిత్రను తెరపైకి తీసుకురావడం ద్వారా మరుగునపడుతున్న కళారూపంపై ఆసక్తిని పునరుద్ధరించాలని, యువతకు దీనిని పరిచయం చేయాలని భావించాం’ అంటున్నారు సుబ్రో.





ఆకట్టుకునేలా ఉత్సవాలు..

ఇవే కాకుండా నగరంలో పలు చోట్ల ఉత్సవాలు ఆకట్టుకునేలా నిర్వహిస్తున్నారు. బంగ్రియా సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో కీస్‌ హైస్కూల్లో, హైదరాబాదీ బంగాలీ సమితి నేతృత్వంలో ఎన్టీఆర్‌ స్టేడియంలో, బెంగాలీ సాంస్కృతిక సంఘం సారథ్యంలో బంజారా ఫంక్షన్‌ హాల్లో, హైదరాబాద్‌ కలిబిరి సైనిక్‌పురిలో నిర్వహిస్తున్న ఉత్సవాలు, నార్సింగిలోని ఆరోహణ్‌ దుర్గా పూజ, బోయినపల్లిలోని బంగియా శిక్షానికేతన్‌లో.. ఇలా పలు చోట్ల ఏర్పాటైన ఉత్సవ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.



శాంతి రూపిణిగా..



ఇక్కడ అమ్మవారి విగ్రహం శాంతి రూపిణిగా రూపొందించడం విశేషం. గచ్చిబౌలిలోని ఉత్సాబ్‌ కల్చరల్‌ అసోసియేషన్‌ మండపం కూడా వెదురు, వస్త్రంతో తయారు చేసిన ఒక వినూత్న శైలిలో రూపొందింది. ‘వృత్తి నిపుణులైన కళాకారులకు బదులుగా, కళ పట్ల మక్కువ ఉన్న సంస్థ సభ్యులే డిజైన్లను రూపొందించే పనిని నిర్వర్తించారు’ అని అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు క్రిషేందు రాయ్‌ చెబుతున్నారు. ఈ సంవత్సరం, సభ్యులు సులగ్న దాస్, శబరి చక్రవర్తి వెదురు, వస్త్రంపై అల్పోనా మోటిఫ్‌లు, మట్టి దీపాలను ఉపయోగించి 40 అడుగుల వెడల్పు, 80 అడుగుల పొడవు, 16 అడుగుల ఎత్తులో పర్యావరణ అనుకూల మండపాన్ని ఏర్పాటు చేశారు. ‘అల్పోనా మోటిఫ్‌లు శుభం, శ్రేయస్సు సంతానోత్పత్తిని సూచిస్తుండగా, దీపాలు చీకటిపై కాంతి విజయాన్ని దుర్గామాత నుంచి మనం కోరుకునే దైవిక మార్గదర్శకత్వాన్ని సూచిస్తాయి’ అని సులగ్న, శబరి అంటున్నారు.

ఆకట్టుకున్న ‘భక్తి శక్తి’

గన్‌ఫౌండ్రీ: నవరాత్రుల అర్థాన్ని బెంగళూరుకు చెందిన కూచిపూడి కళాకారులు నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. రవీంద్ర భారతిలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న సంగీత నృత్యోత్సవాలు–బతుకమ్మ సంబరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు నాట్య గురువు వీణా మూర్తి విజయ్‌ శిష్య బృందం భక్తి శక్తి పేరిట ప్రదర్శించిన కూచిపూడి దృశ్యాంశాలు వీక్షకులను సమ్మోహన పరిచాయి. పవిత్ర జలం, రంగోలి, ధూపం, దీపం, జాగ్రాలతో వేదికను శుద్ధి చేసే నృత్యం ఆసక్తికరంగా సాగింది. అదేవిధంగా నర్తకి శ్యామక్రిష్ణ, జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నవదుర్గ తోలుబొమ్మలాట ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ అలేఖ్య పుంజాల, ఆర్‌ వినోద్‌ కుమార్‌ పలువురు కళాకారులు పాల్గొన్నారు.





విదేశీ పూలతో వింతగా..

తెలంగాణలోనే అత్యంత ఖరీదైన బతుకమ్మను పేర్చి కూకట్‌పల్లికి చెందిన పలువురు అబ్బురపరుస్తున్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లికి చెందిన గుండాల అర్చన విదేశాల నుంచి పూలను తెప్పించి గత మూడేళ్లుగా వింతగా బతుకమ్మను పేరుస్తున్నారు. మొదట తామర పువ్వు ఆకారంలోనూ, రెండో ఏడాది హంస ఆకారంలోనూ, ఈ ఏడాది ఏనుగు బొమ్మలతో కూడిన బతుకమ్మను పేర్చి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈసారి బతుకమ్మ కోసం థాయిలాండ్‌ ఆర్చిడ్స్, సింగపూర్‌ రోజెస్, బ్యాంకాక్‌ కాచెస్స్, బెంగళూరు బెజస్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ నుంచి జిప్సోమియా పూలను తెప్పించినట్లు చెబుతున్నారు.

– కూకట్‌పల్లి

నగరంలో చోటా భీమ్‌ థీమ్‌ కేఫ్‌

2026 నాటికి దేశవ్యాప్తంగా 300 పాయింట్ల లక్ష్యం



సనత్‌నగర్‌: దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన యానిమేషన్‌ పాత్ర చోటాభీమ్‌ ఆధారంగా రూపొందించిన తొలి థీమ్‌ కేఫ్‌ నగరంలో ప్రారంభం కానుంది. ప్రముఖ యానిమేషన్‌ సంస్థ గ్రీన్‌గోల్డ్‌ ఈబీజీ గ్రూపుతో కలిసి ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. చోటభీమ్‌ థీమ్‌ కేఫ్‌లో కథలు చెప్పడం, ఆటలు, ఆహారం, లైసెన్స్‌డ్‌ మెర్చండైజ్‌తో పాటు వినోదాన్ని పంచేలా ఎన్నో అంశాలు ఈ థీమ్‌ కేఫ్‌లో మిళితమై ఉంటాయి. బేగంపేటలోని తాజ్‌వివంతాలో సంస్థ వ్యవస్థాపకులు రాజీవ్‌ చిలక, హరికిరణ్‌ సోమవారం వెల్లడించారు. చోటాభీమ్, చుట్కీ, మైటీరాజు పాత్రలతో ఇంటరాక్టివ్‌ ప్లే జోన్లతో థీమ్‌ కేఫ్‌లు ఏర్పాటుచేస్తామన్నారు. పిల్లలతో గడిపేందుకు ప్రత్యేకంగా ఈ థీమ్‌ డిజైన్‌ చేసినట్లు తెలిపారు. డిసెంబర్‌ నాటికి హైటెక్స్‌లో రెండు అవుట్‌లెట్లు, 2026 నాటికి 50 అవుట్‌లెట్లు, మరో దశలో 300 కేఫ్‌లు దేశవ్యాప్తంగా విస్తరించాలని లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు.

వ్యర్థాలతో వండర్స్‌..

ఆ చిన్నారి వయసు ఐదేళ్లు.. అయితేనేం పనికిరాని వ్యర్థాలతో అద్భుతాలు సృష్టించింది.. బుజ్జి మెదడుకు పదును పెట్టి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సేవాతత్పరత, సామాజిక బాధ్యతను ఒంటబట్టించుకుంది. అనాథ పిల్లల కోసం వారు చేస్తున్న సేవలో తన పాత్రను గుర్తించి వ్యర్థాలతో చిన్నారులకు బట్టలు తయారుచేసింది. ఇంటర్నేషనల్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది.

– కుషాయిగూడ

- అద్భుతాలు సృష్టించిన చిన్నారి అవినా
- ఐదేళ్ల వయసులోనే అరుదైన ఘనత
- ఇంటర్నేషనల్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో చోటు





ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో తయారు చేసిన దుస్తులలో అవినా

కాప్రా సాకేత్‌కు చెందిన పొట్టపాటి ప్రవీణ్‌కుమార్‌ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి. భార్య తేజస్విని సోషల్‌ వర్కర్‌గా పనిచేస్తున్నారు. వీరి ఐదేళ్ల కుమార్తె అవినా పొట్టపాటి బిల్లబాంగ్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్లో యూకేజీ చదువుతోంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే తల్లిదండ్రులతో పాటుగా అవినా కూడ తరచూ వారితో కలిసి వెళ్లేది. ఈ క్రమంలో తన వయసున్న తోటి పిల్లలకు సరైన దుస్తులు లేకపోవడం, చెప్పులు లేకపోవడం గమనించింది. వారికి తనవంతుగా ఎమైనా సాయం చేయాలనే తలంపుతో వ్యర్థాలతో దుస్తులు తయారు చేయడం మొదలుపెట్టింది. మూడేళ్ల వయసు నుంచే ఇంట్లో ప్లాసిక్‌ బ్యాగులు, ప్లాస్టిక్‌ కవర్లు, పేపర్‌ బ్యాగులతో దుస్తులు, చెప్పులు వంటి వస్తువులను తయారు చేయడం ప్రారంభించింది.

కుమార్తె ఆసక్తిని గమనించి..

చిన్నారి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు అవినాను ప్రోత్సహించారు. ఆమె మేధస్సుకు పదును పెట్టి ప్లాస్టిక్‌ వ్యర్థాలతో పలు రకాల దుస్తులను తయారు చేసింది. తమ కూతురు ప్రతిభకు గుర్తింపు ఇవ్వాలనే కోరిక వ్యర్థాలతో తయారు చేసిన దుస్తులను ఇంటర్నేషనల్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌కి పంపించారు. పలుమార్లు చేసిన ప్రయత్నం ఫలించి ఎట్టకేలకు ఇంటర్నేషనల్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ నుంచి ఆహ్వానం పొందారు. చిన్నారి అవినా అందరి సమక్షంలో ప్లాస్టిక్, పేపర్‌ వ్యర్థాలతో 7 రకాల అందమైన దుస్తులను తయారు ఆశ్చర్యపరించింది. అవినా సృజనను ప్రశంసిస్తూ ఆమెకు ఇంటర్నేషనల్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు.



చాలా గర్వంగా ఉంది..

అతి చిన్న వయసులో మా కుమార్తె ఇలాంటి రికార్డు దక్కించుకోవడం సంతోషంగా ఉంది. మూడేళ్ల వయసు నుంచే వ్యర్థాలతో ఏదో ఒకటి తయారు చేస్తూ ఉండేది. ఆ ఆసక్తిని గమనించి ప్రోత్సహించాం. తన ప్రతిభను గుర్తించి ఇంటర్నేషనల్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు. అవినా ప్రతిభ పర్యావరణ పరిరక్షణకు దోహదం చేయడం సంతోషం కలిగించింది.

– పొట్టపాటి ప్రవీణ్‌కుమార్, తేజస్విని దంపతులు (తల్లిదండ్రులు)

రొమ్ము కేన్సర్‌పై అవగాహనకు.. థాంక్స్‌ ఏ డాట్‌..

సాక్షి, సిటీబ్యూరో : రొమ్ము కేన్సర్‌ పై అవగాహన పెంచేందుకు మన దేశపు ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన ఎస్‌బీఐ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ భారత క్రికెట్‌ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో కలిసి సంయుక్తంగా ‘థాంక్స్‌ ఏ డాట్‌’ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. దీనిలో భాగంగా భారత మహిళా క్రికెట్‌ జట్టు థాంక్స్‌–ఎ–డాట్‌ లోగోతో, గులాబీ రంగు జెర్సీలతో క్రీడా మైదానంలో కనిపిస్తున్నారని ఇరు సంస్థల ప్రతినిధులు తెలిపారు. మహిళలకు, మరీ ముఖ్యంగా యువతకు దీనిపై అవగాహన పెంచడం, సకాలంలో జాగ్రత్తలు తీసుకునేలా ప్రోత్సహించడం, రొమ్ము కేన్సర్‌ గురించి లివింగ్‌ రూమ్‌ సంభాషణలను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యమని తెలిపారు.



ఫోరం మాల్లో రితిక సందడి..

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలో ఫోరంమాల్లో మిరాయ్‌ సినిమా హీరోయిన్‌ రితిక నాయక్‌ సోమవారం సందడి చేశారు. ఓ జ్యూవెలరీ షోరూం ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అథిగా హాజరయ్యారు. వినియోగదారులకు అందుబాటు ధరల్లో, ఆకర్షణీయమైన డిజైన్లను అందించేదుకు కేపీహెచ్‌బీలో మొదటి షోరూం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రలో రెండు షోరూమ్స్‌ ఉండగా, తెలంగాణలో ఇదే మొదటిదని, స్వచ్ఛమైన బంగారంతో పాటు వినియోగదారులు మెచ్చిన డిజైన్‌లో రాగి ఆభరణాలు చేసి వాటిపై 24 క్యారెట్స్‌ గోల్డ్‌ షీట్‌ అంటించడం తమ ప్రత్యేకతని వెల్లడించారు. తమ ఆభరణాల నాణ్యత, నిర్వహణ కూడా సులభమని నాలుగు తరాలు అయినా అవి అలానే ఉంటాయని, ఇది తమ భరోసా అని వెల్లడించారు.



ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్‌కు రజత పతకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ యువ షూటర్ ముకేశ్ నేలవల్లి రజత పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన జూనియర్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో 20 ఏళ్ల ముకేశ్ రెండో స్థానంలో నిలిచాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ ఫైనల్లో 'షూట్ ఆఫ్'లో స్వర్ణ పతకాన్ని చేజార్చుకున్నాడు. నిర్ణీత ఏడు రౌండ్ల తర్వాత అలెగ్జాండర్ కొవాలెవ్ (రష్యా), ముకేశ్ 27 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచారు. విజేతను తేల్చేందుకు 'షూట్ ఆఫ్' నిర్వహించగా... కొవాలెవ్ మూడు పాయింట్లు స్కోరు చేసి స్వర్ణం దక్కించుకోగా... ముకేశ్ ఒక పాయింట్ సాధించి రజతం గెల్చుకున్నాడు. భారత్‌కే చెందిన సూరజ్ శర్మ 21 పాయింట్లతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. జూనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్లు ఓజస్వి ఠాకూర్ (252.7 పాయింట్లు) స్వర్ణం, కొండూర్ హృదయశ్రీ (250.2 పాయింట్లు) రజతం, శాంభవి (229.4 పాయింట్లు) కాంస్యం నెగ్గి క్లీన్ స్వీప్ చేశారు. జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్లు హిమాన్షు (250.9 పాయింట్లు) స్వర్ణం, అభినవ్ షా (228.4 పాయింట్లు) కాంస్యం నెగ్గారు. ప్రస్తుతం భారత్ 20 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో కొనసాగుతోంది.

'మా ఆటగాళ్లంతా ఒక్కో ట్రోఫీతో సమానం'

- కప్ లేకపోయినా మా విజయం విలువ తగ్గదు
- భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వ్యాఖ్య



దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీలో విజేతగా నిలిచిన తర్వాత జరిగిన అనూహ్య పరిణామాలపై భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పందించాడు. చాంపియన్ టీమ్‌కు ట్రోఫీ ఇవ్వకుండా నిలిపివేసిన ఘటన గతంలో ఎన్నడూ చూడలేదని అతను అన్నాడు. అయితే తాము ఈ విషయాన్ని పట్టించుకోమని, ట్రోఫీ లేకపోవడం వల్ల తమ విజయం విలువ ఏమాత్రం తగ్గదని సూర్య వ్యాఖ్యానించాడు. 'ఒక క్రికెట్ అభిమానిగా, ఆపై ఆటగాడిగా ఇలాంటి ఘటనను ఎప్పుడూ చూడలేదు. ఎంతో కష్టపడి విజేతగా నిలిచి సంపాదించిన ట్రోఫీని ఆటగాళ్లకు ఇవ్వకపోవడం ఏమిటి? దానిని అందుకునేందుకు మాకు పూర్తి అర్హత ఉంది. అయితే ట్రోఫీల గురించే మాట్లాడాల్సి వస్తే మా డ్రెస్సింగ్‌రూమ్‌లోనే ఇలాంటి 14 ట్రోఫీలు ఉన్నాయి. ఈ ఆసియా కప్ గెలుపు ప్రయాణంలో మా ఒక్కో ఆటగాడు, సహాయక సిబ్బంది ఒక్కో ట్రోఫీతో సమానం. పాకిస్తానీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించరాదనే విషయం మాకు ఎవరూ చెప్పలేదు. మా జట్టు సభ్యులంతా మైదానంలో కలిసి తీసుకున్న నిర్ణయమిది' అని సూర్యకుమార్ స్పష్టం చేశాడు. మరోవైపు పహల్గాం దాడిలో మృతి చెందిన కుటుంబాల సంక్షేమం కోసం తాను ఆసియా కప్‌లో 7 మ్యాచ్‌ల ద్వారా అందుకున్న మ్యాచ్ ఫీజు మొత్తాన్ని (రూ. 28 లక్షలు) విరాళంగా ఇస్తున్నట్లు సూర్యకుమార్ ప్రకటించాడు.

నఖ్వీ తీసుకెళ్లిపోయాడు!

ఫైనల్ ముగిసిన తర్వాత బహుమతి ప్రదానోత్సవానికి వేదికను ఏర్పాటు చేశారు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడు, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్, పాకిస్తాన్ ప్రభుత్వంలో అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి కూడా అయిన మొహసిన్ నఖ్వీ అక్కడే ఉన్నాడు. అయితే పహల్గాం దాడి సమయంలో నఖ్వీ సోషల్ మీడియాలో భారత్‌కు వ్యతిరేకంగా పలు వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడి చేతుల మీదుగా ట్రోఫీని అందుకోబోమని భారత జట్టు ముందే ఏసీసీకి సమాచారం అందించింది. దాంతో ప్రత్యామ్నాయంగా వేదికపై ఉన్న ఇతర అధికారుల నుంచి అందించవచ్చని నిర్వాహకులు భావించారు. అయితే నఖ్వీ వేదికపై ఉన్నంత సేపు తాము అక్కడికి వెళ్లమని భారత్ స్పష్టం చేసింది. అయితే నిబంధనల ప్రకారం ఏసీసీ అధ్యక్షుడి హోదాలో తానే ట్రోఫీ ఇస్తానంటూ నఖ్వీ మొండితనం ప్రదర్శించాడు. దాంతో చివరకు భారత్ కప్ అందుకోకుండానే కార్యక్రమం ముగిసింది. అయితే ఆశ్చర్యకరంగా, ఎవరూ ఊహించని విధంగా నఖ్వీ సన్నిహితులు కొందరు అక్కడ ఉన్న ఆసియా కప్ ట్రోఫీని తమతో పాటు తీసుకెళ్లిపోయారు. అనంతరం భారత జట్టు మొత్తం వేదిక వద్ద చేరి ఊహాత్మకంగా ట్రోఫీ చేతిలో ఉన్నట్లుగా నటిస్తూ సంబరాలు చేసుకుంది.

బీసీసీఐ ఆగ్రహం...

నఖ్వీ ప్రవర్తనపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'నఖ్వీ పాకిస్తాన్ రాజకీయ నాయకుడు కూడా. అందుకే ఆయన నుంచి ట్రోఫీ తీసుకోవద్దని భారత్ నిర్ణయించింది. కానీ ఆయన తనతో పాటు ట్రోఫీని, పతకాలను కూడా తీసుకెళ్లమని దానర్థం కాదు. అవన్నీ వీలైనంత త్వరగా భారత్‌కు వస్తాయని నమ్ముతున్నాం. నవంబరులో జరిగే ఐసీసీ సమావేశంలో ఏసీసీ అధ్యక్షుడి ప్రవర్తనపై మేం చాలా గట్టిగా నిరసన వ్యక్తం చేయనున్నాం' అని సైకియా వెల్లడించారు. మరోవైపు టోర్నీలో భారత జట్టు ప్రవర్తన క్రికెట్‌ను అగౌరవపర్చినట్లుగా ఉందని పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా అన్నాడు. టోర్నీ ఆరంభానికి ముందు వేర్వేరు సందర్భాల్లో తనతో కరచాలనం చేసిన సూర్యకుమార్... జనం మధ్యలోకి వచ్చేసరికి మాత్రం షేక్ హ్యాండ్ ఇవ్వలేదని సల్మాన్ విమర్శించాడు.

తిలక్ వర్మకు ఘన స్వాగతం...



అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ సోమవారం రాత్రి నగరానికి తిరిగొచ్చాడు. శంషాబాద్ విమానాశ్రయంలో అతనికి అభిమానులు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారుల నుంచి ఘన స్వాగతం లభించింది. 'నేను క్రీజ్‌లోకి వచ్చిన సమయంలో పాకిస్తాన్ ఆటగాళ్లు ఎన్నో వ్యాఖ్యలు చేశారు. అయితే నా బ్యాట్‌తోనే వారికి సమాధానం చెప్పాలని భావించా. అనుకున్నట్లుగానే చెలరేగిపోయా. నా ఆట తర్వాత మైదానంలో వారెవరూ కనిపించలేదు. మరో మాట అనే అవకాశం వారికి లేకుండా పోయింది. స్టేడియంలో అభిమానులు వందేమాతరంతో హోరెత్తించడంతో మరింత కసిగా చెలరేగిపోయా' అని తిలక్ మ్యాచ్ తర్వాత వ్యాఖ్యానించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీతో 8 జట్ల కెప్టెన్‌లు

ప్రపంచకప్ వేటకు వేళాయె...

సొంతగడ్డపై భారత మహిళల జట్టు వన్డే ప్రపంచకప్ వేటకు సిద్ధమైంది. ఇంటా బయటా ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన మహిళల జట్టుకు ఐసీసీ ప్రపంచకప్ వెలితిగానే ఉంది. 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు సొంతగడ్డపై జరిగే మెగా ఈవెంట్‌లో తెరదించాలని క్రికెట్ అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో రెండుసార్లు ఫైనల్ చేరినా టీమిండియాకు నిరాశ తప్పలేదు. కానీ అప్పటికీ ఇప్పటికీ భారత మహిళల జట్టు ఎంతో మారింది. ప్రపంచకప్‌ను గెలిచే సత్తా కలిగి ఉంది.

నేటి నుంచి మహిళల వన్డే వరల్డ్‌కప్

- తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ 'ఢీ'
- బరిలో 8 జట్లు
- ఫైనల్ నవంబర్ 2న
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

గువాహటి: దశాబ్దాలుగా అందని ద్రాక్షగా ఉన్న ఐసీసీ ప్రపంచకప్‌ను ఎలాగైనా ఈసారి అందుకోవడమే లక్ష్యంగా భారత మహిళల జట్టు బరిలోకి దిగుతోంది. వన్డే ప్రపంచకప్‌లో నేడు తొలి మ్యాచ్ ఆతిథ్య దేశాలు భారత్, శ్రీలంకల మధ్య ఇక్కడ జరుగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం సొంతగడ్డ అనుకూలతల్ని వినియోగించుకొని మెగా ఈవెంట్‌లో రాణించాలనే పట్టుదలతో ఉంది. ఇటీవల పరిమిత ఓవర్ల ఫార్మాట్ ఫామ్ కూడా భారత జట్టులో కొండంత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. భారత్ పటిష్టమైన ప్రత్యర్థే కాదు... టైటిల్ ఫేవరెట్లలో ఒకటని కచ్చితంగా చెప్పొచ్చు.

ఫామ్‌లో స్మృతి మంధాన

భారత వైస్‌కెప్టెన్ స్మృతి మంధాన జోరు మీదుంది. ఇది జట్టుకు బాగా కలిసొచ్చే అంశం. టాపార్డర్‌లో ప్రతీక, హర్లీన్ నిలకడగా రాణిస్తున్నారు. జెమీమా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మలతో మిడిలార్డర్ కూడా పటిష్టంగా ఉంది. బౌలింగ్ బలగంలో రేణుక, క్రాంతి, అరుంధతిలతో కూడిన పేస్ దళానికి కొత్త స్పిన్ కెరటం శ్రీచరణి జతయ్యింది. మరోవైపు శ్రీలంక కూడా ప్రపంచకప్‌కు దీటుగా సిద్ధమై వచ్చింది. భారత్ లాగే ఆతిథ్య అనుకూలతల్ని సొమ్ము చేసుకోవాలని భావిస్తోంది.

5న పాక్‌తో భారత్ పోరు

శ్రీలంకతో మంగళవారం తొలి మ్యాచ్ ఆడాక భారత జట్టు కొలంబోకు వెళుతుంది. అక్టోబర్ 5న కొలంబో వేదికగా పాకిస్తాన్‌తో టీమిండియా ఆడుతుంది. పాక్‌తో మ్యాచ్ ఆడాక భారత బృందం తిరిగి స్వదేశానికి చేరుకుంటుంది. విశాఖపట్నంలో అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో, అక్టోబర్ 12న విశాఖపట్నంలోనే ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది. ఈ రెండు మ్యాచ్‌ల తర్వాత అక్టోబర్ 19న ఇండోర్‌లో ఇంగ్లండ్‌తో ఆడనున్న భారత్... అక్టోబర్ 23న నవీ ముంబైలో న్యూజిలాండ్ జట్టుతో, అక్టోబర్ 26న నవీ ముంబైలోనే బంగ్లాదేశ్‌తో ఆడి లీగ్ దశను ముగిస్తుంది. లీగ్ దశ ముగిశాక టాప్–4లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుకుంటాయి.

ఆస్ట్రేలియా ఏడు సార్లు...

ఇప్పటి వరకు 12 సార్లు మహిళల వన్డే వరల్డ్ కప్ జరిగింది. ఆస్ట్రేలియా అత్యధికంగా ఏడు సార్లు (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022) చాంపియన్‌గా నిలిచింది. ఇంగ్లండ్ నాలుగు సార్లు (1973, 1993, 2009, 2017), న్యూజిలాండ్ ఒకసారి (2000) విజేతగా నిలిచాయి.

ఇదీ మన చరిత్ర

మహిళల క్రికెట్‌లో మన జట్టు 1976లో అరంగేట్రం చేసింది. 1978లో స్వదేశంలో జరిగిన ప్రపంచకప్‌లో భారత్ తొలి సారి పాల్గొంది. కానీ పురుషుల జట్టులా మేటిగా ఎదిగేందుకు దశాబ్దాల సమయం పట్టింది. 21 ఏళ్ల తర్వాత 1997లో జరిగిన ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు సెమీఫైనల్ చేరింది. అలా ఎట్టకేలకు వెలుగులోకి వచ్చిన భారత్‌కు 2005 ప్రపంచకప్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ఆ మెగా ఈవెంట్‌లో ఫైనల్ చేరిన భారత్ చివరకు రన్నరప్‌గా తృప్తిపడింది. మళ్లీ 12 ఏళ్ల తర్వాత కూడా 2017లో టైటిల్ బరిలోఉన్నప్పటికీ 'కప్' ముచ్చట అయితే తీరలేదు. మళ్లీ రన్నరప్‌గానే నిలిచింది.

ఇదీ ప్రస్తుత కప్ కథ

భారత్, శ్రీలంక జట్లు సంయుక్తంగా ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తున్నాయి. మొత్తం 5 వేదికలు కాగా... విశాఖపట్నం, నవీ ముంబై, గువాహటి, ఇండోర్ ఈ నాలుగు భారత నగరాలు. శ్రీలంకలోని కొలంబో ఐదో వేదిక. ఆతిథ్య జట్లు సహా డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లాంటి గట్టి ప్రత్యర్థులే బరిలో ఉండటం వల్ల బోర్ కొట్టించే మ్యాచ్‌లకు చోటు లేదు. ప్రతీ జట్టు మిగతా ఏడు ప్రత్యర్థులతో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో తలపడుతుంది. అంటే ఒక్కో జట్టుకు లీగ్ దశలో ఏడు మ్యాచ్‌లుంటాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. అక్టోబర్ 29, 30 తేదీల్లో రెండు సెమీఫైనల్స్ గువాహటి, ముంబై, నవంబర్ 2న ఫైనల్ ముంబైలో జరుగుతాయి. అయితే పాక్ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే ఆడుతుంది. నాకౌట్‌కు చేరితే ఫైనలైనా... సెమీ ఫైనలైనా... కొలంబోలోనే పాకిస్తాన్ ఆడుతుంది.

విదేశీ చిత్రాలకు ట్రంప్ షాక్

అమెరికా వెలుపల నిర్మితమయ్యే సినిమాలపై వంద శాతం పన్ను

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా దేశం వెలుపల నిర్మితమయ్యే సినిమాలపై 100 శాతం సుంకం విధించనున్నట్లుగా ప్రకటించారు. తమ దేశ సినిమా వ్యాపారాన్ని ఇతర దేశాలు దోచుకుంటున్నాయని ట్రంప్ ఆరోపించారు. ఈ విషయమై తన ట్రూత్ సోషల్ అకౌంట్‌లో ఓ పోస్ట్ షేర్ చేశారు. ''చిన్నారుల నుంచి క్యాండీని దొంగిలించినట్లుగా అమెరికా సినీ వ్యాపారాన్ని ఇతర దేశాలవాళ్లు లాక్కున్నారు. కాలిఫోర్నియాకు ఉన్న బలహీన, అసమర్థ గవర్నర్ వల్ల ఈ పరిస్థితులు వచ్చాయి. ఎప్పట్నుంచో ఉన్న ఈ సమస్యను నిర్మూలించే ప్రక్రియలో భాగంగా అమెరికా వెలుపల నిర్మితమయ్యే సినిమాలపై వంద శాతం సుంకం విధించనున్నాను. అమెరికాను మళ్లీ అగ్రస్థానంలో నిలుపుతాం'' అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు డొనాల్డ్ ట్రంప్. అయితే ఈ 100 శాతం సుంకం ఎప్పట్నుంచి అమలులోకి వస్తుందనే విషయంపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు.


భారతీయ సినిమాకు తీవ్ర నష్టం

ప్రేక్షకులు థియేటర్స్‌కు రాక, ఓటీటీ–శాటిలైట్ డీల్స్ కుదరక ఇప్పటికే భారతీయ సినీ నిర్మాతలు ఇబ్బందులపాలవుతున్నారు. ఇక ట్రంప్ తాజా నిర్ణయం అమలులోకి వస్తే, భారతీయ సినిమాకు ఎంతో కీలకమైన యూఎస్ మార్కెట్ నుంచి ఆదాయం తగ్గుతుంది. ఇటు నిర్మాతలు, అటు భారతీయ సినిమాల డిస్ట్రిబ్యూటర్స్ తీవ్ర నష్టాలను చవి చూడాల్సి వస్తుంది. ఈ నష్టాలను తగ్గించుకునేందుకు అమెరికాలో టికెట్ ధరలు పెంచే అవకాశం లేకపోలేదు. దీని మూలంగా థియేటర్స్‌కి వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గే ప్రమాదం ఉంది. ట్రంప్ 100 శాతం పన్ను గురించి ప్రకటించగానే ఈ సుంకాల అమలులో ఎలాంటి నియమ నిబంధనలు, షరతులు ఉండబోతున్నాయి? అనే చర్చ మొదలైంది. ఈ వంద శాతం సుంకం పాలసీ వల్ల యూఎస్ థియేటర్స్, వీటికి అనుసంధానమైన వ్యాపార సంస్థలు కూడా ప్రభావితం అవుతాయి. యూఎస్ ఎగ్జిబిటర్స్, యూఎస్ మల్టీప్లెక్స్ చైన్స్ నియమాలు మారొచ్చు.

ఆ సినిమాలపై ట్రంప్ వైఖరి ఏంటో?: భారీ బడ్జెట్‌తో నిర్మితమయ్యే కొన్ని భారతీయ సినిమాల వీఎఫ్‌ఎక్స్ పనులు అమెరికాలోని ప్రముఖ స్టూడియోల్లో జరుగుతుంటాయి. మరి... ట్రంప్ ఈ చిత్రాలకు ఏమైనా వెసులుబాటు ఇస్తారా? లేక అమెరికాలో షూటింగ్ జరుపుకోని సినిమాలకు మాత్రమే 100 శాతం పన్నుని వర్తింపజేస్తారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. అలాగే అమెరికాలోని ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థలు కొన్నిసార్లు అమెరికా వెలుపల షూటింగ్స్ చేస్తుంటాయి. తమ దేశ సినిమాలు కాబట్టి వంద శాతం పన్ను మినహాయింపు ఇస్తారా? ఈ విషయంలో ట్రంప్ వైఖరి ఎలా ఉంటుందనేది చూడాలి.

ఈ ఏడాది మేలోనూ ట్రంప్ విదేశీ చిత్రాలపై 100 శాతం పన్ను అమలు విషయాన్ని ప్రస్తావించారు. కానీ అమలు కాలేదు. తాజా ప్రకటన నేపథ్యంలో కొందరు తెలుగు నిర్మాతలు చెబుతున్న ప్రకారం ఈ విధానాన్ని అమలు చేయడం అంత సులువు కాదని స్పష్టం అవుతోంది.

సినిమా ఇండస్ట్రీ ఆగమైపోతది!



సినిమాలపై భారీ పన్ను అనేది ట్రంప్ ఇప్పుడే కాదు... గతంలోనూ ప్రకటించారు. అప్పుడు ఎవరో కోర్టుకి వెళ్లి, స్టే తెచ్చారు. ఇప్పుడు కూడా అమెరికాలో ఎవరో ఒకరు కోర్టుకి వెళ్లకుండా ఉండరని అనుకుంటున్నా. ఒకవేళ 100 శాతం పన్ను అమలు అయితే ఇక అప్పుడు సినిమా ఇండస్ట్రీ ఆగమైపోతది. అమెరికాలో థియేటర్ ఇండస్ట్రీ బంద్ అయిపోతది. బయటి సినిమాలు వద్దంటే ఇదే జరుగుతది. చాలామందికి ఉద్యోగాలు పోతాయి. ఉద్యోగాలు ఇప్పించాలనుకోవాలి కానీ ఉన్న ఉద్యోగాలు పోగొట్టాలనుకునే ఈ విధానం ఏంటో? ప్రతిసారీ ఎవరో ఒకరు ఆపుతున్నారు. మరి... ఈసారి ఏం జరుగుతుందో చూద్దాం. ఒకవేళ 100 శాతం పన్ను అమలు అయితే అప్పుడు ఇండియన్ సినిమాకి భారీ నష్టం తప్పదు. ఎందుకంటే అమెరికా డిస్ట్రిబ్యూషన్ ద్వారా నిర్మాతకు వచ్చే ఆదాయం ఎక్కువ ఉంటుంది.

– ఏషియన్ ఫిల్మ్స్ సునీల్ నారంగ్



● అల్లు అర్జున్, స్నేహ

వెకేషన్ మోడ్

నెదర్లాండ్స్‌లో ల్యాండ్ అయ్యారు హీరో అల్లు అర్జున్. భార్య స్నేహాతో కలిసి ఆమ్‌స్టర్‌డామ్ లొకేషన్స్‌లో ఫ్యామిలీ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. సోమవారం (సెప్టెంబరు 29) అల్లు స్నేహ బర్త్ డే. ఈ సందర్భంగా 'హ్యాపీ బర్త్ డే క్యూటీ' అంటూ భార్యతో ఉన్న ఫొటోలను 'ఎక్స్'లో షేర్ చేశారు అల్లు అర్జున్. ఈ వెకేషన్ ట్రిప్ మరికొన్ని రోజులు కొనసాగుతుందట. సో... అల్లు అర్జున్ దసరా సెలబ్రేషన్స్ ఫారిన్‌లోనే అని ఊహించవచ్చు. ఈ ట్రిప్ పూర్తి చేసుకుని వచ్చిన వెంటనే అట్లీ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌తో బిజీ అయిపోతారు అల్లు అర్జున్. ఈ చిత్రానికి సంబంధించిన ఓ భారీ షెడ్యూల్ ఇటీవల ముంబైలో ముగిసింది. నెక్ట్స్ షెడ్యూల్‌ను అబుదాబిలో ప్లాన్ చేశారు. ఇటీవల దర్శకుడు అట్లీ లొకేషన్స్‌ను చూసొచ్చారు. వచ్చే నెల రెండో వారంలో అబుదాబిలో షూట్ ఆరంభమవుతుందట. ఈ షెడ్యూల్‌లోనే ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్న దీపికా పదుకోన్ కూడా పాల్గొంటారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, భాగ్యశ్రీ, ఆలియా .ఎఫ్, యోగిబాబు ఈ సినిమాలో నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా 2027లో విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది.

సంచలనమైపోవాలి...



● ప్రభాస్

'నౌ క్లోజ్ యువర్ ఐస్... టేక్ ఏ డీప్ బ్రీత్... నీ బ్రెయిన్ నా కమాండ్స్ మాత్రమే ఫాలో అవుతుంది...' అనే డైలాగ్స్‌తో, ఓ భారీ హవేలీలోకి ప్రభాస్‌ను ఓ హిప్నాటిస్ట్ తీసుకెళ్లే విజువల్స్‌తో ఆరంభమైంది 'ది రాజా సాబ్' సినిమా తెలుగు ట్రైలర్. ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సంజయ్ దత్, బొమన్ ఇరానీ, జరీనా వాహబ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కానుంది. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో 'ది రాజాసాబ్' సినిమా తొలి ట్రైలర్స్‌ను రిలీజ్ చేశారు. 'చంపేశాడు బాబోయ్...', 'ఏదో గుర్తుండిపోయే పని చేయాలి... సంచలనమైపోయాలి... ఏంట్రా ఇలాంటి పని చేశాడని అందరు షాకైపోవాలి', 'ఇక నా వల్ల కాదు... తల్లీ దుర్గా... నా మనవడిని రక్షించు...', 'ఏందిరా మీ బాధ... పుట్టలో చేయిపెడితే కుట్టడానికి నేనేమైనా చీమనా... రాక్షసుడిని' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

మనం కలిసి బతుకుదామా...



● ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా

''నేను ఏ సినిమా చేసినా అందులో ఒక కొత్త కాన్సెప్ట్ ఉండేలా చూసుకుంటాను. 'థామా' సినిమా కాన్సెప్ట్ ఆడియన్స్‌ని అలరిస్తుంది. ఈ సినిమాలోని అలోక్ క్యారెక్టర్ చేయడం కొత్తగా అనిపించింది. 'థామా' చిత్రం కోసం యాక్షన్ సీక్వెన్స్ చాలా చేశాను'' అని ఆయుష్మాన్ ఖురానా అన్నారు. ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా హీరో హీరోయిన్లుగా నటించిన హిందీ చిత్రం 'థామా'. మాడాక్ హారర్ ఫిల్మ్స్ యూనివర్స్ (ఎమ్‌హెచ్‌సీయు)లో భాగంగా ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'థామా' సినిమా తెలుగు ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకలో ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ– ''నా సినిమా ప్రమోషన్స్ కోసం తొలిసారిగా హైదరాబాద్ వచ్చాను. ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది. 'థామా' ఫుల్ పాన్ ఇండియా మూవీ. రష్మికగారితో తొలిసారి కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఆమె బ్రిలియంట్ పెర్ఫార్మర్. 'థామా' సినిమాను థియేటర్స్‌లో చూసి, ఎంజాయ్ చేయండి'' అని అన్నారు. ''మాడాక్ హారర్ కామెడీ యూనివర్స్ నుంచి వచ్చే సినిమాలకు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంది. 'థామా' సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ సినిమాలో ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేసే క్యారెక్టర్ చేశాను'' అని తెలిపారు రష్మికా మందన్నా. ''పోలీసుల కోసం నేను ఏమైనా చేస్తాను', 'ఏం చేశారో చెప్పండి', 'విక్రమార్కుడు సినిమా ఎనిమిది సార్లు చూశాను సార్', 'నేను వెళ్లక తప్పదు అలోక్... నా కారణంగా నువ్వు కూడా ప్రమాదంలో పడతావ్..', 'నాకేం కలిసి చనిపోయే ఉద్దేశం లేదు... మనం కలిసి బతుకుదామా!', 'నేను నీతో పాటు ఉండలేను... మన ప్రపంచాలు ఒకటి కావు' అనే డైలాగ్స్ 'థామా' తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి.

హైలెస్సో ఆరంభం



● సుధీర్, అక్షర, నటాషా, నక్షలపై క్లాప్ ఇస్తున్న వినాయక్

సుడిగాలి సుధీర్ (సుధీర్ ఆనంద్) హీరోగా 'హైలెస్సో' చిత్రం సోమవారం ఆరంభమైంది. ప్రసన్న కుమార్ కోట దర్శకత్వంలో వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుధీర్, అతని సరసన హీరోయిన్లుగా నటిస్తున్న నటాషా సింగ్, నక్ష శరణ్, కీలక పాత్ర పోషిస్తున్న అక్షర గౌడలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకులు మెహర్ రమేశ్, చందు మొండేటి, వశిష్ఠ కెమెరా స్విచాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ కొట్టారు. హీరో నిఖిల్ టైటిల్‌ను లాంచ్ చేశారు. నిర్మాత బన్నీ వాసు స్క్రిప్ట్‌ను అందజేశారు. గ్రామీణ నేపథ్యంలో సాగే కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఓ మహిళ కాలు, ముఖం కనిపించకుండా చేతిలో ఆయుధం పట్టిన ఓ మిస్టీరియస్ ఫిగర్, అన్నం, పువ్వులు వంటి వాటితో డిజైన్ చేసిన పోస్టర్‌ని విడుదల చేశారు. ''మా సినిమా మోషన్ పోస్టర్, టైటిల్‌ను లాంచ్ చేసిన నిఖిల్‌గారికి, అతిథులుగా విచ్చేసిన అందరికీ ధన్యవాదాలు'' అని సుధీర్ పేర్కొన్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, కెమెరా: సుజాత సిద్ధార్థ్.

ఈ ప్రేమ దూరం కాదుగా...



● రక్షిత్, కోమలి

'నాకు ఊహ తెలియని వయసు నుంచి నా అనుకున్న బంధం నాన్న... ఊహ తెలిసిన తర్వాత నా అనుకున్న బంధం మీరు' అంటూ హీరోయిన్ పట్ల తనకున్న ప్రేమను హీరో వ్యక్తపరిస్తే, 'ఇంత ప్రేమ నా నుంచి ఎప్పటికీ దూరం కాదుగా రాఘవ' అంటుంది హీరోయిన్. రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ హీరో హీరోయిన్లుగా నటించిన 'శశివదనే' చిత్రం ట్రైలర్‌లోని డైలాగ్స్ ఇవి. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోదాల ఈ సినిమాను నిర్మించారు. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం విడుదల చేసిన ట్రైలర్‌లో పైన పేర్కొన్న సంభాషణలతో పాటు 'ఆడపిల్లలు మన జీవితంలోకి కోరికలతోను, ఆశలతోను రారురా... జీవితంలో తోడుగా ఉంటామని భరోసాతో వస్తారు' వంటివి కూడా ఉన్నాయి. గోదావరి నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథా చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, నేపథ్య సంగీతం: అనుదీప్ దేవ్, కెమెరా: సాయికుమార్ దారా.



మహాగౌరిదేవిగా జోగుళాంబ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహాగౌరిగా భక్తులకు దర్శనమిచ్చిన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ క్షేత్రంలో వెలసిన జోగుళాంబదేవి

అలంపూర్



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహాగౌరి అలంకరణలో దర్శనం ఇచ్చిన నిర్మల్ జిల్లా బాసరలోని సరస్వతీ అమ్మవారు

బాసర



సరస్వతీదేవిగా..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన వరంగల్ భద్రకాళి

- హనుమకొండ కల్చరల్

1,050 సినిమాల పైరసీ



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సీవీ ఆనంద్

▶ మొదటి పేజీ తరువాయి

నిందితులను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ప్రకటించారు. వీరిలో ఓ నిందితుడు మూడేళ్లలో 550 సినిమాలు పైరసీ చేయగా... నలుగురితో కూడిన ముఠా ఐదేళ్లలో 500 సినిమాలు చేసినట్లు గుర్తించామన్నారు. ఈ పైరసీతో చిత్ర పరిశ్రమకు రూ.22,400 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ మేరకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కలిసి సీవీ ఆనంద్ మీడియాకు వెల్లడించారు.

ఈ అశ్వని కుమార్ మామూలోడు కాదు...

బిహార్‌కు చెందిన అశ్వినీ కుమార్ పదో తరగతి వరకు చదివాడు. ఆన్‌లైన్ ద్వారానే హ్యాకింగ్ నేర్చుకున్న ఇతగాడి దృష్టి సినిమా పైరసీపై పడింది. విడుదలకు సిద్ధమైన చిత్రాన్ని నిర్మాతలు కొన్ని డిజిటల్ మీడియా సంస్థలకు అందిస్తారు. దాన్ని తమ సర్వర్లలో నిక్షిప్తం చేసుకునే ఈ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఆయా థియేటర్లకు శాటిలైట్ ద్వారా పంపిస్తాయి. ఇలాంటి సంస్థలపై కన్నేసిన అశ్వినీ కుమార్ వాటి సర్వర్లను హ్యాక్ చేసి, విడుదలకు సిద్ధంగా ఉన్న, తాజాగా విడుదలైన చిత్రాలను తస్కరిస్తాడు. మూడేళ్లలో వివిధ భాషలకు చెందిన 550 సినిమాలను పైరసీ చేసి కొన్నింటిని విడుదలకు వారం రోజుల ముందే తస్కరించాడు. ఇలాంటి వాటిలో పుష్ప–2 కూడా ఉంది. పైరసీ ద్వారా లక్ష డాలర్లు (సుమారు రూ.88 లక్షలు) ఆర్జించినట్లు పోలీసులు గుర్తించారు. పట్నాలోని సంపత్ చక్‌లో ఇతడి ఇల్లు 80 గజాల్లో ఉంటుంది. ఈ ఇంటి చుట్టూ ఏకంగా 22 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నాడు.

బెట్టింగ్ యాప్స్‌తో ఒప్పందాలు చేసుకుని..

పైరసీ చేసిన సినిమాలను మార్కెటింగ్ చేసుకోవడానికి అశ్వినీ కుమార్ వివిధ టెలిగ్రాం చానల్స్ అడ్మిన్లతోపాటు గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. వీరి నుంచి ఒక్కో చిత్రానికి 10 వేల నుంచి 25 వేల డాలర్ల వరకు వసూలు చేస్తున్నాడు. టెలిగ్రాం చానల్స్‌లో నేరుగా సినిమా లింకు పెడుతుండగా... వెబ్‌సైట్స్‌లో యాడ్స్ రూపంలో ఈ లింకు ఇస్తున్నారు. పగటి పూట నిద్రపోయి, రాత్రి వేళల్లో మేల్కొనే ఇతడు తన హ్యాకింగ్ సత్తాను పరీక్షించుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘంతోపాటు బిహార్, జార్ఖండ్‌కు చెందిన వివిధ ప్రభుత్వ వెబ్‌సైట్లు, సర్వర్లను హ్యాక్ చేశాడు. దీనికోసం నెదర్లాండ్స్‌కు చెందిన ఐపీ అడ్రస్ వినియోగించాడు. ఇతడు చిత్రాలను నేరుగా సర్వర్ల నుంచి పైరసీ చేస్తుండటంతో అవన్నీ హెచ్‌డీ ప్రింట్‌తో ఉంటున్నాయి. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన క్రిప్టో కరెన్సీ ఇతగాడికి అష్మిత్ సింగ్ ద్వారా చేరినట్లు పోలీసులు గుర్తించారు. ఇతడి హ్యాకింగ్ టాలెంట్ చూసి అవాక్కైన సీవీ ఆనంద్ నెలకు రూ.10 లక్షల జీతం ఇచ్చి అతడి సేవలు వినియోగించుకోవచ్చన్నారు.

క్యామ్ కార్డర్‌తో థియేటర్లలో...

తమిళనాడుకు చెందిన సిరిల్ ఇన్ఫంట్ రాజ్ అమలదాస్ క్యామ్ కార్డర్ ద్వారా థియేటర్లలో సినిమాలు రికార్డు చేసి పైరసీ చేస్తున్నాడు. దీనికోసం వనస్థలిపురంలో ఉంటున్న జాన కిరణ్ కుమార్, తమిళనాడుకే చెందిన సుధాకరన్, గోవాకు చెందిన అర్సలాస్ అహ్మద్‌లతో ముఠా ఏర్పాటు చేశాడు. పైరసీ సినిమాలను హోస్ట్ చేయడానికి అమలదాస్ రెండు సర్వర్లను ఖరీదు చేశాడు. కిరణ్ కుమార్ మిగిలిన ఇద్దరితో కలిసి సినిమా విడుదలైన రోజు థియేటర్లలో మధ్యలో ఉండే వరుసల్లో టిక్కెట్లు బుక్ చేసుకుంటాడు. తమతోపాటు చుట్టు పక్కల ఉన్న సీట్లను బుక్ చేస్తాడు. క్యామ్ కార్డర్లు లేదా సెల్‌ఫోన్‌లో ప్రత్యేక క్యామ్ కార్డర్ యాప్‌ల సహకారంతో వీరు సినిమా రికార్డు చేస్తారు. ఈ ప్రింట్‌ను అమలదాస్ కొన్ని టోరెంట్స్‌తోపాటు ఇతర వెబ్‌సైట్లలో హోస్టు చేస్తున్నాడు. వారి నుంచి ఒక్కో సినిమాకు 3 వేల డాలర్ల వరకు వసూలు చేస్తూ అనుచరులకు వాటా ఇస్తున్నాడు. వీళ్లు ఐదేళ్లలో 500 సినిమాలు పైరసీ చేయగా... కొన్నింటిని హైదరాబాద్‌లోని థియేటర్లలో రికార్డు చేశారు. ఇలా ఇప్పటివరకు రూ.2 కోట్లు సంపాదించారు. హిట్, సింగిల్, కుబేర, హరి హర వీరమల్లు చిత్రాల పైరసీపై నమోదైన కేసుల్ని దర్యాప్తు చేసిన పోలీసులు ఈ ఐదుగురినీ అరెస్టు చేశారు. వీరికి సహకరించిన ఇతర నిందితుల కోసం గాలిస్తున్నారు.

సినీ ప్రముఖులతో సీపీ భేటీ

సినిమా పైరసీ పూర్వాపరాలు, నిరోధానికి తీసుకుంటున్న చర్యల్ని వివరించడానికి హైదరాబాద్ పోలీసులు సినీ ప్రముఖులతో భేటీ అయ్యారు. పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి ప్రముఖ నటులు చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. సినీ నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిజిటల్ డిస్ట్రిబ్యూషన్ భాగస్వాములు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని పోలీసులు వివరించారు. క్యామ్ కార్డర్ పైరసీని నిరోధించడానికి థియేటర్లలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. థియేటర్ యజమానులు నిఘా పెంచాలని కోరారు. పైరసీ ముఠాలను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఏసీపీ ఆర్‌జీ శివమారుతితోపాటు ఇన్‌స్పెక్టర్లు ఎస్.నరేష్, సతీష్‌రెడ్డి, ఎస్.దిలీప్ కుమార్, కె.మధుసూదన్ రావులను అభినందించారు.

బాలకృష్ణపై 300 ఠాణాల్లో ఫిర్యాదు చేద్దాం

చిరంజీవి అభిమానుల నిర్ణయం | **జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు సిద్ధం..వారించిన మెగాస్టార్**

బంజారాహిల్స్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మెగాస్టార్ చిరంజీవిపై హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ అసభ్య పదజాలంతో దూషించిన ఘటనలో బాలకృష్ణపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని 300 పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని చిరంజీవి అభిమానులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వందమందికి పైగా ప్రధాన అభిమానులు సమావేశమయ్యారు. అసెంబ్లీలో బాలకృష్ణ ఇష్టానుసారంగా మాట్లాడడాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఆయనపై అన్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఉమ్మడిగా తీర్మానించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు తాము బాలకృష్ణపై ఫిర్యాదు చేయడానికి వస్తున్నట్టు సమాచారమిచ్చారు. చిరంజీవికి కూడా సమాచారం అందించారు. వెంటనే ఆయన అభిమానులను సున్నితంగా హెచ్చరిస్తూ ఫిర్యాదు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని సూచించారు. దీంతో బాలకృష్ణపై ఫిర్యాదు చేయడానికి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ దాకా వచ్చిన అభిమానులు చిరంజీవి వారించడంతో వెనుదిరిగారు.

చరిత్ర నిర్మాతలు.. తుదితీర్పు ఇచ్చేది ప్రజలే

- వారి ముందు నిజాయితీగా వాస్తవాలనే ఉంచాలి
- మూడు పేజీల సుదీర్ఘ లేఖ విడుదల చేసిన మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

సాక్షి, హైదరాబాద్ : చరిత్ర నిర్మాతలు.. తుది తీర్పు ఇచ్చేది ప్రజలే అని, వారి ముందు నిజాయితీగా వాస్తవాలనే ఉంచాలని మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ తెలిపారు. 'తాత్కాలిక సాయుధ పోరాట విరమణ' ప్రకటనపై తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ కౌంటర్‌కు ప్రతిగా అభయ్ సోమవారం మూడు పేజీల సుదీర్ఘ లేఖను విడుదల చేశారు.

శాంతి చర్చల గురించి ఆలోచించ కూడదని అభిప్రాయపడ్డాం

'నవంబర్ 2024లో పార్టీ జనరల్ సెక్రటరీ సమక్షంలోనే కొంతమంది సీసీఎంలం (సెంట్రల్ కమిటీ మెంబర్స్) శాంతి చర్చల విషయంపై చర్చించాం. ఆయుధాలు వదలకపోతే ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా లేదని, మనం ఇక శాంతి చర్చల గురించి ఆలోచించకూడదని కూడా అభిప్రాయపడినాం. కానీ, దీనికి భిన్నంగా మీ అందుబాటులోని సీసీఎంలు 'శాంతి చర్చలకు మేం సిద్ధం' అంటూ, మార్చి 2025లో కొందరు మిత్రులు తమ అభిప్రాయం చెప్పారు. అయితే అందుబాటులో ఉన్న కొద్దిమందైనా స్పష్టమైన నిర్ణయం తీసుకొని, దానిని స్పష్టం చేస్తూ ఆ ప్రకటన పంపి ఉండాల్సింది. అలా చేయకపోవడంతో, ఆ ప్రకటననే అనుసరిస్తూ కామ్రేడ్ బసవరాజు, రూపేశ్‌లు పరస్పరం చర్చించుకొని శాంతి చర్చలపై అనివార్యంగా ప్రకటనలు విడుదల చేశారు. ఇవన్నీ నవంబర్ 2024 అవగాహనకు భిన్నమైనవనే విషయం జగన్ ముందు తన బాధ్యుల నుంచి తెలుసుకోవాలి' అని పేర్కొన్నారు.

ఆ 22 పేజీల విజ్ఞప్తిని చదివి ఉంటే...

నిజానికి ఈ రెండు ప్రకటనలకన్నా, పార్టీలో అంతర్గత సర్క్యులేషన్ కోసం తెలుగులో నేను విడుదల చేసిన 22 పేజీల కేడర్ విజ్ఞప్తిని జగన్ చదివి దానిపై తన అమూల్యమైన అభిప్రాయాన్ని తెలిపి ఉంటే, అది మన సెంట్రల్ కమిటీ, పార్టీకి చాలా ఉపయోగపడేది. నేను ఆ 22 పేజీల విజ్ఞప్తిలో రాసినవన్నీ మన పొలిట్ బ్యూరో ఆగస్టు 2024లో విడుదల చేసిన సర్క్యులర్ లోనివేనని జగన్‌కు ముందుగా స్పష్టం చేస్తున్నాను' అని అభయ్ తన లేఖలో తెలిపారు.

నా ప్రకటనపై పార్టీ శ్రేణుల మధ్య చర్చ జరపండి

'నేను 15 ఆగస్టు నాడు తయారు చేసిన ప్రకటనపై అంచెలంచెలుగా పార్టీ శ్రేణుల మధ్య చర్చ జరిపి చివరకు సెప్టెంబర్ 12 నాడు ఆ చర్చలు ముగిశాక, అందులో ఎలాంటి మార్పులు చేయకుండానే విడుదల చేయడంతో డేట్ విషయం కొంతమందిలో అనుమానాలను రేకెత్తించింది. అంతకు మించి తేదీకి ఎలాంటి ప్రాధాన్యత లేదు. అత్యంత ముఖ్యమైన ఈ విషయంపై నా ఫొటోతో ప్రకటన విడుదల చేయడమే శ్రేయస్కరమని భావించాను.' అని చెప్పారు.

మిథున్‌రెడ్డికి బెయిల్

ఈ కేసులో ఆయన పాత్రను నిరూపించే ఆధారాల్లేవన్న ఏసీబీ కోర్టు

- ఆరోపణల ఆధారంగా అమూల్యమైన బెయిల్ హక్కును తిరస్కరించలేం
- మాస్టర్ మైండ్ అనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు
- సహ నిందితుల వాంగ్మూలాల ఆధారంగానే ఆరోపణలు
- ఆ వాంగ్మూలాలకు ఎలాంటి ఆమోద యోగ్యత లేదు
- మా ముందుంచిన ఆధారాలు స్వతంత్రమైనవి కావు
- ముడుపులు వసూలు చేశారన్న ఆరోపణలు నిరాధారం
- నేరపూరిత కుట్రకు సైతం ఆధారాలు చూపలేకపోయారు
- సాక్ష్యాలు తారుమారు చేసినట్లు కూడా ఆరోపణలేవీ లేవు
- అనుమానాలతో నిరవధికంగా కస్టడీలో ఉంచలేమంటూ బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం



జైలు నుంచి విడుదలైన అనంతరం కార్యకర్తలకు మిథున్‌రెడ్డి అభివాదం

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): మద్యం అక్రమ కేసులో నిందితునిగా ఉన్న రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో నాల్గవ నిందితునిగా ఉన్న మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు ఈ ఏడాది జూలై 19న అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయన 72 రోజులుగా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఇటీవల ఆయన ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మిథున్‌రెడ్డి తరఫు న్యాయవాది తప్పెట నాగార్జునరెడ్డి, సిట్ తరఫున స్పెషల్ పీపీ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి పి.భాస్కరరావు.. ఈ కేసులో మిథున్‌రెడ్డి పాత్ర ఉందనేందుకు బలమైన ఆధారాలేవీ లేవని చెబుతూ, విచారణకు సహకరించాలని ఆదేశిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. తీర్పులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

ఆరోపణల ఆధారంగా బెయిల్ హక్కును నిరాకరించలేం

'కేవలం కేసు తీవ్రత, పరిమాణం మాత్రమే కాక నిందితుని పాత్ర, దర్యాప్తు అధికారులు సేకరించిన ఆధారాలను బట్టే బెయిల్ మంజూరుపై నిర్ణయం ఉంటుంది. ప్రస్తుత కేసులో పిటిషనర్ పాత్రను నిర్ధారించేందుకు సరైన, బలమైన ఆధారాలేవీ లేవు. కేవలం ఆరోపణల ఆధారంగా ఆయన అమూల్యమైన బెయిల్ హక్కును తిరస్కరించలేం. నిందితుడిపై ఆరోపణలు తీవ్రమైన ఆర్థిక నేరాలకు సంబంధించినవన్న కారణంతో మాత్రమే బెయిల్ నిరాకరించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఇందుకు సంబంధించి చట్టాలలో, బెయిల్ సంబంధిత న్యాయ సూత్రాలలో అలాంటి నిషేధం లేదు. మిథున్‌రెడ్డిపై ఉన్న ప్రధాన ఆరోపణ ఏమిటంటే, ఈ కేసులో ఆయన మాస్టర్ మైండ్ అని, కీలక పాత్ర పోషించారని. ఇందుకు ప్రాసిక్యూషన్ సహ నిందితుల నేరాంగీకార వాంగ్మూలంపై ఆధారపడుతోంది. కానీ ఆ వాంగ్మూలాలకు ఎలాంటి ఆమోద యోగ్యత లేదు. సహ నిందితుల వాంగ్మూలాలు, కొందరు సాక్షులు ఇచ్చిన 161 స్టేట్‌మెంట్లు తప్ప ఇతర ఆధారాలను సమర్పించలేదు. కోర్టు ముందుంచిన ఆధారాలు స్వతంత్రమైనవి కావు. వాటికి ఎంత విలువ ఉందనే విషయం క్రాస్ ఎగ్జామినేషన్ తర్వాతే తెలుస్తుంది' అని ఏసీబీ కోర్టు తన తీర్పులో పేర్కొంది.

ముడుపుల వసూలు ఆరోపణలు నిరాధారం

'మిథున్‌రెడ్డి ఈ కేసులో మాస్టర్ మైండ్‌గా ఉంటూ, ఒక సిండికేట్ ద్వారా ముడుపులు వసూలు చేశారని సిట్ ఆరోపించింది. అలాగే, డీకార్ట్ లాజిస్టిక్స్ నుంచి రూ.5 కోట్లు అందుకున్నారని, అది మద్యం విక్రయాలకు సంబంధించిన మొత్తమని కూడా ఆరోపించింది. అయితే ఆ ఆరోపణలు నిరాధారమైనవి. వాటికి ఎలాంటి ఆధారాలు లేవు. మాస్టర్ మైండ్ అనడంతో పాటు 2019–24 మద్యం విధానం రూపకల్పన, అమలులో కీలక పాత్ర పోషించారన్నది కూడా మిథున్‌రెడ్డిపై ఉన్న ఆరోపణ. అయితే, ఆయన మద్యం విధానం రూపకల్పన కమిటీలో ఆయన సభ్యుడు కాదని, ఆయన పార్లమెంట్ సభ్యుడు మాత్రమేనని, రాష్ట్ర వ్యవహారాలు లేదా ఎక్సైజ్ పాలసీతో సంబంధం లేదని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పోలీసులు ఇప్పటి వరకు సేకరించిన ఆధారాలేవీ మిథున్‌రెడ్డిపై ప్రాథమికంగా కేసు రుజువు చేసేందుకు సరిపోవు. ఏదేమైనప్పటికీ, నేరం తీవ్రతను మాత్రమే బెయిల్ తిరస్కరణకు ఏకైక కారణంగా పరిగణించబడకూడదు' అని ఏసీబీ కోర్టు తేల్చి చెప్పింది.

రాజకీయ కేసులు ఉండటం ఆశ్చర్యకరం కాదు

'మిథున్‌రెడ్డికి నేర చరిత్ర ఉందంటూ సిట్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏడు కేసులను ప్రస్తావించారు. అయితే, వాటిలో ఐదు కేసులు ఇప్పటికే క్లోజ్ అయ్యాయి. మిగిలిన రెండు కేసులు కూడా రాజకీయ స్వభావం ఉన్నవి. మిథున్‌రెడ్డికి దీర్ఘకాల రాజకీయ ప్రస్థానం ఉంది. అలాంటప్పుడు రెండు రాజకీయ కేసులు పెండింగ్‌లో ఉండటం ఆశ్చర్యకరమైన విషయం కాదు. ఎందుకంటే రాజకీయాల్లో ఎల్లప్పుడూ ప్రత్యర్థులు ఉంటారు. అయితే, మిథున్‌రెడ్డి ఇప్పటి వరకు ఎటువంటి ఆర్థిక లేదా క్రూరమైన నేరాలకు పాల్పడలేదన్నది వాస్తవం. కాబట్టి, ఆయనను బెయిల్‌పై విడుదల చేయడం వల్ల సమాజానికి ఎలాంటి ముప్పు కలిగించదు' అంటూ కోర్టు తీర్పు చెప్పింది.

డబ్బు మళ్లింపునకు ఆధారాలేవీ?

'ఇది బెయిల్ దశ మాత్రమే. కాబట్టి కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి లోతైన పరిశీలన చేయాల్సిన అవసరం లేదు. కేసు పూర్వాపరాల ఆధారంగా ఈ దశలో ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేసినా కూడా అది విచారణ ఫలితాన్ని ముందే నిర్ణయించినట్లు అవుతుంది. నేరపూరిత కుట్ర విషయంలో దర్యాప్తు అధికారులు ప్రాథమిక ఆధారాలను చూపలేకపోయారు. నిందితులు డబ్బు, ముడుపులను దారి మళ్లించడానికి ఒప్పందం చేసుకున్నారనేందుకు ఆధారాలేవీ చూపలేదు. సిట్ అధికారులు మిథున్‌రెడ్డి గూగుల్ టేకౌట్స్, సెల్ టవర్ లోకేషన్ డేటాను ఈ కోర్టు ముందుంచుంచారు. అయితే, నెట్‌వర్క్ రద్దీ, భౌగోళిక అడ్డంకుల కారణంగా వాటిలో తేడాలున్నాయి. అందువల్ల అవి కచ్చితమైనవి గానీ, నిర్ణయాత్మకమైనవి గానీ కావు' అని కోర్టు స్పష్టం చేసింది.

ప్రాథమిక ఆధారాలు చూపడంలో ప్రాసిక్యూషన్ విఫలం

'డీకార్ట్ నుంచి పీఎల్ఆర్ కంపెనీకి వచ్చిన రూ.5 కోట్ల నగదుతో తనకు ఎలాంటి సంబంధం లేదని మిథున్‌రెడ్డి చెప్పారు. ఈ కేసులో ఆయనకు ప్రమేయం ఉందని నమ్మేందుకు నగదు, బంగారం, విలాసవంతమైన కార్లు, ఆస్తులు వేటిని కూడా ఆయన నుంచి స్వాధీనం చేసుకోలేదు. ఈ విషయాలన్నింటినీ విచారణ సమయంలో పరిశీలించాల్సి ఉంటుంది. అందువల్ల కొంత మంది సాక్షులు ఇచ్చిన 161 స్టేట్‌మెంట్లు, సహ నిందితులు ఇచ్చిన 164 స్టేట్‌మెంట్లు బెయిల్ నిరాకరించడానికి ఎంత మాత్రం సరిపోవు. ఆరోపణలు తీవ్రమైనవి అయినా కూడా, కేసును బట్టి బెయిల్‌పై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పింది. ప్రధానంగా నిందితుడికి ఆపాదించిన పాత్ర, ప్రాసిక్యూషన్ సేకరించిన ఆధారాలపై బెయిల్ మంజూరు ఆధారపడి ఉంటుంది. కానీ ప్రస్తుత కేసుతో పిటిషనర్‌కు సంబంధం ఉందని నిరూపించే ప్రాథమిక ఆధారాలను చూపడంలో ప్రాసిక్యూషన్ విఫలమైంది. ఈ కేసు ఆదాయపు పన్ను శాఖ లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఫిర్యాదు ఆధారంగా నమోదు కాలేదు. చిన్నారులపై వేధింపులు, పన్ను ఎగవేత, బ్యాంకు మోసం, కస్టమ్స్ ఉల్లంఘనలు వంటి ఆరోపణలేవీ పిటిషనర్‌పై లేవు. పిటిషనర్ మనీ లాండరింగ్, ఉపా, జాతీయ భద్రత కేసుల్లో అరెస్ట్ కాలేదు. కాబట్టి బలమైన ఆధారాలు లేకుండా ఆయన్ను నిరవధికంగా కస్టడీలో ఉంచడానికి వీల్లేదు' అని ఏసీబీ కోర్టు తన తీర్పులో వివరించింది.

సాక్ష్యాలను తారుమారు చేసినట్లు ఆరోపణా లేదు

'మిథున్‌రెడ్డి బెయిల్‌పై బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేయడంతో పాటు సాక్ష్యాలను తారుమారు చేస్తారని ప్రాసిక్యూషన్ వాదిస్తోంది. వాస్తవానికి పిటిషనర్ మూడు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై, ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు. ఆయన తండ్రి ప్రస్తుతం ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా ఉన్నా రు. తద్వారా సమాజంలో వీరికి గట్టి సంబంధాలున్నాయి. ఈ కేసులో ముందు బెయిల్ నిరాకరించిన తర్వాత మిథున్‌రెడ్డి స్వచ్ఛందంగా దర్యాప్తు అధికారి ముందు లొంగిపోయారు. మధ్యంతర బెయిల్ మంజూరైనప్పుడు తన పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించారు. 72 రోజుల రిమాండ్ సమయంలో గానీ, మధ్యంతర బెయిల్ కాలంలో గానీ ఆయన సాక్ష్యాలను తారుమారు చేసినట్టు ఎలాంటి ఆరోపణా లేదు. ఈ కేసు ప్రధానంగా డాక్యుమెంటరీ ఆధారాలపైనే ఆధారపడి ఉంది. అవన్నీ ప్రాసిక్యూషన్ సురక్షిత కస్టడీలో ఉన్నాయి. అలాంటప్పుడు సాక్ష్యాలను తారుమారు చేస్తారని, విచారణలో ఆటంకం కలిగించే అవకాశం ఉందనే అనుమానాలతో బెయిల్ నిరాకరించడానికి వీల్లేదు. సాక్ష్యాలను తారుమారు చేసి ఉంటే అందుకు స్పష్టమైన ఆధారాలుంటాయి. సాక్ష్యాల తరుమారుపై అనుమానాలుంటే ఉంటే వాటిని కఠిన షరతుల ద్వారా నిరోధించవచ్చు. పిటిషనర్ సాక్షులను ప్రభావితం చేయడానికి, సాక్ష్యాలను తారుమారు చేయడానికి, విచారణకు ఆటంకం కలిగించడానికి ప్రయత్నిస్తే.. ప్రాసిక్యూషన్ ఎప్పుడైనా కోర్టును ఆశ్రయించి బెయిల్ రద్దు కోరవచ్చు. ప్రజా ప్రయోజనం, నిందితుని వ్యక్తిగత స్వేచ్ఛ రెండింటినీ సమన్వయం చేయాలి. అందువల్ల పిటిషనర్‌కు కొన్ని షరతులతో బెయిల్ మంజూరు చేస్తున్నాం' అని ఏసీబీ కోర్టు తన తీర్పులో స్పషం చేసింది. రూ.2 లక్షలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని.. సోమ, శుక్రవారాల్లో దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని.. తదితర షరతులు విధించింది.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల

సాక్షి, రాజమహేంద్రవరం : మద్యం అక్రమ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఉన్న రాజంపేట ఎంపీ పి.మిథున్‌రెడ్డి సోమవారం సాయంత్రం బెయిలుపై విడుదలయ్యారు. విజయవాడ ఏసీబీ కోర్టు మంజూరు చేసిన బెయిల్ పత్రాలు సెంట్రల్ జైలు అధికారులకు అందడంతో సాయంతం 5.55 గంటలకు ఆయన్ను విడుదల చేశారు. జూలై 20వ తేదీ నుంచి ఆయన రిమాండులో ఉన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు కోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అనంతరం తిరిగి ఆయన సెంట్రల్ జైలుకు వచ్చేశారు. కాగా, బెయిల్‌పై విడుదలైన మిథున్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. బెయిల్ పత్రాలు సెంట్రల్ జైల్ అధికారులకు మధ్యాహ్నమే చేరినా, ఆలస్యంగా విడుదల చేయడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

పార్టీ మారారని ఎలా చెప్తారు?

నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంను కలిశారు

- మీడియా వార్తల ఆధారంగా నిర్ధారణకు వస్తారా?
- కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు
- పార్టీ మారిన వారిని అనర్హులుగా ప్రకటించాల్సిందే
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై క్రాస్ ఎగ్జామినేషన్
- తొలి రోజు స్పీకర్ ట్రిబ్యునల్ ఎదుట వాదనలు



మీడియాతో మాట్లాడుతున్న పల్లా

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరి పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ ప్రారంభించారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నలుగురు ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లపై స్పీకర్ చాంబర్‌లో వాదనలు జరిగాయి. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు టి.ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తమ న్యాయవాదులతో హాజరయ్యారు. పిటిషనర్ ఎమ్మెల్యేలు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్, డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా తమ న్యాయవాదులతో వచ్చారు. పిటిషనర్లుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎదుటి పక్షం న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్‌లో అనేక ప్రశ్నలు సంధించారు.

అభివృద్ధి కోసమే సీఎంను కలిశారు

నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఎమ్మెల్యేలు సీఎంను కలిశారని, పార్టీ మారినట్లు పిటిషన్లు ఎలా ఇస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రశ్నించినట్లు తెలిసింది. మీడియాలో వచ్చిన వార్తలు, కథనాల ఆధారంగానే పిటిషన్లు వేసినట్లు ఆధారాలు ఇవ్వడం ఎలా చెల్లుబాటు అవుతుందని అడిగినట్లు సమాచారం. రాజకీయంగా ఎదుగుతున్నందునే బీఆర్ఎస్ అనర్హత పిటిషన్లు దాఖలు చేసినట్లు కనిపిస్తోందనే వాదన వినిపించినట్లు తెలిసింది. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఎదుటి పక్షం న్యాయవాదులు అడిగిన ప్రశ్నలకు పలు ఆధారాలు చూపినట్లు తెలిసింది. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు తమ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం లేదని, పార్టీ పిలుపు మేరకు జరిగే ఆందోళన కార్యక్రమాలకు దూరంగా ఉంటు న్నారని చెప్పినట్లు సమాచారం. బుధవారం ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్‌లో వాదనలు మరింత వాడిగా సాగే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

తిమ్మిని బమ్మి చేసే ప్రయత్నం: పల్లా

బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన విషయం బహిరంగ రహస్యమేనని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ విచారణ చేపట్టగా 8 మంది ఎమ్మెల్యేలు స్పీకర్‌కు వివరణ ఇచ్చారన్నారు. క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు తిమ్మిని బమ్మి చేసే ప్రయత్నం చేశారన్నారు. వాదనల అనంతరం కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్‌తో కలిసి అసెంబ్లీ బయట పల్లా రాజేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. న్యాయవాదులు అసంబద్ధ ప్రశ్నలు వేసినా ఓపికతో సమాధానం చెప్పామన్నారు. పార్టీ మారి అసంబద్ధంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని చెప్పామన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు సిగ్గుంటే తమ పదవులకు రాజీనామా చేయాలని కల్వకుంట్ల సంజయ్ సవాల్ చేశారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	62	80,365
నిఫ్టీ ▽	20	24,635

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	22,579	△	94
డోజోన్స్	46,184	▽	63
ఎఫ్‌టీఎస్ఈ 100	9,312	△	27
డాక్స్	23,779	△	40
షాంఘై	3,863	△	34
నికాయ్	45,044	▽	311

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.25	89.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.74	120.72
€	యూరో	ఎస్‌బీఐ	102.69	105.49
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.29	59.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.49	70.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.28	24.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.41

వెండి @ రూ. 1,50,000



- దేశీయంగా కొత్త గరిష్ట స్థాయి
- తొమ్మిది నెలల్లో రూ.60,000 ప్లస్
- రూ.1.20 లక్షలకు చేరిన పసిడి

న్యూఢిల్లీ: వెండి ధర తారాజువ్వలా దూసుకుపోతోంది. ఢిల్లీ మార్కెట్లో సోమవారం కిలోకి మొదటిసారి రూ.1.5 లక్షలు పలికింది. ఒకే రోజు రూ.7,000 లాభపడింది. మరోవైపు పసిడి ధర సైతం (99.9 శాతం స్వచ్ఛత) 10 గ్రాములకు రూ. 1,500 పెరిగి రూ.1,19,500 వద్ద సరికొత్త జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ఔన్స్ ధర (స్పాట్ మార్కెట్) 2 శాతం పెరిగి 47.18 డాలర్లకు చేరింది. కామెక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఔన్స్ బంగారం 46 డాలర్లు పెరిగి 3,855 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. విదేశీ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలతో దేశీ మార్కెట్లో వెండి, బంగారం ధరలు కొత్త రికార్డు స్థాయిలకు చేరినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ''స్పాట్ గోల్డ్ ధరలు వరుసగా ఆరో వారంలో నూ కొత్త రికార్డులకు చేరా యి. వాణిజ్య అనిశ్చితులకు తోడు ఫెడ్ రేటు కోత అంచనాలు, ఈటీఎఫ్‌ల్లోకి బలమైన పెట్టుబడుల రాక ఇందుకు మద్దతుగా నిలిచాయి''అని మిరే అస్సెట్ కమోడిటీస్ హెడ్ ప్రవీణ్‌సింగ్ చెప్పారు.

వెండి 67 శాతం రాబడి..

ఈ ఏడాది వెండి, పసిడి ధరల పెరుగుదల ఇన్వెస్టర్లు, విశ్లేషకుల అంచనాలకు మించి ఉండడం గమనార్హం. వెండి కిలోకి నికరంగా రూ.60,300 పెరిగింది. 2024 డిసెంబర్ చివరికి ఉన్న రూ.89,700 నుంచి చూస్తే 67% రాబడిని ఇచ్చింది. పసిడి ధర సైతం ఈ ఏడాది ఇప్పటి వరకు 10 గ్రాములకు రూ.40,550 పెరిగింది. గత డిసెంబర్ చివరికి ఉన్న రూ.78,950 నుంచి చూస్తే 51 శాతం ర్యాలీ చేసింది.

టాటా క్యాపిటల్ మెగా ఆఫర్!

షేరు ధరల శ్రేణి రూ. 310-326

- అక్టోబర్ 6–8 మధ్య ఐపీవో
- రూ. 15,512 కోట్ల సమీకరణ
- 2025లో అతిపెద్ద ఇష్యూ



న్యూఢిల్లీ: అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకి రూ. 310–326 ధరల శ్రేణి ప్రకటించింది. అక్టోబర్ 6న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా మొత్తం 47.58 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనుంది. తద్వారా రూ. 15,512 కోట్లు సమకూర్చుకోనుంది. వెరసి 2025లో అతి పెద్ద ఐపీవోగా నిలవనుంది. ఐపీవోలో భాగంగా టాటా గ్రూప్ దిగ్గజం 21 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 23 కోట్ల షేర్లను ప్రమోటర్ టాటా సన్స్ ఆఫర్ చేయనుంది. వీటికి జతగా ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ) సైతం 3.58 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఐపీవో ధర ప్రకారం లిస్టింగ్‌లో కంపెనీ మార్కెట్ విలువ రూ. 1.38 లక్షల కోట్లుగా నమోదయ్యే వీలుంది. అక్టోబర్ 8న ముగియనున్న ఇష్యూలో భాగంగా యాంకర్ ఇన్వెస్టర్లకు 3న షేర్లను ఆఫర్ చేయనుంది. ప్రస్తుతం కంపెనీలో టాటా సన్స్ వాటా 88.6 శాతంకాగా.. ఐఎఫ్‌సీ 1.8 శాతం వాటా కలిగి ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 46 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధులను రుణాల విడుదలతోపాటు భవిష్యత్ అవసరాలరీత్యా టైర్–1 మూలధన పటిష్టతకు వినియోగించనుంది. దేశీ ఫైనాన్షియల్ రంగంలోనే టాటా క్యాపిటల్ అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నమోదుకానుంది. 2023 నవంబర్‌లో టాటా గ్రూప్ నుంచి టాటా టెక్నాలజీస్ లిస్టయ్యాక, రెండేళ్ల తదుపరి తిరిగి మరో దిగ్గజం ఇదే బాట పట్టడం గమనార్హం!

మార్కెట్‌ను మించుతూ



టాటా క్యాపిటల్ మార్కెట్ వృద్ధి (11%)ని మించుతూ 17–18% పురోగతి సాధిస్తోంది. నూతన ప్రొడక్టులను ఆవిష్కరిస్తూ మార్కెట్ వృద్ధికంటే వేగంగా ఎదుగుతోంది. డిజిటల్ సాంకేతికతలపై గత 4–5 ఏళ్లలో రూ. 2,000 కోట్లు వెచ్చించాం.

– రాజీవ్ సబర్వాల్, టాటా క్యాపిటల్ ఎండీ, సీఈవో

ఫైనాన్షియల్ సర్వీసులతో

టాటా గ్రూప్‌లోని ఫైనాన్షియల్ సర్వీసుల విభాగం టాటా క్యాపిటల్ తొలుత ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐపీవో చేపట్టేందుకు వీలుగా సెబీకి గోప్యతా మార్గంలో ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. జూలైలో సెబీ అనుమతి పొందింది. ఆర్‌బీఐ నుంచి అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందిన సంస్థ అప్పటినుంచి మూడేళ్లలోగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టుకావలసి ఉంది. 2022 సెప్టెంబర్‌లో టాటా క్యాపిటల్‌కు ఈ గుర్తింపు లభించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీవో ద్వారా ఈ ఏడాది జూన్‌లో రూ. 12,500 కోట్లు సమీకరించడం తెలిసిందే. బజాజ్ ఫైనాన్స్ 2024 సెప్టెంబర్‌లోనే లిస్టయ్యింది. 2007లో కార్యకలాపాలు ప్రారంభించిన టాటా క్యాపిటల్ ఆదాయం గతేడాది (2024–25) రూ. 18,175 కోట్ల నుంచి రూ. 28,313 కోట్లకు జంప్‌చేసింది. నికర లాభం రూ. 3,327 కోట్ల నుంచి రూ. 3,655 కోట్లకు ఎగసింది.

వియ్‌వర్క్ @ రూ. 615-648

- అక్టోబర్ 3–7 మధ్య ఐపీవో
- రూ. 3,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: కోవర్కింగ్ కార్యాలయ నిర్వాహక కంపెనీ వియ్‌వర్క్ ఇండియా పబ్లిక్ ఇష్యూకి రూ. 615–648 ధరల శ్రేణి నిర్ణయించింది. అక్టోబర్ 3న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా మొత్తం 4.63 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనుంది. ప్రమోటర్ గ్రూప్ సంస్థ ఎంబసీ బిల్డ్‌కాన్ ఎల్‌ఎల్‌పీతోపాటు ప్రస్తుత ఇన్వెస్టర్ సంస్థ 1 ఏరియల్ వే టెనెంట్(వియ్‌వర్క్ గ్లోబల్‌లో భాగం) షేర్లను ఆఫర్ చేయనున్నాయి. తద్వారా రూ. 3,000 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఐపీవో ధర ప్రకారం కంపెనీ లిస్టింగ్‌లో రూ. 8,685 కోట్ల మార్కెట్ విలువను సాధించే వీలుంది. ఇష్యూ అక్టోబర్ 7న ముగియనుంది.



మార్కెట్‌ను వీడని నష్టాలు

ఏడో రోజూ అమ్మకాలే

- ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



ముంబై: బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో పాటు విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో సోమవారం స్టాక్ మార్కెట్ స్వల్ప నష్టంతో ముగిసింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమావేశ ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. సెన్సెక్స్ 62 పాయింట్లు నష్టపోయి 80,365 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 20 పాయింట్లు కోల్పోయి 24,635 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా ఏడో రోజూ నష్టాల ముగింపు. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. రోజంతా లాభ, నష్టాల మధ్య ట్రేడవుతూ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,249 వద్ద కనిష్టాన్ని, 80,851 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 49 పాయింట్లు పతనమై 24,606 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆసియాలో జపాన్ మినహా అన్ని దేశాల మార్కెట్లు 1% వరకు పెరిగాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో ఐటీ 0.33%, ఇండస్ట్రియల్స్ 0.32%, ఆటో 0.12%, క్యాపిటల్ గూడ్స్ 0.09 శాతం నష్టపోయాయి. మరోవైపు ఆయిల్‌అండ్‌గ్యాస్ 2%, ఇంధన 1.10%, రియల్టీ 1%, విద్యుత్ 0.46%, సర్వీసెస్ 0.41%, మెటల్ 0.39% లాభపడ్డాయి. మిడ్ క్యాప్ ఇండెక్సు 0.34% పెరిగింది. స్మాల్ క్యాప్ సూచీ 0.17% నష్టపోయింది.
- డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలహీనపడి 88.75 వద్ద స్థిరపడింది.
- అట్లాంటా ఎలక్ట్రానిక్స్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర (రూ.754)తో పోలిస్తే బీఎస్ఈలో 14% ప్రీమియంతో రూ.858 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 14.50% పెరిగి రూ.864 గరిష్టాన్ని తాకింది. చివరికి 9% లాభంతో రూ.823 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,331 కోట్లుగా నమోదైంది.
- గణేశ్ కన్సూమర్ ప్రొడక్ట్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర (రూ.322)తో పోలిస్తే 8.38% డిస్కౌంటుతో రూ.295 వద్ద లిస్టయ్యింది. చివరికి 9% నష్టంతో రూ.294 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

పటిష్టంగా ఆర్థిక వృద్ధి: మూడీస్	లిస్టింగ్ బాటలో 7 కంపెనీలు

ఎలక్ట్రిక్ వాహనాల్లో సౌండ్ అలర్ట్ సిస్టం!



న్యూఢిల్లీ: పాదచారులు, వాహనదార్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కుల్లాంటి వాహనాల్లో ఎకూస్టిక్ వెహికల్ అలర్టింగ్ సిస్టం (ఏవీఏఎస్)ను అమలు చేయాలని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ ప్రతిపాదించింది. 2026 అక్టోబర్ తర్వాత కొత్తగా తయారు చేసే అన్ని ఎలక్ట్రిక్ ప్యాసింజర్, గూడ్స్ వాహనాల్లో దీన్ని తప్పనిసరిగా అమర్చాలని ఒక ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది. అలాగే ప్రస్తుత మోడల్స్ విషయంలో అక్టోబర్ 1 నాటికి ఎం, ఎన్ కేటగిరీ వాహనాల్లో ఏవీఏఎస్‌ను అమర్చాలని ప్రతిపాదించింది. ప్యాసింజర్ ఎలక్ట్రిక్ కార్లు, బస్సులను కేటగిరీ ఎం వాహనాలుగా, విద్యుత్ గూడ్స్.. ట్రక్కులను కేటగిరీ ఎన్ వాహనాలుగా పరిగణిస్తారు. దాదాపు నిశ్శబ్దంగా పరుగులు తీసే ఎలక్ట్రిక్ వాహనం ఉనికి గురించి పాదచారులు, ఇతరత్రా వాహనదారులను అలర్ట్ చేసేందుకు, ఇంజిన్ శబ్దాన్ని వెలువరించేలా ఈ సిస్టం ఉంటుంది. అమెరికా, జపాన్‌తో పాటు కొన్ని యూరోపియన్ యూనియన్ దేశాలు ఇప్పటికే హైబ్రిడ్ వాహనాల్లో ఏవీఏఎస్‌ని తప్పనిసరి చేశాయి.

ఐఐపీకి మైనింగ్ దన్ను

ఆగస్టులో పారిశ్రామికోత్పత్తి వృద్ధి 4 శాతం



న్యూఢిల్లీ: ఆగస్టులో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 4 శాతం వృద్ధి నమోదు చేసింది. మైనింగ్ రంగం 6 శాతం మెరుగుపడటం ఇందుకు తోడ్పడిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) వెల్లడించింది. గతేడాది ఆగస్టులో ఐఐపీ వృద్ధి దాదాపు ప్రస్తుత స్థాయిలోనే ఉండగా, మైనింగ్ రంగం 4.3 శాతం క్షీణత నమోదు చేసింది. తాజాగా సూచీలో నాలుగింట మూడొంతుల వాటా ఉండే తయారీ రంగం వృద్ధి 1.2 శాతం నుంచి 3.8 శాతానికి పెరిగింది. విద్యుదుత్పత్తి 3.7 శాతం క్షీణత నుంచి బైటపడి 4.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. మరోవైపు, జూలై ఐఐపీ వృద్ధి గణాంకాలను ముందుగా అంచనా వేసిన 3.5 శాతం నుంచి 4.3 శాతానికి ఎన్ఎస్‌వో సవరించింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఆగస్టు మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి 4.3 శాతం నుంచి 2.8 శాతానికి నెమ్మదించింది. రాబోయే రోజులలో జీఎస్‌టీ క్రమబద్ధీకరణతో పండుగ సీజన్‌లో వినియోగం పుంజుకుంటుందని, నిల్వలన్నీ అమ్ముడైపోతే, సెప్టెంబర్–అక్టోబర్‌లో తయారీ రంగ ఉత్పత్తి మెరుగుపడటానికి దోహదపడగలదని ఇక్రా చీఫ్ ఎకానమిస్ట్ అదితి నాయర్ తెలిపారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2026

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) దేశవ్యాప్తంగా రైల్వే, టెలికాం, డిఫెన్స్ సర్వీస్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో ఇంజనీరింగ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 474.

» **విభాగాలు:** సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్.

» **అర్హత:** పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీఈ/బీటెక్ చదివి ఉండాలి. లేదా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) ఇన్‌స్టిట్యూట్ ఎగ్జామినేషన్స్ ఎ, బి విభాగాలు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అసోసియేట్ మెంబర్‌షిప్ ఎగ్జామినేషన్ పార్ట్స్ 2, 3/సెక్షన్లు, ఎ, బి అర్హత సాధించాలి. లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూషన్(ఇండియా) గ్రాడ్యుయేట్ సభ్యత్వ పరీక్ష పాసై ఉండాలి. లేదా ఎంఎస్సీ(వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్స్, రేడియో ఫిజిక్స్, రేడియో ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** 01.01.2026 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.

» **ఎంపిక విధానం:** స్టేజ్–1 (ప్రిలిమినరీ) పరీక్ష, స్టేజ్–2 (మెయిన్)పరీక్ష, స్టేజ్–3 (పర్సనాలిటీ టెస్ట్), మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**26.09.2025

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.10.2025

» **ప్రిలిమినరీ/స్టేజ్–1 పరీక్షతేది:** 08.02.2026

» **వెబ్‌సైట్:** https://upsconline.nic.in

సైన్స్‌లో పరిశోధనలకు ఫెలోషిప్ ఇలా!

» సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్-2025 నోటిఫికేషన్

» కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఆన్‌లైన్ పరీక్ష

» జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే రెండేళ్లపాటు నెలకు రూ.37వేల ఫెలోషిప్

» ఆ తర్వాత పీహెచ్‌డీకి నమోదుతో నెలకు రూ.42వేల ఎస్ఆర్ఎఫ్

» పీహెచ్‌డీలో ప్రవేశంతోపాటు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువుకు మార్గం

సైన్స్ రంగంలో పరిశోధనల్లో రాణించాలని కోరుకునే యువతకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. సైన్స్ విభాగంలో పీజీ ఉత్తీర్ణతతో ఈ పరీక్షకు పోటీ పడొచ్చు.జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల్లో పరిశోధనల్లో పాల్పంచుకోవచ్చు. బోధన రంగంలో ప్రవేశించాలనుకునే వారికి కూడా ఇది చక్కటి మార్గం. ఈ నేపథ్యంలో.. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్-2025తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష ప్యాట్రన్, సిలబస్, ప్రిపరేషన్ తదితర వివరాలు..

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. సీఎస్ఐఆర్-యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్‌తోపాటు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీలో ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహిస్తారు.

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌తో ప్రయోజనాలెన్నో

- జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37వేల స్టైపెండ్ లభిస్తుంది. దీంతోపాటు ఏడాదికి రూ.20వేల అత్యవసర గ్రాంట్‌ను కూడా అందజేస్తారు.
- రెండేళ్ల జేఆర్ఎఫ్ అనంతరం అభ్యర్థి పీహెచ్‌డీకి నమోదు చేసుకుంటే.. ఎస్ఆర్ఎఫ్(సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్)కు ఎంపిక చేస్తారు. ఎస్ఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి మూడో ఏడాది నుంచి ప్రతి నెలా రూ.42వేలు చెల్లిస్తారు.
- సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ డిసెంబర్ 2025 పరీక్షలో ప్రతిభ ఆధారంగా భారత ప్రభుత్వ ఎర్త్‌సైన్సెస్ మంత్రిత్వ శాఖ పరిశోధన అభ్యర్థులకు 25 ఫెలోషిప్‌లను అందించనుంది.
- నేషనల్ ఫెలోషిప్‌లు/స్కీమ్స్(ఎన్ఎఫ్ఓబీసీ, ఎన్ఎఫ్ఎస్‌సీ, ఎన్ఎఫ్‌పీడబ్ల్యూడీ, ఎన్ఎఫ్‌పీడబ్ల్యూబీడీ) వంటి వాటికి దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ డిసెంబర్ 2025లో అర్హత సాధించాల్సి ఉంటుంది.
- అదేవిధంగా సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆయా యూనివర్సిటీలు విడుదల చేసే నోటిఫికేషన్‌ను అనుసరించి పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత పొందిన వారు యూజీసీ నిబంధనలకు అనుగుణంగా కాలేజీలు, యూనివర్సిటీల్లో బోధన పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.
- సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో అర్హత సాధించిన వారి వివరాలను ఎన్‌టీఏ/యూజీసీ ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు)/ఇతర సంస్థలతో పంచుకుంటుంది. తద్వారా అవి తమ నియామకాల్లో వీరిని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

ఐదు విభాగాల్లో పరీక్ష

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షను ఐదు విభాగాల్లో నిర్వహించనున్నారు. అవి..కెమికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్.

అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి సంబంధిత సైన్స్ విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ(నాన్ క్రీమీలేయర్) తదితర రిజర్వేషన్ వర్గాలకు చెందిన అభ్యర్థులు మాస్టర్స్ డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు పొందాలి.
- మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న వారు లేదా మాస్టర్స్ డిగ్రీ కోర్సు ఫైనల్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- నాలుగేళ్లు/ఎనిమిది సెమిస్టర్ల బ్యాచిలర్ డిగ్రీ కోర్సును 75 శాతం మార్కులతో (రిజర్వేషన్ వర్గాలకు 5శాతం మార్కుల సడలింపు) ఉత్తీర్ణులైనవారు/ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరికి జేఆర్ఎఫ్, పీహెచ్‌డీలో ప్రవేశానికి అనుమతి ఉంటుంది. కాని అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువుకు అర్హత ఉండదు.

వయసు

- జేఆర్ఎఫ్‌కు సంబంధించి జనరల్ కేటగిరి అభ్యర్థులకు డిసెంబర్ 2025 నాటికి 30 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళా అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ (నాన్‌క్రిమిలేయర్)లకు మూడేళ్ల గరిష్ట వయో సడలింపు వర్తిస్తుంది.
- అసిస్టెంట్ ప్రొఫెసర్/పీహెచ్‌డీ ప్రవేశాలకు గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

మూడు కేటగిరీలుగా ఎంపిక

- సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో మూడు కేటగిరీలు (కేటగిరీ1,2,3)గా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. దరఖాస్తు సమయంలోనే అభ్యర్థులు తమ కేటగిరీని పేర్కొనాల్సి ఉంటుంది.
- **కేటగిరీ–1 అవార్డ్ ఆఫ్ జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం:** ఇందులో అర్హత సాధించిన వారికి..జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తోపాటు పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు కూడా అర్హత లభిస్తుంది. జేఆర్ఎఫ్‌కు అర్హత పొందిన వారిని యూజీసీ నిబంధనలకు అనుగుణంగా ఇంటర్వ్యూ ద్వారా పీహెచ్‌డీలో ప్రవేశం కల్పిస్తారు.
- **కేటగిరీ–2 అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీలో ప్రవేశం:** ఇందులో అర్హత పొందిన వారికి పీహెచ్‌డీలో అడ్మిషన్‌కు అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అవకాశం లభిస్తుంది. వీరికి జేఆర్ఎఫ్‌కు అవకాశం ఉండదు.
- **కేటగిరీ–3 పీహెచ్‌డీలో ప్రవేశం:** ఈ కేటగిరీలో అర్హత సాధించిన అభ్యర్థులకు పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు మాత్రమే వీలుంటుంది.

200 మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష

- సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్షను మొత్తం 200 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)విధానంలో నిర్వహిస్తారు.
- ఈ పరీక్షలో ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్ ఉంటాయి. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో(బైలింగ్వల్) ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ఈ పరీక్ష ప్రశ్న పత్రంలో మూడు విభాగాలు.. పార్ట్ ఏ, పార్ట్ బీ, పార్ట్ సీ ఉంటాయి.
- పార్ట్ ఏలో.. జనరల్ అప్టిట్యూడ్ విభాగం అందరికీ కామన్‌గా ఉంటుంది. ఇందులో లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సీరిస్ ఫార్మేషన్, పజిల్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పార్ట్ ఏలో అడిగే 20 ప్రశ్నల్లో 15 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. ఇందులో ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు కేటాయిస్తారు. అదేవిధంగా ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు.
- పార్ట్ బీలో.. సంబంధిత సబ్జెక్టుపై ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఇవి సాధారణంగా పేర్కొన్న సిలబస్ నుంచే ఉంటాయి.
- పార్ట్ సీలో.. సబ్జెక్టు సంబంధిత ఉన్నత స్థాయి ప్రశ్నలు అడుగుతారు. ఇవి సదరు సబ్జెక్టులో అభ్యర్థికున్న లోతైన నైపుణ్యాన్ని పరిశీలించేలా ఉంటాయి. అభ్యర్థి విశ్లేషణ సామర్థ్యంతోపాటు అప్లికేషన్ ఓరియెంటేషన్‌ను సైతం పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు.

సబ్జెక్టు ప్రశ్నలు ఇలా

- కెమికల్ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 40 ప్రశ్నలుంటే.. ఏవైనా 35 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతోంది. ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 60 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఇలా కెమికల్ సైన్సెస్‌లో మొత్తం 120 ప్రశ్నల్లో 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతోంది.
- ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 50 ప్రశ్నలుంటే.. ఏవైనా 35 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 80 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి 1.32 మార్కులు తగ్గిస్తారు. ఇలా ఈ విభాగంలో మొత్తం 150 ప్రశ్నల్లో 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతోంది.
- లైఫ్ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 50 ప్రశ్నలుంటే.. ఏవైనా 35 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 75 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఇలా లైఫ్ సైన్సెస్‌లో మొత్తం 145 ప్రశ్నల్లో 75 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతోంది.
- మ్యాథమెటికల్ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 40 ప్రశ్నలుంటే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి మూడు మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి 0.75 మార్కులు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 60 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 4.75 మార్కులు కేటాయిస్తారు. పార్ట్‌సీలో నెగిటివ్ మార్కులు లేవు. ఇలా మ్యాథమెటికల్ సైన్సెస్‌లో మొత్తం 120 ప్రశ్నల్లో 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతోంది.



సీఎస్ఐఆర్ యూజీసీ నెట్2025

- ఫిజికల్ సైన్సెస్‌లో.. పార్ట్ బీలో 25 ప్రశ్నలుంటే.. ఏవైనా 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికి 3.5 మార్కులు లభిస్తాయి. ప్రతి పొరపాటు సమాధానానికి 0.875 మార్కులు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ సీలో మొత్తం 30 ప్రశ్నలు అడిగితే.. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఇందులో ప్రతి సరైన సమాధానానికి 5 మార్కులు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి 1.25 మార్కులు తగ్గిస్తారు. ఇలా ఫిజికల్ సైన్సెస్‌లో మొత్తం 75 ప్రశ్నల్లో 55 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతోంది.

ఎంపిక ఎలా

- జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీలో అడ్మిషన్ కోసం ఎంత మందిని అర్హులుగా ప్రకటించాలో ఫలితాల కమిటీ నిర్ణయిస్తుంది.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి నిబంధనల మేరకు సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ మార్కులకు 70 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూ/వైవా వోస్ మార్కులకు 30 శాతం వెయిటేజీ కల్పిస్తారు.
- సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ కేటగిరీ 2, 3లో పొందిన మార్కులను యూనివర్సిటీలు/ఇతర ఉన్నత విద్యాసంస్థలు పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎంట్రెన్స్ టెస్ట్ మాదిరిగా పరిగణనలోకి తీసుకోవచ్చు. అయితే ఈ పరీక్ష ఫలితాలు వెలువడిన రోజు నుంచి ఒక ఏడాది వరకూ మాత్రమే పరిగణనలో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.09.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.10.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది:** 25.10.2025.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 27.10.2025 నుంచి 29.10.2025 వరకు
- **పరీక్ష తేది:** 18.12.2025.
- **వెబ్‌సైట్:** https://csirnet.nta.nic.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-సోషల్ స్టడీస్- మెథడాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఆధునిక భౌతికశాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-జనరల్ ఇంగ్లిష్



MODEL	125 CF	NS 125	150	NS 160	NS 200
100% GST లాభం	₹8 287/-*	₹9 897/-*	₹10 758/-*	₹12 532/-*	₹13 603/-*
PF + ఇన్సూరెన్స్ లో ఆదా	₹3 000/-*	₹3 500/-*	₹3 800/-*	₹4 500/-*	₹4 800/-*
హ్యాట్రిక్ సేవింగ్స్	₹11 287/-*	₹13 397/-*	₹14 558/-*	₹17 032/-*	₹18 403/-*

10 YEAR WARRANTY | BAJAJ SECURE • AMC • ROAD SIDE ASSISTANCE | 72198 21111 | HDFC BANK | SHRIRAM Finance | IDFC FIRST Bank | BAJAJ AUTO CREDIT | L&T Finance | TATA CAPITAL Two Wheeler Loans

*నియమాలు మరియు నిబంధనలు వర్తిస్తాయి. సెప్టెంబర్ 22, 2025 హ్యాట్-ట్రిక్ పొదుపులు వర్తిస్తాయి. పూర్తి పొదుపులలో ఉంటాయి 100% జీఎస్‌టీ లాభం (ఎక్స్- షోరూమ్ ధర మరియు వర్తించే ఆర్‌టీఓ పన్నుల పైన), ప్రాసెసింగ్ ఫీ సున్నా, మరియు 1-సంవత్సరం సొంత హాని బీమా. సున్నా పిఎఫ్ పైన పొదుపులు మరియు ఋణసదుపాయం అందించువారి/బీమాతీయువారి ప్రకారం సున్నా పిఎఫ్ మరియు ఓడీ పైన పొదుపులలో మార్పు ఉండవచ్చు. ఋణసదుపాయం అందించువారి విచక్షణ మేరకు ఋణసదుపాయం ఉంటుంది. 5 సంవత్సరాల ప్రమాణిత వారంటీ + 5 సంవత్సరాల పొడిగించబడిన వారంటీ @ ₹999/. సూచించిన స్టంట్స్‌ని నిపుణుల ద్వారా, వృత్తిపరమైన పర్యవేక్షణలో నియంత్రిత వాతావరణ పరిసరాలలో కొనసాగించడం జరిగింది. నకలు చేసే ప్రయత్నం చెయ్యకండి; ఎల్లప్పుడు ట్రాఫిక్ మరియు భద్రత నియమాలు పాటించండి.

Authorised Dealers For Bajaj Auto Ltd.: Bahadurpura SRI VINAYAKA BAJAJ 9393745666 • Begumpet SRI VINAYAKA BAJAJ 9390459666 • Chandanagar VARUN BAJAJ 8297544420 • Dilsukhnagar SRI VINAYAKA BAJAJ 9391770116 • ECIL SELECT AUTOMOBILES 8008104461 • NAMPALLY SRI VINAYAKA BAJAJ 9642488833• Erragadda MGB BAJAJ 8978865666• Habsiguda SELECT BAJAJ 8008104400 • Hydernagar JNTU SELECT AUTMOBILES 9154292284 • Kachiguda SRI VINAYAKA BAJAJ 9030030280 • Suchitra VVC Motorcycle 8143690900, 8143690900 • Kondapur VARUN BAJAJ 8297544408 • Kukatpally Y Jun SELECT AUTMOBILES 9154292288 • LB Nagar SRI VINAYAKA BAJAJ 9948222455 • RC Puram VARUN BAJAJ 8297544405 • RP Road DECCAN BAJAJ 9948884427 • Tirumalgiri SELECT AUTOMOBILES 80081044466 • Tolichowki ABHINANDAN BAJAJ 8008803761 • Uppal SELECT BAJAJ 8008100966. Amberpet SRI VINAYAKA BAJAJ 9133425299, Hayathnagar SRI VINAYAKA BAJAJ 9010115299, Vidyanagar SRI VINAYAKA BAJAJ 9393836388,Malkajgiri SELECT BAJAJ 8008104445, Anandbagh SELECT BAJAJ 9154802444, Jagadgirigutta SELECT BAJAJ 9154292300, Pragathinagar SELECT BAJAJ 9154292288, Miyapur Bachupally SELECT BAJAJ 8341124434



CONSUMER OFFERS OF UP TO ₹1 63 000^ | EXCHANGE BONUS OF UP TO ₹1 00 000^ | UP TO 100% WAIVER ON CAR LOAN PROCESSING FEE** | SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU | E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM | Contact us at 1800-200-6392 1800-102-6392

For detailed T&C kindly visit nearest dealership. Maruti Suzuki India Limited reserves the rights to discontinue offers without notice and offers may vary across variants. ^Offers include consumer offer, exchange bonus and institutional or rural offers (wherever applicable) on select models/variants. Finance is at the sole discretion of the financer. 3 years or 100 000 km, whichever is earlier. Above offers are valid until stocks last. Black glass shade on the vehicle is due to the lighting effect. Images used are for illustration purposes only. Car colour may vary due to printing on paper. Revised prices effective from September 22, 2025. *Prices subject to applicable GST rates as notified by the Government. **By selected finance partners.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

దక్షిణాఫ్రికాలో వైఎస్సార్‌సీపీ ఎన్నారై యూత్ నిరసన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ దక్షిణాఫ్రికాలో 'సే నో టు ప్రైవెటైజేషన్' పేరిట వైఎస్సార్‌సీపీ ఎన్నారై యూత్ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఇందులో పలువురు ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.

బాబు పాలనలో రాష్ట్రానికి ఏమీ చేయలేదు

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కడప రూరల్: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా రాష్ట్రానికి ఏమీ చేయలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. సోమవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి, సమస్యలను దారి మళ్లించడానికి చంద్రబాబు ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు.

'అప్సడా'కు సభ్యుల నియామకం

సాక్షి, అమరావతి: ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా)కి వివిధ రంగాలకు చెందిన వారిని సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాసంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ (ప్రాసెసింగ్ ప్లాంట్స్ విభాగం) గుత్తికొండ శ్రీరాజబాబు (ఫీడ్ మాన్యుఫ్యాక్చరర్స్ వింగ్), వేగేశ్న సత్యనారాయణరాజు (ఆక్వాకల్చర్ హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్ డీలర్), విత్తనాల నాగశ్రీనివాస (హేచరీస్), లంకే నారాయణ ప్రసాద్, మహ్మద్ నూరుద్దీన్ (చేప రైతులు), రాచమళ్ల మీరయ్య, వంకా కొండబాబు, వేగేశ్న సాయి మనోహరరాజు (రొయ్య రైతులు)లను సభ్యులుగా నియమిస్తూ సోమవారం మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఆదేశాలు జారీ చేశారు.

'ఈ-క్రాప్' నమోదును వెంటనే పూర్తి చేయాలి

సాక్షి, అమరావతి: దేవాలయ భూముల్లో పంటల సాగు వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయకపోవడం వల్ల కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఏపీ కౌలురైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నారు వేయడం, కలుపు తీయడం, ఎరువులు చల్లడం పూర్తయిందన్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారన్నారు. సాగు చేపట్టి నాలుగు నెలలు దాటిపోతున్నా ఇంతవరకు ఈ భూముల్లో సాగు వివరాల నమోదు చేపట్టలేదన్నారు.

- గత నెలలో అనంతపురం రూరల్ మండలానికి చెందిన 30 ఏళ్ల యువకుడు గుండె నొప్పిగా ఉందంటూ అనంతపురంలోని సర్వజనాస్పత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షిస్తున్న సమయంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు.
- అనంతపురం నగరపాలక సంస్థలో పని చేసే ఓ ఉద్యోగి ఇటీవల అమరావతికి వెళ్లారు. మార్గమధ్యంలో ఉన్నఫళంగా గుండె నొప్పి వచ్చింది. తోటి సిబ్బంది హుటాహుటిన కర్నూలు జిల్లాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వీరిద్దరే కాదు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇటీవల యువతలో గుండె పోట్లు పెరిగిపోయాయి.



బీ'ట్' కేర్ ఫుల్

- యువతలో అధికమైన గుండె సమస్యలు
- ఆహార అలవాట్లు, వ్యసనాలతోనే సమస్యలంటున్న వైద్య నిపుణులు
- మెరుగైన జీవన విధానంపై దృష్టి సారించాలని సూచనలు



అనంతపురం మెడికల్: నిండు నూరేళ్లు జీవించాలని పెద్దలు ఆశీర్వదిస్తుంటారు. వందేళ్లు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆనందంగా జీవనం సాగించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ప్రస్తుత రోజుల్లో వందేళ్ల మాట పక్కన పెడితే 25 నుంచి 30 ఏళ్లకే యువత మరణిస్తుండడం కలచివేస్తోంది. ప్రధానంగా గుండె సంబంధిత సమస్యలతో ప్రాణాలో కోల్పోతుండడం కలవరపరుస్తోంది. చెట్టంత కొడుకు కళ్లముందే ప్రాణాలు విడుస్తుండడంతో తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా సగటున 25 వేల మందికిపైగా గుండెపోట్లకు గురవుతుండడం గమనార్హం. 2019–20లో 4,660, 2020–21లో 5,107, 2021–22లో 6,637, 2022–23లో 7,909, 2023–24లో 10,274, 2024–25లో 9,754, 2025లో 7 వేల వరకు (ఇప్పటి వరకు) గుండె సంబంధిత శస్త్రచికిత్సలు జరిగాయి.ఏటా ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం (ఆరోగ్య శ్రీ)లో భాగంగా 30 శాతానికి పైగా గుండె జబ్బులకే వ్యయమవుతోంది. రూ.25 కోట్లకు పైగానే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

విద్యార్థి దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా రోజూ కనీసం అరగంట వాకింగ్, వ్యాయామం చేయాలంటున్నారు. ఆహారంపై కూడా శ్రద్ధ వహించాలని చెబుతున్నారు. జంక్ ఫుడ్‌తో ఓబెసిటీ, గ్యాస్ట్రైటీస్ తదితర సమస్యలు తలెత్తుతాయంటున్నారు. వారానికి 150 నిమిషాలు కనీస నడక మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, 40 ఏళ్లు పైబడిన వారు తప్పకుండా బీపీ, కొలెస్ట్రాల్, షుగర్, టెస్టులు చేయించుకుని మందులు వాడితే గుండెపోటును నియంత్రించవచ్చంటున్నారు.

వ్యసనాలతోనే సమస్య..

వ్యసనాలకు బానిసలు కావడం,వ్యాయామం, యోగా తదితర వాటికి దూరంగా ఉండడం తదితర కారణాలతో చిన్నవయసులోనే గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత రోజుల్లో యువత పార్టీల పేరుతో ఇష్టానుసారంగా మద్యం తీసుకుంటున్నారు. అత్యంత ప్రమాదకరమైన ధూమపానాన్ని సేవిస్తున్నారు. దీనికి తోడు ఉరుకుల పరుగుల జీవితంలో బిజీగా ఉంటూ మానసిక ఒత్తిడికి లోనవుతూ హైపర్‌టెన్షన్, మధుమేహం బారిన పడుతున్నారు.

యోగాతో సత్ఫలితాలు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి ఆహార అలవాట్లు లేకపోవడం, శారీరక శ్రమ చేయకపోవడం, నిద్రలేమి తదితర కారణాలతో తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారు. గుండె పోటు, బీపీ, మధుమేహం తదితర సమస్యలు తెచ్చుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేయాలి. యోగా బాగా ఉపయోగపడుతుంది. నిత్యం యోగా చేస్తే సత్ఫలితాలు పొందవచ్చు.

– సురేష్ ఈశాపతి, యోగా గురువు, అనంతపురం

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



జంక్ ఫుడ్, పొగ తాగడం, వ్యాయామం లేకపోవడంతో యువత మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. వారంలో కనీసం ఐదు రోజుల పాటు వ్యాయామం చేయాలి. వంశపారంపర్యంగా కూడా గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత రోజుల్లో 12 మందిని పరీక్షిస్తే అందులో ముగ్గురికి కచ్చితంగా బీపీ సమస్య కన్పిస్తోంది.ఈ పరిస్థితుల్లో 40 ఏళ్లు దాటిన వారందరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

– సుభాష్ చంద్రబోస్, అసోసియేట్ ప్రొఫెసర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

బొమ్మల కొలువు భలే..భలే

సీతంపేట: దసరా... అంటే మనకు గుర్తొచ్చేది నవరాత్రులు.. బొమ్మల కొలువులు.. సంప్రదాయ వంటలు. ప్రస్తుతం నగర జీవన విధానంలో క్షణం తీరిక లేకుండా ఉన్నవారికి బొమ్మల కొలువు అంటే ఏదో కొత్త మాట విన్నట్లుగా అనిపిస్తుంది. విశాఖలోని ఓ కుటుంబం మాత్రం 15 ఏళ్లుగా ఏటా విజయదశమి రోజున బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తోంది. పురాణ గాథలు, దేవతల విశిష్టత, మానవ జీవన పరిస్థితులు తెలియజేసేలా ఈ బొమ్మల కొలువు ఉంటుంది. లలితానగర్‌లోని తొండం వినాయకుని గుడి వద్ద నివసించే గృహిణి రంగుడు మాధురి తమ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సుమారు వెయ్యికి పైగా బొమ్మలతో ఈ కొలువును తీర్చిదిద్దారు. ఇందులో సమస్త దేవతలు, తిరుపతి బ్రహ్మోత్సవాలు, రాముడు, కృష్ణుడి వృత్తాంతాలు, అష్టలక్ష్ములు, నవ దుర్గలు, నవ వారాహిలు వంటి పురాణ ఘట్టాలు కనువిందు చేస్తున్నాయి. కుమార్తె ఆర్.సాయి వైష్ణవి..డాక్టర్ రామవరపు మాధురి దేవి వద్ద మ్యూజిక్ నేర్చుకుంటోంది. సంగీత శిక్షణకు గుర్తుగా బొమ్మలతో రూపొందించిన 'మ్యూజికల్ థీమ్' కొలువు కూడా ఆకర్షణగా నిలుస్తోంది. 15 ఏళ్లుగా ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. పెళ్లికి ముందు అమ్మగారి ఇంట్లో బొమ్మల కొలువు పెట్టేవాళ్లం. ఆ తర్వాత అత్తగారింట్లో వారి పిల్లలు పెట్టేవారు. వారికి పెళ్లై వెళ్లిపోయాక, ఈ సాంస్కృతిక వారసత్వాన్ని తానే భుజాన వేసుకుని ప్రతి ఏటా నవరాత్రుల్లో పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు 15 రోజులపాటు ఈ కొలువును ఏర్పాటు చేస్తున్నానని మాధురి తెలిపారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లినప్పుడల్లా మంచి బొమ్మలను సేకరించి, ప్రతి ఏటా కొలువులో ప్రదర్శిస్తానని, ప్రతి బొమ్మ వెనుక ఒక జ్ఞాపకం దాగి ఉందని మాధురి తెలిపారు. ఈ అపురూప బొమ్మల కొలువు పౌర్ణమి వరకు ఉంటుందని తెలిపారు.



మ్యూజికల్ థీమ్‌తో సుమారు వెయ్యి బొమ్మలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు







దసరా బొమ్మల కొలువులు..



దసరా ఉత్సవాలలో అమ్మవారి ఊరేగింపు

బ్రిటిషర్లను భయపెట్టిన... చెడీ తాలింఖానా

- కోనసీమలో దసరా ప్రత్యేకం
- స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో 169 ఏళ్లుగా సాగుతున్న ప్రదర్శన
- ఇటీవల పెరిగిన ఆదరణ
- ఎన్‌ఆర్‌ఐలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి రాక
- మైసూర్ తరువాత... 'పచ్చని సీమ'లోనే 'దసరా' శోభ
- సంక్రాంతికి ప్రభల తీర్థం.. దసరాకు చెడీ తాలింఖానా

సాక్షి, అమలాపురం/అమలాపురం టౌన్: కోనసీమ అనగానే ప్రకృతి అందాలు, పర్యాటక కేంద్రాలకే కాదు.. సంస్కృతీ సంప్రదాయాలకు.. ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు. సంక్రాంతి వస్తే పల్లె ముస్తాబవుతుంది. నింగిలోని ఇంద్ర ధనస్సులు 'ప్రభ'లుగా మారి నేలన నడయాడతాయి. తీర్థాలతో ఈ ప్రాంతం హోరెత్తుతుంది. ఇక దసరా వస్తే చెడీ తాలింఖానా ప్రదర్శన.. అమ్మవార్ల వాహనాల ఊరేగింపులతో జనజాతరగా మారిపోతుంది. ఒకప్పుడు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో నేర్చుకున్న ఈ చెడీ తాలింఖానా వీర విద్య రానురానూ ప్రజల సంప్రదాయ కళలలో ఒక భాగమైంది.

శతాబ్దాల చరిత్ర

అజ్ఞాతం ముగిసిన తరువాత జమ్మి చెట్టు మీద ఉన్న పాండవుల ఆయుధాలు చేతులకు వచ్చినట్టుగా ఇక్కడ దసరాకు ముందు దాచి ఉంచిన కత్తులు కొత్తగా పదునెక్కుతాయి. బరిసెలు బయటకు వస్తాయి. రాత్రి వేళల్లో అగ్గిబరాటాలు నిప్పులు కక్కుతాయి. లేడి కొమ్ములు, పొడవాటి కర్రలు కళాత్మకంగా తిరుగుతుంటాయి. ఆపై అమ్మవారి ఊరేగింపులతో కోనసీమలో దసరా కొత్త పుంతలు తొక్కుతుంది.దసరా ఉత్సవాలు కర్ణాటకలోని మైసూరు తరువాత కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఇంచుమించు రెండు శతాబ్దాల నుంచి జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రాచీన యుద్ధాలను తలపించే చెడీ తాలింఖానా వీరత్వానికి మారుపేరుగా నిలుస్తోంది. శతాబ్దాల చరిత్ర ఉన్న తాలింఖానాకు నేటికీ ఆదరణ చెక్కు చెదరలేదు. కర్రలు, కత్తులు, లేడి కొమ్ములతో వారు చేసే ప్రదర్శన ప్రేక్షకులను గగుర్పాటుకు గురి చేస్తాయి. యువకుల నుంచి వృద్ధుల వరకూ వయోభేదం మరచి చేసే తాలింఖానా విన్యాసాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయి. అన్ని వీధులు ఈ ప్రదర్శనలతో నిండిపోతాయి. ఇంచుమించు నెల రోజుల ముందు నుంచే ఈ ప్రదర్శనకు అవసరమైన శిక్షణ పొందుతారు. కొత్త తరం కూడా ఈ విద్యా ప్రదర్శనకు ఉత్సాహంగా ముందుకు రావడం విశేషం.

మంత్రముగ్ధులను చేసేలా..

దసరా ఉత్సవాలలో భాగంగా పురవీధుల్లో చెడీతాలింఖానా ప్రదర్శన జరుగుతుంది. ఈ ఏడాది అక్టోబరు 2వ తేదీ రాత్రి అంతా ఈ కార్యక్రమం జరుగనుంది. వీధుల్లో యువకులు, పెద్దలు ప్రాచీన యుద్ధవిన్యాసాలను తలపించేలా ప్రదర్శించే చెడీ తాలింఖానా విద్య ఉద్విగ్నభరితంగా సాగుతుంది. కళ్లకు గంతలు కట్టుకుని మనిషి మీద, కంఠం, నుదిటిపై, పొత్తి కడుపుల మీద కొబ్బరి కాయలు, కూరగాయలు పెట్టి నరకడం వంటి విన్యాసాలు తాలింఖానాలో ముఖ్య ఘట్టాలు. అగ్గిబరాటాలు, లేడికొమ్ములు, పట్టాకత్తులు వేగంగా.. చురుగ్గా కదుపుతూ యువకులు చేసే విన్యాసాలు రాచరిక యుద్ధ సన్నాహాలను తలపిస్తాయి. ఈ ప్రదర్శనలో ఏమాత్రం ఏమరు పాటు జరిగినా ప్రాణాలకు ప్రమాదం. అయినా కూడా అత్యంత ధైర్య సాహసాలతో శిక్షణ పొందిన ఆరేళ్ల చిన్నారుల నుంచి అరవై ఏళ్ల వృద్ధుల వరకు చేసే ప్రదర్శన మంత్రముగ్ధులను చేస్తుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైనా, ఎన్‌ఆర్‌ఐలైనా ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు రెక్కలు కట్టుకుని వాలిపోతుంటారు.అమలాపురంలో చెడీ తాలింఖానా విద్య ప్రదర్శన వెనుక స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి ఉందని స్థానికులు చెబుతుంటారు. బ్రిటిష్ సేనలతో పోరాడే భారతీయుల్లో ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ దసరా, వినాయక చవితి ఉత్సవాలను ప్రోత్సహించారు. ఈ విద్య స్థానికంగా 1835 కొంకాపల్లిలో మొదలైంది. అయితే దసరా వేడుకలలో 1856లో మహిపాల వీధిలో రైతుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు అబ్బిరెడ్డి రామదాసు ఈ విద్యకు అంకురార్పణ చేశారు. ఇది ఇక్కడ ప్రారంభమై 190 సంవత్సరాలు అవుతోంది. అప్పటి నుంచి ఈ ప్రదర్శన నిర్విఘ్నంగా సాగుతోంది. వీటితో పాటు గండువీధి మైనర్స్ పార్టీ, నల్లా వీధి, శ్రీరామపురం మైనర్స్ పార్టీ, రవణం మల్లయ్య వీధి తాలింఖానా ప్రదర్శనలకు దశాబ్దాల చరిత్ర ఉంది. చెడీ తాలింఖానా ప్రదర్శనతో పాటు పట్టణానికి చెందిన ఏడు వీధులలో కొలువు తీరిన వాహనాలను ఊరేగింపులో ప్రదర్శిస్తారు. బాజాభజంత్రీలు, డప్పు వాయిద్యాలు, శక్తి వేషధారణలు, కోయడ్యాన్సులు, బుట్టబొమ్మలు, మ్యూజికల్, తీన్‌మార్ బ్యాండ్‌లు, విద్యుత్ దీపాలంకరణలతో వాహనాలు ముందుకు సాగుతాయి.కొంకాపల్లి ఏనుగు అంబారీ వాహనం , ఆంజనేయస్వామి వాహనం, మహిపాలవీధి రాజహంస, గండువీధి శేషశయన, రవణం వీధి మహిషాసుర మర్దిని, రవణం మల్లయ్యవీధి గరుడ విష్ణు, నల్లా వీధి శ్రీవిజయ దుర్గమ్మవారు వాహనం, శ్రీరామపురం హంస, శ్రీకృష్ణుడు, వినాయక వాహనాలు పురవీధుల్లో ఊరేగింపుగా వెళతాయి. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి, తెలంగాణా ప్రాంతం నుంచి కూడా ఈ ఉత్సవాలను తిలకించేందుకు అమలాపురానికి తరలివస్తారు.



చెడీ తాలింఖానా ప్రదర్శనలు



చెడీ తాలింఖానా ప్రదర్శనలు

తరతరాలుగా నిర్వహిస్తున్నాం



దశాబ్దాల కాలం నుంచి అమలాపురంలో ఈ ప్రదర్శన జరుగుతోంది. మా తాతలు మాకు వారసత్వంగా అందించారు. మేము మా వారసులకు ఈ విద్యను అందిస్తాం. ఈ ప్రాచీన విద్యను ప్రభుత్వాలు గుర్తించాల్సి ఉంది.

– పనస బుజ్జి, నిర్వాహకుడు, కొంకాపల్లి, అమలాపురం

రోజుకు ఎనిమిది గంటల శిక్షణ



దసరాకు ముందు ఆయుధ పూజ చేసిన తరువాత సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు శిక్షణ ఇస్తాం. రోజుకు 150 నుంచి 250 మంది వరకు గురువుల వద్ద శిక్షణ పొందుతారు. ఎక్కువగా చిన్నారులు, యువత రావడం వల్ల భవిష్యత్‌లో కూడా ఈ ప్రదర్శన నిర్విఘ్నంగా సాగుతుందనే ఆశ మాకుంది.

– అబ్బిరెడ్డి మల్లేష్, నిర్వాహకుడు, మహిపాల వీధి, ఎన్‌ఆర్‌ఐ (అమెరికా)

బయటపడుతున్న.. బంగారం బండారం!

- బట్టబయలవుతున్న బంగారం మోసాలు
- శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఇదే బాగోతమా?
- మొన్న నకిలీ హాల్‌మార్క్ మోసం
- తాజాగా జీఎస్టీ అధికారుల సోదాలతో వెలుగులోకి జీరో వ్యాపారం
- చివరికీ మోసపోతున్నది వినియోగదారులే



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: బంగారం వ్యాపారానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే నరసన్నపేటలో ఇటీవల కాలంలో పలు అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఇది ఒక్క పేటకే పరిమితం కాకుండా.. జిల్లా అంతటా పలు షాపుల్లో అక్రమాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నరసన్నపేటలో ఆ మధ్య నకిలీ హాల్‌మార్క్ బంగారం పెద్ద ఎత్తున దొరికింది. ఇప్పుడేమో జీఎస్టీ అధికారుల దాడులతో జీరో వ్యాపారం జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వానికి ట్యాక్స్ ఎగ్గొట్టి వినియోగదారులను కొల్లగొడుతున్నట్లు తెలుస్తోంది. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు ఇప్పుడిది నరసన్నపేటకే పరిమితం కాకుండా జిల్లా అంతటా నడుస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మాటల గారడీ..

ధర పెరిగినా ప్రజలకు బంగారంపై మోజు తగ్గడం లేదు. తులం బంగారం రూ.లక్షా 25 వేలు దాటినా వెనక్కి తగ్గడం లేదు. రోజురోజుకూ అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి. బంగారానికి ఉన్న డిమాండ్‌ను కొందరు వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు. ప్రజల్ని అమాయకులను చేసి బురిడీ కొట్టిస్తున్నారు. నాలుగు మంచి మాటలు చెప్పి బుట్టలోకి లాగేస్తున్నారు. ఈ క్రమంలో జరుగుతున్న మోసాల్లో బయటికొచ్చినవి కొన్నే. వెలుగులోకి రానివెన్నో. అలాగని అందరూ అలాంటి వారు కాదు. కొందరు నిజాయితీగా వ్యాపారం చేసి, వినియోగదారుల మన్ననలు, నమ్మకం పొందుతున్నారు.

దొంగ బంగారం ఆరోపణలు..

ఇప్పటికే దొంగతనం బంగారం, నాణ్యత తక్కువ ఉన్న ఆభరణాలు, ట్యాక్స్ చెల్లించని బంగారం విక్రయిస్తుంటారన్న ప్రచారం ఉంది. గతంలో దొంగ బంగారాన్ని పోలీసులు రికవరీ చేసిన సందర్భాలు ఉన్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వచ్చి కూడా ఇక్కడ రికవరీ చేశారు. 24 క్యారెట్ అని 22 క్యారెట్, 22 క్యారెట్ పేరిట 18 క్యారెట్ బంగారం ఇస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. బిల్లులపై స్పష్టంగా రాయడం లేదని ఆ మధ్య ఒక అధికారి హెచ్చరించినట్టు తెలిసింది. మొత్తానికి మోసమనేది కొన్నిచోట్ల జరుగుతోంది.

జీరో వ్యాపారం..

మోసాలతో పాటు జీరో వ్యాపారం జోరుగా సాగుతున్నట్టుగా తాజాగా జరిగిన జీఎస్టీ అధికారుల సోదాలతో తెలుస్తోంది. కోయంబత్తూరు, చెన్నై, ముంబై తదితర నగరాల నుంచి బిల్లులు లేకుండా కొనుగోలు చేసిన బంగారాన్ని ఇక్కడ వినియోగదారులకు కట్టబెడుతున్నట్టు సమాచారం. ఒక్క వినియోగదారులకే కాకుండా పలు షాపులకు కూడా సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా మాత్రం ఆ జీఎస్టీ లెక్కలు ఎవరికీ అర్థం కాకుండా వేస్తున్నారు. కొందరికైతే జీఎస్టీ లేకుండా బంగారం విక్రయిస్తున్నారు. జీఎస్టీ లేకుండా బంగారం కావాలంటే బిల్లులు ఉండవని చెప్పేస్తున్నారు. ఈ తరహా కొనుగోళ్లలోనే మోసాలు జరుగుతున్నాయి. బిల్లుల్లేని బంగారంలో మోసాలకు పాల్పడుతున్నారు. తిరిగి అమ్మేటప్పుడు నిలదీయాలంటే బిల్లులు ఉండాలి. అవి లేనప్పుడు వినియోగదారుడు ఏం అడగగలడని వ్యాపారులు దగా చేస్తున్నారు.

నకిలీ హాల్‌మార్క్ మోసాలు..

ప్రత్యేకంగా తయారు చేసిన లేజర్ మిషనరీతో నకిలీ హాల్‌మార్క్ వేసి బంగారం విక్రయిస్తున్నారు. ఆ నకిలీ హాల్‌మార్క్ బయటపడకుండా ఉండేందుకు నెట్‌లో ఉన్న వేరే వారి హెచ్‌యూఐడీ నంబర్లు వేస్తున్నారు. సాధారణంగా హెచ్‌యూఐడీ నెంబర్‌ను గూగుల్ సెర్చ్ చేస్తే మొత్తం వివరాలన్నీ వచ్చేస్తాయి. ఆ రకంగా వెలుగు చూడకూడదని వేరే వారి హెచ్‌యూఐడీ నంబర్‌ను ఉపయోగించి సొంతంగా ఏర్పాటు చేసుకున్న మిషన్‌తో హాల్‌మార్క్ వేసి వ్యాపారం సాగించేస్తున్నారు. ఆ మధ్య నరసన్నపేటలో ఇదే మోసం వెలుగుచూసింది. వాస్తవంగా ఈ రకమైన మోసం జిల్లాలో చాలాచోట్ల జరుగుతోందని సమాచారం. ఆకస్మిక తనిఖీల్లో అక్కడ బండారం బయటపడింది. దీంతో మనం కొనుగోలు చేస్తున్న బంగారంలో నాణ్యతెంతో ? అన్న అనుమానం వినియోగదారుల్లో నెలకొంది.

హెల్త్





మన్నూ మింగలేని ప్లాస్టిక్స్ మనను మింగుతున్నాయి!



బరువు పెంచి ఒబేసిటీని కలిగిస్తోంది కాబట్టి ఆ ప్లాస్టిక్ పదార్థాలకు 'ఒబిసోజెన్స్' అని పేరు!

మనం ఉపయోగించే షాంపూ బాటిల్ సైతం మన బరువును పెంచే అవకాశం ఉందంటున్నారు పరిశోధకులు. కేవలం షాంపూ బాటిల్ మాత్రమే కాదు... షవర్ జెల్, హెయిర్ కండిషనింగ్ క్రీమ్ లాంటి వాటిని ప్యాక్ చేసే కొన్ని సీసాలతో పాటు తిరిగి మాటిమాటికీ భర్తీ చేసుకోడానికి అవకాశమున్న డ్రింకింగ్ బాటిళ్లలో ఉండే ప్లాస్టిక్ కూడా బరువు పెరగడానికి కారణమవుతోందన్న విషయాన్ని గత కొద్దిరోజుల ముందర నార్వేలోని నార్వేజియన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ నిర్వహించిన ఓ పరిశోధనతో తెలిసింది. ఈ అధ్యయనంలో భాగంగా 629 రకాల వివిధ ప్లాస్టిక్ వస్తువుల్లో ఉంచిన దాదాపు 55,000 రకాల రసాయనాలను పరీక్షించారు. వీటిల్లో పదకొండు రకాల రసాయనాలు బరువు పెరగడానికి కారణమవుతాయని తేలిందని పరిశోధనకు నేతృత్వం వహించిన, ఆ సంస్థకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ మార్టిన్ వేజ్నర్ తెలిపారు. ఆ ప్లాస్టిక్ సీసాలను ఉపయోగించినప్పుడు మన దేహంలోకి ప్రవేశించే ఆ పదకొండు రకాల రసాయనాల వల్ల బరువు పెరుగుతుండటంతో వాటిని 'ఒబిసోజెన్స్' అని పేర్కొంటున్నారు.

మరీ ముఖ్యంగా బైస్ఫినాల్-ఏ వంటి 'ఒబిసోజెన్స్' మన దేహంలోని జీవరసాయన ప్రక్రియల్లో జోక్యం చేసుకోవడంతో పాటు కొవ్వు నిండి ఉండే ఫ్యాట్ సెల్స్‌ను పెరిగిపోయేలా చేయడం వల్ల దేహం బరువు అకస్మాత్తుగా పెరుగుతోందని ఈ అధ్యయనంలో పాల్గొన్న మరో పరిశోధకుడు జొహన్నెస్ వోకర్ తెలిపారు. అంటే ఇప్పటివరకూ ప్లాస్టిక్ పర్యావరణానికి హానికరమని, అలాగే బైస్ఫినాల్-ఏ, థ్యాలేట్స్ వంటి ప్లాస్టిక్స్ వల్ల అనేక నాడీ సంబంధమైనవి, వ్యాధినిరోధకతను తగ్గించేవి, ప్రత్యుత్పత్తి వ్యవస్థను దెబ్బతీసేలాంటి అనారోగ్యాలు కలగడమే కాదు... ఇప్పుడు తాజాగా బరువు పెరిగేలా చేయడం ద్వారా కూడా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని స్పష్టమైంది. బరువు పెరగడం వల్ల... స్థూలకాయం కారణంగా ఆరోగ్యపరంగా అనేక అనర్థాలు వస్తాయనే విషయం తెలిసిందే. ఈ అధ్యయన వివరాలన్నీ 'ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే ప్రముఖ జర్నల్ లో ప్రచురితమయ్యాయి.





డాక్టర్ శివరాజు
సీనియర్ ఫిజీషియన్

నిజం చెప్పాలంటే మనమిప్పుడు ప్లాస్టిక్ మహాసముద్రం మధ్యలో జీవిస్తున్నాం. ఇది అతిశయోక్తిగా అనిపించవచ్చుగానీ... మన రోజువారీ కార్యకలాపాల్లో చూసుకుంటే పొద్దున్నే బ్రష్, స్నానంలో మగ్, రుద్దుకునే సబ్బు తాలూకు సోప్‌కేస్ అన్నీ ప్లాస్టిక్‌వే. ఇక ఆఫీసుకు వచ్చాక తాగే మొదటిచాయ్ నుంచి బయటకు వెళ్లినప్పుడు చాయ్ అమ్మే వ్యక్తి ఇచ్చే టీ వరకు చాలావరకు ప్లాస్టిక్కే. గతంలోని స్టీల్ క్యారియర్ స్థానంలో ఇప్పుడు చాలా లంచ్‌బాక్సులు ప్లాస్టిక్‌వే. ఇలా చూసుకుంటే మనం వాడే నిత్యజీవిత ఉపకరణాల్లో ప్రతి ఐదింటిలో కనీసం మూడైనా ప్లాస్టిక్‌వే ఉంటాయి. కానీ ఈ ప్లాస్టిక్ సముద్రమిప్పుడు సునామీగా మారి మన ఆరోగ్యాలను దెబ్బతీస్తోంది. అది ఏయే విధంగా మన ఆరోగ్యాలను కబళిస్తోందీ, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించలేకపోయినా కనీసం దాన్ని రీ-సైకిల్ చేసేందుకు వీలుగా ఉండే వాటిని వాడాలనే అవగాహన కోసమే ఈ కథనం.

మన ఇళ్లలో చెత్త ఊడ్చాక దాన్ని ఎత్తడానికీ ప్లాస్టిక్ చేటనే వాడతాం. అయితే ఇలాంటి ఉపకరణాలతో అప్పటికప్పుడు ఆరోగ్యానికి వచ్చే ప్రమాదమేమీ పెద్దగా లేకపోయినప్పటికీ... వేడి వేడి ఆహారాన్ని నిల్వ చేయడానికి ఉపయోగించే ప్లాస్టిక్ ఉపకరణాలతో మాత్రం ఆరోగ్యాలకు ఎంతో నష్టం చేకూరుతుంది. ఆ ప్లాస్టిక్‌ల కారణంగా ఆరోగ్యానికి జరిగే చేటు ఏమిటో, దాన్ని నివారించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం.

ప్లాస్టిక్‌తో ఆరోగ్యానికి హాని ఎందుకు..?

ఇందుకు ఓ ఉదాహరణగా... ఆహారం పెట్టుకోడానికి గతంలో వాడే స్టీలుకు బదులు ప్లాస్టిక్ ఉపకరణాలను వాడుతున్నప్పుడు మన ఆరోగ్యానికి కలిగే హాని ఏమిటో తెలుసుకుందాం. ఆహారం ప్లాస్టిక్ బాక్స్‌లలో నిల్వ ఉంచి తీసుకుంటున్నప్పుడు మనం దాన్ని తిన్నప్పుడల్లా బాక్స్ తాలూకు ప్లాస్టిక్ పదార్థాలూ కొద్దికొద్ది మోతాదుల్లో ఆహారంతోపాటు మన దేహంలోకి వెళ్తుంటాయి. ఆహారంతో పాటు ప్లాస్టిక్ మన శరీరంలోకి వెళ్లి, మన దేహంలోకి ఇంకిపోయే ప్రక్రియను 'లీచింగ్' అంటారు.

ఈ ప్రక్రియ ఎక్కువగా ఉండేదెప్పుడు..?

లీచింగ్ ఎక్కువగా జరిగేందుకు ఆస్కారం ఉన్న పరిస్థితులివే...

● ఆహారం ఎంత వేడిగా ఉంటే... అంతగా ప్లాస్టిక్ మన కడుపులోకి ప్రవేశిస్తుంది. ● అదే ఆహారంలో కొవ్వులు, ఉప్పు ఉన్నప్పుడు లీచింగ్ మరింత పెరుగుతుంది. ● మనం తీసుకునే ఆహారంలో అసిడిక్ వస్తువులు అంటే చింతపండు, సాంబార్ వంటి పులుపు వస్తువులు ఉంటే... మన ప్లాస్టిక్ కంటెయినర్ నుంచి మన దేహంలోకి ప్లాస్టిక్ ఎక్కువ మోతాదుల్లో కలుస్తుంటుంది.

ప్లాస్టిక్ బౌల్‌లో ఆహారాలు ఎందుకు పెట్టకూడదంటే...?!

ఈ మధ్యకాలంలో మనం అందంగా కనిపించే ప్లాస్టిక్ బౌల్స్‌లో కూరలూ, వేడి వేడి పులుసు వంటి ఆహారాలను ఉంచి, వాటిని డైనింగ్ టేబుల్ మీద అలంకరించి వాటిల్లోంచే అన్నం, కూరలు వడ్డించడాన్ని చూస్తున్నాం.

సాధారణంగా ఈ కూరలు పెట్టుకునే బౌల్స్‌ను 'మెలమెన్' అనే ప్లాస్టిక్ వంటి పదార్థంతో తమారు చేస్తారు. వేడి వేడి కూరలు, పులుసులు ఇందులోకి తీయగానే ఆ వేడికి ఆ ప్లాస్టిక్‌లోని మెలమైన్... ఆహారంతో పాటు కలిసి నోటి ద్వారా శరీరంలోకి వెళ్తుంది. ఇలా దేహంలోకి వెళ్లిన ఈ పదార్థం వల్ల కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశం ఉందని ఒక అధ్యయనంలో తేలింది. ఈ విషయం 'జామా ఇంటర్నల్ మెడిసిన్' జర్నల్‌లోనూ ప్రచురితమైంది.

ఈ అధ్యయనంలో భాగంగా కొంతమందికి మెలమైన్ బౌల్స్‌లో నూడుల్స్ ఇచ్చారు. మరికొందరికి పింగాణీ బౌల్స్‌లో ఇచ్చారు. ఈ రెండు గ్రూపుల వారికి నిర్వహించిన మూత్ర పరీక్షల్లో మెలమైన్ బౌల్స్‌లో తిన్నవారి మూత్రంలో మెలమైన్ మోతాదులు దాదాపు ఎనిమిది రెట్లు ఉన్నాయని తేలింది. దీంతో వారిలో కిడ్నీ ఫెయిల్యూర్ వంటి ముప్పుతో పాటు... క్యాన్సర్ ప్రమాదమూ ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు చెబుతున్నాయి. మెలమైన్ బౌల్‌లో పెట్టి ఏ ఆహారాన్నీ మైక్రోవేవ్ ఒవెన్‌లోఉంచి వేడిచేయకూడదని అమెరికన్ సంస్థ ఎఫ్‌డీఏ కూడా గట్టిగా సిఫార్సు చేస్తోంది. ఈ ప్లాస్టిక్ ప్రభావం ముఖ్యంగా హార్మోన్లపై... మరీ ముఖ్యంగా మహిళల్లోని ఈస్ట్రోజెన్ స్రావంపై ఉంటుందనీ, దీనివల్ల ప్రత్యుత్పత్తికి తోడ్పడే హార్మోన్ల సమతౌల్యంలో తేడాలు వచ్చి గర్భధారణ సమస్యలు రావచ్చని తేలింది. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, కదలికలు తగ్గడం, పురుష సంబంధ హార్మోన్ల స్రావం తగ్గడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి.

చాలామందిలో డయాబెటిస్ రిస్క్ పెరుగుతున్నట్లుగా ఇలాంటిదే మరో అధ్యయనంలోనూ తేలింది. స్థూలకాయం వస్తున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. రొమ్ము క్యాన్సర్ వంటి క్యాన్సర్ రిస్కులు చాలా ఎక్కువ. ప్లాస్టిక్ బౌల్స్‌లో వేడి వేడి ఆహారం పెట్టుకుని తీసుకునేవారిలో మెదడు కణాలు బలహీనమై జ్ఞాపకశక్తి తగ్గుతున్నట్లు, మూడ్స్ మారిపోవడం వంటి సమస్యలు వస్తున్నట్లు గుర్తించారు. అల్జైమర్స్ వంటివి కూడా ఎక్కువగా పెరుగుతున్నట్లు పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి. ప్లాస్టిక్ ఉపయోగం కారణంగా ఇలా పలు రకాలుగా ఆరోగ్యంపై అనేక దుష్ప్రభావాలు పడుతున్నాయి. అందుకే కూరలు, పులుసులు నిల్వ చేసుకునేందుకు ప్లాస్టిక్ బౌల్స్‌లో కాకుండా పింగాణీ బౌల్స్ వాడటం మేలని నిపుణులు చెబుతున్నారు.

మరో సరికొత్త అధ్యయన ఫలితమిలా...

పిల్లలు పాలు తాగడానికి ఉపయోగించే పాలపీకలు మొదలుకొని, వాళ్లు ఆడుకునే ఆట వస్తువుల వరకు ప్లాస్టిక్‌తో తయారైనవి కాస్తా... చాలాకాలం తర్వాత... అంటే ఆ చిన్నారులే పెరిగి కాస్త పెద్దయ్యాక (అంటే పెద్దపిల్లలుగా ఉన్నప్పుడూ, వాళ్ల కౌమార ప్రాయంలో/అడాలసెంట్ వయసులో) వాళ్ల ఆరోగ్యంపై దుష్ప్రభావాలు చూపుతాయంటూ వేలాది తల్లులూ, పిల్లలపై నిర్వహించిన ఓ అధ్యయనం తెలుపుతోంది. అలా ఆ ప్లాస్టిక్ వస్తువులు వాడిన ఆ పిల్లలతోపాటు తల్లుల్లో సైతం మొదట స్థూలకాయం... దాని ప్రభావంతో గుండె జబ్బులు, ఆస్తమా, సంతానలేమి వంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయంటూ ఆ అధ్యయనం పేర్కొంటోంది. ఈ ఫలితాలు ప్రముఖ హెల్త్ జర్నల్ 'ల్యాన్సెట్'లో ప్రచురితమయ్యాయి.

ప్లాస్టిక్ బాటిలో ఉంచిన నీళ్లు తాగచ్చా..?

మరో పరిశోధన తాలూకు ఫలితాలివి. ఇటీవల చాలామంది నీళ్లబాటిల్ కొని దాన్ని వాడుతూ ఉంటారు. ఇలా ఓ బాటిల్లో వారం పాటు ఉంచిన నీళ్లు తాగవచ్చా అనే అంశంపై ఇటీవల కొందరు పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు.

ఈ అధ్యయనంలో తేలిన అంశమేమిటంటే... ఇలా నీళ్లు నిల్వ ఉంచినప్పుడు ప్లాస్టిక్ కొద్దికొద్ది మోతాదుల్లో కలవడం (లీచ్ కావడం) వల్ల ఆరోగ్యానికి హాని జరుగుతుందనీ, అలాగే వారం పాటు ఉంచి నీళ్లలో బ్యాక్టీరియా పెరగడంతో కడుపులో ఇబ్బందిగా ఉండటం, కడుపు నొప్పి, డయేరియా వంటి సమస్యలు రావడమేగాక... కాస్త అరుదుగా అలాంటి కొందరిలో అది ప్రాణాపాయానికీ దారితీయవచ్చంటూ పరిశోధకులు పేర్కొంటున్నారు. ఇలా బ్యాక్టీరియా పెరగడమన్నది కేవలం నీళ్లలో జరిగినా, జరగకపోయినా... బాటిల్ తాలూకు మూతలో సైతం బ్యాక్టీరియా/మౌల్డ్ (నాచు వంటి పెరుగుదల) పెరగవచ్చంటూ వారు హెచ్చరిస్తున్నారు.

అసలు ప్లాస్టిక్ అంటే ఏమిటంటే...?

● ప్లాస్టిక్ వస్తువులు, ఉపకరణాలు ప్రధానంగా బైస్ఫినాల్ ఏ (బీపీఏ) అనే పదార్థంతో తయారవుతాయి. ● కొన్ని సందర్భాల్లో థాలేట్ అనే పదార్థంలోనూ ప్లాస్టిక్ ఉపకరణాలను తయారు చేస్తారు. మనం ఆహారం, తినుబండారాలూ, ఇతరత్రా ద్రవపదార్థాలను నిల్వ ఉంచేందుకు మనం రోజువారీ ఉపయోగించే ప్లాస్టిక్‌తో తయారైన ఉపకరణాలన్నీ (యుటెన్సిల్స్) ప్రధానంగా బైస్ఫినాల్ ఏ (బీపీఏ) లేదా థాలేట్‌తోనే తయారవుతాయి.

బీపీఏలతో ఆరోగ్యంపై దుష్ప్రభావాలు...

ప్లాస్టిక్ బాక్స్‌లలో ఉంచే ఆహారం వల్ల మన ఆరోగ్యంపై చాలా రకాల దుష్ప్రభావాలు పడతాయి. వాటిలో కొన్ని...

● ప్లాస్టిక్ కలిసిన ఆహారంతో హార్మోన్లపై... మరీ ముఖ్యంగా మహిళల్లోని ఈస్ట్రోజెన్ హార్మోన్‌పై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా మహిళల్లో ప్రత్యుత్పత్తికి తోడ్పడే హార్మోన్ల సమతౌల్యంలో తేడాలు వచ్చి గర్భధారణ సమస్యలు వచ్చే అవకాశాలెక్కువ.

● పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, కదలికలు తగ్గడం, పురుష సంబంధ హార్మోన్ల స్రావం తగ్గడం.

● వైద్యపరీక్షల్లో మూత్రంలో ప్లాస్టిక్ పాళ్లు పెరిగినట్లుగా రిపోర్టులు వచ్చిన చాలామందిలో డయాబెటిస్ కేసులు పెరుగుతున్నట్లుగా ఒక అధ్యయనంలో తేలింది.

● ప్లాస్టిక్ యుటెన్సిల్స్‌లో ఆహారం తీసుకునే వారిలో స్థూలకాయం వస్తున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది.

● రొమ్ము క్యాన్సర్ వంటి క్యాన్సర్ ముప్పు చాలా ఎక్కువ.

● ప్లాస్టిక్ కంటెయినర్లలో వేడి వేడి ఆహారం పెట్టుకుని తీసుకునేవారిలో మెదడు కణాలు బలహీనమై జ్ఞాపకశక్తి తగ్గుతున్నట్లు, మూడ్స్ మారిపోవడం వంటి సమస్యలు వస్తున్నట్లు గుర్తించారు. అల్జైమర్స్ వ్యాధి వంటివి కూడా ఎక్కువగా పెరుగుతోంది.

బీపీఏలతో తయారయ్యే ఉపకరణాలివి...

● పిల్లలకు ఉపయోగించే పాలపీకలు,
● వాటర్‌బాటిళ్లు, ● లంచ్‌బాక్సులు,
● సీడీలు, డీవీడీలు,
● కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు.

థాలేట్స్‌తో తయారయ్యే వాటిల్లో కొన్ని...

ఆహారంలో కలిసేందుకు అవకాశం ఉన్న మరో ప్లాస్టిక్ ఉపకరణాలు థాలేట్స్. (ఇంగ్లిష్‌లో థాలేట్స్ స్పెల్లింగ్‌కు ముందర ఉండే 'పీ' అక్షరం సైలెంట్ కాగా... కొందరు దీన్నే 'ఫ్తాతలేట్స్' అని కూడా ఉచ్చరిస్తుంటారు). ప్లాస్టిక్‌ను ఎటుపడితే అటు ఒంచేందుకు (ఫ్లెక్సిబిలిటీ కోసం) ఉపయోగించే పాలీ విన్సైల్ క్లోరైడ్ (పీవీసీ) ఆహారంలో కలిసి దుష్ప్రభావాలను చూపుతాయి.

థాలేట్స్‌ను ఏయే తయారీల్లో ఉపయోగిస్తారంటే...?

● ఆహారాన్ని ప్యాక్ చేసేందుకు వాడే బాక్స్‌ల కోసం. ● కూల్‌డ్రింక్స్ లేదా మంచినీటి సీసాల తయారీలో. ● వాటర్‌ప్రూఫ్ కోట్లు, జాకెట్స్ వంటి దుస్తుల తయారీలో ● నీళ్ల పైపుల తయారీలో. ● పైకి తోలులా కనిపించే కొన్ని రకాల దుస్తుల తయారీలో. ● విద్యుత్ వైర్లపై ఉండే ఇన్సులేటింగ్ పదార్థాలలో ● ఎలక్ట్రానిక్ వస్తువుల్లో, వినైల్ ఫ్లోరింగ్స్‌లో ● వాటర్‌బెడ్స్, పిల్లల ఆటవస్తువుల్లో

ఆరోగ్యంపై థాలేట్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు

● బైస్ఫినాల్ ఏ (బీపీఏ) లాగే థాలేట్స్ కూడా టెస్టోస్టెరాన్ వంటి పురుష సెక్స్ హార్మోన్‌పై దుష్ప్రభావం చూపుతాయి. వీటి వల్ల పురుషుల్లో వీర్యం నాణ్యత (స్పెర్మ్ క్వాలిటీ) కూడా దెబ్బతింటుంది. ● ప్లాస్టిక్‌తో కలిసిన ఆహారం వల్ల అలర్జీలు, ఆస్తమా, పిల్లికూతలు రావచ్చు.

మరికొన్ని రకాల ప్లాస్టిక్‌లు... ఆరోగ్యంపై వాటి దుష్ప్రభావాలు

మనం అన్నింటినీ కలిపి (బ్రాడ్‌గా) ప్లాస్టిక్ అని పిలిచే వాటిల్లో ఎన్నో రకాలున్నాయి. ఉదాహరణకు...

● **పాలీ ఇథిలీన్ టెరెథాలేట్ (పీఈటీ)**
ఈ పదార్థంతో తయారైన సీసాలను మనం 'పెట్ బాటిల్స్' అంటాం. వీటిల్లో సాఫ్ట్ డ్రింక్స్, జ్యూస్‌లు, నీళ్లు, మౌత్‌వాష్‌లు వంటివి ప్యాక్ చేస్తుంటారు. దీనివల్ల దీర్ఘకాలంలో శ్వాససమస్యలు, చర్మంపై ఇరిటేషన్, మహిళల్లో రుతుసంబంధ వ్యాధులు కనిపిస్తుంటాయి. కొన్నిసార్లు గర్భస్రావాలూ జరగవచ్చు. వీటితో మనకు ఏర్పడే దుష్ప్రభావాలూ / సమస్యలపై పరిశోధనలింకా సాగుతూనే ఉన్నాయి.

● **హై డెన్సిటీ పాలీ ఇథిలీన్ (హెచ్‌డీపీఈ)**
పాల సీసాలు, బ్లీచ్‌లు, షాంపూసీసాలు, వంటనూనెలు, కిటికీల్ని శుభ్రపరిచే ద్రవాలు (విండోక్లీనర్స్), కొన్ని రకాల మందులను ప్యాకింగ్ ట్యూబ్‌ల తయారీలో 'హెచ్‌డీపీఈ' ఉపయోగిస్తారు. వీటితో చాలామందిలో అలర్జీలు, ఆస్తమా సమస్యలు వస్తున్నట్లుగా గుర్తించారు. కొందరిలో కాలేయం, కిడ్నీలు, స్ప్లీన్, ఎముకలపై దుష్ప్రభావాన్ని చూపుతాయి.


● **లో-డెన్సిటీ పాలీ ఇథిలీన్ (ఎల్‌డీపీఈ)**
చాలా రకాల కిరాణా వస్తువుల ప్యాకింగ్‌లలో, బ్రెడ్, ఫ్రోజెన్ ఫుడ్ ఐటమ్స్ నిల్వ కోసం ఈ పదార్థాన్ని ఉపయోగిస్తుంటారు. దీన్నే 'సాఫ్ట్ ప్లాస్టిక్' అని కూడా అంటరు. దీంతో చేసిన ప్యాకింగ్‌లోని పదార్థాలను తొలగించగానే ఇవి తేలిగ్గా ముడుచుకుపోతాయి.

● **పాలీస్టైరీన్ (పీఎస్)**
వీటిని గుడ్లను నిల్వచేసే కార్టన్లు, డిస్పోజబుల్ కప్పులు, ప్లాస్టిక్‌తో చేసే స్పూనులు, ఫోర్కులు (కట్లెరీ), కాంపాక్ట్ డిస్కుల వంటి వాటి తయారీలో వాడుతారు. వీటితో నాడీవ్యవస్థపై, ప్రత్యుత్పత్తి వ్యవస్థపై, ఎర్రరక్తకణాల పైన ప్రభావం పడుతుంది.

● **పాలీ ప్రొపిలీన్ (పీపీ)**
కెచప్ సీసాలు, పెరుగు ప్యాకింగ్, మార్జరిన్ అనే వంట నూనెలు, మందులు, సిరప్‌లు, పారదర్శకం కాని కొన్ని మందుల్ని నిల్వ చేసే సీసాల తయారీకి వీటిని ఉపయోగిస్తుంటారు. మిగతా ప్లాస్టిక్‌లతో పోలిస్తే దీన్ని చాలావరకు సురక్షితమని అంటారుగానీ... దీనివల్ల కలిగే దుష్ప్రభావాలపై ఇంకా పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి. అంతమాత్రాన ఇది పూర్తిగా సురక్షితమని చెప్పడానికి వీలు లేదు.

ప్లాస్టిక్‌తో అనర్థాల నివారణకు కొన్ని సూచనలివి...

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి లేదా ఒకవేళ వాడుతున్నప్పటికీ... చాలావరకు వాటిని సురక్షితంగా మలచుకోడానికి కొన్ని సూచనలివే... ● ప్లాస్టిక్ వస్తువుల తయారీలో బైస్ఫినాల్ ఏ లేనివి (బీపీఏ ఫ్రీ) అని రాసి ఉన్న వాటిని మాత్రమే వాడాలి. ● ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించాల్సి వస్తే... వాటిపై 'మైక్రోవేవ్ సేఫ్' అని రాసి ఉన్నవే వాడాలి. అవి మైక్రోవేవ్ ఒవెన్‌లో పెట్టినా కరగవు. లేకపోతే ఆ ఉష్ణోగ్రత వద్ద ప్లాస్టిక్ ఎంతో కొంత కరిగి ఆహారంలో కలిసి ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని గుర్తుంచుకోవాలి. ● ప్లాస్టిక్ వస్తువులను కఠినమైన డిటర్జెంట్స్ మోతాదులు ఎక్కువగా ఉండే డిష్‌వాషర్స్‌లో ఎక్కువసేపు నానబెట్టి ఉంచడం సరి కాదు. ● పిల్లల పాలకోసం గ్లాస్‌తో చేసిన పాల సీసాలు ఉపయోగించడమే మంచిది. ప్లాస్టిక్ సీసాలు ఉపయోగించేప్పుడు వాటిలో వేడి వేడి పాలు పోయకూడదు. ● ఆహారాన్ని ఉంచడం కోసం ప్లాస్టిక్ డబ్బాల కంటే స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు మంచివని గుర్తుంచుకోవాలి. ● కొన్ని లంచ్‌బాక్స్‌లు మూత సాగినట్లుగానూ, కింద ఉన్న కంటెయినర్ కాస్త సాగిపోయి షేప్ చెడిపోయనట్లుగానూ ఉంటాయి. ఇలా సాగి ఉన్నట్లుగా ఉన్న ఆహారపు డబ్బాలను ఏమాత్రం ఉపయోగించకూడదు. ● ఇక మనం రోజూ నీళ్లను నిల్వ చేసుకోడానికి ఉపయోగించే ప్లాస్టిక్ డ్రమ్ముల వంటి వాటిని కేవలం నీళ్ల నిల్వ కోసం తయారు చేసినవాటినే ఉపయోగించాలి. అయితే చాలామంది కొన్ని రకాల రసాయనాలను (కెమికల్స్) నిల్వ ఉంచడానికి వాడిన వాటిని కడిగి వాటిని నీళ్ల నిల్వ కోసం వాడుతుంటారు. ఇలాంటివి కూడా అంత మంచిది కాదు.



నిర్వహణ: యాసీన్

బిజినెస్ రీల్

మహీంద్ర వర్సిటీ, అపోలో హెల్త్‌కేర్ అకాడెమీ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అలైడ్ హెల్త్ సైన్సెస్‌లో బ్యాచిలర్స్ కోర్సు ప్రారంభించే దిశగా హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ, అపోలో హెల్త్‌కేర్ అకాడెమీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. డిమాండ్ అధికంగా ఉన్న అనస్థీషియా, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, మెడికల్ ల్యాబరేటరీ టెక్నాలజీ, కార్డియోవాస్కులర్ టెక్నాలజీ మొదలైన స్పెషలైజేషన్స్‌పై ఈ కోర్సు ప్రధానంగా దృష్టి పెడుతుంది. బోధనకు సంబంధించి మహీంద్రా వర్సిటీకి చెందిన ఆధునిక మౌలిక సదుపాయాలు, క్లినికల్ నైపుణ్యాల్లో అపోలో హెల్త్‌కేర్ అకాడెమీ అనుభవంతో విద్యార్థులు ప్రయోజనం పొందవచ్చని ఇరు సంస్థలు తెలిపాయి. ఆఖరు సంవత్సరంలో ఇంటర్న్‌షిప్‌తో పాటు అపోలో హాస్పిటల్స్, భాగస్వామ్య నెట్‌వర్క్‌లలో ప్లేస్‌మెంట్‌పరంగా కూడా మద్దతు లభిస్తుంది.

270 నగరాలకు అమెజాన్ ఫ్రెష్ సర్వీసుల విస్తరణ



న్యూఢిల్లీ: నిత్యావసరాల సర్వీసులు అమెజాన్ ఫ్రెష్‌ను తాజాగా 270 పైగా నగరాలకు విస్తరించినట్లు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా వెల్లడించింది. నెల్లూరు, గోరఖ్‌పూర్, డెహ్రాడూన్, జలంధర్, కోయంబత్తూరు, జంషెడ్‌పూర్, దుర్గాపూర్ మొదలైన ప్రాంతాల్లోనూ ఈ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించింది. పండుగ సీజన్ సందర్భంగా ఇది కీలక విస్తరణగా నిలుస్తుందని పేర్కొంది. ఫ్రెష్ రెండేళ్ల వ్యవధిలోనే నాలుగున్నర రెట్లు విస్తరించిందని వివరించింది.

బ్లూక్లౌడ్ సాఫ్టెక్ చైర్మన్‌కి గ్లోబల్ ఏఐ అవార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌కి చెందిన లిస్టెడ్ టెక్నాలజీ కంపెనీ బ్లూ క్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ గ్రూప్ చైర్మన్ తేజేశ్ కుమార్ కొడాలి, చైర్మన్ జానకి యార్లగడ్డకి ప్రతిష్టాత్మక గ్లోబల్ ఏఐ ఎక్సలెన్స్ పురస్కారాలు దక్కాయి. లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఇండో-యూరోపియన్ బిజినెస్ ఫోరం నిర్వహించిన వికసిత్ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో వీటిని ప్రదానం చేశారు. కృత్రిమ మేథ, వినూత్న టెక్నాలజీలతో పరిశ్రమల వృద్ధికి దోహదపడే కొత్త ఆవిష్కరణలపై కృషి చేస్తున్నందుకు గాను ఈ పురస్కారాలు లభించినట్లు తేజేశ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-9-2025

విశాఖ	520-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	734.6	3.07
TITAN	3,417.00	2.7
HINDALCO	756.1	1.65
SBIN	870.25	1.55
WIPRO	239.4	1.55

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	16,000.00	-1.76
AXISBANK	1,134.00	-1.73
DRREDDY	1,238.90	-1.13
HDFCLIFE	756.25	-1.07
EICHERMOT	6,973.50	-1.04

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,486
ఎన్ఎస్ఈ	1,33,255
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,27,572
ఎఫ్ఐఐ	- 2,832
డీఐఐ	+ 3,846

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.05 (రాత్రి 11.30కు)	$ 65.72 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.72 (రాత్రి 11.30కు)	$ 69.22 (క్రితం ముగింపు)

పటిష్టంగా ఆర్థిక వృద్ధి

- స్థిరంగా భారత్ రేటింగ్
- బీఏఏ3గా కొనసాగింపు
- మూడీస్ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్ దీర్ఘకాలిక రుణ రేటింగ్‌ను స్థిరమైన ఔట్‌లుక్‌తో యథాతథంగా 'బీఏఏ3'గా కొనసాగిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తెలిపింది. ఆర్థిక వృద్ధి పటిష్టంగా ఉండటం, అంతర్జాతీయంగా వాణిజ్యం, చెల్లింపులకు సంబంధించి మెరుగైన స్థితిలో ఉండటం, తదితర అంశాలు ఇందుకు కారణమని సంస్థ వివరించింది. ఇవన్నీ కూడా అమెరికా టారిఫ్‌ల భారం, తయారీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు ఎదురవుతున్న అవాంతరాలు మొదలైన అంతర్జాతీయ ప్రతికూల పవనాలను ఎదుర్కొనే బలాన్ని అందిస్తున్నాయని పేర్కొంది. దేశీయంగా భారీ మార్కెట్, జనాభా తీరుతెన్నులపరంగా సానుకూలతలాంటి అంశాలు .. అంతర్జాతీయ షాక్‌ల నుంచి దేశీ ఎకానమీకి రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు, జీడీపీ వృద్ధి అధిక స్థాయిలో ఉండటం, ఆర్థిక స్థిరీకరణ వంటి అంశాలనేవి భారీ స్థాయిలో ఉన్న ప్రభుత్వ రుణభారాన్ని నెమ్మదిగా తగ్గించుకోవడానికే తోడ్పడతాయే తప్ప ఎకాయెకిన తగ్గించుకోవడానికి ఉపయోగపడకపోవచ్చని తెలిపింది. పైగా వినిమయాన్ని పెంచే దిశగా ఇటీవల తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయానికి కొంత గండి పడుతుందని, దీంతో రుణభారాన్ని అదుపులో ఉంచుకోవడం కష్టంగా మారొచ్చని మూడీస్ వివరించింది. ఇటీవలే ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ సంస్థ 18 ఏళ్లలో తొలిసారిగా భారత్ సార్వభౌమ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసింది. 'ట్రిపుల్‌బీ మైనస్' నుంచి ట్రిపుల్ బీ'కి పెంచింది. అటు జపాన్‌కి చెందిన రేటింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ (ఆర్అండ్ఐ) కూడా దీర్ఘకాలిక సావరీన్ రేటింగ్‌ను ట్రిపుల్ బీ నుంచి ట్రిపుల్ బీ ప్లస్‌కి పెంచింది. ఇక మార్నింగ్‌స్టార్ డీబీఆర్ఎస్ సైతం ట్రిపుల్ బీ (కనిష్ట) నుంచి ట్రిపుల్ బీ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది.

వేగవంతమైన వృద్ధి..

2023–24లో 9.2 శాతంగా నమోదైన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 2025 ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతానికి నెమ్మదించినా కూడా గత రెండు, మూడేళ్లుగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న జీ20 దేశంగా భారత్ కొనసాగుతోందని మూడీస్ వివరించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ప్రభుత్వ వ్యయాలు పెంచడం, ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, ద్రవ్యపరపతి విధానాన్ని సరళతరం చేయడంపై కేంద్రం దృష్టి పెడుతుండటమనేది దేశీయంగా వినియోగం, పెట్టుబడులు పెరగడానికి దన్నుగా నిలుస్తుందని మూడీస్ తెలిపింది. అమెరికా భారీ టారిఫ్‌లను విధించడం వల్ల సమీప భవిష్యత్తులో భారత ఆర్థిక వృద్ధిపై పడే ప్రతికూల ప్రభావాలు పరిమితంగానే ఉంటాయని పేర్కొంది. అయితే, అధిక విలువను జోడించగలిగే ఎగుమతి ఆధారిత పరిశ్రమగా తయారీ రంగాన్ని తీర్చిదిద్దాలన్న భారత ఆకాంక్షలకి అవరోధాలు కలిగించడం ద్వారా మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా వృద్ధి అవకాశాలపై ప్రభావం చూపవచ్చని తెలిపింది. ప్రస్తుత దశలో సంప్రదింపుల వల్ల టారిఫ్‌లు తగ్గే అవకాశం ఉందని, దేశీ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం గణనీయంగానే ఉండొచ్చని మూడీస్ పేర్కొంది.

వచ్చే ఏడాది గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్


స్విస్ కంపెనీతో టీకేఐఎల్ జత



న్యూఢిల్లీ: ఈపీసీ కాంట్రాక్టర్ సంస్థ టీకేఐఎల్ ఇండస్ట్రీస్(గతంలో థిస్సెన్‌క్రుప్ ఇండస్ట్రీస్ ఇండియా) వచ్చే ఏడాదిలో దేశీయంగా గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా స్విట్జర్లాండ్ కంపెనీ సోహైటెక్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు టీకేఐఎల్ ఇండస్ట్రీస్ ఎండీ, సీఈవో వివేక్ భాటియా తాజాగా వెల్లడించారు. సోహైటెక్‌తో భాగస్వామ్యంతో దేశీయంగా గ్రీన్ హైడ్రోజన్ విభాగంలో అత్యంత ఆధునిక ఇన్నొవేటివ్ సొల్యూషన్లను అందించనున్నట్లు తెలియజేశారు. ఇందుకు ప్రొప్రయిటరీ ఆర్టిఫిషియల్ ఫొటోసింథసిస్(ఫొటోఎలక్ట్రోలిసిస్) టెక్నాలజీని వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా సౌర(సోలార్), పవన(విండ్) తదితర పునరుత్పాదక ఇంధనాల నుంచి గ్రీన్ హైడ్రోజన్‌ను తయారు చేయనున్నట్లు వివరించారు. వీటిని పలు పరిశ్రమలలో వినియోగించేందుకు వీలుంటుందని తెలియజేశారు. తాజా సాంకేతికతతో రానున్న 12 నెలల్లో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈపీసీ సంస్థగా గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు ఏర్పాటుకు స్టీల్, ఆయిల్ మార్కెటింగ్ తదితర రంగాలలోని కంపెనీలతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాణిజ్య ఒప్పందంపై యూఎస్‌తో చర్చలు

- మరెన్నో దేశాలతో సంప్రదింపులు
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: అమెరికా సహా పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కోసం చర్చలు కొనసాగుతున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. న్యూజిలాండ్, ఒమన్, పెరూ, చిలీ, ఐరోపా సమాఖ్య (ఈయూ) ఇందులో ఉన్నాయి. ఖతార్, బహ్రెయిన్ సైతం భారత్‌తో వాణిజ్య ఒప్పందాల పట్ల సుముఖంగా ఉన్నట్లు గోయల్ చెప్పారు. ఆగస్టులో ఆర్మీనియా, బెలారస్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, రష్యాతో కూడిన యూరేషియన్ ఎకనమిక్ యూనియన్ (ఈఏఈయూ) భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులకు వీలుగా షరతుల కార్యాచరణపై సంతకం చేయడం గమనార్హం. నోయిడాలో జరిగిన యూపీ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో సందర్భంగా గోయల్ దీనిపై మాట్లాడారు.

1 నుంచి ఈఎఫ్‌టీఏతో ఒప్పందం అమలు

నాలుగు ఐరోపా దేశాలతో కూడిన యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)తో కుదిరిన వాణిజ్య, ఆర్థిక ఒప్పందం (టిపా) అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని గోయల్ చెప్పారు. ఈ ఒప్పందం భారత వర్తకులకు ప్రయోజనం కలిగిస్తుందని చెప్పారు. దీని కింద 15 ఏళ్లలో భారత్‌కు 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రానున్నట్టు పేర్కొన్నారు. గత వారం మంత్రి గోయల్ ఆధ్వర్యంలో అధికారిక బృందం చర్చల కోసం న్యూయార్క్‌కు వెళ్లి రావడం తెలిసిందే. అక్టోబర్-నవంబర్ నాటికి మొదటి దశ ఒప్పందం కోసం రెండు దేశాలు కృషి చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఐదు దశల చర్చలు నడిచాయి. 2024-25లో 86.5 బిలియన్ డాలర్ల ఎగుమతులతో వరుసగా నాలుగో ఏడాది భారత్‌కు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా నిలిచింది. రెండు దేశాల మధ్య 132 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఒప్పందం కుదరడం, ముఖ్యంగా భారత్‌కు ప్రయోజనం కలిగించనుంది. రష్యాపై చమురు కొంటుందన్న కారణంతో విధించిన 25 శాతం అదనపు టారిఫ్‌లు తొలగిపోతాయి.

ఆర్‌బీఐ రూటెటు..?

- మొదలైన పరపతి ద్రవ్య సమీక్ష
- 1న వెల్లడి కానున్న నిర్ణయాలు



ముంబై: ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమీక్షా సమావేశం సోమవారం మొదలైంది. కీలక రెపో రేటును 5.50 శాతం వద్ద కొనసాగిస్తూ, యథాతథ విధానానికి మొగ్గు చూపించొచ్చని కొందరు విశ్లేషకుల అంచనా. మరికొందరు అయితే పావు శాతం రేటు కోతను చేపట్టొచ్చని భావిస్తున్నారు. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన గల ఎంపీసీ తన నిర్ణయాలను 1వ తేదీ ఉదయం ప్రకటించనుంది. భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించడం, అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు దేశ ఆర్థిక వ్యవస్థపై చూపించే ప్రభావాన్ని ఎంపీసీ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మూడు విడతల్లో ఆర్‌బీఐ మొత్తం 100 బేసిస్ పాయింట్లు (ఒక శాతం) మేర రెపో రేటును తగ్గించడం తెలిసిందే. ద్రవ్యోల్బణం నియంత్రణల్లోకి రావడంతో నగదు లభ్యత పెంపు దిశగా ఆర్‌బీఐ ఎన్నో చర్యలు చేపట్టింది. కానీ, ఆగస్ట్ సమీక్షలో మాత్రం యథాతథ స్థితికి మొగ్గు చూపించింది. అమెరికా టారిఫ్‌ల నేపథ్యంలో వేచి చూసే ధోరణిని అనుసరించింది.

డిసెంబర్‌లో కోత..

ఆర్‌బీఐ ఎంపీసీ రెపో రేటును 5.50 శాతం వద్ద కొనసాగిస్తుందని గోల్డ్‌మ్యాన్ శాక్స్ అంచనా వేసింది. తటస్థ విధానాన్ని కొనసాగించొచ్చని పేర్కొంది. గతంలో చేపట్టిన ఒక శాతం రేటు తగ్గింపు పూర్తి స్థాయిలో బదిలీ అయ్యే వరకు వేచి చూడొచ్చని అభిప్రాయపడింది. డిసెంబర్ సమీక్షలో 25 బేసిస్ పాయింట్లు తగ్గించి రెపో రేటును 5.25 శాతం చేయొచ్చని పేర్కొంది. వాణిజ్య అనిశ్చితులు ఆర్థిక వృద్ధిని కిందకు తీసుకెళతాయని ఎంపీసీ భావిస్తే అప్పుడు.. పావు శాతం రేటు తగ్గింపును అక్టోబర్ సమీక్షలోనే తీసుకోవచ్చని అంచనా వేసింది.

డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్ము

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా శిరీష్ చంద్ర ముర్మును కేంద్రం నియమించింది. ఎం.రాజేశ్వరరావు స్థానంలో ఈ నియామకం జరిగింది. రాజేశ్వరరావుకు పొడిగించిన పదవీకాలం అక్టోబర్ 8తో ముగియనుంది. అక్టోబర్ 9 లేదా ఆ తర్వాత బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పదవీకాలంతో ముర్ము నియామకానికి కేబినెట్ నియామక కమిటీ ఆమోదం తెలిపింది. ముర్ము ప్రస్తుతం ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

పేటీఎం చెల్లింపులపై గోల్డ్ కాయిన్లు



న్యూఢిల్లీ: పేటీఎం తన ప్లాట్‌ఫామ్‌పై చేసే ప్రతీ చెల్లింపు లావాదేవీపై బంగారం కాయిన్లను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ కాయిన్లను పేటీఎం డిజిటల్ గోల్డ్ కింద మార్చుకోవచ్చని ప్రకటించింది. షాపుల్లో పేటీఎం యాప్‌తో స్కాన్ చేసి చేసే చెల్లింపులు, ఆన్‌లైన్ చెల్లింపులు, నగదు బదిలీలు, రీచార్జ్‌లు, బిల్లు చెల్లింపులపై ఒక శాతం విలువ మేరకు గోల్డ్ కాయిన్లు లభిస్తాయి. యూపీఐ, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్‌బ్యాంకింగ్ లావాదేవీలపై రెట్టింపు గోల్డ్ కాయిన్లు లభిస్తాయని తెలిపింది. రోజువారీ చెల్లింపులను దీర్ఘకాల పొదుపు, పెట్టుబడులుగా మార్చుకునే అవకాశం దీంతో లభిస్తుందని పేర్కొంది.

జొమాటోలో 'హెల్దీ మోడ్' ఫీచర్



న్యూఢిల్లీ: యూజర్లు పౌష్టికాహారాన్ని అన్వేషించడానికి, ఆర్డర్ చేయడానికి వీలుగా ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం జొమాటో తమ యాప్‌లో కొత్తగా 'హెల్దీ మోడ్' ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతానికి గురుగ్రామ్ యూజర్లకు ఇది అందుబాటులో ఉందని, త్వరలో మిగతా మార్కెట్లలోనూ ప్రవేశపెడతామని కంపెనీ తెలిపింది. మెట్రో నగరాల్లోని 18–45 ఏళ్ల వారు ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించింది. భాగస్వామ్య రెస్టారెంట్లు ఇచ్చే వివరాలను బట్టి ఒక్కో వంటకానికి 'కనిష్ఠం' నుంచి 'సూపర్' వరకు' హెల్దీ స్కోరు' ఉంటుందని జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ తెలిపారు. ఈ ఫీచరులో మార్పులు, చేర్పులకు సంబంధించి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని యూజర్లను కోరారు.

మార్చి నుండి మార్కెట్ల అప్‌ట్రెండ్

- మరికొన్ని త్రైమాసికాలు ఆటుపోట్లు తప్పవు
- జియో బ్లాక్‌రాక్ సీఐవో రిషి కోహ్లి



న్యూఢిల్లీ: దేశ ఈక్విటీ మార్కెట్లలో మరికొన్ని త్రైమాసికాల పాటు ఆటుపోట్లు కొనసాగుతాయని జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ (సీఐవో) రిషి కోహ్లి పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి స్థిరమైన అప్‌ట్రెండ్‌లో కొనసాగొచ్చని అంచనా వేశారు. ఆర్థిక మూలాలు, స్థూల ఆర్థిక, సైక్లికల్ అంశాలు మార్కెట్ గమనాన్ని నిర్ణయిస్తాయన్నారు. జూన్ త్రైమాసికం ఫలితాలు వివిధ రంగాల మధ్య అసహజంగా ఉన్నాయంటూ, రానున్న నెలల్లో ఇవి స్థిరపడతాయని చెప్పారు. అంతర్జాతీయ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ అయిన బ్లాక్‌రాక్‌తో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ఏర్పాటు చేసిన 50:50 జాయింట్ వెంచర్ కంపెనీయే జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్. ఇటీవలే ఈ సంస్థ ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌ను ప్రారంభించడం గమనార్హం. ఈ పథకం కింద సమీకరించే పెట్టుబడుల్లో అధిక శాతాన్ని లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేయనున్నట్టు రిషి కోహ్లి తెలిపారు. బ్లాక్‌రాక్‌కు చెందిన సిస్టమ్యాటిక్ యాక్టివ్ ఈక్విటీస్ ప్లాట్‌ఫామ్ ఆధారితంగా ఈ పథకం పెట్టుబడులు పెట్టనుంది. డేటా విశ్లేషణ, నిపుణుల పరిశీలనతో పోర్ట్‌ఫోలియోను నిర్మించనుంది. ''ఫ్లెక్సీక్యాప్ మా మొదటి యాక్టివ్ ఫండ్. చురుకైన, భిన్నమైన, తక్కువ వ్యయాలతో కూడిన పరిష్కారాలు అందించడమే మా లక్ష్యం. అన్ని మార్కెట్ సైకిల్స్‌లో రిస్క్ నియంత్రణ దృష్టిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో సంపద సృష్టించాలన్న లక్ష్యం పెట్టుకున్నాం'' అని వివరించారు.

ఐపీవో స్ట్రీట్

లిస్టింగ్ బాటలో 7 కంపెనీలు

కొద్ది రోజులుగా దుమ్మురేపుతున్న ప్రైమరీ మార్కెట్లు భవిష్యత్‌లో మరింత దూకుడు ప్రదర్శించనున్నాయి. దిగ్గజాలు టాటా క్యాపిటల్, వియ్‌వర్క్ ఇండియా ఐపీవోలు వచ్చే వారం ప్రారంభం కానుండగా.. తాజాగా 7 కంపెనీలు లిస్టింగ్ బాట పట్టాయి. ఇందుకు అనుగుణంగా సెబీకి దరఖాస్తు చేశాయి. వివరాలు చూద్దాం..

- జాబితాలో హోటల్ పోలో, బాంబే కోటెడ్
- ఏపీపీఎల్ కంటెయినర్స్, ధరీవాల్ బిల్డ్‌టెక్
- ఆర్డీ ఇండస్ట్రీస్, కుసుమార్గ్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్..



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ఏడు కంపెనీలు ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. జాబితాలో హోటల్ పోలో టవర్స్, బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్స్, ఏపీపీఎల్ కంటెయినర్స్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్, ధరీవాల్ బిల్డ్‌టెక్, ఆర్డీ ఇండస్ట్రీస్, కుసుమార్గ్ చేరాయి. ఐపీవోలో భాగంగా స్టీల్ ప్రాసెసింగ్ సెంటర్లను నిర్వహించే బాంబే కోటెడ్ 1.5 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. స్టీల్ క్యాయిల్స్ ప్రాసెసింగ్‌లో ప్రత్యేకతను కలిగిన కంపెనీ ప్రస్తుతం 3,50,411 టన్నుల వార్షిక సామర్థ్యాన్ని అందుకుంది. గతేడాది(2024–25) ఆదాయం రూ. 1,056 కోట్లను తాకగా, రూ. 29 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ఆతిథ్య రంగ చైన్

ఐపీవోలో భాగంగా మధ్యస్థాయి ఆతిథ్య రంగ కంపెనీ హోటల్ పోలో టవర్స్ రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 71.2 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను విస్తరణ, ప్రస్తుత ప్రాపర్టీల ఆధునీకరణ, రుణ చెల్లింపులు తదితర అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ పోలో, మ్యాక్స్ బ్రాండ్లతో ప్రధానంగా దేశ ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాలలో మధ్యస్థాయి హోటళ్లు, రిసార్టులను నిర్వహిస్తోంది. త్రిపుర, కోల్‌కతా, మేఘాలయ, షిల్లాంగ్, ప్రయాగ్‌రాజ్, జబల్‌పూర్ తదితర ప్రాంతాలలో 425 గదులతో హోటళ్లను నిర్వహిస్తోంది. గతేడాది(2024–25) ఆదాయం రూ. 118 కోట్లను తాకగా, రూ. 22 కోట్ల నికర లాభం ఆర్జించింది.

కంటెయినర్ల తయారీ

గుజరాత్‌లోని భావనగర్ కేంద్రంగా ఏర్పాటైన ఏపీపీఎల్ కంటెయినర్స్ ఐపీవోలో భాగంగా 12.5 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్లు మరో 25.6 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలతోపాటు.. రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2021లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా కంటెయినర్ తయారీలో కార్యకలాపాలు విస్తరించింది. గతేడాది(2024–25) ఆదాయం రూ. 69 కోట్లను తాకగా, రూ. 33 కోట్ల నికర లాభం ఆర్జించింది.

సాస్ సొల్యూషన్స్

బ్లాక్‌చెయిన్, ఐవోటీ, డేటా సైన్స్ ఆధారంగా సాస్ సొల్యూషన్లు అందించే బాన్‌బ్లాక్ టెక్నాలజీస్ ఐపీవోలో భాగంగా రూ. 230 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా 2020లో ఏర్పాటైన చెన్నై కంపెనీ ప్రమోటర్ బాన్‌బ్లాక్ ఇంక్ 3 కోట్ల షేర్లను ఆఫర్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 136 కోట్లు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ప్లాట్‌ఫామ్స్‌కు, రూ. 13 కోట్లు ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లకు వినియోగించనుంది. మరికొన్ని నిధులను ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వెచ్చించనుంది. కంపెనీ ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ సర్వీసులు, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లలో వేగంగా విస్తరిస్తోంది.

రూ. 950 కోట్లకు రెడీ

ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ధరీవాల్ బిల్డ్‌టెక్ ఐపీవోలో భాగంగా రూ. 950 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఇష్యూ నిధులలో రూ. 203 కోట్లు ఎక్విప్‌మెంట్ కొనుగోలుకి, రూ. 174 కోట్లు, రూ. 300 కోట్లు సంస్థతోపాటు అనుబంధ కంపెనీ రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా రోడ్లు, హైవేలు, బ్రిడ్జిలు, సొరంగాలు తదితర నిర్మాణాలు చేపడుతోంది. గతేడాది(2024–25) ఆదాయం రూ. 1,153 కోట్లను తాకగా, రూ. 161 కోట్ల నికర లాభం ఆర్జించింది.

రికవరీ, రీసైక్లింగ్

ఇంధన స్టోరేజీ, నాన్‌ఫెర్రస్ స్క్రాప్ నుంచి రికవరీ, రీసైక్లింగ్ చేపట్టే ఆర్డీ ఇండస్ట్రీస్ ఐపీవోలో భాగంగా రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్లు మరో 3.76 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 220 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 22 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. లెడ్ అల్లాయ్స్, లెడ్ టిన్, లెడ్ సిల్వర్ తదితర ప్రొడక్టులను రూపొందిస్తోంది. కంపెనీకి ఆంధ్రప్రదేశ్‌లో తయారీ ప్లాంటు ఉంది.

రూ. 650 కోట్లపై కన్ను

ఇంజనీర్డ్ ఫ్యాబ్రిక్ తయారీ సంస్థ కుసుమార్గ్ ఐపీఓ ద్వారా రూ.650 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమైంది. 1990లో ఏర్పాటైన కంపెనీ ఏరోస్పేస్, డిఫెన్స్, పారిశ్రామిక, ఆటోమోటివ్ రంగాల కోసం ఫ్యాబ్రిక్స్ దుస్తులు తయారు చేస్తుంది. కంపెనీకి గుజరాత్‌లో ఆరు మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లతో పాటు ఉత్తరప్రదేశ్‌లో ఒక ఫ్యాబ్రికేషన్ యూనిట్ ఉంది. ఆర్థిక సంవత్సరం 2025 గానూ రూ.779 కోట్ల ఆదాయాన్ని, రూ.112 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.



నేపాల్ సంచలనం... వెస్టిండీస్‌పై మళ్లీ విజయం

షార్జా: క్రికెట్ కూన నేపాల్ సంచలన ప్రదర్శనతో ఏకంగా వెస్టిండీస్‌లాంటి గట్టి ప్రత్యర్థిపై సిరీస్ విజయం సాధించింది. అదికూడా వరుస మ్యాచ్ విజయాలతో... ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే ఈ ఘనత సాధించడం విశేషం. సోమవారం జరిగిన రెండో టి20లో నేపాల్ 90 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను కంగుతినిపించింది. మొదట నేపాల్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. ఆసిఫ్ షేక్ (47 బంతుల్లో 68 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), సందీప్ జోరా (39 బంతుల్లో 63; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) రాణించారు. అకీల్, కైల్ మేయర్స్ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత విండీస్ 17.1 ఓవర్లలో 83 పరుగులకే కుప్పకూలింది. హోల్డర్ (21), అమిర్ జంగూ (16), అకీమ్ అగస్టే (17)లు రెండంకెల స్కోర్లు చేశారు. నేపాలీ బౌలర్లు ఆదిల్ 4, కుశాల్ 3 వికెట్లు తీశారు.

సాక్షి ప్లస్
మంగళవారం। 30-9-2025

చరిత్ర సృష్టించిన సైరెమ్-విల్సన్ జోడీ

అహ్మదాబాద్: ఆసియా అక్వాటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో డైవింగ్ ఈవెంట్‌లో పతకం సాధించిన తొలి భారతీయ జోడీగా ఇందివర్ సైరెమ్-విల్సన్ సింగ్ నింగ్‌థోజమ్ గుర్తింపు పొందింది. సోమవారం జరిగిన 10 మీటర్ల పురుషుల సింక్రనైజ్డ్ డైవింగ్ ఈవెంట్‌లో సైరెమ్-విల్సన్ ద్వయం 300.66 పాయింట్లు స్కోరు చేసి మూడ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. మణిపూర్‌కు చెందిన 18 ఏళ్ల సైరెమ్, 32 ఏళ్ల విల్సన్ పుణేలోని ఆర్మీ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆస్ట్రేలియాకు చెందిన షానన్ రాయ్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. ఈ పోటీల రెండో రోజు భారత్‌కు నాలుగు పతకాలు లభించాయి. పురుషుల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కుశాగ్ర రావత్ (15ని:30.88 సెకన్లు) కాంస్య పతకం సంపాదించాడు. పురుషుల 4-200 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే ఈవెంట్‌లో అనీశ్ గౌడ, సజన్ ప్రకాశ్, షాన్ గంగూలీ, శ్రీహరి నటరాజ్‌లతో కూడిన భారత బృందం (7ని:23.38 సెకన్లు) రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని దక్కించుకుంది. పురుషుల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో రిషభ్ దాస్ (2ని:02.64 సెకన్లు) కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు.



భళా బోపన్న...

45 ఏళ్ల వయసులో ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ డబుల్స్ టైటిల్ పోరుకు అర్హత



టోక్యో: వయసు ఒక అంకె మాత్రమేనని... ఆడాలన్న ఉత్సాహం, గెలవాలన్న కసి ఉంటే... నాలుగు పదులు దాటినా అద్భుతాలు సాధించవచ్చని భారత టెన్నిస్ డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న మరోసారి నిరూపించాడు. జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో జపాన్ ప్లేయర్ టకెరు యుజుకితో కలిసి 45 ఏళ్ల రోహన్ బోపన్న డబుల్స్ విభాగంలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తద్వారా ఏటీపీ-500 టోర్నీల చరిత్రలో ఫైనల్‌కు చేరిన అతిపెద్ద వయస్కుడిగా బోపన్న గుర్తింపు పొందాడు. సోమవారం జరిగిన సెమీఫైనల్లో బోపన్న-టకెరు ద్వయం 4-6, 6-3, 18-16తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ క్రిస్టియన్ హ్యారీసన్-ఇవాన్ కింగ్ (అమెరికా) జోడీని బోల్తా కొట్టించింది. 94 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట 'సూపర్ టైబ్రేక్'లో మూడు మ్యాచ్ పాయింట్లను కాచుకొని గెలుపొందడం విశేషం. 'సూపర్ టైబ్రేక్'లో ఒకదశలో 1-4తో వెనుకబడ్డ ఈ ఇండో-జపాన్ ద్వయం ఆ తర్వాత 8-9 వద్ద... 9-10 వద్ద... 12-13 వద్ద మూడుసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని గట్టెక్కింది. ఎనిమిది ఏస్‌లు సంధించిన బోపన్న-టకెరు మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారికోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. నేడు జరిగే ఫైనల్లో హ్యూగో నిస్ (మొనాకో)-ఎడువార్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్)లతో బోపన్న-టకెరు తలపడతారు.

64 బోపన్న తన కెరీర్‌లో ఇప్పటి వరకు 64 టోర్నీలలో డబుల్స్ విభాగంలో ఫైనల్‌కు చేరాడు. ఇందులో 26 సార్లు గెలిచి విజేతగా... 37 సార్లు ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు.

రింకూ హుడాకు స్వర్ణం

ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్46 ఈవెంట్‌లో భారత అథ్లెట్ రింకూ హుడా పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. జావెలిన్‌ను 66.37 మీటర్ల దూరం విసిరి అతను అగ్రస్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. 2023 పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన రింకూకు ఇది తొలి స్వర్ణం. ఇదే ఈవెంట్‌లో భారత్‌కే రజతం కూడా దక్కింది. భారత అథ్లెట్ సుందర్ సింగ్ గుర్జర్ బల్లెంను 64.76 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుత ప్రపంచ రికార్డు గుర్జర్ పేరిటే ఉండగా...అతడిని వెనక్కి తోసి రింకూ స్వర్ణం గెలవడం విశేషం. అయితే మహిళల షాట్‌పుట్‌లో భారత అథ్లెట్ దయావంతి త్రుటిలో పతకం చేజార్చుకుంది. గుండును 27.94 మీటర్ల దూరం విసిరిన దయావంతి నాలుగో స్థానానికే పరిమితమైంది. మరో భారత అథ్లెట్ రొంగాలి రవి పురుషుల షాట్‌పుట్ ఎఫ్40 ఫైనల్లో పూర్తిగా విఫలమయ్యాడు. ప్రస్తుతం ఓవరాల్‌గా 2 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యం (మొత్తం 7 పతకాలు)తో వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఆరో స్థానంలో కొనసాగుతోంది.

యోధాస్‌పై జెయింట్స్ విజయం

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో వరుసగా ఐదు ఓటముల తర్వాత గుజరాత్ జెయింట్స్ ఎట్టకేలకు విజయాన్ని అందుకుంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 33-27 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌ను ఓడించింది. మొహమ్మద్ రెజా, అంకిత్ దహియా చెరో 8 పాయింట్లతో గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించగా... రాకేశ్ 6, హరీశ్ 4 పాయింట్లు సాధించారు. యూపీ తరఫున భవానీ రాజ్‌పుత్ 8 పాయింట్లు నమోదు చేయగా...గగన్ గౌడ 6, కెప్టెన్ సుమీత్ 4 పాయింట్లు సాధించారు. ఈ విజయం తర్వాత కూడా జెయింట్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్‌ను ఒక పాయింట్ తేడాతో ఓడించి దబంగ్ ఢిల్లీ తమ అగ్రస్థానాన్ని పటిష్టపర్చుకుంది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో ఢిల్లీ 38-37 పాయింట్లతో హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. దబంగ్ ఢిల్లీ ఆటగాళ్ళలో రెయిడర్ అశు మలిక్ చెలరేగిపోయాడు. అతనొక్కడే 15 పాయింట్లతో సత్తా చాటగా, నీరజ్ నర్వాల్ 6 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. మరోవైపు హరియాణా తరఫున అశుకంటే మెరుగైన ప్రదర్శనే కనబర్చినా... దురదృష్టవశాత్తూ వినయ్ జట్టును గెలిపించలేకపోయాడు. వినయ్ 18 పాయింట్లతో అదరగొట్టగా, కెప్టెన్ జైదీప్ 7, ఆశిష్ నర్వాల్ 5 పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌లలో పట్నా పైరేట్స్‌తో తెలుగు టైటాన్స్... బెంగాల్ వారియర్స్‌తో పుణేరీ పల్టన్ తలపడతాయి.



భారత టెన్నిస్ జట్టులో సహజ, రష్మిక



న్యూఢిల్లీ: బిల్లీజీన్ కింగ్ కప్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీ ప్లే ఆఫ్స్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. తెలంగాణకు చెందిన సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక జట్టులో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) తాజా సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో సహజ 347వ స్థానంలో నిలిచి భారత నంబర్‌వన్ ర్యాంకర్‌గా... రష్మిక 374వ స్థానంలో నిలిచి భారత రెండో ర్యాంకర్‌గా ఉన్నారు. సహజ, రష్మికలతో పాటు అంకిత రైనా (447వ ర్యాంక్), రియా భాటియా (499వ ర్యాంక్), ప్రార్థన తొంబారేలను జట్టులోకి ఎంపిక చేశారు. డబ్ల్యూటీఏ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రార్థన 131వ స్థానంలో నిలిచిన భారత డబుల్స్ నంబర్‌వన్‌గా ఉంది. వైదేహి చౌధరీని రిజర్వ్ ప్లేయర్‌గా... జీల్ దేశాయ్, శ్రుతి అహ్లావత్‌లను ట్రెయినింగ్ క్యాంప్‌నకు ఎంపిక చేశారు. విశాల్ ఉప్పల్ నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా, రాధిక కనిత్కర్ కోచ్‌గా వ్యవహరిస్తారు. బిల్లీ జీన్ కింగ్ కప్ క్వాలిఫయర్స్ నవంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు బెంగళూరులో జరుగుతాయి. గ్రూప్ 'జి'లో స్లొవేనియా, నెదర్లాండ్స్‌లతో భారత్ పోటీపడనుంది. గ్రూప్ 'జి' విజేత 2026 క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. మిగిలిన రెండు జట్లు వచ్చే ఏడాది గ్రూప్-1లో పోటీపడతాయి.


క్రికెట్‌కు క్రిస్ వోక్స్ గుడ్‌బై



లండన్: ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య ఇటీవల జరిగిన 'అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ'లో ఆడిన వోక్స్‌కు ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో చోటు దక్కలేదు. దీంతో సోమవారం తన 15 ఏళ్ల కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడు. ఇంగ్లండ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా సుదీర్ఘకాలం జట్టుకు సేవలందించిన 36 ఏళ్ల వోక్స్ సంప్రదాయ ఫార్మాట్‌లో 62 టెస్టులు ఆడి 192 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లో 2034 పరుగులు కూడా చేశాడు. ఇందులో ఒక శతకం ఉంది. 122 వన్డేలాడిన ఈ ఆల్‌రౌండర్ 173 వికెట్లు తీశాడు. 6 ఫిఫ్టీలు సహా 1524 పరుగులు సాధించాడు. 33 టి20లు ఆడి 31 వికెట్లు తీయడంతో పాటు 147 పరుగులు చేశాడు. 'నిష్క్రమించాల్సిన సమయం వచ్చింది. అందుకే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్ కావాలని నిర్ణయించుకున్నాను. ఇంగ్లండ్‌కు ఆడాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నాను. ఆ కలల్ని నిజం చేసుకొని 15 ఏళ్లపాటు ఆడటం అదృష్టంగా భావిస్తున్నా. ఇంగ్లండ్ జట్టుకు ప్రాతినిధ్యం, మూడు సింహాల జెర్సీ ధరించడం, సహచరులతో గడిపిన క్షణాలు మరెన్నో తీపి గుర్తులు ఎప్పటికీ పదిలంగానే ఉంటాయి' అని తన వీడ్కోలు సందేశంలో వోక్స్ పేర్కొన్నాడు. ఇంగ్లండ్ గెలిచిన వన్డే, టి20 ప్రపంచకప్‌లలో జట్టు సభ్యుడిగా ఉన్నాడు. 2019లో జరిగిన వన్డే ప్రపంచకప్, 2022లో జరిగిన టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ విశ్వవిజేతగా నిలిచింది. తమ సొంతగడ్డపై భారత్‌తో జరిగిన చివరి ఐదో టెస్టే వోక్స్ కెరీర్‌లో ఆఖరి మ్యాచ్‌గా నిలిచిపోయింది. చేతికి గాయమైనా కట్టు కట్టుకొని బరిలోకి దిగిన వోక్స్ ఇంగ్లండ్ 'డ్రా' కోసం ప్రయత్నించాడు. కానీ హైదరాబాదీ స్పీడ్‌స్టర్ సిరాజ్ సంచలన బౌలింగ్‌తో ఇంగ్లండ్ టెయిలెండర్ల ఆటకట్టించి భారత్‌ను గెలిపించాడు. సిరీస్ 2-2తో సమమయ్యేందుకు దోహదపడ్డాడు.

విండీస్‌కు మరో దెబ్బ

భారత్‌తో సిరీస్‌కు పేసర్ అల్జారి జోసెఫ్ కూడా దూరం


అల్జారి జోసెఫ్

సెయింట్ జాన్స్: భారత్‌తో రెండు టెస్టుల సిరీస్ ప్రారంభానికి ముందే వెస్టిండీస్ జట్టుకు మరో దెబ్బ తగిలింది. ఇప్పటికే షామర్ జోసెఫ్ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరం కాగా... షామర్ సరసన మరో పేస్ బౌలర్ అల్జారి జోసెఫ్ చేరాడు. వెన్నునొప్పి కారణంగా భారత్‌తో జరిగే సిరీస్ నుంచి అల్జారి జోసెఫ్ వైదొలిగాడు. అల్జారి స్థానంలో ఎడంచేతి వాటం పేసర్ జెడియా బ్లేడ్స్ (బార్బడోస్)ను ఎంపిక చేశారు. అల్జారి స్థానంలో మాజీ కెప్టెన్, ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్‌ను జట్టులోకి తీసుకోవాలని విండీస్ బోర్డు ప్రయత్నించినా... ముందస్తుగా అనుకున్న వైద్య చికిత్స కోసం ఈ ప్రతిపాదనను హోల్డర్ తిరస్కరించాడు. 28 ఏళ్ల అల్జారి జోసెఫ్ ఇప్పటి వరకు వెస్టిండీస్ తరఫున 40 టెస్టులు ఆడి 124 వికెట్లు, 81 వన్డేలు ఆడి 133 వికెట్లు, 45 టి20లు ఆడి 62 వికెట్లు పడగొట్టాడు. అక్టోబర్ 2 నుంచి భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య అహ్మదాబాద్‌లో తొలి టెస్టు మొదలవుతుంది.

అక్టోబర్ 2 నుంచి ప్రైమ్ వాలీబాల్ లీగ్



సాక్షి, హైదరాబాద్: మరో క్రీడా ఈవెంట్‌కు హైదరాబాద్ నగరం సిద్ధమైంది. ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌కు హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం వేదిక కానుంది. అక్టోబర్ 2 నుంచి 26వ తేదీ వరకు ప్రైమ్ వాలీబాల్ లీగ్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రైమ్ వాలీబాల్ లీగ్ మ్యాచ్‌లను వీక్షించాలని కోరుతూ హైదరాబాద్ బ్లాక్ హాక్స్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసి ఆయనను ఆహ్వానించారు. కిషన్ రెడ్డితోపాటు తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరిని, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను అభిషేక్ రెడ్డి కలిసి ఈ లీగ్‌ను తిలకించేందుకు రావాలని కోరారు.

పోరాడి ఓడిన అభయ్ సింగ్



దోహా: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) ప్లాటినమ్ ఈవెంట్ ఖతర్ క్లాసిక్ టోర్నీలో భారత స్టార్ అభయ్ సింగ్ పోరాటం ముగిసింది. సోమవారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్ అభయ్ 66 నిమిషాల్లో 13-11, 5-11, 11-9, 3-11, 3-11తో ప్రపంచ 15వ ర్యాంకర్ ఫరీస్ దెసూకి (ఈజిప్ట్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. ఆసియా క్రీడల్లో రెండు పతకాలు నెగ్గిన అభయ్ ఈ టోర్నీ తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్, ప్రపంచ ఐదో ర్యాంకర్ కరీమ్ గవాద్ (ఈజిప్ట్)పై సంచలన విజయం సాధించాడు.

రేసులో మెరిసిన పదేళ్ల అతీఖ



అల్ ఐన్ (యూఏఈ): భారత్‌కు చెందిన పదేళ్ల బాలిక అతీఖ మీర్ చిరు ప్రాయంలోనే రేసింగ్‌లో దూసుకెళుతోంది. అల్ ఐన్ రేస్‌వేలో జరిగిన ఆర్‌ఎంసీ ఇన్విటేషనల్ కార్టింగ్ ఈవెంట్ క్వాలిఫయింగ్‌లో అతీఖ పోడియంలో రెండో స్థానంలో నిలిచింది. ఫైనల్ గ్రిడ్‌లో ఎనిమిదో స్థానం నుంచి రేసును ప్రారంభించిన చిన్నారి అతీఖ వేగంగా కార్టింగ్ కార్‌ను నడిపింది. ఈ క్రమంలో ఆమె ఐదుగురు రేసర్లను వెనక్కి నెట్టి పోడియంలో నిలిచింది. నిజానికి తను ఈ రేసులో గెలవాలనుకున్నానని, అయితే రెండో ల్యాప్‌లో కాస్త వెనుకబడటంతోనే విజేతగా నిలువలేకపోయానని అతీఖ మీర్ చెప్పింది. ఈ నెలలోనే స్లొవేకియాలో జరిగిన చాంపియన్స్ ఆఫ్ ద ఫ్యూచర్ అకాడమీ (సీఓఎఫ్‌టీఏ) పోటీలో అతీఖ నాలుగో స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన డీఏఎమ్‌సీ సిరీస్‌లో మొదటి స్థానంలో నిలిచింది.



డీపీఎస్, సిల్వర్ ఓక్స్ స్కూల్ జట్లకు టైటిల్స్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) సీజన్‌కు ముందు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు స్కూల్ జట్ల కోసం వర్సిటీ వాలీబాల్ లీగ్‌ను నిర్వహించింది. బాలుర విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్-నాచారం), బాలికల విభాగంలో సిల్వర్ ఓక్స్ స్కూల్ జట్లు విజేతలుగా నిలిచాయి. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ లీగ్‌ను నిర్వహించారు. బాలుర ఫైనల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 3-1తో ద గాడియం స్కూల్‌పై... బాలికల ఫైనల్లో సిల్వర్ ఓక్స్ స్కూల్ 3-0తో చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై విజయం సాధించాయి. 'వర్సిటీ లీగ్ ద్వారా హైదరాబాద్ వాలీబాల్ భవిష్యత్ తారలు ఉద్భవించారు' అని హైదరాబాద్ బ్లాక్ హాక్స్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆరు వారాలపాటు జరిగిన ఈ లీగ్‌లో బాలుర విభాగంలో 48 జట్లు... బాలికల విభాగంలో 20 జట్లు పోటీపడ్డాయి.



సాక్షి ప్లస్
మంగళవారం । 30-9-2025



పంటలు బాగా పండాలని కోరుతూ పశ్చిమ బెంగాల్‌లోని నడియాలో హుగ్లీ నదిలో సోమవారం అరటి మొక్కతో నభ పత్రిక పూజ చేస్తున్న భక్తుడు



నవరాత్రి సందర్భంగా లక్నోలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కన్య పూజ కార్యక్రమంలో బాలిక కాళ్లు కడుగుతున్న యూపీ కాంగ్రెస్ చీఫ్ రాయ్



ఇండోర్‌లోని కమలా నెహ్రూ జూలాజికల్ పార్కును సోమవారం సందర్శించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ చిలుకలకు ఆహారం తినిపించారు

భారత్ సైన్యానికి జై కొట్టిన హైఫా

భారతీయ సైనికుల వల్లే ఒట్టోమాన్ల నుంచి విముక్తి..
- విముక్తం చేసింది ఆంగ్లేయులు కారు
- ఇజ్రాయెల్ పాఠ్యపుస్తకాల్లో భారతీయ సైనికుల ధైర్య సాహసాలు
- హైఫా మేయర్ యోనా యాహవ్ వెల్లడి

హైఫా: 'ఒట్టోమాన్ పాలన నుండి హైఫా నగరాన్ని విముక్తం చేసింది ఆంగ్లేయులు కారు.. ఆ ఘనత భారతీయ సైనికులకే దక్కుతుంది. ఈ మేరకు ప్రతి పాఠశాలలోనూ పాఠ్యపుస్తకాలను మారుస్తున్నాం.. మమ్మల్ని విముక్తం చేసింది ఆంగ్లేయులు కారు.. భారతీయులేనని చెబుతున్నాం,'.. అన్నారు హైఫా మేయర్ యోనా యాహవ్ 'నేను ఈ నగరంలో పుట్టాను, ఇక్కడే చదువుకున్నాను. ఈ నగరాన్ని ఆంగ్లేయులు విముక్తం చేశారని మాకు ఎప్పుడూ చెప్పేవారు. కానీ ఒక రోజు హిస్టారికల్ సొసైటీ నుంచి ఒకరు నా దగ్గరకు వచ్చి, వారు చేసిన పూర్తి పరిశోధనలో ఈ నగరాన్ని (ఒట్టోమాన్ల నుండి) విముక్తం చేసింది భారతీయులేనని తేలిందని చెప్పారు'.. అని హైఫా మేయర్ వెల్లడించారు. భారతీయ సైనికుల వీరత్వం, ధైర్యసాహసాలకు ఇజ్రాయెల్‌లోని హైఫా నగరం సోమవారం ఘన నివాళి అర్పించింది. అమరులైన భారతీయ సైనికుల స్మశానవాటికలో.. నివాళులర్పించేందుకు జరిగిన ఒక కార్యక్రమంలో హైఫా మేయర్ భారతీయ సైన్యం సాహసాన్ని కొనియాడారు.

చరిత్రలో చివరి గొప్ప అశ్వికదళ పోరాటం

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో, బల్లేలు, కత్తులతో సాయుధులైన భారతీయ అశ్వికదళ రెజిమెంట్లు, మౌంట్ కార్మెల్ రాతి వాలులపై ఉన్న ఒట్టోమాన్ బలగాలను ఎన్నో కష్టాలను ఎదుర్కొని తుదముట్టించి నగరాన్ని విముక్తం చేశాయి. చాలామంది యుద్ధ చరిత్రకారులు దీనిని 'చరిత్రలో చివరి గొప్ప అశ్వికదళ పోరాటంగా'పరిగణిస్తారు. ఇదే ప్రదేశంలో 2009లో జరిగిన మొదటి కార్యక్రమంలో.. నగర చరిత్ర పాఠ్యపుస్తకాల్లో భారతీయ సైనికుల విముక్తి కథను చేర్చనున్నట్లు మేయర్ యాహవ్ ప్రకటించడం హైఫా నగర యువతకు బాగా తెలుసు. ఏటా సెప్టెంబర్ 23న భారత సైన్యం హైఫా దినోత్సవంగా జరుపుకొంటుంది. 1918లో అదే తేదీన 15వ ఇంపీరియల్ సర్వీస్ క్యావలరీ బ్రిగేడ్ జరిపిన సాహసోపేతమైన అశ్వికదళ దాడిలో.. హైఫాను విముక్తి చేయడానికి సహాయపడిన మూడు ధైర్యవంతులైన భారతీయ అశ్వికదళ రెజిమెంట్లు – మైసూర్, హైదరాబాద్, జోధ్‌పూర్ లాన్సర్స్ లను గౌరవిస్తుంది.

ఏటా భారతీయ సైనికులకు నివాళి

అమరవీరులైన భారతీయ సైనికులకు నివాళులర్పించేందుకు ఏటా ఇక్కడ భారతీయ మిషన్, హైఫా మునిసిపాలిటీ ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. నాటి యుద్ధంలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన కెప్టెన్ అమన్ సింగ్ బహదూర్, దాఫాదార్ జోర్ సింగ్‌లకు ఇండియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ పురస్కారం లభించింది. కెప్టెన్ అనోప్ సింగ్, 2వ లెఫ్టినెంట్ సాగత్ సింగ్‌లకు మిలిటరీ క్రాస్ లభించింది. మేజర్ దల్పత్ సింగ్ 'హీరో ఆఫ్ హైఫా'గా ప్రసిద్ధి చెందారు, ఆయనకు మిలిటరీ క్రాస్ లభించింది. ఈ యుద్ధంలో జోధ్‌పూర్ లాన్సర్స్ ఎనిమిది మంది సైనికులను కోల్పోగా.. 34 మంది గాయపడ్డారు. అయినప్పటికీ, వారు 700 మందికి పైగా ఖైదీలు సహా 17 ఫీల్డ్ గన్‌లను, 11 మెషీన్ గన్‌లను స్వాధీనం చేసుకున్నారు. 'భారతీయ సైనికులు ఈ యుద్ధంలో కీలక పాత్ర పోషించారు. ఫలితంగా ఆ ప్రాంతంలోని ఒట్టోమాన్ బలగాలు ఓడిపోయాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో 74,000 మందికి పైగా భారతీయ సైనికులు ప్రాణాలు అర్పించారు, అందులో పశ్చిమ ఆసియాలో 4,000 మందికి పైగా ఉన్నారు'.. అని ఇజ్రాయెల్‌లోని భారత రాయబారి జేపీ సింగ్ నివాళి కార్యక్రమంలో వివరించారు. 'ఇది యుద్ధంలో పెద్ద ఎత్తున యంత్రాల వినియోగం మొదలైన కాలంలో జరిగిన చివరి సంప్రదాయ అశ్వికదళ పోరాటాలలో ఒకటి. అమరులైన సైనికులు భారత్‌లోని అన్ని ప్రధాన మతాలు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వారి ధైర్యాన్ని, త్యాగాన్ని ఎప్పటికీ మరిచిపోమని ఈ నివాళి రుజువు చేస్తుంది'.. అని సింగ్ నివాళులర్పించారు.

3-5 తరగతులకు 'భారతీయ సైనికుల హైఫా విముక్తి' కథ

భారతీయ సైనికుల ధైర్య సాహసాలకు నివాళిగా.. ఇజ్రాయెల్ అధికారుల సహకారంతో భారత రాయబార కార్యాలయం 'ది ఇండియా ట్రైల్'ని ఏర్పాటు చేస్తోంది. హైఫాలో, 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు చరిత్ర పాఠ్యపుస్తకాల్లో భారతీయ సైనికుల హైఫా విముక్తి కథను బోధిస్తున్నారు. హైఫా హిస్టారికల్ సొసైటీ ప్రతినిధులు కూడా గత దశాబ్ద కాలంగా యువతకు ఈ కథను వివరించేందుకు పాఠశాలలకు వెళ్తున్నారు.

ఢిల్లీలో 'తీన్ మూర్తి హైఫా చౌక్'

ఇజ్రాయెల్‌తో స్నేహానికి ప్రతీకగా, ఈ చారిత్రక సాహసాన్ని గుర్తు చేసుకుంటూ 1922లో ఢిల్లీలో నిర్మించిన ఐకానిక్ తీన్ మూర్తి చౌక్‌ను.. 2018 జనవరిలో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఢిల్లీ పర్యటన సందర్భంగా 'తీన్ మూర్తి హైఫా చౌక్'గా పేరు మార్చారు.

ఇజ్రాయెల్ ప్రత్యేక స్మారక తపాలా బిళ్ల

స్వాతంత్ర్యం తర్వాత మూడు అశ్వికదళ యూనిట్ల విలీనంతో ఏర్పడిన 61వ అశ్వికదళం, 2018లో శతజయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు ఇజ్రాయెల్‌కు ఒక దళాన్ని పంపింది. ఇజ్రాయెల్ తపాలా శాఖ 2018లో భారతీయ సైనికుల ధైర్య సాహసాలకు గౌరవంగా ఒక స్మారక తపాలా బిళ్లను కూడా విడుదల చేసింది.

ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి
స్టాంప్, నాణెం

రేపు విడుదల చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్మారక తపాలా బిళ్ల, నాణేన్ని విడుదల చేయనున్నారు. 1925లో విజయదశమి రోజున ఏర్పాటైన ఆర్‌ఎస్‌ఎస్‌కు వచ్చే గురువారంతో వందేళ్లు పూర్తవుతాయి. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె సమక్షంలో స్మారక స్టాంప్, నాణెం విడుదల చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఆర్‌ఎస్‌ఎస్ క్రమశిక్షణతో, నిస్వార్థ సేవలను అందిస్తోందంటూ, ఆ సంస్థ కార్యకర్తలు ప్రతి పనిలోనూ దేశ ప్రయోజనాలనే పరమావధిగా భావిస్తారంటూ మన్ కీ బాత్ సందర్భంగా ఆదివారం ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించడం తెల్సిందే. శతాబ్ది వేడుకల సందర్భంగా వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా ఒక లక్ష హిందూ సమ్మేళనాలను నిర్వహించడం వంటివి ఇందులో ఉన్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఆదివారం నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాటల ఆల్బం సంఘ్ గీత్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు. ఆల్బంలోని 25 పాటలకు గాను 10 పాటలను ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ ఈ సందర్భంగా ఆలపించడం విశేషం. ఆర్‌ఎస్‌ఎస్‌ను కీర్తిస్తూ అన్ని భారతీయ భాషల్లోనూ కలిపి కనీసం 30 వేల పాటలున్నాయని అంచనా. విజయదశమి రోజున గురువారం నాగ్‌పూర్‌లో సంఘ్ ప్రధాన కార్యాలయంలో మోహన్ భాగవత్ ప్రసంగంతో మొదలయ్యే శతాబ్ది ఉత్సవాలు వచ్చే విజయదశమి వరకు కొనసాగుతాయి.

చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకోండి

- ఈ కేసుల కోసం తక్షణమే పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలి
- కేంద్ర హోంశాఖకు సుప్రీంకోర్టు ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో చిన్నారులు అపహరణకు, రవాణాకు గురవుతున్నారని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. చిన్నారుల అపహరణ, అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరముందని, ఇందుకోసం ఒక పోర్టల్‌ను రూపొందించాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది. చిన్నారుల అక్రమ రవాణా, అపహరణలపై గురియా స్వయం సేవీ సంస్థ వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)ను జస్టిస్ బీవీ నాగరత్నం, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం విచారించింది. తక్షణమే ప్రత్యేకంగా పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలని స్పష్టం చేసింది. పోర్టల్ నిర్వహణకు ప్రత్యేకంగా అధికారిగా నియమించాలి. ఇకపై ఎక్కడా అక్రమ రవాణా, పిల్లల అపహరణ జరగకూడదు. ఇందుకు రాష్ట్రాల సాయం కూడా అవసరం. రాష్ట్రాలు కూడా ఓ అధికారిని నియమించాలి. ఈ విధానం సమస్య పరిష్కారంలో ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నాం'అని ధర్మాసనం పేర్కొంది.

పోలీసుల మధ్య సమన్వయం అవసరం

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పోలీసుల మధ్య సమన్వయలోపం కారణంగా చిన్నారులు అపహరణకు గురవుతున్నారని గురియా స్వయం సేవీ సంస్థ తెలిపింది. అపహరించిన చిన్నారులను పెద్ద నెట్‌వర్క్ సాయంతో రాష్ట్రాలు దాటించేస్తున్నారని వివరించింది. యంత్రాంగం మధ్య సమన్వయం లేకపోవడంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను తిరిగి పొందలేకపోతున్నారని పేర్కొంది. 'ఒక రాష్ట్రంలో అపహరించిన చిన్నారిని రెండుమూడు రాష్ట్రాల సరిహద్దులు దాటించే ప్రమాదముంది'అంటూ ధర్మాసనం పేర్కొంది. ఇలా అపహరణకు గురైనప్పుడు, రవాణాకు గురైన విషయం తెలిసినప్పుడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పోలీసుల మధ్య సమన్వయం అవసరమని, ఇకపై సమన్వయంతో పని చేసి చిన్నారుల అక్రమ రవాణ, అపహరణ అరికట్టాలని న్యాయస్థానం ఆదేశించింది.

హోంశాఖ పర్యవేక్షణలో పోర్టల్

ఈ సమస్యను పరిష్కరించేందుకు ఏకైక మార్గం.. హోం శాఖ పర్యవేక్షణలో కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటని ధర్మాసనం పేర్కొంది. ఈ పోర్టల్, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి నోడల్ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే కోల్పోయిన చిన్నారుల డేటాను అప్‌లోడ్ చేయగల కేంద్రీకృత వేదికగా పనిచేయాలని సూచించింది. అపహరణ, అక్రమ రవాణా చేసే వారికి ఇది ఒక హెచ్చరికగా ఉండాలని పేర్కొంది. పోలీసు బలగాల మధ్య రియల్-టైమ్ సమన్వయం, సమాచార భాగస్వామ్యాన్ని పోర్టల్ సులభతరం చేస్తుందని ధర్మాసనం తెలిపింది. ప్రతి రాష్ట్రం నుంచి ఫిర్యాదులు, సమాచారాన్ని సేకరించేందుకు అధికారిని నియమించాలని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వం నుంచి సమాచారం సేకరించేందుకు మరింత సమయం కావాలని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి న్యాయస్థానాన్ని కోరారు. దీంతో, కేసు తదుపరి విచారణను ధర్మాసనం అక్టోబర్ 14వ తేదీకి వాయిదా వేసింది.

హరియాణా సీఎల్పీ నేతగా మాజీ సీఎం హుడా

న్యూఢిల్లీ: హరియాణా కాంగ్రెస్ శాసనసభా పక్షం(సీఎల్పీ) నేతగా మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా నియమితులయ్యారు. అదేవిధంగా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా మాజీ మంత్రి రావు నరేందర్ సింగ్‌ను సోమవారం అధిష్టానం నియమించింది. 2022 ఏప్రిల్ నుంచి పీసీసీ చీఫ్‌గా కొనసాగుతున్న ఉదయ్ భాను స్థానంలో నరేందర్ సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఓబీసీ నేతకు పార్టీ బాధ్యతలను అప్పగించాలన్న రాహుల్ గాంధీ ప్రత్యేక శ్రద్ధ వల్లే నరేందర్ సింగ్‌కు అవకాశం దక్కిందని సమాచారం. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ నియామకాలు చేపట్టారని పార్టీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఇవి తక్షణమే అమల్లోకి వచ్చాయన్నారు. 2004–14 సంవత్సరాల్లో హుడా సీఎంగా పనిచేశారు. ఆ తర్వాత నుంచి రాష్ట్రంలో బీజేపీయే అధికారంలో కొనసాగుతోంది. సీఎల్పీ నేతగా హుడాయే ఉండాలన్న మెజారిటీ ఎమ్మెల్యేల ఒత్తిళ్ల మేరకు అధిష్టానం ఈ నియామకం చేపట్టినట్లు చెబుతున్నారు. అందుకే ఆలస్యమైందని కూడా అంటున్నారు.

రూ. 21.5 కోట్ల డ్రగ్స్ సీజ్..
12 మంది అరెస్ట్

- పట్టుబడిన వారిలో ఇద్దరు విదేశీయులు
- ఢిల్లీ, కర్నాటక మేఘాలయ, అసోంలలో ఘటనలు

న్యూఢిల్లీ/బెంగళూరు/ఇంఫాల్: దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ దందాపై కేంద్ర సంస్థలు, రాష్ట్రాల పోలీసులు పకడ్బందీగా వ్యవహరిస్తున్నా, నేరగాళ్లు మాత్రం తమ పోకడలను మానుకోవడం లేదు. యాంటీ నార్కోటిక్ బృందాలు, పోలీసులు గత కొద్ది రోజులుగా చేపట్టిన దాడుల్లో మేఘాలయలో రూ.2.5 కోట్లు, కర్నాటకలో రూ.9 కోట్లు, అసోంలో రూ.9 కోట్లు, దేశ రాజధాని ఢిల్లీలో రూ.కోటి విలువైన డ్రగ్స్ తాజాగా పట్టుబడ్డాయి. ఈ ఘటనలకు సంబంధించి ఇద్దరు విదేశీయులు సహా మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిఘా వర్గాల సమాచారం మేరకు మేఘాలయంలోని వెస్ట్ జైంతియా హిల్స్ జిల్లా పోలీసులు ఆదివారం రాత్రి ఫ్రామర్ మెర్ సమీపంలో ఓ వాహనాన్ని అడ్డుకుని, సోదాలు జరిపారు. అందులో 50 సబ్బు పెట్టెల్లో దాచిన 500 గ్రాములకు పైగా హెరాయిన్ బయటపడింది. ఇందుకు సంబంధించి మణిపూర్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వాహనాన్ని సీజ్ చేశారు. పట్టుబడిన హెరాయిన్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.2.5 కోట్లపై మాటేనని అధికారులు తెలిపారు. నిందితుల నుంచి భారత కరెన్సీని, కొరియా, కజఖ్‌స్తాన్, మయన్మార్ కరెన్సీ నోట్లతోపాటు మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దుల మీదుగా జరిగే డ్రగ్స్ దందాతో వీరికిగల సంబంధాలపై విచారణ జరుపుతున్నారు. విదేశీ కరెన్సీ లభ్యం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అదేవిధంగా, సోమవారం అసోంలోని చఛార్ పోలీసులు మిజోరం నుంచి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేసి, రూ.9 కోట్ల విలువైన 30 వేల మెథాంఫెటమైన్ డ్రగ్ టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

ఢిల్లీ పరిధిలో డ్రగ్స్ రాకెట్ నడుపుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని అమృత్‌సర్‌కు చెందిన తజిందర్‌పాల్ సింగ్ అలియాస్ హ్యాపీ(30), విక్రమ్ సింగ్ భదోరియా(29), కుందన్ సింగ్ బిష్త్ అలియాస్ కేడీ(28)గా గుర్తించారు. ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదివిన హ్యాపీ 2014లో మలేసియా వెళ్లాడు. 2022లో తిరిగి వచ్చిన ఇతడికి మెథాంఫెటమైన్ అనే డ్రగ్స్‌ను సరఫరా చేసే మాజీ సహోద్యోగి సుర్జీత్ అలియాస్ జీతాతో సంబంధం ఏర్పడింది. అనంతరం డ్రగ్స్ కేసులో సుర్జీత్ అరెస్టయ్యాడు. హ్యాపీ మాత్రం ఉత్తరాఖండ్‌కు చెందిన బిష్త్, గ్వాలియర్ వాసి విక్రమ్‌తో కలిసి ఈ దందా కొనసాగిస్తున్నాడు. పోలీసులు వలపన్ని ఢిల్లీలోని వసంత్‌కుంజ్ ప్రాంతంలో వీరిని అరెస్ట్ చేసి, 32 గ్రాముల మెథాంఫెటమైన్, ఏడు గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.కోటి వరకు ఉంటుంది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, డెంటల్ స్టూడెంట్..

కర్నాటక రాజధాని బెంగళూరు పోలీసులు గత 10 రోజుల వ్యవధిలో వివిధ ఆపరేషన్లలో వివిధ రకాల రూ.9.93 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు విదేశీయులు సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. పోస్టాఫీస్ నుంచి కొరియర్ సర్వీస్ ద్వారా విదేశానికి తరలిస్తున్న 6 కిలోల హైడ్రో గంజాయి కూడా ఇందులో ఉందని నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ చెప్పారు. కేరళలో తక్కువ ఖరీదుకే కొనుగోలు చేసిన హైడ్రో గంజాయిని ఇక్కడికి తీసుకువచ్చి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఓ నిందితుడు తెలిపాడన్నారు. అడుగోడి పోలీస్ స్టేషన్ పరిధిలో డెంటల్ కాలేజీ విద్యార్థి ఒకరు ఇలాగే హైడ్రో గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు.

ధీర వనిత మెలోనీ

ఇటలీ ప్రధాని ఆత్మకథకు ప్రధాని మోదీ ముందుమాట

న్యూఢిల్లీ: ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ ఆత్మకథ ఆమె హృదయాన్ని ఆవిష్కరిస్తోందని, ఆమె మనసులోని మాటను పాఠకులకు తెలియజేస్తోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మెలోనీ ఆత్మకథ పుస్తకం ఇండియన్ ఎడిషన్‌కు మోదీ ముందుమాట రాయడం విశేష. ఇందులో ఆయన మెలోనీ తన అనుబంధాన్ని పంచుకున్నారు. 'ఐయామ్ జార్జియా: మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్' పేరిట ఈ పుస్తకాన్ని రూపా పబ్లికేషన్స్ సంస్థ ప్రచురించింది. మెలోనీ జీవితం కేవలం రాజకీయాలు, అధికార పదవులకే పరిమితం కాలేదని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఆమె ధైర్యసాహసాలు కలిగిన ధీర వనిత అని కొనియాడారు. ప్రజాసేవ పట్ల అనురక్తి ఉన్న గొప్ప నాయకురాలు అని కీర్తించారు. మెలోనీ ప్రస్థానం నిజంగా స్ఫూర్తిదాయకం, చరిత్రాత్మకం అని ఉద్ఘాటించారు. ప్రతికూల పరిస్థితుల్లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మెలోనీ ఇటలీకి బలాన్ని, సుస్థిరతను చేకూర్చారని పేర్కొన్నారు. ఆచరణవాది అయిన మెలోనీ ప్రపంచ సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని మోదీ ప్రశంసించారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్

న్యూఢిల్లీ: మావోయిస్టులతో కాల్పుల విరమణ ప్రసక్తే లేదంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా సోమవారం స్పందించారు. 'మావోయిస్టులు ప్రభుత్వంతో చర్చలు జరపాలనుకుంటున్నారు. వారు కాల్పుల విరమణ ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అలాంటప్పుడు, కేంద్రం ఎందుకు అంగీకరించదు?. వారితో ఎందుకు చర్చలు జరపదు?'అని రాజా ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్ట్ అగ్ర నేతలే లక్ష్యంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌పై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 'ఏమిటీ ఆపరేషన్ కగార్. ఈ ఆపరేషన్‌లో చనిపోయిన మావోయిస్టులెందరు? గిరిజనులెందరు? ఆ లెక్కలను ప్రభుత్వం వెల్లడించాలి'అని డిమాండ్ చేశారు. గిరిజనులను అడవులను నుంచి, సొంత భూముల నుంచి వెళ్లగొట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలను ఇప్పటికే అదానీకి అప్పగించేశారు. ఇప్పుడిక అడవుల్ని కూడా అప్పగించేందుకు సిద్ధమైందని మండిపడ్డారు.

రైలు మార్గంతో భారత్-భూటాన్‌ల అనుసంధానం

రూ.4,033 కోట్లతో రెండు రైలు మార్గాల నిర్మాణం

న్యూఢిల్లీ: భారత్-భూటాన్‌ను కలిపేలా రెండు రైలు మార్గాలను నిర్మించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. పశ్చిమబెంగాల్‌లోని బనార్హట్‌తో భూటాన్‌లోని సంత్సే నగరాన్ని, అసోంలోని కొక్రాఝర్‌తో గెలెఫు సిటీని కలిపే 89 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గాల కోసం రూ.4,033 కోట్లు వెచ్చించనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు తెలిపారు. ప్రయాణికుల, సరుకు రవాణాకు అనువుగా ఉండే ఈ రెండు మార్గాలు భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో భాగంగా ఉంటాయన్నారు. గతేడాది భూటాన్‌లో ప్రధాని మోదీ పర్యటన సమయంలో ఈ రైలు అనుసంధానం ఒప్పందంపై సంతకాలు జరిగాయని వారు వివరించారు. నాలుగేళ్లలో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. మొత్తం వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. భారతదేశం, భూటాన్ పరస్పరం నమ్మకం, గౌరవం, అవగాహనతో కూడిన సంబంధాలను శతాబ్దాలుగా కొనసాగిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

కరూర్ విషాదంపై ఎన్డీయే బృందం విచారణ

న్యూఢిల్లీ: తమిళనాడులోని కరూర్‌లో 41 మంది మృతికి కారణమైన తొక్కిసలాటపై ఎన్డీయే విచారణ జరపనుంది. సోమవారం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ మేరకు 8 మంది ఎంపీలతో కమిటీ వేశారు. ఈ కమిటీ ఘటనపై నివేదికను అందించనుంది. కమిటీలో బీజేపీతోపాటు శివసేన(షిండే), టీడీపీల ఎంపీలు కూడా ఉంటారు. బీజేపీ తరఫున మథుర ఎంపీ హేమ మాలిని ఈ కమిటీకి సారథ్యం వహిస్తారు. ఈమె తమిళనాడుకు చెందిన వారు కావడం గమనార్హం. శనివారం రాత్రి కరూర్‌లో టీవీకే చీఫ్ విజయ్ చేపట్టిన భారీ ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది చనిపోయారు. వీరిలో మహిళలు 18, చిన్నారులు 10 మంది ఉన్నారు.

హోం శాఖ బిల్లుల కమిటీలకు దూరంగా కాంగ్రెస్

న్యూఢిల్లీ: లోక్‌సభలో హోంశాఖ ప్రవేశపెట్టిన బిల్లులపై త్వరలో ఏర్పాటయ్యే పార్లమెంట్ సంయుక్త కమిటీల్లో భాగస్వామిగా ఉండరాదని కాంగ్రెస్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ప్రధానమంత్రి సహా ఉన్నతస్థానాల్లో ఉన్న వారెవరైనా సరే తీవ్ర అభియోగాలతో 30 రోజులపాటు జైలులో ఉండే వారిని పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన బిల్లు కూడా ఇందులో ఉంది. తాము ఈ కమిటీల్లో భాగస్వామిగా ఉండబోమని త్వరలోనే కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ స్పీకర్ తెలియజేయనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. శివసేన(యూబీటీ), ఆప్‌తోపాటు సమాజ్‌వాదీ పార్టీ కూడా ఇదే రకమైన నిర్ణయం తీసుకోనున్నట్లు చెబుతున్నారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్(సవరణ)బిల్లు, రాజ్యాంగ(138వ సవరణ)బిల్లు, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులపై ఏర్పాటయ్యే సంయుక్త పార్లమెంటరీ కమిటీలను బహిష్కరిస్తామని తనకు ఏ పార్టీ నుంచి కూడా లేఖ అందలేదని స్పీకర్ ఓం బిర్లా ఇటీవల తెలిపారు. ఈ బిల్లులపై ప్రతిపక్షాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలే లక్ష్యంగా వీటిని తీసుకువచ్చిందని ఆరోపిస్తున్నాయి.

పంజాబ్ అసెంబ్లీకి పోటీ చేస్తా

సిద్ధూ మూసేవాలా తండ్రి ప్రకటన

భటిండా: రానున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు హత్యకు గురైన సిద్ధూ మూసేవాలా తండ్రి బల్కౌర్ సింగ్ సోమవారం ప్రకటించారు. 2022 ఎన్నికల్లో తన కుమారుడు సిద్ధూ పోటీ చేసి ఓడిపోయిన మన్సా స్థానం నుంచే పోటీకి దిగుతానన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. సిద్ధూ మూసేవాలా చనిపోయాక తనకు, తన కుటుంబానికి మన్సా ప్రజలు ఎంతో మద్దతుగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. 'అసెంబ్లీకి వెళ్లాలన్న కోరిక నెరవేరకుండానే సిద్ధూ చనిపోయాడు. వచ్చే ఎన్నికల్లో నేను పోటీ చేసి, గెలుస్తా. సిద్ధూ ఫొటోతో అసెంబ్లీలోకి అడుగుపెట్టి, అతడి ఆకాంక్ష నెరవేరుస్తా'అని ఆయన ప్రకటించారు. శుభ్‌దీప్ సింగ్ సింధ్దూ అలియాస్ సిద్ధూ మూసేవాలా 2022 మేలో మన్సాలో దుండగుల కాల్పుల్లో చనిపోవడం తెల్సిందే.

11 మంది నేరగాళ్లకు చైనా మరణశిక్ష

బీజింగ్: మయన్మార్‌కు చెందిన ఒకే కుటుంబంలోని నేరగాళ్ల ముఠాలోని 11 మందికి చైనా కోర్టు మరణ శిక్ష విధించింది. 39 మందితో కూడిన ఈ సాయుధ గ్యాంగ్ 2015 నుంచి సెక్స్ రాకెట్, కేసినోల నిర్వహణ, డ్రగ్స్ రవాణా వంటి నేరాలకు పాల్పడుతోంది. వివిధ ఘటనల్లో 14 మంది చైనీయులను చంపడంతోపాటు ఆరుగురిని గాయపర్చింది. సోమవారం విచారణ చేపట్టిన ఝెజియాంగ్ ప్రావిన్స్‌లోని వెన్‌ఝూ పీపుల్స్ కోర్టు హత్యలు, మోసాలకు పాల్పడినట్లు 14 మందిని దోషులుగా తేల్చింది. పాల్పడిన నేరాలు, దారితీసిన పరిస్థితులు, వారి చర్యలతో సమాజానికి కలిగిన నష్ట తీవ్రత ఆధారంగా శిక్షలను ఖరారు చేసింది. ముఠా నాయకుడు సహా 11 మందికి మరణ శిక్షను, మరో ఐదుగురికి మరణ శిక్షను రెండేళ్ల ఖైదుకు తగ్గించింది, ఇంకో 11 మందికి జీవిత ఖైదును విధించింది. మిగతా వారికి ఐదేళ్ల నుంచి 24 ఏళ్ల వరకు శిక్షలు పడ్డాయి.పలువురికి జరిమానాలు కూడా విధించింది. దేశ బహిష్కరణ, ఆస్తుల స్వాధీనం వంటివీ ఉన్నాయి.

విమానం ల్యాండింగ్ గేర్‌లో మృతదేహం

చార్లొట్టె(యూఎస్ఏ): నార్త్ కరోలినా విమానాశ్రయం నిర్వహణ సిబ్బంది అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం ల్యాండింగ్ గేర్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని కనుగొన్నారు. దొంగచాటుగా ప్రయాణించేందుకు ప్రయత్నించే క్రమంలో అతడు మరణించి ఉండొచ్చని అనుమానాలున్నాయి. ఈ విమానం తాజాగా యూరప్ నుంచి వచ్చిందని సమాచారం. ఆదివారం ఉదయం చార్లెట్టె డగ్లస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మెయింటెనెన్స్ చేపట్టిన సమయంలో మృతదేహం బయటపడిందని పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేపట్టామన్నారు. ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి ఎవరు? ఏ దేశం వాడనేది తెల్సుకోవాల్సి ఉందన్నారు. గేర్ బాక్స్‌లోకి దూరి దొంగచాటుగా ప్రయాణించాలనుకునే వారిలో బతికి బట్టకట్టడం దాదాపు అసంభవమని చెబుతున్నారు. అత్యంత ఎత్తయిన, అతిశీతల, ఆక్సిజన్ అందని వాతావరణ పరిస్థితుల్లో విమానాలు ప్రయాణించడమే కారణమని పేర్కొన్నారు. ఇదే క్రమంలో ఈ ఘటన కూడా జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

ఆ జడ్జిలకు వారం శిక్షణ ఇప్పించండి

మోసగాడికి బెయిలిచ్చినందుకు సుప్రీం ప్రతిచర్య

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కర్కడూమా అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ బెయిలిచ్చిన తీరు, సెషన్స్ కోర్టు జడ్జి ఆ బెయిల్ మంజూరులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించడంపై పట్టించుకోకుండా ఉండటమంటే విధులను నిర్లక్ష్యం చేసినట్లేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మోసాలకు పాల్పడటం అలవాటుగా మార్చుకున్న ఓ జంటను జైలు నుంచి స్వేచ్ఛగా విడిచిపెట్టిన ఉదంతంపై ఈ మేరకు పేర్కొంది. అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ బెయిలిస్తూ వెలువరించిన తీర్పును ఢిల్లీ హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, సెషన్స్ కోర్టు జడ్జిలకు కనీసం వారం పాటు ప్రత్యేక జ్యుడీషియల్ శిక్షణ ఇప్పించాలని ఢిల్లీ హైకోర్టును ఆదేశించింది. నిందితులైన దంపతులపై భూమి బదిలీ కోసం రూ.1.9 కోట్లు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ భూమిని వారు తనఖా పెట్టి మరొకరికి విక్రయించినట్లు తేలింది. తీసుకున్న డబ్బును వాపసు చేసేందుకు నిరాకరించడంతో కేసు నమోదైంది. వీరిపై గతంలో ఇలాంటి కేసులున్నాయని తేలింది.

రాజధానిని రాచకొండకు మార్చింది ఎవరు?

అనపోతనాయకుడు తన రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం. అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కాకతీయానంతర యుగం

పద్మనాయకులు

ప్రసాదిత్య నాయకుడి కుమారుడు వెన్నమ నాయకుడు ప్రతాపరుద్రుడి సేనానిగా ప్రసిద్ధుడు. 1303లో అల్లాఉద్దీన్ ఖిల్జీ కాకతీయ రాజ్యంపై చేసిన దండయాత్రను తిప్పికొట్టిన వారిలో ఇతడు ప్రముఖుడు. వెన్నమ నాయకుడి కుమారుడు ఎరదాచానాయకుడు, సబ్బినాయకుడి కుమారుడు (ప్రసాదిత్య నాయకుడి మనవడు) నలదాచానాయకుడు కూడా ప్రతాపరుద్రుడి సేనానులే. కాకతీయులకు పాండ్య రాజుల (1316)తో, హోయసాల రాజులతో జరిగిన యుద్ధాల్లో ఎరదాచానాయకుడు కీలక పాత్ర పోషించాడు. ప్రతాపరుద్రుడు ఇతడి పరాక్రమానికి మెచ్చి పంచ పాండ్యదళ విభాళ, పాండ్య గజకేసరి అనే బిరుదులిచ్చాడు.

ఎరదాచానాయకుడికి ముగ్గురు కుమారులు. వారు ఒకటో సింగమనాయకుడు, వెన్నమనాయకుడు, ఏచమనాయకుడు. నలదాచానేనికి మాధవ నాయకుడు, దామానేడు అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిలో సింగమనాయకుడు (1326–1361)ప్రసిద్ధుడు. తండ్రితోపాటు పాండ్య యుద్ధంలో పాల్గొని చిన్నతనంలోనే పరాక్రమం చూపాడు. కంపిలి రాజ్యంతో జరిగిన యుద్ధం (1320)లో కూడా విజయం సాధించి ప్రతాపరుద్రుడి ప్రశంసకు పాత్రుడయ్యాడు. ఢిల్లీ సుల్తాన్ల దాడిలో ప్రతాపరుద్రుడు బందీ అయ్యాక మహ్మద్ బిన్ తుగ్లక్ మాలిక్‌ను ఓరుగల్లు పాలకుడిగా నియమించాడు. ముసునూరి ప్రోలయ నాయకుడు, సింగమనాయకుడు, వేమారెడ్డి ముస్లింలను ఎదిరించి స్వతంత్ర రాజ్యస్థాపనకు పూనుకున్నారు. ముసునూరి ప్రోలయనాయకుడు తీరాంధ్ర నుంచి తురుష్కులను వెళ్లగొట్టాడు. ఇతడి తర్వాత పినతండ్రి కుమారుడు కాపయనాయకుడు రాజయ్యాడు. కాపయనాయకుడి నాయకత్వంలో సింగమనాయకుడు, వేమారెడ్డి తదితరులు ఏకమై 1336లో ఓరుగల్లును ఆక్రమించారు. కాపయ ఓరుగల్లు పాలకుడయ్యాడు. సింగమనాయకుడు వారసత్వంగా వచ్చిన ఆమనగల్లు రాజ్యంలో స్వతంత్రించాడు. అంతేగాక ఈ సమయంలో సింగమనాయకుడు తన కుమారులతో కలిసి మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని, కృష్ణా, తుంగభద్ర మధ్య ప్రాంతాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు.

రెడ్డి, వెలమ రాజ్యాల వైరం

చక్రవర్తి కావాలనుకున్న కాపయనాయకుడు సింగమనీడు పాలిస్తున్న ఆమనగంటి రాజ్యాన్ని ఆక్రమించి తన ప్రతినిధిగా ఎరబోతు లెంకను నియమించాడు. కాపయ ఆక్రమించిన ఆమనగల్లు, పిల్లలమర్రి ప్రాంతాన్ని సింగమనీడు 1360 ప్రాంతంలో తిరిగి జయించాడు. ఈ చర్యకు ఆగ్రహించిన కాపయ సామంతులు, స్నేహితులైన క్షత్రియులు సింగమనేని బావమరిదైన చింతపల్లి సింగమనాయుడిని ఓరుగల్లు మండలంలోని జల్లపల్లి కోటలో బంధించారు. సింగమనీడు ఈ కోటను ముట్టడించాడు. క్షత్రియులు సంధి పేరుతో తంబళ్ల బ్రహ్మజీని రాయబారిగా పంపి సింగమను హత్య చేయించారు. అతడి కుమారులు అనపోతానాయకుడు, మాదానాయుడు రాజులై జల్లిపల్లి, ఇనుగుర్తి కోటలను ముట్టడించి క్షత్రియులను చంపి పగతీర్చుకున్నారు. కొందరు క్షత్రియులు హుజూరాబాద్, మొలంగూరు కోటల్లో దాచుకున్నారు. కరీంనగర్ జిల్లా మొలంగూరు సమీపంలోని చెంజర్ల వద్ద దాక్కొన్న సోమవంశ క్షత్రియులనందరినీ 1361లో సంహరించారు.

ఈ సమయంలో కాపయ ప్రోత్సాహంతో క్షత్రియులకు సహాయంగా వచ్చిన రెడ్డి రాజులను మాదానాయకుడు, నాగానేడు చేజెర్ల, మొగళ్లూరు ప్రాంతం నుంచి తరిమి వేశారు. శ్రీశైలం ప్రాంతమంతటినీ జయించి తమ రాజ్యంలో కలుపుకున్నారు. తర్వాత రెడ్డి రాజ్యభాగమైన ధరణికోటను ముట్టడించి అనపోతారెడ్డిని ఓడించారు. ఈ యుద్ధం 1361లో చెంజర్ల యుద్ధం తర్వాత జరిగింది. ఈ యుద్ధంతో మొదలైన రెడ్డి, వెలమ రాజ్యాల వైరం ఈ రాజ్యాల పతనం దాకా కొనసాగింది. క్షత్రియుల్లో కొందరు భువనగిరి ప్రాంతం చేరి అనపోతనాయకుడి శత్రువులను కలుపుకొని యుద్ధానికి సిద్ధమయ్యారు. అనపోతానాయకుడు భువనగిరి సమీపంలో మూసీనది తీరంలో ఇంద్ర్యాల వద్ద వీరిని జయించాడు. ఈ యుద్ధం కూడా 1361లోనే జరిగింది. భువనగిరి కోట అనపోతనాయకుడి వశమైంది.

పద్మనాయకుల పైచేయి

ఈ విజయాల అనంతరం అనపోతనాయకుడు రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం. అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు. ఇరు రాజ్యాల ఆధిపత్య పోరే ఈ యుద్ధానికి కారణం. ఆంధ్ర దేశాధీశ్వరులమని ఇరువురూ చెప్పుకోవడం అందుకు నిదర్శనం. ఈ యుద్ధం 1369లో ముగిసింది. ఓరుగల్లు ప్రాంతం పద్మనాయకుల వశమైంది. ముసునూరి వంశం అంతమైంది. ఓరుగల్లు, భువనగిరి, సింగవరం మొదలైన ప్రాంతాలను అనపోతానాయకుడు స్వాధీనం చేసుకున్నాడు.

ఓరుగల్లు స్వాధీనమయ్యాక ఆంధ్రదేశమంతటినీ జయించాలనే ఉద్దేశంతో అనపోతా నాయకుడు కళింగ మీద దండెత్తాడు. వీర నరసింహదేవుడు యుద్ధంలో ఓడిపోయి తన కుమార్తె కనక లక్ష్మీదేవిని అనపోతనాయకుడి మనవడైన రెండో అనపోతనకిచ్చి సంధి చేసుకున్నాడు. ఇది 1380కి ముందు జరిగింది. అప్పటికి పద్మనాయక రాజ్యానికి ఉత్తరాన గోదావరి, దక్షిణాన శ్రీశైలం, తూర్పున కొండవీటి రాజ్యం, పశ్చిమాన బహమనీ రాజ్యం సరిహద్దులు. అంటే తెలంగాణ ప్రాంతమంతా పద్మనాయకుల పాలనలోకి వచ్చింది. అప్పటి నుంచి ఒక శతాబ్దం వరకూ పద్మనాయకుల చరిత్రే తెలంగాణ చరిత్ర అని చరిత్రకారులు చెప్పిన మాట వాస్తవం.

దాయాదుల పాలన

పై విజయాలు పూర్తయ్యాక రాజ్యవిస్తీర్ణం, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా దేవరకొండ ప్రాంతానికి తన సోదరుడైన మాదానాయకుడిని అధిపతిగా నియమించాడు. అప్పట్నుంచి రాచకొండ రాజ్యంలోని దక్షిణభాగాన్ని మాదానాయకుడి సంతతి పరిపాలించింది. రెండు రాజ్యకేంద్రాలు ఏర్పడినప్పటికీ ఇరు కుటుంబాల మధ్య ఎన్నడూ పొరపొచ్చాలు రాకపోవడం చరిత్రలో అరుదైన అంశం. అనపోతానాయకుడి కుమారులు రెండో సింగభూపాలుడు, ధర్మానాయకుడు. మాదానాయకుడి కుమారుడు వేదగిరి నాయకుడు.

అనపోతానాయకుడి తర్వాత రెండో సింగభూపాలుడు 1384లో రాచకొండలో సింహాసనం అధిష్ఠించాడు. అదే సంవత్సరం దేవరకొండలో పెదవేదగిరి నాయకుడు అధికారంలోకి వచ్చాడు. సింగభూపాలుడి రాజ్య ఆరంభకాలంలో విజయనగరరాజు రెండో హరిహరరాయలు రాచకొండ రాజ్యంలోని కొత్త కొండ (మహబూబ్‌నగర్)పై దండెత్తాడు. సింగ భూపాలుడు విజయనగర సైన్యాలను ఓడించాడు. తాను యువరాజుగా ఉన్నప్పుడే కల్యాణి (గుల్బర్గా) దుర్గాన్ని ఆక్రమించిన అనుభవం ఈ యుద్ధంలో ఉపయోగపడింది. ఈ యుద్ధం తర్వాత సింగ భూపాలుడు కళింగ దేశాన్ని జయించడానికి వెళ్లి గోదావరి జిల్లాలోని బెండపూడి, వేములకొండ ప్రాంతాల్ని జయించి 1387లో సింహాచల క్షేత్రంలో శాసనం వేయించాడు.

1397లో రెండో బుక్కరాయలు పాత పగతో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ తాలూకాలోని పానుగల్లు కోటను రెండు సంవత్సరాల యుద్ధానంతరం స్వాధీనం చేసుకున్నాడు. ఈ సమయంలోనే రెండో బుక్కరాయలు దేవరకొండ మీద దండెత్తగా, పెద వేదగిరినాయకుడు తన కుమారుడైన మూడో మాదానీడును పంపి ఓడించాడు. ఇతడు విజయనగర సైన్యాధ్యక్షుడైన గుండదండాధీశుడిని సంహరించి ఓరుగల్లును ఆక్రమించాడని వెలుగోటి వంశావళి తెలుపుతోంది. రెండో సింగభూపాలుడికి ఆరుగురు కుమారులు. వారిలో పెద్దవాడైన రెండో అనపోతానాయకుడు (1400–1420), సింగభూపాలుడి అనంతరం రాజ్యానికి వచ్చాడు. అధికారం చేపట్టగానే మెదక్ దుర్గాన్ని ఆక్రమించిన విజయనగర సైన్యాలను తరిమేశాడు.

విజయనగర రాజులతో మైత్రి

రెండో హరిహరరాయల మరణానంతరం వారసుల మధ్య విభేదాలు తలెత్తాయి. కొండవీటి రెడ్డి రాజ్యంలో కుమారగిరి రెడ్డి పెద కోమటి వేమారెడ్డి మధ్య వైరం మొదలైంది. ఇదే అదనుగా భావించిన అనపోతానాయుడు విజయనగర రాజ్యంపై దండెత్తి చెన్నపట్నం వరకు ఉన్న భూభాగాలను ఆక్రమించాడు. కొండవీటి రెడ్ల ఆధీనంలోని వాడపల్లి, చిలుకూరు, వేదాద్రులను జయించాడు. దీంతో కొండవీటి రాజులు, బహమనీ ఫిరోజ్ షాలు ఒక్కటయ్యారు. దీంతో అనపోతానాయకుడు విజయనగర రాజులతో మైత్రి చేసి, వారి సాయంతో పానగల్లు (మహబూబ్‌నగర్) మీద దాడిచేసిన ఫిరోజ్‌షా సైన్యాలను ఓడించి తమ పూర్వరాజ్య భాగమైన పానగల్లును వశపరచుకున్నాడు.

ఇదే సమయంలో కొండవీటి రాజు పెద కోమటి వేమారెడ్డి దేవరకొండ రాజ్యంపై దండెత్తి పినవేదగిరిని సంహరించాడు. దీంతో అనపోతానాయుడు విజయనగర రాజుల సహాయంతో కొండవీడును ముట్టడించి వేమారెడ్డిని సంహరించాడు. కొండవీడు రాజ్యాన్ని పద్మనాయకులు, విజయనగరాధీశులు, గజపతులు ఆక్రమించారు (మిగిలిన కొద్ది భాగాన్ని పాలించిన రాచవేమారెడ్డితో కొండవీటి రాజ్యం అంతరించింది.) పద్మనాయకుల ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన గొప్ప పరాక్రమవంతుడు అనపోతానాయుడు. ఇతడు విజయనగర రాజులతో మైత్రి చేసినందువల్ల బహమనీయులు శత్రుభావం పెంచుకున్నారు. అందువల్ల పద్మనాయక రాజ్యానికి ముప్పు తలెత్తింది.

రెండో అనపోతానాయుడి తర్వాత అతడి కుమారులు చిన్న వారు కావడం వల్ల అతడి చిన్న తమ్ముడు రావు మాదానాయుడు రాజయ్యాడు. దేవరకొండ రాజ్యంలో అంతకు ముందే పెదవేదగిరి మూడో మనవడూ, మూడో మాదానీ చిన్న కుమారుడూ అయిన లింగమనీడు రాజ్యానికొచ్చాడు. బహమనీ ఫిరోజ్‌షా కుమారుడు అహ్మద్‌షా పానగల్లు యుద్ధంలో జరిగిన అవమానానికి ప్రతీకారంగా విజయనగరంపై దండెత్తాడు. విజయనగర రాజులతో మైత్రి ఉండటం వల్ల మాదానీడు, లింగమనీడు విజయనగరం పక్షాన యుద్ధం చేశారు. ఇరు సైన్యాల ధాటికి తట్టుకోలేక అహ్మద్‌షా లొంగిపోయి 1422లో విజయనగరంతో సంధి చేసుకున్నాడు.

ఈ యుద్ధంలో మాదానీడు విజయనగర పక్షం వహించడం వల్ల బహనీయులు (అహ్మద్ షా) పద్మనాయకులపై పగ పెంచుకున్నారు. తమ ఇరువురి మధ్య జరిగిన సంధి వల్ల విజయనగర రాజులు పద్మనాయకులకు దూరమయ్యారు. దీంతో పద్మనాయకుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఇదే అదనుగా అహ్మద్‌షా ఓరుగల్లు మీద దాడి చేశాడు. మూడో సింగభూపాలుడు తన పినతండ్రి రావు మాదానీడు, లింగమనేనిల సహాయంతో అజీమ్‌ఖాన్‌లాంటి సర్దారులను ఓడించి 1425లో ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నాడు. రెండో అనపోతానేని కుమారుడైన సింగభూపాలుడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. సింగమనాయకుడు పదేళ్లపాటు ఏ ఇబ్బంది లేకుండా రాజ్యాన్ని పాలించాడు. ఇతడు పోతనను, శ్రీనాథుడిని ఆదరించి కవి పండిత పోషకుడిగా పేరొందాడు.

బహమనీల దాడి

మాళవ, గుజరాత్ దేశాలతో పోరాడుతున్న అహ్మద్‌షా వారితో సంధి చేసుకొని తిరిగి ఓరుగల్లుపై దండెత్తాడు. కళాపోషకుడైన సింగమనాయకుడు సహజంగానే యుద్ధ విముఖుడు కాబట్టి అహ్మద్‌షాను ఎదుర్కొనకుండానే సంధి చేసుకొని భువనగిరిని వదులుకున్నాడు. పైకి సంధికి అంగీకరించిన అహ్మద్‌షా భువనగిరిలో సంజర్‌ఖాన్‌ను నియమించి వెళ్లాడు. కానీ తెలంగాణ మొత్తాన్నీ జయించమని సంజర్‌ఖాన్‌ను ఆదేశించాడు. సంజర్‌ఖాన్ 1436లో ఓరుగల్లును ఆక్రమించాడు. దేవరకొండ మినహా తెలంగాణ అంతా బహమనీయుల వశమైంది. బహమనీ రాకుమారుడు దాసూర్‌ఖాన్ రాచకొండ ప్రతినిధి అయ్యాడు. ఆ తర్వాత సింగమనాయకుడి చరిత్ర, పద్మనాయక చరిత్ర లింగమనీడు చరిత్రతో కలిసిపోయింది. 1420లో దేవరకొండ శాఖలో రాజ్యానికొచ్చిన లింగమనీడు పద్మనాయక రాజుల్లో మరో గొప్ప పరాక్రమవంతుడు. లింగమనీడు ఏకధాటిగా 32 దుర్గాలను జయించడం అందుకు నిదర్శనం. ఇతడు సింగమనాయకుడితో కలిసి అహ్మద్‌షా ఆక్రమించిన ఓరుగల్లును 1425లో జయించాడు. తర్వాత 1428 నాటికి తూర్పు దండయాత్రల్లో అల్లయ వేమారెడ్డిని, వీరభద్రారెడ్డిని ఓడించి రాజమండ్రి, సింహాచలాన్ని జయించాడు.

తర్వాత వేములకొండ, మామిడాల, సప్తమాడియాలు, ఆవంచ, గంగవరాలను ఆక్రమించాడు. ఈ సమయంలోనే కళింగ గంగరాజైన నాలుగో భానుదేవుణ్ణి తొలగించి కపిలేశ్వర గజపతి కళింగ సింహాసనాన్ని అధిష్ఠించాడు. అధికారంలోకి రాగానే రెడ్డి రాజ్యభాగాల్లో ప్రవేశించాడు. ఈ ఆక్రమణను, లింగమనీడు విజృంభణనూ సహించని విజయనగర దేవరాయలు తెలుంగ రాయలను సింహాచలంపైకి పంపాడు. దీంతో గజపతులు, లింగమనీడు వెనక్కి మరలాల్సి వచ్చింది. ఈ పరిస్థితి వీరిద్దరూ చేయికలపడానికి దారితీసింది. అలా కపిలేశ్వర గజపతి సహాయంతో లింగమనీడు మెదట కొండవీడు ప్రాంతాలను జయించాడు. శ్రీశైలాన్ని ఆక్రమించాడు.

పాఠశాలల్లో ఎక్కువగా ఉపయోగించే మ్యాప్‌లు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ స్టడీస్- మెథడాలజీ

బోధనాభ్యసన సామగ్రి - వనరులు

1. ఎడ్గర్‌డేల్ అనుభవ శంఖులో పై నుంచి రెండో స్థానంలో ఉన్న అభ్యసన అనుభవం? (టెట్- జూలై 2011)
   1) క్షేత్ర పర్యటనలు 2) దృశ్య సాంకేతికాలు
   3) కదిలే చిత్రాలు 4) ప్రదర్శనలు
2. రేడియో, కార్టూన్, నాటకీకరణ అనేవి ప్రక్షేపితం కాని బోధనోపకరణాలు. వీటికి గల సరైన విద్యాపరమైన పేర్లు వరుసగా? (టెట్ - జనవరి 2012)
   1) శ్రవణ ఉపకరణం, గ్రాఫిక్ ఉపకరణం, కృత్య ఉపకరణం
   2) కృత్య ఉపకరణం, గ్రాఫిక్ ఉపకరణం శ్రవణ ఉపకరణం
   3) కృత్య ఉపకరణం, శ్రవణ ఉపకరణం గ్రాఫిక్ ఉపకరణం
   4) గ్రాఫిక్ ఉపకరణం, శ్రవణ ఉపకరణం, కృత్య ఉపకరణం
3. విద్యార్థుల్లో అభిరుచులను, పఠనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వాడే కార్టూన్‌లకు ఏ గ్రాఫ్‌ను ఉపయోగిస్తారు? (టెట్ - జనవరి 2012)
   1) ఫ్లానెల్ గ్రాఫ్ 2) సచిత్ర గ్రాఫ్
   3) బార్ గ్రాఫ్ 4) రేఖా చిత్రాల గ్రాఫ్
4. ఉపాధ్యాయులకు సంబంధించిన బోధనా సామగ్రి (టెట్ - జనవరి 2012)
   1) కరిక్యులం గైడ్‌లు 2) అట్లాస్
   3) అనుబంధ సామగ్రి 4) వర్క్‌బుక్‌లు
5. ఒక ప్రదేశాన్ని చూపించేందుకు సార్వత్రికంగా ఆమోదించిన చిహ్నం? (టెట్ - మే 2012)
   1) మ్యాప్ 2) ఫోటోగ్రాఫ్
   3) గ్రాఫ్ 4) చార్ట్
6. ఒక నగర పరిపాలన వ్యవస్థీకరణ, కార్య నిర్వహణ, న్యాయ, శాసన వ్యవస్థల మధ్య సంబంధాన్ని చూపేందుకు ఏ రకమైన చార్ట్ ఉపయోగపడుతుంది? (టెట్-మే 2012)
   1) పట్టికా చార్ట్
   2) సంబంధాలను సూచించే చార్ట్
   3) ప్రవాహ చార్ట్ 4) కాలక్రమ చార్ట్
7. సాంఘికశాస్త్ర ప్రయోగశాలలో ఉంచదగిన వాతావరణ సంబంధిత పరికరం? (టెట్ - మే 2012)
   1) గొలుసు 2) డివైడర్
   3) బాక్స్ అయస్కాంతం 4) బారోమీటర్
8. భారత స్వాతంత్ర్య ఉద్యమం అనే పాఠాన్ని బోధించేందుకు ఒక ఉపాధ్యాయుడు పైకి ఉబికే చిత్రాల పుస్తకాలను ఉపయోగించాడు. అతడు ఉపయోగించిన ఆ పుస్తకాలు ఏ దృశ్య సాధనాల రకానికి చెందినవి? (డీఎస్సీ - 2008)
   1) త్రిపార్శ్వ బోధనోపకరణాలు
   2) ద్విపార్శ్వ బోధనోపకరణాలు
   3) కృత్యోపకరణాలు
   4) దృశ్యశ్రవణోపకరణాలు
9. దేశపటాలను విద్యార్థులతో కచ్చితంగా తయారు చేయించేందుకు ఉత్తమమైన పద్ధతి? (డీఎస్సీ - 2008)
   1) ఆవరణ పటాలను పూరించే పద్ధతి
   2) స్మృతి ద్వారా చేసే పద్ధతి
   3) పటాలను ట్రేసు తీసే పద్ధతి
   4) నైష్పత్తిక చతురస్రాల పద్ధతి
10. సముద్రమట్టం నుంచి 400 మీటర్ల ఎత్తులో గల ఒక కొండను పటంలో ఏ రంగుతో సూచించాలి? (డీఎస్సీ - 2008)
    1) ఎరుపు 2) పసుపు
    3) చిక్కని ఆకుపచ్చ 4) తేలికైన ఆకుపచ్చ
11. వివిధ రకాల మ్యాపులు, చార్టుల తయారీకి సంబంధించిన శాస్త్రం? (డీఎస్సీ - 2008)
    1) కార్టోగ్రఫీ 2) ఫోటోగ్రఫీ
    3) ఫోటోగ్రమెట్రీ 4) టోపోగ్రఫీ
12. రెండో ప్రపంచ యుద్ధం వరకు ప్రపంచం అనే పాఠాన్ని బోధించేటప్పుడు ఉపాధ్యాయుడు జర్మనీలో, ఇటలీలో ఏకకాలంలో జరిగిన సంఘటనలను వివరించేందుకు ఉపయోగించే కాలరేఖ చార్ట్? (డీఎస్సీ-2008)
    1) తిరోగమన కాలరేఖ చార్ట్
    2) పురోగమన కాలరేఖ చార్ట్
    3) సచిత్ర కాలరేఖ చార్ట్
    4) సమకాలిన కాలరేఖ చార్ట్
13. భూమి ఆవరణాలు అనే పాఠాన్ని బోధించేందుకు తోడ్పడే ఉత్తమమైన బోధనోపకరణం? (డీఎస్సీ - 2012)
    1) నమూనా 2) డెమోరమా
    3) భౌతికపటం 4) రంగులపటం
14. ఒక కాలంలోని సంఘటనలను ప్రస్తుత కాలం నుంచి భూతకాలం వరకు, భూతకాలం నుంచి ప్రస్తుత కాలం వరకు చూపే కాలరేఖలు వరుసగా? (డీఎస్సీ - 2012)
    1) తిరోగమన కాలరేఖలు, పురోగమన కాలరేఖలు
    2) పురోగమన కాలరేఖలు, తిరోగమన కాలరేఖలు
    3) తిరోగమన కాలరేఖలు, సచిత్ర కాలరేఖలు
    4) సచిత్ర కాలరేఖలు, పురోగమన కాలరేఖలు
15. మ్యాప్, గ్లోబ్‌లు వరుసగా? (డీఎస్సీ - 2012)
    1) త్రిమితీయంగా భూ పరితలాన్ని చూపుతాయి
    2) చదునుగా భూ ఉపరితలాన్ని చూపుతాయి
    3) త్రిమితీయంగా, చదునుగా భూ ఉపరితలాన్ని చూపుతాయి
    4) చదునుగా, త్రిమితీయంగా భూ ఉపరితలాన్ని చూపుతాయి
16. సతత హరిత అరణ్యాలను మ్యాప్‌పై సూచించేందుకు ఉపయోగించే రంగు? (డీఎస్సీ - 2012)
    1) తేలికైన ఆకుపచ్చ
    2) ముదురు ఆకుపచ్చ
    3) తేలికైన చామనఛాయ
    4) పసుపు ఆకుపచ్చ
17. కార్టూన్‌లు, తోలు బొమ్మలు వరుసగా? (డీఎస్సీ - 2012)
    1) త్రిపార్శ్వ బోధనోపకరణం, ద్విపార్శ్వ బోధనోపకరణం
    2) ద్విపార్శ్వ బోధనోపకరణం, త్రిపార్శ్వ బోధనోపకరణం
    3) రెండూ ద్విపార్శ్వ బోధనోపకరణాలే
    4) రెండూ త్రిపార్శ్వ బోధనోపకరణాలే
18. ఒక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పాఠ్య బోధనలో భాగంగా గోల్కొండ కోటకు సందర్శనను ఏర్పాటు చేశాడు. ఆ కోట ఏ రకమైన మూలాధారం? (డీఎస్సీ - 2012)
    1) పురావస్తు సంబంధ ఆధారం
    2) మౌలిక సంప్రదాయం
    3) శాసనాలు 4) లిఖిత ఆధారాలు
19. ఒక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పాఠ్య బోధనలో భాగంగా దగ్గరలోని మ్యూజియానికి సందర్శనను ఏర్పాటు చేశాడు. ఉపాధ్యాయుడు ఉపయోగించిన వనరు ఏ రకానికి చెందుతుంది? (డీఎస్సీ - 2012)
    1) మతసంబంధ వనరు
    2) చారిత్రక వనరు
    3) ఆర్థిక వనరు 4) భౌగోళిక వనరు
20. బ్యాంక్, బాలభవన్ అనేవి ఏ రకమైన వనరులకు ఉదాహరణలు?
    1) రెండూ ఆర్థిక విలువగల వనరులే
    2) రెండూ సాంస్కృతిక విలువగల వనరులే
    3) ఆర్థిక, సాంస్కృతిక విలువగల వనరు
    4) సాంస్కృతిక, ఆర్థిక విలువ కలిగిన వనరు
21. కొండ ప్రాంతంలోని రోడ్లను మ్యాప్‌లో సూచించేందుకు ఏ రేఖలను ఉపయోగిస్తారు?
    1) సరళరేఖలు 2) వక్రరేఖలు
    3) వలయరేఖలు 4) వాలురేఖలు
22. మ్యూజ్ (Muse) అంటే..?
    1) ఉపయోగించిన వస్తువుల సముదాయం
    2) విద్యాదేవత ఆలయం
    3) ప్రాచీన కాల ఆరాధ్యదేవత పేరు
    4) పురాతన నాగరికత అవశేషాల కేంద్రం
23. పాఠశాలల్లో అధ్యయన కేంద్రాలను స్థాపించడంలో ముఖ్య ఉద్దేశం?
    1) పాఠ్యేతర అంశాలను విద్యార్థులకు తెలియచెప్పడానికి
    2) పాఠ్యాంశాల అదనపు విషయ సామగ్రిని అందుబాటులోకి తేవడానికి
    3) తరగతికి స్థాయికి తగిన సామర్థ్యాలు లేనివారి విద్యా ప్రయోజనాలకు
    4) పాఠశాలకు తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల విజ్ఞాన వికాసానికి
24. విద్యార్థులను బొర్రా గుహలకు విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్లారు. ఏ విలువ గల వనరుల దర్శనానికి విద్యార్థులు వెళ్లారని చెప్పొచ్చు?
    1) సాంస్కృతిక 2) చారిత్రక
    3) శాస్త్రీయ 4) భౌగోళిక
25. విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. అంటే...?
    1) సమాజాన్ని విద్యార్థుల వద్దకు తీసుకెళ్లడం
    2) పాఠశాలను సమాజం వద్దకు తీసుకెళ్లడం
    3) అధ్యయన అంశాలను మెరుగుపర్చడం
    4) పాఠ్యేతర అంశాలను విద్యార్థులకు పరిచయం చేయడం
26. విద్యార్థుల్లో అంతర్దృష్టి వికాసం, సహకార భావం పెంపొందాలంటే తోడ్పడేవి?
    1) పాఠశాల శిబిరాలు
    2) క్షేత్ర పర్యటనలు
    3) సాంఘిక సేవా కార్యక్రమాలు
    4) అధ్యయన కేంద్రాలు
27. పాఠశాల పౌర శిక్షణా కార్యక్రమాల్లోని ప్రధాన కార్యకలాపం?
    1) స్వచ్ఛంద సేవ
    2) పాఠశాల క్రమశిక్షణ నియమావళి రూపకల్పన
    3) విద్యార్థుల్లో పౌరనీతిని అభివృద్ధి చేయడం
    4) పాఠశాల పార్లమెంట్ నిర్వహణ
28. విజ్ఞాన యాత్రలు... అధ్యయనం, ప్రయాణం, పరిశీలన, విజ్ఞానానికి ద్వారాలు అని చెప్పినవారు?
    1) శామ్యూల్ జాన్సన్ 2) ఎడ్గర్ డేల్
    3) మేక్సన్ 4) కిల్‌పాట్రిక్
29. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి విషయ సామగ్రిని సేకరించాడు. ఆ పత్రిక దేనికి చెందినదిగా చెప్పొచ్చు?
    1) ప్రధాన ఆకారాలు
    2) ప్రాథమిక ఆకారాలు
    3) ద్వితీయ ఆకారాలు
    4) తృతీయ ఆకారాలు
30. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో వచ్చే మార్పులను చూపించడానికి ఉపయోగించే గ్రాఫ్?
    1) సచిత్ర గ్రాఫ్ 2) బార్ గ్రాఫ్
    3) లైన్ గ్రాఫ్ 4) వలయ గ్రాఫ్
31. రాష్ట్రపతికి గల అధికారాలను అర్థవంతంగా బోధించాలంటే ఉపయోగించే చార్ట్?
    1) టేబుల్ చార్ట్ 2) ఫ్లో చార్ట్
    3) పంపిణీ చార్ట్ 4) స్ట్రిప్ చార్ట్
32. భూమి ఉపరితల పత్రికలు అని వేటిని అంటారు?
    1) చార్ట్‌లు 2) మ్యాప్‌లు
    3) గ్లోబులు 4) నమూనాలు
33. మ్యాప్‌లను తయారు చేయడానికి నైష్పత్తిక చతురస్రాల పద్ధతి కంటే సులభమైనది?
    1) ప్రక్షేపన పద్ధతి 2) ప్రకల్పనా పద్ధతి
    3) త్రిమితీయ విస్తరణపద్ధతి
    4) సెల్యూలాయిడ్ పద్ధతి
34. మన రాష్ట్రంలో మొదటిసారిగా విద్యార్థుల కృత్యాధార అభ్యసనానికి అవసరమైన బోధనాభ్యసన సామగ్రిని అందించిన పథకం?
    1) ఏపీపీఈపీ 2) ఓబీబీ
    3) డీపీఈపీ 4)ఎస్ఎస్ఏ (ఆర్‌వీఎం)
35. పాఠ్య విషయం విద్యార్థులకు ఆసక్తి దాయకంగా ఉండాలంటే బోధనాభ్యసన సామగ్రి ఎలా ఉండాలి?
    1) నిత్యనూతనంగా ఉండాలి
    2) మంచి విలువ కలిగి ఉండాలి
    3) స్థానికంగా తయారు చేసి ఉండాలి
    4) విద్యార్థులు గతంలో చూసినవై ఉండాలి
36. కింది వాటిలో గ్రాఫిక్ ఉపకరణం కానిది?
    1) ఫ్లాష్‌కార్డ్‌లు 2) పటాలు
    3) కార్టూన్లు 4) నమూనాలు
37. పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే) గురించి విద్యార్థులకు వివరించడానికి అనువైన పటాలు?
    1) భౌగోళిక పటాలు 2) రాజకీయ పటాలు
    3) భౌగోళిక రాజకీయ పటాలు
    4) రిలీఫ్ పటాలు
38. రిలీఫ్ పటాలు ఎలా ఉంటాయి?
    1) ఎత్తు పల్లాలతో తయారై ఉంటాయి?
    2) ఇవి త్రిమితీయ పటాలు
    3) వివిధ రంగులతో వుంటాయి
    4) పైవన్నీ
39. విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే చార్ట్‌లు?
    1) స్ట్రిప్‌టీజ్ చార్ట్‌లు 2) టైమ్‌లైన్ చార్ట్‌లు
    3) ఫ్లో చార్ట్‌లు 4) ట్రీ చార్ట్‌లు
40. మన జాతీయాదాయానికి వివిధ ఆదాయ వనరుల నుంచి ఎంత శాతంలో ఆదాయం వచ్చిందో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించడానికి అనువైన గ్రాఫ్?
    1) సచిత్ర గ్రాఫ్ 2) పై గ్రాఫ్
    3) బార్ గ్రాఫ్ 4) లైన్ గ్రాఫ్
41. నల్లబల్లను సక్రమంగా వాడడానికి గల నియమాల్లో ఇది ఉండదు?
    1) నల్లబల్లపై రాసే అక్షరాల సైజు $2^1/_2$ అంగుళాల వ్యాసంతో ఉండాలి
    2) క్లిష్టమైన అంశాలను, డయాగ్రామ్‌ను ముందే రాసుకుని లేదా గీసి ఉంచాలి
    3) పాఠ్య విషయాన్ని స్పష్టంగా వివరిస్తూనే బోర్డ్‌పై ముఖ్యాంశాలు రాయాలి
    4) విద్యార్థులు కూడా నల్లబల్లపై రాసేలా చర్యలు తీసుకోవాలి
42. ఏ బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగించి బోధించే ఉపాధ్యాయుడు అంటే ప్రఖ్యాత విద్యావేత్త కోమీనియస్‌కు చాలా ఇష్టం?
    1) నల్లబల్ల 2) స్పెసిమెన్‌లు
    3) చార్ట్‌లు, గ్రాఫ్‌లు
    4) స్లైడ్‌లు, ఫిల్మ్ స్ట్రిప్‌లు
43. ప్రాచీన మానవుడు ఉపయోగించిన వస్తువుల గురించి బోధించేటప్పుడు విద్యార్థులకు ఆసక్తి దాయకంగా ఉండడానికి ఉపాధ్యాయుడు ఉపయోగించాల్సిన బోధనాభ్యసన సామగ్రి?
    1) స్పెసిమెన్‌లు 2) ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్
    3) స్లైడ్‌లు 4) చిత్రాలు
44. పాఠశాలలో బోధనాభ్యసన సామగ్రిని భద్రపర్చే బాధ్యతను ఎవరు నిర్వహించడం ఉత్తమం?
    1) సంబంధిత ఉపాధ్యాయుడు
    2) ప్రధానోపాధ్యాయుడు
    3) అటెండర్ 4) విద్యార్థులు
45. పాఠశాలల్లో ఎక్కువగా ఉపయోగించే మ్యాప్‌లు?
    1) రిలీఫ్ మ్యాప్‌లు
    2) త్రీ డైమెన్షనల్ మ్యాప్‌లు
    3) ఫ్లాట్‌మ్యాప్‌లు 4) స్పెసిమెన్ మ్యాప్‌లు

సమాధానాలు

1) 2	2) 1	3) 2	4) 3	5) 1
6) 1	7) 4	8) 3	9) 4	10) 4
11) 3	12) 2	13)2	14) 1	15) 4
16) 2	17) 2	18)1	19) 2	20) 3
21) 4	22) 2	23)3	24) 4	25) 2
26) 1	27) 4	28)1	29) 4	30) 3
31) 2	32) 2	33)1	34) 1	35) 1
36) 4	37) 3	38)4	39) 1	40) 2
41) 3	42) 2	43) 1	44) 4	45) 3

పరమాణు కేంద్రకాన్ని కనుగొన్న శాస్త్రవేత్త?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం


జనరల్ స్టడీస్

ఆధునిక భౌతికశాస్త్రం

క్రీ.శ. 1900లో మాక్స్ ప్లాంక్ అనే శాస్త్రవేత్త క్వాంటం సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తర్వాత భౌతిక శాస్త్ర అభివృద్ధిని కలిపి ఆధునిక భౌతికశాస్త్రం అంటారు. ఈ శాస్త్రంలో మనం అధ్యయనం చేసే విషయాల్లో ప్రాథమిక కణాలు (ఎలక్ట్రాన్‌లు, ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు మొదలైనవి), ఐసోటోపులు, రేడియోధార్మికత, కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం, ఎక్స్-కిరణాలు, కాస్మిక్ కిరణాలు ముఖ్యమైనవి.

పదార్థాలను విభజించినపుడు చివరగా పరమాణవులు లభిస్తాయి. ఈ పరమాణువులను విభజించేందుకు వీలుకాదని జాన్ డాల్టన్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించాడు.

కానీ తర్వాత వచ్చిన శాస్త్రవేత్తలు పరమాణువును విభజించొచ్చని తెలుసుకున్నారు. సాధారణంగా పరమాణువులో న్యూక్లియస్, ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు, ఎలక్ట్రాన్‌లు మొదలైన కణాలుంటాయి.



పరమాణు కేంద్రకం:

రూథర్‌ఫర్డ్ అనే శాస్త్రవేత్త పరమాణు కేంద్రకాన్ని కనుక్కొన్నాడు. దీని పరిమాణం 1 Fermi ఉంటుంది.

1 Fermi=10^{-15}m

ఇందులోని ఒక ప్రోటాన్, ఒక న్యూట్రాన్ ను కలిపి ఒక న్యూక్లియాన్ అని అంటారు.

ప్రాథమిక కణాల్లో ఆవిష్కరించిన తొలికణం 'ఎలక్ట్రాన్'. దీన్ని కేథోడ్ కిరణాలు లేదా బీటా - కిరణాలు అంటారు.

ఎలక్ట్రాన్

ఎలక్ట్రాన్‌లను మొట్టమొదటి సారిగా గుర్తించిన శాస్త్రవేత్త 'ప్లక్కర్'. దీన్ని ప్రయోగాత్మకంగా కనుగొన్న శాస్త్రవేత్త జె.జె.థామ్సన్ (జాన్ జోసెఫ్ థామ్సన్)కు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

- కేథోడ్ కిరణాలకు ఎలక్ట్రాన్ అని పేరు పెట్టిన శాస్త్రవేత్త జాన్‌స్టోని'.
- కేథోడ్ కిరణాలు ఎల్లప్పుడు రుజుమార్గంలో ప్రయాణిస్తాయని నిరూపించిన శాస్త్రవేత్త హిటార్ఫ్.
- ఎలక్ట్రాన్‌లు కూడా ఎల్లప్పుడూ రుజు మార్గంలోనే ప్రయాణిస్తాయి.
- ఎలక్ట్రాన్‌లు ప్రయాణించే మార్గంలో ఎదురుగా ఫొటోగ్రఫిక్ ఫిల్మ్‌ను అమర్చినపుడు ఎలక్ట్రాన్‌లు ప్రభావితం చెందుతాయి.
- ఎలక్ట్రాన్‌లు ప్రయాణిస్తున్న మార్గంలో ఎదురుగా ఉన్న వాయుకణాలను ఢీకొని వాటిని అయనీకరణం చెందిస్తాయి.
- ఒక పరమాణువు బాహ్య కక్ష్యలో అదనంగా ఎలక్ట్రాన్‌లను చేర్చడం లేదా ఉన్న ఎలక్ట్రాన్‌లలో కొన్నింటిని తొలగించడాన్ని అయనీకరణం అంటారు. సాధారణంగా ధనావేశం లేదా రుణావేశ కణాలవల్ల అయనీకరణం జరుగుతుంది. ఎటువంటి ఆవేశంలేని కణాల వల్ల అయనీకరణం జరగదు
- ఎలక్ట్రాన్ ద్రవ్యరాశి 9.11×10^{-31} కిలోలు. అంటే ఎలక్ట్రాన్ చాలా తక్కువ ద్రవ్యరాశిని కలిగి ఉంటుంది. అందువల్ల పదార్థంలో ఎక్కువ లోతుకు చొచ్చుకొని వెళ్లగలుగుతుంది. ముఖ్యంగా ప్లాటినం, టంగ్‌స్టన్, మాలిబ్డినమ్ మొదలైన ధృడమైన లోహాల్లోంచి ఎలక్ట్రాన్‌లు చొచ్చుకొని వెళ్లినపుడు ఎక్స్-కిరణాలు ఉత్పత్తి అవుతాయి.
- ఎలక్ట్రాన్‌లకు రుణావేశం ఉంటుందని మొదట గుర్తించిన శాస్త్రవేత్త పెరిన్. కానీ ఈ ఆవేశ విలువను ప్రయోగాత్మకంగా నిర్ధారించిన శాస్త్రవేత్త 'మిల్లిఖాన్'. అందువల్ల భౌతిక శాస్త్రంలో అతనికి నోబెల్ బహుమతి లభించింది. ఒక ఎలక్ట్రాన్ ఆవేశ విలువ $e = -1.602\times10^{-19}$ కూలుంబ్స్.
ఒక వస్తువుకు అందించే లేదా గ్రహించే ఆవేశం కనీసం ఒక ఎలక్ట్రాన్ ఆవేశ విలువకు సమానంగా లేదా ఎక్కువగా ఉంటుంది. అంతేకానీ ఎలక్ట్రాన్‌ల ఆవేశ విలువ కంటే తక్కువగా ఉండదు.
- ఎలక్ట్రాన్ విశిష్ట ఆవేశాన్ని జె.జె.థామ్సన్ అనే శాస్త్రవేత్త కనుకొన్నాడు. విశిష్ట ఆవేశం

$$e/m = 1.759\times10^{11}\ c\ kg^{-1}$$

- గమనంలో ఉన్న ఎలక్ట్రాన్ రేఖీయ ద్రవ్యవేగం, గతిజశక్తిని కలిగి ఉంటుందని నిరూపించిన శాస్త్రవేత్త విలియమ్ క్రూక్స్.
- జింక్ సల్ఫైడ్ లేదా బేరియం ప్లాటినో సయనైడ్ వంటి పదార్థాలతో పూత పూసిన లోహపలకల పై ఎలక్ట్రాన్‌లు పతనమైనప్పుడు దట్టమైన వెలుగు కనిపిస్తుంది. దీన్ని 'ప్రతిదీప్తి' అని అంటారు. ఈ ధర్మం ఆధారంగా ఎలక్ట్రాన్‌ల ఉనికిని గుర్తించొచ్చు.
- విద్యుత్ క్షేత్రంలో, అయస్కాంతక్షేత్రంలో ఎలక్ట్రాన్‌లు వంగి ప్రయాణిస్తాయి. ఈ ధర్మాన్ని అపవర్తనం అని అంటారు.
- కదులుతున్న ఎలక్ట్రాన్ తరంగ స్వభావాన్ని ప్రదర్శిస్తుందని కనుగొన్నందుకు జె.జె.థామ్సన్ కుమారుడు జి.పి. థామ్సన్‌కు నోబెల్ బహుమతి లభించింది.

ప్రోటాన్

ప్రోటాన్‌ను తొలిసారిగా గుర్తించిన శాస్త్రవేత్త గోల్డ్ స్టైన్. దీన్ని ప్రయోగాత్మకంగా కనుక్కొన్న శాస్త్రవేత్త రూథర్‌ఫర్డ్. (ఈ శాస్త్రవేత్తను కేంద్రక భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు).

ధర్మాలు - ఉపయోగాలు:

- ప్రోటాన్ ఆవేశం, ఎలక్ట్రాన్ ఆవేశానికి సమానంగా ఉండి ధనస్వభావాన్ని కలిగి ఉంటుంది.
- ఎలక్ట్రాన్ ద్రవ్యరాశికంటే ప్రోటాన్ ద్రవ్యరాశి సుమారు 1840 రెట్లు ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది భారయుతమైన కణం. ప్రోటాన్ ఎల్లప్పుడూ పరమాణువు కేంద్రకం లో ఉంటుంది. ఈ కణం ద్రవ్యరాశి ఎక్కువగా ఉండడం వల్ల పదార్థంలో తక్కువ లోతుకు చొచ్చుకొని వెళుతుంది.
- ప్రోటాన్ ద్రవ్యరాశి 1.67×10^{-27} కిలోలు. ఈ ద్రవ్యరాశిని 'పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం' అంటారు.

పదార్థం ద్రవ్యరాశి కొలవడానికి ఉపయోగించే అతి చిన్న ప్రమాణం పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం. పదార్థ ద్రవ్యరాశిని కొలవడానికి ఉపయోగించే అతిపెద్ద ప్రమాణం 1 చంద్రశేఖర లిమిట్

- విద్యుత్ క్షేత్రంలో, అయస్కాంత క్షేత్రంలో ప్రోటాన్‌లు రుణపలకవైపు వంగి ప్రయాణిస్తాయి.
- ప్రోటాన్‌ను హైడ్రోజన్ పరమాణు కేంద్రకంతో సూచిస్తారు ($_{1}H^{1}$). ఎందుకంటే హైడ్రోజన్ పరమాణు కేంద్రకంలో ఒక ప్రోటాన్ మాత్రమే ఉంటుంది. ఎలాంటి న్యూట్రాన్‌లు ఉండవు.
- ఈ విశ్వంలో సూర్యుడు, నక్షత్రాల్లో ఎక్కువగా ఉన్న కణాలు 'ప్రోటాన్‌లు' (లేదా) హైడ్రోజన్ వాయువులు. ఈ కణాలు కేంద్రక సంలీనం అనే చర్యలో పాల్గొనడం వల్ల కాంతి శక్తి విడుదలవుతుంది. కాబట్టి సూర్యుడు, నక్షత్రాలు స్వయం ప్రకాశత్వాన్ని పొందేందుకు ప్రోటాన్‌లు ఇంధనంలా ఉపయోగపడుతున్నాయి.
- ఈ విశ్వంలోగల హైడ్రోజన్, హీలియం వాయువులను శాశ్వతమైన వాయువులుగా పరిగణిస్తారు.

న్యూట్రాన్

ఈ కణాన్ని మొట్టమొదటిసారిగా గుర్తించిన శాస్త్రవేత్తలు ఐరీన్ క్యూరీ, ఫ్రెడ్రిక్ క్యూరీలు. కానీ ఈ కణాన్ని క్రీ.శ. 1932లో ప్రయోగాత్మకంగా కనుక్కొన్న శాస్త్రవేత్త 'ఛాడ్విక్'. ఇందుకు 1935వ సంవత్సరంలో అతనికి నోబెల్ బహుమతి లభించింది.

ధర్మాలు-ఉపయోగాలు:

- న్యూట్రాన్‌కు ఎటువంటి ఆవేశం ఉండదు. అందువల్ల ఎలక్ట్రాన్, ప్రోటాన్‌లతో పోల్చినప్పుడు పదార్థంలో ఈ కణం ఎక్కువ లోతుకు చొచ్చుకొని వెళుతుంది.
- న్యూట్రాన్ ద్రవ్యరాశి అనేది ప్రోటాన్ ద్రవ్యరాశికి సమానంగా లేదా స్వల్పంగా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల న్యూట్రాన్ కూడా ప్రోటాన్‌లా ఒక భారయుత కణం. ఈ కారణం వల్ల న్యూట్రాన్ ఎల్లప్పుడూ పరమాణువు కేంద్రకంలో ఉంటుంది.
- హైడ్రోజన్ పరమాణు కేంద్రకంలో తప్ప మిగిలిన అన్ని మూలకాల్లో న్యూట్రాన్ ఉంటుంది.
- విద్యుత్ క్షేత్రంలో, అయస్కాంత క్షేత్రంలో న్యూట్రాన్ రుజుమార్గంలో ప్రయాణిస్తుంది. ఎందుకంటే ఈ కణాలకు ఎలాంటి ఆవేశం ఉండదు.
- స్వేచ్ఛగా ఉన్న ఒక న్యూట్రాన్ సుమారు 13 నిమిషాల్లో విచ్ఛిన్నం చెంది ఒక ప్రోటాన్, ఒక ఎలక్ట్రాన్‌గా విడిపోతుంది. ఈ విధంగా ఏర్పడిన ఎలక్ట్రాన్‌ను β–కిరణం అని అంటారు.

పరమాణు సంఖ్య:
పరమాణు సంఖ్య అనేది పరమాణు కేంద్రకంలో ఉన్న ప్రోటాన్‌ల సంఖ్యను తెలుపుతుంది.

పరమాణు ద్రవ్యరాశి:
పరమాణు కేంద్రకంలో ఉన్న ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌ల మొత్తం ద్రవ్యరాశిని తెలిపేదే పరమాణు ద్రవ్యరాశి.

1) $_{1}H^{1} = 1P^{+} + 0\ 0^{n1}$
2) $_{6}C^{12} = 6P^{+} + 60\ 0^{n1}$
3) $_{98}U^{236} = 92P^{+} + 1430^{n1}$

కాంతి

కాంతి కిరణాలు ఒక సంవత్సర కాలంలో ప్రయాణించే దూరాన్ని 'కాంతి సంవత్సరం' అంటారు. సాధారణంగా భూమి నుంచి నక్షత్రాలకు మధ్య దూరాన్ని కొలవడానికి ఈ ప్రమాణాన్ని ఉపయోగిస్తారు.

1 కాంతి సంవత్సరం = 365.25 × 24 రోజుల
× 60 ని. × 60 సె. × 3 × 10^{8} మీ.
= 9.4× 10^{15} మీ.
= 9.4 × 10^{12} కి.మీ.

1 పార్‌సెక్ = 3.26 కాంతి సంవత్సరాలు. పొడవును కొలవడానికి ఉపయోగించే అతి పెద్ద ప్రమాణం పారసెక్. దూరాన్ని కొలవడానికి చిన్న ప్రమాణం ఫెర్మి. (1 ఫెర్మి = 10^{-15} మీ.)
పరమాణు కేంద్రకం పరిమాణాన్ని కొలవడానికి ఈ ప్రమాణాన్ని ఉపయోగిస్తారు.

- ఈ విశ్వంలో ఒక వస్తువు లేదా వికిరణం లేదా తరంగం ప్రయాణించగలిగే గరిష్ఠ వేగం కాంతి వేగానికి సమానంగా లేదా తక్కువగా ఉంటుంది. అంతేగాని ఎక్కువగా ఉండదు. ఏ వస్తువూ కాంతి వేగానికి మించిన వేగంతో ప్రయాణించదు.
- రెండు అంతరిక్ష నౌకలు ఒక్కొక్కటి కాంతి వేగానికి సమానమైన వేగంతో ఎదురెదురుగా ప్రయాణిస్తూ పరస్పరం సమీపిస్తున్నప్పుడు వాటి సాపేక్ష వేగం కాంతి వేగానికి సమానంగా ఉంటుంది.

కాంతి వక్రీభవనం

కాంతి కిరణాలు ఒక యానకం నుంచి మరో యానకంలోకి ప్రయాణిస్తున్నప్పుడు రెండో యానకంలో వంగి ప్రయాణిస్తాయి. ఈ ధర్మాన్ని 'కాంతి వక్రీభవనం' అంటారు. ఇది రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. యానకం స్వభావం (సరళ యానకం, సాంద్రతర యానకం అనే అంశంపై)
2. కాంతి కిరణాలు ప్రయాణించే కోణం

అనువర్తనాలు

- ఒక పాత్రలో కొంత వరకు నీటితో నింపి అందులో ఒక కర్రను ఉంచినప్పుడు నీటి లోపల ఉన్న కర్ర భాగం వంగినట్లుగా కనిపిస్తుంది. దీనికి కారణం కాంతి వక్రీభవనం.
- కొంత వరకు నీటితో నింపిన పాత్ర అడుగు భాగం పైకి లేచినట్లు కనిపిస్తుంది. ఈ కారణం వల్లే జలాశయాలు లోతు తక్కువగా ఉన్నట్లు కనిపిస్తాయి.
- నీటితో ఉన్న పాత్రలో ఒక నాణేన్ని వేసినప్పుడు వక్రీభవనం వల్ల ఆ నాణెం అసలు పరిమాణం కంటే పెద్దగా, తక్కువ లోతులో ఉన్నట్లుగా కనిపిస్తుంది.
- గాలిలో ఎగురుతున్న ఒక గద్ద నీటిలోని చేపను చూసినప్పుడు అది అసలు పరిమాణం కంటే పెద్దదిగా, తక్కువ లోతులో ఉన్నట్లుగా కనిపిస్తుంది.
- ఒకవేళ నీటిలోని చేప గాలిలో ఎగురుతున్న గద్దను చూస్తే అది అసలు పరిమాణం కంటే చిన్నగా, అసలు ఎత్తు కంటే ఎక్కువ ఎత్తులో ఎగురుతున్నట్లుగా కనిపిస్తుంది.
- అక్షరాలు ఉన్న పేపరుపై గాజు పలకను అమర్చినప్పుడు వక్రీభవనం వల్ల అవి పెద్దగా, కంటికి దగ్గరగా కనిపిస్తాయి.
- సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సూర్యుడి నుంచి వచ్చే కాంతి కిరణాలు క్షితిజ సమాంతరంగా ప్రయాణిస్తూ భూమి వాతావరణ పొరల్లోకి ప్రవేశించినప్పుడు వక్రీభవనం చెందుతాయి. అందువల్ల ఉదయిస్తున్న, అస్తమిస్తున్న సూర్యబింబం కొన్ని క్షణాల పాటు అండాకృతిలో కనిపిస్తుంది.
- విశ్వాంతరాళంలో ఉన్న నక్షత్రాల నుంచి వచ్చే కాంతి కిరణాలు భూ వాతావరణ పొరల్లోకి ప్రవేశించి వక్రీభవనం చెందడం వల్ల మిణుకుమిణుకుమన్నట్లుగా కనిపిస్తాయి.

వక్రీభవన గుణకం (స్నెల్ నియమం): కాంతి కిరణాలు ఒక యానకం నుంచి మరో యానకంలోకి ప్రయాణిస్తున్నప్పుడు మొదటి యానకంలో లంబం వద్ద చేసే పతన కోణం sine విలువకు, రెండో యానకంలో వక్రీభవన కోణం sine విలువకు మధ్య నిష్పత్తిని 'వక్రీభవన గుణకం' అంటారు. దీన్నే 'స్నెల్ నియమం' అంటారు.

$$\mu = \sin i/\sin r$$

- వక్రీభవన గుణకం అనేది ఒకే రకమైన రెండు భౌతికరాశుల మధ్య నిష్పత్తి. కాబట్టి దీనికి ప్రమాణాలు ఉండవు. ఆయా పారదర్శక పదార్థాల స్వభావం ఆధారంగా దీనికి వేర్వేరు విలువలు ఉంటాయి.

I think I understand the nuts and..

Idioms and Phrases

Idioms and phrases refer to commonly used group of words in English. They carry a specific meaning and are used in specific situations. Phrases are usually made up of a few words and are used as a grammatical unit in a sentence; on the other hand idioms are full sentences. It is an important category in all competitive exams. Candidates preparing for competitive examinations must practice idioms and phrases in their writing as well as speech. By listening to native speakers one will get acquainted with the nuances of the language. It will make them proficient while practicing.

For attempting the questions in this section the candidates should know the rules of grammar. They should also pay attention to various exceptions to the grammatical rules. Good command over grammar is necessary to solve these questions.

List of important Idioms and Phrases

» **A bird in the hand is worth two in the bush**
Meaning: Having something that is certain is much better than taking a risk for more, because chances are you might lose everything

» **A bitter pill**
Meaning: A situation or information that is unpleasant but must be accepted

» **A blessing in disguise**
Meaning: Something good that isn't recognized at first

» **A man of action**
Meaning: A man who is inclined to act first rather than think about things and discuss them.

» **Add fuel to the fire**
Meaning: To make a problem worse

» **Every cloud has a silver lining**
Meaning: Be optimistic

» **From scratch / to start from scratch**
Meaning: Start from the beginning with no prior preparation

» **Face the music**
Meaning: Said when someone accepts to confront the unpleasant consequences of one's actions.

» **Gain ground**
Meaning: To become popular, to make progress, to advance.

» **Cross your fingers**
Meaning: To hope that something happens the way you want it to.

» **Couch potato**
Meaning: Lazy person.

» **Cost an arm and a leg**
Meaning: Extremely expensive.

» **Cry over spilt milk**
Meaning: When you complain about a loss from the past.

» **Don't put all your eggs in one basket**
Meaning: Do not put all your resources in one possibility.

» **Lend me your ear**
Meaning: To politely ask for someone's full attention.

» **Picture paints a thousand words**
Meaning: A picture will be far more descriptive of something than words can ever be.

» **Raw deal**
Meaning: Said when someone is ill treated.

» **Red handed**
Meaning: Be discovered in or just after the act of doing something wrong or illegal

» **Spill the beans**
Meaning: To reveal a secret.

» **Turn a blind eye**
Meaning: Refuse to acknowledge something you know is real.

» **Until one is blue in the face**
Meaning: Pointless efforts while trying to convince someone or change his mind.

» **Walk on air**
Meaning: Very excited or happy.

» **You can't judge a book by its cover**
Meaning: Decisions shouldn't be made primarily on appearance.

» **Zero tolerance**
Meaning: No crime or law breaking big or small will be overlooked.

BANK EXAMS

GENERAL ENGLISH

Directions: which of the phrases (a), (b), (c) and (d) given below each sentence should replace the phrase printed in bold type to make the sentence grammatically correct? If the sentence is correct as it is, mark (e) i.e. No correction required as the answer.

1. Why do you wish **to tread on the toes?**
a) To give offence to them
b) To treat them indifferently
c) To follow them grudgingly
d) To be kicked by them
e) No correction required

2. **To keep one's temper**
a) To be in good mood
b) To preserve ones energy
c) To be angry d) To be aloof from
e) No correction required

3. **To play second fiddle**
a) To be happy
b) To reduce importance of one's senior
c) To support the role and view of another person
d) To do back seat driving
e) No correction required

4. Action is the glorious principle of life and the one that saves man from _____.
a) The use of faculties, physical or mental
b) Stagnation and unhappiness
c) The sorrow of fellow beings
d) The prerequisites of happiness
e) No correction required

5. Being the head of a large family it difficult to **keep his head above water.**
a) To take rest
b) To work properly
c) To avoid quarrel
d) To keep out of debt
e) No correction required

6. **To leave someone in the lurch**
a) To come to compromise with someone
b) Constant source of annoyance to someone
c) To put someone at ease
d) to leave someone at a time when they need you to stay and help them
e) No correction required

7. And really the only reason you were there was because **you had a bone to pick with him.**
a) You wanted to have a discussion with him
b) You wanted to chat
c) You wanted to talk
d) You wanted to have an argument with him
e) No correction required

8. He doesn't really go around with many people because he is a bit a **lone wolf.**
a) Single person b) Lonely person
c) Unhappy person d) Simple person
e) No correction required

9. I don't honestly think he is capable of being polite as **the leopard never changes his spots.**
a) Always complain b) Differ in opinion
c) Never change d) Shout
e) No correction required

10. The issue was **taken before** the Municipal Corporation meeting last week.
a) Taking place at b) Taken after
c) Being taken up d) Taken up at
e) No correction required

11. As the maestro lifted his baton the theatre was so still you could hear _____.
a) His heartbeat b) A pin drop
c) Bird wings d) Drum beating
e) No correction required

12. I don't agree with you, but your idea certainly gives me **food** _____.
a) For fun b) For consideration
c) For thought d) For thinking
e) No correction required

13. Look, I will pay you back. Would you please call the _____.
a) Hunters off b) Tigers off
c) Dogs off d) Apes off
e) No correction required

14. Just a moment... I've got the answer on the _____ **of my tongue.**
a) Top b) back
c) Tip d) Front
e) No correction required

15. I'm afraid Chess isn't **my cup of** _____.
a) Tea b) Coffee
c) Wine d) Java
e) Milk

16. I think I understand the **nuts and** _____ of the operation.
a) Screws b) Hammer
c) Nails d) Bolts
e) No correction required

17. Oh, I'm sorry. I shouldn't have said that. I guess I really **put my** _____ **in my mouth.**
a) Foot b) Hand
c) Elbow d) Knee
e) No correction required

18. I'll be back in the twinkling of _____.
a) An eye b) A Lighting bolt
c) A smile d) A laugh
e) No correction required

19. He is plain, simple and sincere man. He will always **call a spade a spade.**
a) Find meaning or purpose in your action
b) Avoid controversial situations
c) Be outspoken
d) Resist from making controversial statement
e) No correction required

20. He has rejoined after a week and looks **run down.**
a) Cheerful and bubbly
b) Weak and tired
c) Active and energetic
d) Busy and preoccupied
e) No correction required

21. **To hit the nail on the head**
a) To do the right thing
b) To destroy one's reputation
c) Announce one's fixed views
d) To teach someone a lesson
e) None of these

22. All these promises these politicians make are just _____ **in the sky.**
a) Pie b) Ocean
c) Music d) Rags
e) No correction required

23. The small amount of money donated is just a _____ **in the ocean** compared to the large sum of money needed.
a) Spot b) Drop
c) Speck d) Sea
e) None of the above

24. They had had a dispute yesterday. That's why she gave him **the cold** _____.
a) Arm b) Hand
c) Shoulder d) Music
e) None of the above

25. He has been successful in his life. He went from _____ **to riches.**
a) Rags
b) Shoulder
c) Colours
d) Poor
e) None of the above

Answers:

1) a	2) a	3) c	4) b
5) d	6) d	7) d	8) b
9) c	10) d	11) b	12) c
13) c	14) c	15) a	16) d
17) a	18) a	19) c	20) b
21) a	22) a	23) b	24) c
25) a			